సంపుటి: 34
సంచిక: 6

ఫోన్ నెం.
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 66 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

జూలై, 1982

P. BOOK STALLS
Jakkampudi P...
Gandhi ...
VIJAYAWADA-3

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
నండూరి శైలజ

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
ఏ. వీ. మోహన్రావ్
విద్వాన్ షీలాదేవి

మీ ఉత్తరాలు

'రక్తం త్రాగే పిశాచం' సీరియల్ ముగింపు ఊహించని విధంగా వుంది సీరియల్ అప్పుడే అయిపోయిందా అనిపించింది. 'రక్తపు జేర్లు' ప్రారంభమే గగుర్పాటును కల్గించింది. వసుంధర గారికి మా అభినందనలు. 'కాంచనగ్రహం', 'మృత్యుతార' సీరియల్స్ కూడా మమ్మల్ని సస్పెన్స్‌తో చంపేస్తున్నాయి.

—వడ్డాది వేణు, అనిత, రాజమండ్రి

జొన్నలగడ్డ రామలక్ష్మి గారి 'పిరికివాళ్ళు' కథ క్లైమక్స్‌లో చాలా బాగుంది. గిరిజ శ్రీభగవాన్ గారి 'మృత్యుతార' ఊహించని మలుపులు తిరిగింది. తదుపరి సంచికకై ఎదురు చూస్తున్నాము.

—తోట కేశవరావు, సామనస.

ఈ నెల అపనలో శీల పరీక్ష, అస్త్రాం వస్త్రం, పిరికివాళ్ళు, నేరాల బేరగాడు కథలు సూపర్ ఫైన్. సప్లిమెంట్‌లోని నాలుగు నవలలు ఆసక్తిదాయకంగా వున్నాయి. 'రక్తం త్రాగే పిశాచం' సీరియల్ ముగింపు మంచి థ్రిలింగ్‌గా, సహజంగా వుంది.

—ఎమ్. మీనాక్షి, భీమవరం.

మే నెల అపనలో కళాపోషకులు, దొంగాడొచ్చాడు మర్యాద చేయండి కథలు చాల బాగున్నాయి. అపన ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా, ఇతర రాష్ట్రాలలో కూడా సంచలనం సృష్టిస్తున్నందుకు మేము గర్విస్తున్నాము.

—ఎన్. శివానంద్, బెల్లంపల్లి.

కథలలో 'కళాపోషకులు', 'వాళ్ళు ముగ్గురు' ఎంతో బావున్నాయి. 'డర్టీగేమ్' ఫెంటాస్టిక్‌గా వుంది. బాగాపురం గారి జోక్స్ పసందుగా వున్నాయి.

—విజేంద్రనాథ్ ప్రసాద్, ఆదోని.

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. కనుల రహస్యం—జొన్నలగడ్డ రామలక్ష్మి.
17. వెంటాడిన నీడలు—శ్రీధర్.
32. మలక్ పేట రేసులు—బి. రాజేశ్వరి.
47. మృత్యుతార (సీరియల్)—గిరిజ శ్రీ భగవాన్.
73. మిస్. మార్గరేట్— వి. ఎస్. చెన్నూరి.
95. హంతకుడికి మళ్ళీ పెళ్ళా?—వసుంధర.
108. ఢిల్లీ దొంగలు— బొమ్మిడి అప్పారావు.
129. ఔరా మానవుడా... విశ్వమోహిని.
143. దెయ్యంలాంటి కుక్క—భమిడిపాటి భాస్కరరామారావు
163. ముంచుకురానున్న ముప్పు—ఎమ్. సత్యవతీదేవి.
1 5. కాంచన గ్రహం (సీరియల్)—వాణిశ్రీ.

నవలలు (సప్లిమెంట్)

3. నొక్కుల జుత్తు—వసుంధర.
37. యావజ్జీవాశ్రమం—సికిందర్.
89. కోటి సొరంగాలు—మోహన్.
136. యాభై వజ్రాలు—టెంపో రావు.
172. రక్తపుటేర్లు (సీరియల్)—వసుంధర.

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!

జొన్నలగడ్డ రామలక్ష్మి

కనుల రహస్యం



ఆకాశంలో మండే సూర్యుడు ప్రపంచానికి శక్తినిస్తాడు. అయితే సూర్యుడు దుర్నిరీక్ష్యుడు. అందువల్ల మండు టెండలో కళ్ళు మండుతాయి. ఆ మంటను పోగొట్టి ఎండను వెన్నెల అనిపించేలా చేయగల సామర్థ్యం కూలింగ్ గ్లాసెస్‌కుంది.

నేను కూలింగ్ గ్లాసెస్ గురించి ఆలోచించడానికి కారణం మా ఎదురింటి వాళ్ళు.

మా ఎదురింటాయన పేరు శ్యామలరావు. ఆయన భార్య శ్యామల. వాళ్ళ పేర్లు కలిసినట్లే మనసులూ కలిశాయి. వాళ్ళిద్దరూ ఒకర్ని విడిచి ఒకరుండరు. ఎప్పుడు బయట కనిపించినా కలిసే కనిపిస్తారు. ఎప్పుడూ చలాకీగా వుంటారు. వారి అన్యోన్యతను గురించి మా వీధిలో అంతా అబ్బురంగా చెప్పుకుంటారు.

మగాళ్ళకు ఇంగ్లీషు సినిమా లిష్టం. ఆడాళ్ళకు తెలుగు సినిమా లిష్టం. ఒకవేళ మగాళ్ళు తెలుగు సినిమాలంటే ఇష్టపడినా — వాళ్ళకు నచ్చే సినిమాలు ఆడాళ్ళకు ఇష్ట ముండవు. అందుకని తెలుగు సినిమాలన్నీ మా వీధిలోని ఆడాళ్ళందరం కలిసి ఏ నూన్ షోకో, మ్యాట్నీకో మగాళ్ళు ఆఫీసుకు వెళ్ళిన సమయాల్లో చూస్తుంటాం.

ఒక్క శ్యామల మాత్రం మాతో కలవదు. ఆమె ఏ సినిమా అయినాసరే భర్తతో కలిసే చూస్తుంది. ఆమె కోసం భర్త తెలుగు సినిమాలకు వస్తాడు. భర్తకోసం ఆమె ఇంగ్లీషు సినిమాలు చూస్తుంది. ఫలితంగా ఇద్దరూ కూడా సినిమాలు ఎక్కువగా చూస్తారు.

ఆమె మాతో కలవదని మాకు కోపం. కానీ ఆమెతో తప్ప విడిగా ఎక్కడకూ వెళ్ళని ఆమె భర్తంటే ఆరాధన. ఎందుకంటే మా మగాళ్ళు సెలవు రోజొస్తే చాలు— నలుగురైదుగురు చేరి ఓ యింట్లో మకాం పెట్టి పేకాట మొదలెడతారు. అందులో పడ్డారంటే వాళ్ళకీ ప్రపంచం తెలియదు.

శ్యామలరావు పెళ్ళి కాకముందు పేకాటలో పెద్ద చెయ్యట. పెళ్ళయ్యాక ఆయన విడిగా ఎవరితోనూ పేకాడ

లేదు. ఎప్పుడాడినా భార్యతో కలిసే ఆడేవాడు.

అలా వుండమని శ్రీవారితో నేను ఎన్నోసార్లు చెప్పాను. మొదట్లో ఆయన సహనం చూపించి నా మాటలు విన్నారు. కానీ మనిషి మారలేదు. తర్వాత తర్వాత సహనం పోగా ఆఖరికి ఒకరోజున—"నీకంతగా మోజుగా ఉంటే వెళ్ళి వాడికి రెండో పెళ్ళాంగా వుండు" అన్నారు.

ఆయనంత మాటన్నాక నేను మళ్ళీ ఆయన దగ్గర శ్యామలరావు ప్రసక్తి తీసుకుని రాలేదు. కానీ రోజూ అతను వచ్చే సమయంలో అతడికి తెలియకుండా అతణ్ణి గమనించేదాన్ని!

శ్రీవారు ఆఫీసుకు వెళ్ళిన అర్ధగంటకు శ్యామలరావు ఇంటిదగ్గర బయల్దేరతాడు. ఆఫీసునుంచి అతను శ్రీవారి కంటే పావుగంట ముందుగానే వస్తాడు. అందువల్ల నేనతణ్ని గమనిస్తున్న విషయం శ్రీవారికి కూడా తెలిసే అవకాశం లేదు. అయితే శ్యామలరావుపైన నాకు గౌరవం తప్ప ఇతరమైన భావాలింకేమీ లేవు.

ప్రతిరోజూ భార్య వీధిలోనికి వచ్చి అతడికి టాటా చెప్పాలి. సాయంత్రం ఆమె గుమ్మంలో నిలబడి వుంటే తప్ప అతనింటిలో అడుగుపెట్టడు. ఆ దృశ్యం నాకు చూడ్డానికి ఎంతో మనోహరంగా వుంటుంది. దంపతులమధ్య అటువంటి అన్యోన్యత అరుదు.

శ్యామల, శ్యామలరావు చూడ చక్కని జోడీ! శ్యామలరావుది పసిమిఛాయ. ఎత్తైన విగ్రహం. నిండైన పెర్సనాలిటీ. అయితే అతడిలో నాకు నచ్చనిది ఒక్కటే వుంది-కూలింగ్ గ్లాసెస్!

మొదట్లో అతను నాకు కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుంటే ఎంతో అందంగా కనిపించేవాడు. ఆ కూలింగ్ గ్లాసెస్

ఎంత డార్కుగా వుంటాయంటే వాటి వెనుకనున్న అతడి కళ్ళు కనబడవు.

ఇంతవరకూ నేను ఒక్కసారి కూడా అతడి కళ్ళు చూడలేను. ఆ కళ్ళు చూడాలన్న కోరికో ఏమో—నన్ను అతడి కూలింగ్‌గ్లాసెస్‌ను ద్వేషించేలా చేసింది.

మా వీధిలో ఆడ కానీ, మగ కానీ ఇంతవరకూ ఎవ్వరూ అతణ్ణి కూలింగ్ గ్లాసెస్ లేకుండా చూడలేదు. రాత్రి జరిగే పార్టీలకు కూడా అతను వాటిలోనే వస్తాడు. వాటి విషయమై ఆడ, మగ ఎన్నో చర్చలు జరిపి-అతడికి కనీసం ఒక కన్ను అయినా గుడ్డిదై వుండాలనీ, లేదా మెల్ల కళ్ళు అయినా అయివుండాలనీ నిర్ణయించారు.

ఈ నిర్ణయం మగవాళ్ళది. ఇది కాదంటే పరాయి మగవాడిపై అభిమానం చూపిస్తున్నామన్న ఆరోపణ వస్తుందని భయపడి ఆడవాళ్ళు ఒప్పుకున్నారు.

నా మటుక్కు నాకు శ్యామలరావు కళ్ళు చక్కటివైతే బాగుండునని వుంది. అతడి కళ్ళు చక్కగా ఎందుకుండాలి-అందువల్ల నాకేమిటి లాభం — అంటే నేనేమీ చెప్పలేను. అభిమాన నటుడు నటించిన చిత్రం ఫ్లాప్ కాకూడదన్న ఆరాటం లాంటిదే అతడి కళ్ళ గురించిన నా ఆందోళన!

నాకులాగే ఆందోళన చెందే ఆడవాళ్ళు చాలామంది వున్నారు మా వీధిలో. అయితే ఎవ్వరూ పైకి తేలరు.

ఎలాగో అలాగ శ్యామలరావు కళ్ళు చూడాలన్న కోరిక నాలో క్రమంగా బలపడసాగింది. కానీ ఈ కోరిక ఎవరికి చెప్పుకోను? ఎలా చెప్పుకోను?

భర్త లేనప్పుడు శ్యామల అప్పుడప్పుడు మాత్రం నలుగురితో కబుర్లకు వస్తూంటుంది. ఆమె అంటే మా అందరికీ భయం, గౌరవం, అసూయ వున్నాయి. ఎక్కు

వగా ఎవరమూ ఆమెను వేళాకోళం చేసేవాళ్ళం కాదు. చెప్పాలంటే ఆమెను కాస్త ప్రత్యేకంగానే చూసేవాళ్ళం.

శ్యామల మిగతా వారికంటె తెలివిగా మాట్లాడేది. చెప్ప దల్చుకున్నదేదో సూటిగా చెప్పేది తప్పితే డొంక తిరుగుడు కబుర్లు చెప్పేది కాదు. అక్కడ లేనివారి గురించి నేరాలు మొదలెడితే ఆమె సహించేది కాదు. ఎదుటివాళ్ళ గొడవలు మనకెందుకూ అనేది. మేము చెప్పుకునేవన్నీ అవే మరి! వీటి కారణంగా భయం, గౌరవం కలిగితే భర్తను తన కొంగుకు కట్టి పడేసుకోగలిగిన అదృష్టానికి—ఆమె అంటే అసూయ వుండేది.

ఒకరోజు నేను వుండబట్టలేక—"మీ ఆయన ఎప్పుడూ కళ్ళజోడు తియ్యరని నలుగురూ అనుకుంటారు. కొంత మంది ఆయనకు గుడ్డి కన్నుందని కూడా అంటున్నారు" అనేశాను శ్యామలతో.

శ్యామలరావు కనులగురించి నేను తొందరగా తెలుసు కోవాలనుకోవడం తప్పితే అంత సూటిగా శ్యామలను అడగ డానికి వేరే కారణమేమీ లేదు. నా ధైర్యానికి అంతా ఆశ్చర్యపోయారు.

శ్యామలమాత్రం తొణకలేదు బెణకలేదు—"ఆయన కళ్ళు చక్కనివైనప్పుడు ఎవరేమనుకుంటే నాకేం?" అంది.

ఈ సమాధానం నాకెంతో తృప్తిని కలిగించింది. శ్యామల అబద్ధం చెప్పే మనిషి కాదు కాబట్టి శ్యామలరావు కళ్ళలో ఏ లోపమూ లేదు. ఎందుకో నా మనసు తేలిక పడింది.

వెంటనే మా పక్కింటావిడ అందుకుని — "కళ్ళు చక్కనివైతే—రాత్రనక పగలనక ఆ మొద్దు కళ్ళద్దాల

జోడెందుకమ్మా" అంది.

"మీరు కోపగించుకోనంటే చెబుతాను—." అంది శ్యామల.

జవాబు వినడంకోసం నాకు కలిగిన ఆత్రుత ఇంతా అంతా కాదు.

"ఆయన కళ్ళు ఎంత అందమైనవంటే చూడగానే ముద్దుపెట్టుకోవాలనిపిస్తుంది. ఆ కోరికను అదుపు చేసుకోవడం చాలా కష్టం. నేనైతే ఆయన భార్యనే కాబట్టి ఫరవా లేదు. కానీ మిగతా ఆడవాళ్ళ విషయంలో అలా బాగుండదు కదా—అందులోనూ పెళ్ళైన ఆడవాళ్ళయితే కాపురాలు కూడా చెడిపోతాయి...." శ్యామల ఒక్క క్షణం ఆగి "ఆ కళ్ళ జోడుండడంవల్లనే ఇంట్లో కూడా నాపనులు నేను చేసుకోగలుగుతున్నాను. నేను ఖాళీగా వున్నప్పుడే ఆయన్ను కళ్ళజోడు తియ్యనిస్తాను" అంది.

మా అందరికీ ఛెళ్ళున చరిచినట్లయింది. శ్యామల మరీ అంత పచ్చిగా చెబుతుందని అనుకోకపోవడంవల్లనేమో ఎవ్వరికీ కాసేపు నోట మాటరాలేదు.

ఆఖరికి పక్కింటావిడే తేరుకుని "మరీ చోద్యంగా చెబుతావమ్మా కబుర్లు...." అని ముసిముసిగా నవ్వింది. ఆవిడ నవ్వు చూస్తూంటే ముద్దు ఊహించిందా అనిపించింది నాకు. నా గురించి నేను ఆలోచించాలనుకోలేదు.

"చోద్యంకాదు పిన్నిగారూ—ఒకటి రెండు అనుభవాలైనాకనే—ఆ కళ్ళజోడు నేనే స్వయంగా కొని ఆ కళ్ళకు తగిలించాను" అంది శ్యామల.

ఆ రోజునుంచీ శ్యామలరావు కనులపట్ల నా ఆకర్షణ మరింత పెరిగింది. శ్యామల నిజమే చెప్పి వుంటే — ఆ

కళ్ళను ఒక్కసారి చూసి తీరాలనే అనిపించింది.

ఒకరోజు అలాంటి అవకాశం వచ్చింది. ఆయన ఆఫీసులో ఓవర్ టైం వున్నదని ఆరోజు లేటుగా వస్తానన్నారు.

శ్యామలరావు యధాప్రకారం ఆఫీసునుంచి ఇంటికి వచ్చేశాడు. భర్త వచ్చేసరికి తను అన్నిపనులూ చేయడం అయిపోతుందనీ—ఆయన వీధిగదిలో కూర్చుని కాసేపు పేపరు చదువుకున్నాక ఇద్దరూ కలిసి కూర్చుని కాసేపు కబుర్లు చెప్పుకుంటామనీ ఒకసారి శ్యామల అంది.

పేపరు చదివేటప్పుడు ఆ కళ్ళజోడుంటుందా అని నేను శ్యామలను అడగలేదు. ఉంటుందని నేనూహించగలను.

సెనగపప్పు అప్పు అడిగే వంకతో శ్యామల యింటికి వెళ్ళాను. నిజానికి నాకు సెనగపప్పు అవసరం లేదు. కానీ అతడి కనులు చూడాలన్న కోరిక....

తలుపులు గడియవేసి లేవు. ఓరగా వేసి వున్నాయి. తలుపు సందులోంచి గది కనబడుతోంది. గదిలో పడక కుర్చీలో శ్యామలరావు కనబడుతున్నాడు. అతడి చేతిలో పేపరు వుంది. ముఖానికి కళ్ళజోడు లేదు. కళ్ళు పేపర్ని చూస్తున్నాయి. అందువల్ల వాటి అసలు స్వరూపం నాకు గోచరించడంలేదు. గదిలో అతనొక్కడే వున్నాడు. శ్యామల లేదు.

లాభం లేదు. క్షణంకూడా ఆగకూడదు. ఇదొక అపూర్వావకాశం. నేను చటుక్కున తలుపుల్ని తోశాను.

అతను ఉలిక్కిపడి నావైపు చూశాడు.

ఆ కళ్ళు....గుడ్డివి కాదు....మెల్ల కాదు .... నిజంగానే శ్యామల చెప్పినంత అందమైనవి. కానీ ...ఏమిటి? అవి నన్ను చూసిన ఆశ్చర్యంతో అలా పెద్దవౌతున్నాయేమిటి? ఆ చూపులేమిటి?....అతడు నన్నలా చూస్తున్నాడేమిటి?

వివాహితురాలిగా ఆ చూపుల అర్థం నాకు తెలుసును— ఏ మగాడూ పరాయి ఆడదానివంక మొదటిసారి కలుసుకున్నప్పుడు అలా చూడడు. అవి కాంక్షతో నిండిన చూపులు. నా భర్త నావైపు అలా చూస్తాడు ఏకాంతంలో! బహుశా విటుడు వేశ్యనలా చూస్తాడేమో?

కానీ .... శ్యామలారావు .... ఇంకా నావంక అలాగే చూస్తున్నాడు. అతడి చూపులు నన్ను సిగ్గుతో కుంచించుకుపోయేలా చేస్తున్నాయి. అక్కడ నేను వివస్త్రగా నిలబడిన అనుభూతిని కలగజేస్తున్నాయి. చటుక్కున వెనక్కు తిరిగాను.

అప్పుడు నాకు శ్యామల కంఠం వినిపించింది—"అరే-మీరా? ఏం కావాలి?.... వెళ్ళిపోతున్నారేం?"

"మళ్ళీ వస్తాన్లెండి!" అని ఆగకుండా, వెనక్కు తిరక్కుండా ఒక్క పరుగున ఇల్లు చేరాను. ఇల్లు చేరేసరికి నాకు రేప్‌నుంచి తప్పించుకుని వచ్చినట్లనిపించింది.

ఇదా శ్యామలరావు కనుల రహస్యం! .... అతడు భార్యపై ఎంత అనురాగాన్నైనా కురిపించవచ్చు. కానీ అతడు పరాయి స్త్రీలవంక చూసే చూపులు....

మైగాడ్ ...కూలింగ్‌గ్లాసెస్ వాడకపోతే అతణ్ణీవీధిలో నలుగురూ తన్ని వుండేవారు. ఇలాంటి మగవాడినా నేను ఆరాధించినది?! ఇతడికి రెండవ భార్యగా వుండమని భర్త తిడితే కోపం కూడా రాలేదు. మొదటిభార్యగా శ్యామల అవస్థేమిటో ఇప్పుడు అర్థమయింది. వారి అన్యోన్యత కేవలం నటన అని నాకు తోచింది....

తమ దాంపత్య జీవితంలోని అసంతృప్తిని నలుగురికీ తెలియకుండా దాచడానికి—ఆ దంపతులిద్దరూ ప్రత్యేకంగా ఇలా నటిస్తున్నారు. ఆ క్షణంలో నాకు కలిగిన ఆనంద

మింతా అంతా కాదు. శ్యామల జీవితంకంటె నాది వెయ్యి రెట్లు మెరుగు.

ఆరాత్రి నేను తనపై చూపించిన ప్రత్యేకాభిమానానికి శ్రీవారు ఆశ్చర్యపడి—"ఏమిటోయ్-విశేషం!" అన్నారు. విశేషం ఆయనకు చెప్పలేను. శ్యామలరావు నావంక అలా చూశాడంటే ఆయన వాళ్ళింటికి వెళ్ళి నానా గొడవా చేయవచ్చు. లేదా నన్నే నిందించవచ్చు.

ఇది జరిగిన అయిదారు రోజులకు ఓ విచిత్రం జరిగింది. ఒకరోజు మధ్యాహ్నం నేను బజారుకు వెళ్ళాను. అనుకోకుండా నేను చాలాకాలంగా ఎదురుచూస్తున్న-"ఇన్‌స్టంట్ వాటర్ హీటర్" కనబడింది. దాని ఖరీదు రెండు వందలు. షాపువాడి దగ్గర ఒక్కటే పీస్ వుంది. నా దగ్గర పాతిక రూపాయలు తక్కువయ్యాయి.

ఏం చేయాలా అనుకుంటూండగా రోడ్డుమీద శ్యామల రావు కనబడ్డాడు. అతడి ఆఫీసు అక్కడికి దగ్గర. బహుశా లంచ్ సమయంలో రోడ్డుమీదకు వచ్చివుంటాడు.

ఒక్క క్షణం తటపటాయించినా—నేను వెళ్ళి అతణ్ణి పలకరించి—అతడు మాట్లాడడానికి కూడా సందివ్వకుండా నా అవసరం చెప్పాను. సాయంత్రానికల్లా డబ్బు ఇచ్చేస్తానని కూడా చెప్పాను. నా పట్ల గతంలో కాస్త అమర్యాదగా ప్రవర్తించినా ఎదురింటివాడు కదా అని సరిపెట్టుకుని ఆ మాత్రం మాట్లాడాను.

అయితే అతను చాలా నిర్లక్ష్యంగా, తాపీగా—"సారీ మేడమ్—మీరెవరో నాకు తెలియదు" అని వెళ్ళిపోయాడు.

అవమానంతో నా శరీరం కుంచించుకుపోయింది.

శ్యామలరావు ఎందుకలా చేశాడు? ఆ రోజు నేనలా వెనక్కు వెళ్ళిపోయాననా? వెళ్ళిపోక ఏంచేయాలి-శ్యామల

చెప్పినట్లే వెళ్ళి ముద్దుపెట్టుకు రావాలా?

మానర్‌లెస్ క్రీచర్....ఇడియట్....

నా కోపం ఎంతలా వుందంటే — ఇన్‌స్టంట్ వాటర్ హీటర్ సంగతి వదిలిపెట్టి బస్సుకోసం కూడా ఎదురుచూడకుండా రిక్షాలో ఇంటికి వెళ్ళిపోయాను. ఇంట్లోకూడా నా అసహనం తగ్గకపోయేసరికి—ఇంక వుండబట్టలేక శ్యామల ఇంటికి వెళ్ళాను.

శ్యామల ఆప్యాయంగా నన్నాహ్వానించింది.

నేనుమాత్రం ఇంకా వేడిలోనే వున్నాను. "ఎదురెదురు ఇళ్ళవాళ్ళంగదా అని సిగ్గువిడిచి అడిగినందుకు మీవారు నాకు మంచి శాస్తి చేశారు!"

"అసలేం జరిగిందండీ?" అంది శ్యామల.

"ఇంకా ఏం జరగాలి?"అంటూ నేను జరిగిందిచెప్పాను.

శ్యామల నేను చెప్పిందంతా ఓపిగ్గా విని—"ఆ పాతిక రూపాయలూ మీకు నేనిస్తాను. వెళ్ళి ఆ హీటర్ కొని తెచ్చుకోండి" అంది.

"జరిగిన అవమానం చాల్లెండి. ఇంకా మీ దగ్గర డబ్బుచ్చుకోవాలా?"

"అసలు సంగతి మీకు తెలిస్తే మావారిని తప్పుపట్టరు. ఆయనకు మనుషులు గుర్తుండరు. అందులోనూ ఆడవాళ్ళ విషయం చెప్పనే అక్కర్లేదు. ఓ గంట క్రితం చూసిన వాళ్ళనికూడా మరిచిపోతారు. అందులోనూ మిమ్మల్నయితే ఆయన చూసేది చాలా తక్కువ...."

"మీరు చాలా తెలివిగా మాట్లాడుతున్నారుగానీ మీవారి చూపులగురించి నాకు బాగా తెలుసు...." అంటూ ఆనాటి అనుభవం వివరించి చెప్పి "ఒకసారి అలా చూసేక ఇంకా మనిషి గుర్తుండదంటే నమ్మడానికి నేను వెర్రిదాన్నికాదు"

అన్నాను.

శ్యామల నవ్వి "మీరు నా మాటలు కాస్త శాంతంగా వినాలి" అంది.

శ్యామల తెలవైనదని నాకు తెలుసు. మళ్ళీ యేదో కల్పించి చెబుతుంది. ఏం చెప్పినా నమ్మడానికి నేను మరీ అంత తెలివితక్కువదాన్ని కాదు. అయితే ఆమె ఏం చెబుతుందో వినాలనే వుంది.

"మీకు రసగుల్లా ఇష్టమనుకోండి. దాన్ని చూడగానే మీ నోట్లో నీరూరుతుంది. అది మీరాపలేరు. వెంటనే తినేయాలని కూడా మీరనుకోకపోవచ్చు. అయినా సరే నోట్లో నీరూరకుండా మీరాపలేరు. మీ చూపుల్లో దాన్ని తినాలన్న కాంక్ష కూడా కనబడవచ్చు. అయినప్పటికీ రసగుల్లా కనబడ్డప్పుడల్లా మీరు తినేయాలనుకోరు. అందుకు ఎన్నో యితర పరిస్థితులు అనుకూలించాలి!

అయితే రసగుల్లాను చూడగానే మీ కది ఫలానా ఇంట గానీ, ఫలానా దుకాణంలోగానీ తయారయిందన్న ఆలోచన రాదు. మీరు రసగుల్లాను రసగుల్లాగా చూస్తారు తప్పితే దానికో ప్రత్యేక గుర్తింపు నాపాదించరు.

స్త్రీ విషయంలో మా వారూ అంతే! ఆడది కనబడగానే ఆయన నరాల్లో సంచలనం కలుగుతుంది. అప్రయత్నంగా కళ్ళు పెద్దవవుతాయి. అలా కళ్ళప్పగించి తినేసేలా చూస్తారు. అయితే ఆ స్త్రీ రూపురేఖలు ఆయన మెదడులో ముద్రవేసుకోవు. ఆడదాన్ని ఆడదిగానే తప్ప వ్యక్తిగా చూడరాయన. ఆయన హృదయమంతా నిండివున్న ఒకే ఒక స్త్రీని నేను మాత్రమే!

ఆయనకున్న యీ జబ్బు గురించి సైకాలజిస్టుని సంప్రదించగా నల్లద్దాల కళ్ళజోడును సూచించడం జరిగిం

దట. అది రెండు విధాల ప్రయోజనం. ఒకటి—ఆయన చూపులు ఎదుటి స్త్రీకి తెలియవు. రెండు—రాత్రి సమయాల్లో కూడా అవి ధరించివుండడంవల్ల తనలోని లోపాన్ని మాటిమాటికీ గుర్తించి హెచ్చరిక తీసుకోవడం జరుగుతుంది. కూలింగ్ గ్లాసెస్ రెండు విధాల ఆయనకు సహాయ పడతాయి....''

అంతా విని "ఇలాంటి భర్తతో ఎలా వేగుతాన్నారో- నాకు మీ మీద చాలా జాలిగా వుంది'' అన్నాను.

శ్యామల చాలా తాపీగా "ఆడదాన్ని చూడగానే అంతలా చలించిపోయే మనిషి నన్ను తప్ప మరే ఆడదాని రూపమూ గుర్తుంచుకోలేకపోవడం ఆయన ప్రేమకూ, నా అదృష్టానికీ నిదర్శనం. మన ఆడవాళ్ళం పైకి తేలంగానీ మన చూపులు మగాళ్ళ చూపులకంటె వాడిగా వుంటాయి. ఒక్కక్షణం చూస్తే చాలు-పరాయి మగాడి రూపం హృదయంలో ప్రతిష్ఠించుకుపోతుంది. సమాజంలో ఆడదానికి హద్దులెక్కువ కాబట్టి కానీ లేకుంటే మా ఆయనలా చూసే వాళ్ళు మగాళ్ళకంటె ఆడాళ్ళలోనే ఎక్కువుంటారు''అంది.

ఆమె అలా యెందుకన్నదో అప్పుడు నాకు అర్థంకాలేదు.

పదిరోజుల తర్వాత శ్యామలతో సహా ఆడవాళ్ళందరం మా పక్కింటావిడ యింట్లో ఏదో పేరంటానికి సమావేశమయ్యాం. చాలా మంది కూర్చుని కబుర్లు చెప్పుకుంటూంటే కొందరు వంటింట్లో కాఫీలు కలుపుతున్నారు. ఆ సమయంలో అక్కడికి పాతికేళ్ళ యువకుడు వచ్చాడు.

అతణ్ణి చూసి ఎవరా అని మేమంతా కలవరపడుతూంటే శ్యామల చటుక్కున లేచి "ఉండండి, మీ అక్కగారిని పిల్చుకువస్తాను'' అంటూ వంటింట్లోకి వెళ్ళి లక్ష్మీదేవిని పిల్చుకుని వచ్చింది.

అతను లక్ష్మీదేవి తమ్ముడే! అంతకు పూర్వం మేం ఎవ్వరమూ అతగాణ్ణి చూడలేదు. శ్యామల కెలా తెలుసా అని ఆశ్చర్యపోయాను.

లక్ష్మీదేవి తమ్ముడికి యింటి తాళాలిచ్చి పంపేసింది.

నే నుండబట్టలేక శ్యామల నడిగాను "అతడు మీ కెలా తెలుసూ?" అని.

"అదేమిటండీ-వాళ్ళింట్లో ఆల్బంలో అతడి ఫొటో మీరూ చూశారు కదా!" అంది శ్యామల.

కొంచెం ఆలోచించగా నాకు గుర్తుకొచ్చింది. ఆల్బంలో ఓ గ్రూపు ఫోటోలో వున్న వారందరి గురించీ ఓసారి లక్ష్మీదేవి వివరించింది. అయితే అందులో అన్నీ చిన్న మొహాలు. లక్ష్మీదేవిని గుర్తుపట్టడమే కష్టమనిపించింది నాకు.

మరి శ్యామల....

"ఆడదానికి హద్దులెక్కువ కాబట్టి కానీ లేకుంటే మా ఆయనలా చూసేవాళ్ళు మగాళ్ళ కంటె ఆడాళ్ళలోనే ఎక్కువ వుంటారు...." అన్న శ్యామల మాటలు గుర్తుకు వచ్చాయి. ఆమె తన గురించే ఈ మాట అన్నదా? ఆమె తన భర్త లోపాన్ని మన్నించడంలోని రహస్యం ఇదేనా?

అదృష్టం శ్యామలదా, ఆమె భర్త శ్యామలరావుదా అన్న సందేహం తొలిసారిగా నాకు కలిగింది. అదే సమయంలో శ్రీవారికి నా స్నేహితురాండ్ర కంటె - నాకు వారి స్నేహితులే బాగా గుర్తుంటారని స్ఫురించింది?

శ్యామల ఈ విషయం గుర్తించింది. అందుకే వారి దాంపత్యం అంత అన్యోన్యంగా వుంది. ఈ విషయం గుర్తించిన ఏ ఆడదైనా మగాడిలోని చిన్న చిన్న లోపాల్ని మన్నించి-తన సంసార జీవితాన్ని సుఖమయం చేసుకో గలదని నాకు అనిపించింది. □

శ్రీధర్

వెంటాడిన నీడలు

సాయంత్రం ఏడు కావస్తోంది.

"జేమ్స్! ఇవాళ్టికి ఆఫీసు మూసి పోదాంపద. ఈ రోజు మనిద్దరం ఏదైనా పబ్లిక్ టెలిఫోన్ బూత్ దగ్గరకు వెళ్ళాలి" అన్నాడు హోమ్స్.

"ఏం, యెవరికి ఫోన్ చెయ్యాలి?" యధాలాపంగా

ప్రశ్నించాడు జేమ్స్.

"ఎవరికీ ఫోన్ చెయ్యనవసరం లేదోయ్. మనం యీ రోజు టెలిఫోన్ బూత్ దగ్గరకు వెళ్ళాక, అక్కడ నువ్వు నీకు తోచిన నెంబర్ ఏదో ఒకటి తిప్పుతావు. నువ్వు ఏ నెంబర్ తిప్పుతున్నావో చూడకుండా నేను మరో ప్రక్కకి తిరిగి నిల్చుంటాను. నువ్వు నెంబర్ త్రిప్పడం అయి పోయాక ఏం నెంబర్ త్రిప్పావో నేను చెపుతాను. ఇలా మనం కొంతసేపు ప్రాక్టీస్ చెయ్యాలి."

"ఎందుకంట?" జేమ్స్ అనుమానం.

"ఇదంతా మన పరిశోధనా పటిమను పెంపొందించు కోవడంకోసం. రేపెప్పుడైనా మనకో మంచికేసు తగిలిం దనుకో. మనం నేరస్థుడిని వెంటాడేటప్పుడు, వాడు మన బారి నుండి తప్పించుకునే ఉపాయం తోచక, సహాయం కోసం వాడి బాస్‌కి ఫోన్ చేస్తాడుకదా. అప్పుడు ఈ ప్రాక్టీస్ ఎంతో ఉపయోగపడుతుంది."

"నువ్వు చెప్పింది ఇంప్రెసివ్‌గా లెదోయ్. ఏదేదో ఊహించుకుని ప్రయోగాలూ, ప్రాక్టీసులూ చేద్దామంటు న్నావు."

హోమ్స్ చురుగ్గా చూశాడు జేమ్స్ వైపు. తరువాత నిదానంగా అన్నాడు. "పిచ్చివాడా! నా అంతటి మేధావి చెప్పేది అర్థం చేసుకోవాలంటే వినేవాడు కూడా మేధావి అయుండాలి. సోక్రటీస్‌లాంటి మహానుభావుడు చెప్పేది అర్థంకాక చాలా మంది ఆయనని పిచ్చివాడని అనుకునే వాళ్ళు."

"నువ్వేగా నన్ను పిచ్చివాడా అని సంబోధించావు. కాబట్టి నేను సోక్రటీసుని. నువ్వు అజ్ఞానివి" జేమ్స్ వాగ్బాణం విసిరాడు.

"షటప్. చెప్పింది విను. నడు పోదాం" అన్నాడు హోమ్స్.

పార్ట్‌నర్స్ ఇద్దరూ బయటకి నడిచి ఆఫీసు గుమ్మానికి తాళంవేసి ప్రక్కవీధిలో వున్న టెలిఫోన్ బూత్‌కేసి బయలుదేరారు. వాళ్ళిద్దరూ నాలునడుగులు వేసీవేయక మునుపే ఒకవ్యక్తి వాళ్ళను వేగంగా రాసుకుంటూ ముందుకు నడవసాగాడు.

హోమ్స్ అన్నాడు "జేమ్స్! వీడిని చూశావా! మనల్ని రాసుకుంటూ ఎలా హడావిడిగా ముందుకు వెళ్ళిపోతు న్నాడో. అతని నడక చూస్తుంటే నాకు అనుమానంగా వుంది. చకచకా నడు. వీణ్ణి మనం నీడలా వెంటా డుదాం."

ఆగంతకుడు అటూ, ఇటూ చూస్తూ వేగంగా నడు స్తున్నాడు. మధ్య మధ్యలో వెనక్కి తిరిగి చూస్తున్నాడు.

"జేమ్స్! వీడెవడో పెద్ద రాస్కెల్! ఎవరన్నా తనని వెంబడిస్తున్నారేమోనని అప్పుడప్పుడు వెనక్కి తిరిగి చూస్తున్నాడు. నే నొకటి వూహించగలను. ఇప్పుడు వీడు తిన్నగా తన స్థావరానికి వెళ్తూ వుండి వుండాలి. లేదా వాడి బాస్ చెప్పిన పనేదో పూర్తి చేయడానికి వెళ్తూ ఉండి వుండాలి. అందుకే అతిజాగ్రత్తగా నడుస్తున్నాడు."

ముందుకు నడుస్తున్న వ్యక్తి మరి కొంతదూరం నడిచి, చటుక్కున ఓ రెస్టారెంట్‌లో దూరాడు. మూలగా వున్న ఓ టేబిల్ ముందు కూర్చుని, బేరర్‌ని పిలిచాడు. టీ కి ఆర్డ రిచ్చాడు.

ఆగంతకుణ్ణి అనుసరిస్తూ పార్ట్‌నర్స్ ఇద్దరూ హోటల్లో ప్రవేశించారు. అతడు తమ దృష్టి నుండి తప్పించుకోకుండా, అతనికి యెదురుగా, దూరంగా వున్న మరో టేబిల్ ముందు

కూర్చున్నారు.

"హోమ్స్! జేబులో డబ్బులేమైనా ఉన్నాయా? ఈ వెధవ కోసం మనం కూడా హోటల్లోకి రావాల్సి వచ్చింది. కనీసం టీ అయినా తాగకపోతే హోటల్ వాడు యేడుస్తాడు."

"నా జేబులో ఇరవైనాలుగు రూపాయల అరవై పైసలున్నాయి. కొత్త క్లయింట్ దొరికేదాకా దీనితోనే సరిపెట్టుకోవాలి. కానీ, ప్రస్తుతానికి టీకి ఆర్డరివ్వక తప్పేట్లు లేదు."

అంతలో ఆ వ్యక్తి కుర్చీలోంచి లేచాడు. వాష్‌బేసిన్ వైపు నడిచాడు. ఒకసారి వెనక్కి తిరిగి చూపి, వాష్ బేసిన్‌కి ప్రక్కగా వున్న లావెటరీలోకి అడుగుపెట్టాడు.

"జేమ్స్, బీ క్విక్. వాడు మనల్ని గమనించినట్లున్నాడు. బహుశ పారిపోవటానికి ప్రయత్నిస్తూ వుంచొచ్చు. లావెటరీ నుండి బయటకు వెళ్ళడానికి మరేదైనా ద్వారం వుందేమో చూడు" ఆర్డర్స్ జారీ చేశాడు హోమ్స్.

జేమ్స్ కుర్చీలోంచి ఒక్క ఉదుటున లేచి చకచకా కిచెన్ వైపు నడిచాడు. అక్కడున్న ఓ బేరర్ నుండి ఏంక్వైరీ చేస్తున్నాడు, లావెటరీ ద్వారాల గురించి. బేరర్ ముఖంలో వస్తున్న మార్పుల్ని గమనిస్తున్నాడు హోమ్స్, కూర్చున్న కుర్చీలోంచి కదలకుండా.

అంతలో, ఆగంతకుడు లావెటరీ నుండి బయటకు వచ్చి, వాష బేసిన్‌లో వచ్చి చేతులు కడుక్కుని, వచ్చి తన కుర్చీలో కూర్చున్నాడు. అప్పటికే టేబిల్‌మీద సిద్ధంగా వున్న టీ అందుకున్నాడు.

"అమ్మయ్య. వీడు పారిపోలేదు" అనుకుంటూ జేమ్స్

తన టేబిల్ దగ్గరికి వచ్చి హోమ్స్ ప్రక్కన కూర్చున్నాడు.

అప్పుడే ఓ సర్వర్ వాళ్ళ టేబిల్ దగ్గరికి వచ్చాడు ఏం కావాలంటూ. హోమ్స్ బుర్ర చురుగ్గా పనిచేసింది.

"చాచా వుందా?" అని అడిగాడు.

"లేదు."

"శాండ్ విచ్?"

"లేదు."

"ఎగ్ చాప్స్?"

"లేదు."

"అయితే మంచినీళ్ళు తీసుకురా. అవి తాగి మరో హోటల్‌కి పోతాము" అన్నాడు హోమ్స్. బేరర్ హోమ్స్, జేమ్స్ వంక మార్చి మార్చి చూశాడు అనుమానంగా. తర్వాత మౌనంగా వెళ్ళిపోయాడు.

"చూశావా నా ప్రతిభ!"అన్నట్లు హోమ్స్, జేమ్స్ వంక చూశాడు, కనుబొమ్మ లెగరేస్తూ.

ఆగంతకుడు టీ తాగడం పూర్తయింది. కుర్చీలోంచి లేచి కౌంటర్ దగ్గరకు నడిచాడు. బిల్లు పేజేసి రోడ్ మీద అడుగుపెట్టాడు. బేరర్ ఇచ్చిన మంచినీళ్ళు గటగటా తాగి, పార్ట్‌నర్స్ యిద్దరూ ఆ అపరిచిత వ్యక్తిని అనుసరించారు.

ఆ వ్యక్తి గబగబా నడుస్తున్నాడు. సుమారు పావుగంట సేపు ఆగకుండా నడిచాడు. మధ్య మధ్యలో అటూ, ఇటూ వెనక్కి చూసుకుంటున్నాడు. హఠాత్తుగా రోడ్డు పక్కనే వున్న ఓ మెడికల్ షాపులోకి వెళ్ళాడు.

కొంచెం దూరం నుండి పార్ట్‌నర్స్ ఇద్దరూ అతన్ని గమనిస్తున్నారు. ఆ వ్యక్తి మెడికల్ షాప్ యజమానితో ఏదో మాట్లాడాడు. చాలా మంది కస్టమర్స్ ఉండటంతో షాపు రద్దీగా వుంది. షాప్ యజమానితో మాట్లాడిన తరు

వాత అక్కడ టేబిల్ మీద వున్న ఫోన్‌ను తనవైపు జరుపుకున్నాడు, ఆగంతకుడు.

"క్విక్, క్విక్. మనం వాడి దగ్గరకు వెళ్ళాలి. వాడు ఏ నెంబర్‌కి ఫోన్ చేస్తున్నాడో మనం తెలుసుకోవాలి. ఇది చాలా అవసరం" అంటూ హోమ్స్ త్వర త్వరగా షాప్ లోకి అడుగుపెట్టాడు. కానీ ఆగంతకుడు, తను ఏ నెంబర్ తిప్పుతున్నాడో యెవరికీ తెలియకుండా అడ్డంగా నుంచుని నెంబర్ తిప్పాడు. లోగొంతుకలో యెవరితోనో కాస్సేపు మాట్లాడాడు.

షాప్ రద్దీగా వుండటం వలన హోమ్స్ మిగతా కస్టమర్లలో కలిసిపోయాడు. ఆగంతకుడు ఫోన్‌లో యేం మాట్లాడుతున్నాడో వినాలని అతనికి దగ్గరగా జరిగాడు. కానీ అతని మాటలు సరిగ్గా వినిపించలేదు. ఏదో "పాకిస్తాన్ .... బంగ్లాదేశ్ .... ప్రెసిడెంట్ .... ప్రమాదాలు" అంటూ ఏదో మాటలు మాత్రం వినిపించాయి హోమ్స్‌కి.

"మైగాడ్! వీడు మామూలు దొంగవెధవ కాదు. ఇంటర్నేషనల్ కేడీలా వున్నాడు. బహుశ సి.ఐ.ఏ. ఏజెంట్ అయుండొచ్చు లేదా మన దేశంలో కల్లోలాలు రేపటానికి పాకిస్తాన్ వాళ్ళకు సహాయపడుతూ వుండివుండొచ్చు" అనుకున్నాడు హోమ్స్. బయటికొచ్చి, ఆ మాటే అన్నాడు జేమ్స్‌తో.

"నీ బుద్ధి అమోఘం హోమ్స్! నువ్వు అన్నీ సరిగ్గా వూహిస్తావు. నువ్వు ఈ రోజు ప్రాక్టీస్ చేద్దామన్న టెలిఫోన్ ప్రయోగం యింతకు ముందే చేసివుంటే ఈ రోజు ఈ పాకిస్తాన్ ఏజెంట్ ఏ నెంబర్‌కి ఫోన్ చేశాడో ఇట్టే పట్టేసేవాళ్ళం" అన్నాడు జేమ్స్.

హోమ్స్ సోక్రటీస్‌లా పోజుపెట్టి సమాధానం యిచ్చే

లోగా, అపరిచిత వ్యక్తి ఫోన్ మాట్లాడడం పూర్తిచేసి, షాప్ యజమానికి డబ్బులిచ్చి రోడ్ మీదకు వచ్చాడు. మళ్ళీ నడక.

"వీడికిదేం పోయేకాలం! తెగనడుస్తున్నాడు. కాళ్ళు ఒహాటే నొప్పులెడుతున్నాయి" జేమ్స్ గొణుక్కుంటు న్నాడు.

సమయం రాత్రి ఎనిమిదిన్నర కావస్తోంది.

ఆగంతకుడు నడుస్తున్నవాడల్లా సేట్ చమన్‌లాల్ షాప్ ముందు ఆగి, వెనక్కి తిరిగి చూసి, ఆ తరువాత షాప్‌లోకి అడుగుపెట్టాడు.

"జేమ్స్! నా హ్యాట్‌ని మన ఆఫీసులో వదిలేశాను. అందుకే బ్రైట్ ఐడియాస్ రావడంలేదు. కానీ ఒక్కటి మాత్రం చెప్పగలను. ఈ పాకిస్తానీ ఏజెంట్‌తో సేట్ చమన్‌లాల్‌కి కూడా సంబంధం వుంది. ఈ దేశద్రోహుల నుండి మన దేశాన్ని ఎలాగైనా కాపాడుకోవాలి జేమ్స్!" అన్నాడు హోమ్స్ ఆవేశంగా. ఆఖరి వాక్యం అంటుండగా, అతని కంఠంలో దేశభక్తి పెల్లుబికిపోయింది.

సరిగ్గా పదిహేను నిమిషాల తరువాత అపరిచిత వ్యక్తి సేట్ చమన్‌లాల్ షాపు నుండి బయటకొచ్చాడు. అతని ముఖంమీద చిరుచెమట. మనిషి కొంచెం కంగారుగా కని పించాడు. అతని చేతిలో యిప్పుడో నల్లటి సూట్‌కేసుంది.

"హోమ్స్! వాడి చేతిలో ఓ సూట్ కేసుంది. బహుశ మన దేశానికి చెందిన ముఖ్యమైన పత్రాలేవో అందులో ఉండి వుండాలి. ఇప్పుడే వాడిని ఎదుర్కొంటాను. ఇదే సరైన అదను."

"జేమ్స్! ఆగాగు. తొందర పడొద్దు. ఇప్పుడు నువ్వు వీడితో తలపడితే మనకు డాక్యుమెంట్స్ దొరుకుతాయి.

కానీ వీడి మూత ఎక్కడుందో తెలీదు. వీడిని బంధించిన తరువాత ఏ విషయమూ వెల్లడించక పోవచ్చు. లేదా మనం సినిమాల్లో చూసినట్లు ఏ విషం మాత్రో మింగి ఆత్మహత్య చేసుకోవచ్చు. కాబట్టి వీడిని వెంబడించటమే మన ప్రస్తుత కర్తవ్యం. అన్నట్లు, నువ్వో విషయం గమనించావా, వాడు ఇప్పటికి ముప్పైసార్లు వెనక్కి తిరిగి చూసినా మనల్ని మాత్రం గుర్తించిన సూచనలు లేవు. చూశావా, వాడిని మనం ఎలా బురిడీ కొట్టించేస్తున్నామో."

ఆగంతకుడు ఐదు నిమిషాలు నడిచి సేట్ రామ్‌లాల్ ఆఫీసులో ప్రవేశించాడు. సరిగ్గా రెండు నిమిషాల తరువాత బయటకు వచ్చాడు. ఆఫీస్‌ముందున్న అంబాసిడర్ కారులో నల్ల సూట్‌కేస్ నుంచి, ఎవరికోసమో నిరీక్షిస్తున్నట్లు కారు డోర్ దగ్గిరే నుంచున్నాడు. కాస్సేపటికి యేమను నాకున్నాడో యేమో, కార్లో కూర్చుని స్టార్ట్ చేశాడు.

"జేమ్స్! మనం త్వరపడాలి. వీడిప్పుడు నడక మానేసి కార్లో బయలుదేరాడు. అదిగో! ఇటువైపు ఓ ఖాళీ ఆటో వస్తోంది. సరిగ్గా వీడు కారు స్టార్ట్‌చేసే సమయానికే మనకి ఆటో దొరకడం చాలా అదృష్టం," అంటూ ఆటోని కేకేసి ఆపాడు హోమ్స్. పార్ట్‌నర్స్ యిద్దరూ అందులో యెక్కి కూర్చుని, ముందు పోతున్న అంబాసిడర్ కారుని వెంబడించమన్నారు.

"సార్! మీరు డిటెక్టివ్‌లా సార్!" కుతూహలంగా ప్రశ్నించాడు ఆటో డ్రైవర్.

"అవునోయ్! నువ్వు చాలా స్మార్టుగా వున్నావే. మమ్మల్ని చూడగానే పట్టేశావ్. నువ్వు త్వరలోనే వృద్ధిలోకి వస్తావు. నాలాగా మంచి పేరు సంపాదిస్తావు. అన్నట్లు, ముందున్న అంబాసిడర్‌లో వున్నది ఓ పాకిస్తానీ

ఏజెంట్. వాడి దగ్గరున్న సూట్ కేస్‌లో భారత దేశానికి చెందిన అతి ముఖ్యమైన పత్రాలున్నాయి. వాడిప్పుడు తన స్థావరానికి వెళ్తున్నాడు. మనం చాలా కేర్‌ఫుల్‌గా ఫాలో అవ్వాలి. తెలిసిందా?'' అన్నాడు హోమ్స్.

‘‘ఇటువంటి అడ్వెంచర్స్ నాకు చాలా యిష్టం సార్! మీలాంటి గొప్ప డిటెక్టివ్‌లకు సహకరించి ఈ పాకిస్తానీ వాడిని పట్టుకోబోతున్నందుకు నాకు యెంతో ఆనందంగా వుంది'' ఉత్సాహంగా అన్నాడు ఆటో డ్రైవర్.

‘‘హోమ్స్! ఆటోలో యెక్కడమైతే యెక్కేశాం. కానీ డబ్బులెలా?'' హోమ్స్ చెవిలో రహస్యంగా అన్నాడు జేమ్స్.

‘‘ఉష్! తర్వాత చూసుకుందాంలే.''

అంబాసిడర్ కారు మెల్లిగా వేగాన్ని పెంచుకుంటోంది. సిటీ లిమిట్స్ దాటింది. కొంత దూరం పోయాక హైవే నుండి ఓ డొంక రోడ్‌లోకి మళ్ళింది.

అంబాసిడర్‌ని కొంచెం దూరంనుండి అనుసరిస్తోంది ఆటో. హోమ్స్, జేమ్స్‌లలో క్యూరియాసిటీ పెరుగుతోంది. డ్రైవర్ మరీ వుత్సాహంగా వున్నాడు.

‘‘డ్రైవర్! నీ పేరేమిటో అడగడం మర్చిపోయాను'' అన్నాడు హోమ్స్.

‘‘గణేష్ సార్! నే నిప్పటికి కనీసం ఆరేడువందల డిటెక్టివ్ నవల్స్ చదివాన్సార్. మనూళ్ళో డిటెక్టివ్ పుస్తకాలు అద్దెకిచ్చే ప్రతి షాప్‌వాడికీ నేను రెగ్యులర్ కస్టమర్‌ని. వాళ్ళకు నా గురించి బాగా తెలుసు'' అన్నాడు కొంచెం గర్వంగా.

‘‘నీపేరు నగేష్ కదూ అన్నావు. చాలా మంచిపేరోయ్'' అన్నాడు హోమ్స్ అతన్ని మంచి చేసుకునే ధోరణిలో,

"కాదు సార్. నా పేరు గణేష్."

"ఓహోహో, గణేష్, గణేష్. సరిగ్గా వినపడలేదోయ్. గణేష్ కూడా మంచి పేరేనోయ్" అని సరిదిద్దుకున్నాడు హోమ్స్. ఒక్క క్షణం ఆగి అన్నాడు, "ఇప్పుడు మనం వెళ్తున్న రూట్ ఏమిటో సరిగ్గా తెలీడంలేదు. ఈ పాకిస్తానీ వాడు ఏ ఊరు పోతున్నట్లు?"

"ఈ రూట్ నాకు కూడా కొత్తే సార్. నేను కూడా యిటువైపు ఎప్పుడూ రాలేదు. ఇదంతా డొంక దారిలా వుంది. బహుశ కూనాలపేట రోడ్ అయుండొచ్చు" అన్నాడు గణేష్.

సమయం రాత్రి పది గంటలౌతోంది. పోను పోను దారంతా అడవిలాగా తోస్తాంది. ఆ రోడ్లో ట్రాఫిక్ అసలు లేదు. మిణుగురు పురుగులు అక్కడక్కడా తళుక్కు మంటున్నాయి. భయంకర నిశ్శబ్దం.

గతుకుల రోడ్ మీద అంబాసిడర్ నిదానంగా పోతోంది. వెనుకే వెంబడిస్తోంది ఆటో. ఎగుడు దిగుడులకు అటూ, యిటూ ఊగుతున్నారు ఆటోలో వున్న ముగ్గురూ.

అంతలో అంబాసిడర్ కారులో నుండి ఆగంతకుని చెయ్యి బయటకు వచ్చింది. రోడ్ మీదకు యేదో గుండ్రటి, తెల్లని వస్తువుని వదిలింది.

"గణేష్! ఆటో ఆపు. మనల్ని వాడు గమనించినట్లున్నాడు. రోడ్ మీదకు విసిరింది యేదో బాంబు అయి వుండొచ్చు" అరిచాడు జేమ్స్.

"ఏమిటి సార్! మీరు డిటెక్టివ్లై వుండి కూడా అలా భయపడతారు?"

"ఛఛ. భయపడటం లేదోయ్. జాగ్రత్తపడమంటున్నాను."

"ఏం ఫరవాలేదు సార్. ఆ బాంబు సంగతి నేను తేల్చేస్తాను" అంటూ అంబాసిడర్ కారులో నుండి విసిరివేయబడ్డ తెల్లటి పదార్థానికి కొద్దిదూరంలో ఆటోని ఆపాడు. ఆటోలో నుండి దిగి ఆ పదార్థంవైపు మెల్లిగా అడుగులు వేశాడు. వెన్నెల కాంతిలో ఆ పదార్థంవైపు పరీక్షగా చూసిన గణేష్ కనుబొమలు విచ్చుకోవడం పార్ట్‌నర్స్ గమనించలేదు.

"ఆఫ్టరాల్, ఓ ఆటో డ్రైవర్ ఈ జేమ్స్‌బాండ్ కంటే సాహసంగా ముందుకు వెళ్ళడమా" అనుకున్నాడు కాబోలు జేమ్స్ రెండంగల్లో ముందుకు వెళ్ళి ఆ తెల్లటి, గుండ్రని పదార్థాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

అది కాగితం ఉండ!

మెల్లగా దాన్ని విప్పాడు జేమ్స్. ఖాళీ కాగితం. ఏమీ వ్రాసినట్లు కూడా కనిపించటంలేదు.

"దీన్ని మన లేబరేటరీలో టెస్ట్ చేద్దాం జేమ్స్. ఇందులో యేదైనా రహస్య సమాచారం మైక్రో డాట్ల రూపంలో వ్రాసివుండొచ్చు" అన్నాడు హోమ్స్.

"కానీ మనకు లాబరేటరీ ఎక్కడుంది?" అని అడగబోయి తమాయించుకున్నాడు జేమ్స్.

హోమ్స్, జేమ్స్‌ల వంక గౌరవపూర్వకంగా చూశాడు గణేష్.

కాగితం తీసుకుని ముగ్గురూ ఆటోలో కూర్చున్నారు. గతుకుల రోడ్డు కావడం మూలాన కాబోలు ముందున్న అంబాసిడర్ నిదానంగా పోతోంది. ఇంకా కనుచూపు దూరంలోనే వుంది. ఆటో వేగంగా దానిని వెంబడించింది.

సరిగ్గా పదకొండు గంటలౌతుండగా అంబాసిడర్ ఓ ఫ్యాక్టరీ ముందు ఆగింది. ఆ చుట్టుప్రక్కల కొన్ని యిళ్ళు

కూడా వున్నాయి.

"ఇదేదో బాంబులు తయారుచేసే ఫ్యాక్టరీ కాదు కదా" అనుకున్నాడు జేమ్స్ మనసులోనే.

"బాంబుల ఫ్యాక్టరీ అనుకుందామంటే, చుట్టు ప్రక్కల యిళ్ళు వున్నాయి. ఈ యిళ్ళు కూడా దేశద్రోహులవేనా?" తర్కించుకుంటున్నాడు హోమ్స్.

ఆసక్తిగా జరగబోయేది చూస్తున్నాడు గణేష్.

ఆగంతకుడు సూట్ కేస్‌తో కార్లో నుండి దిగి ఫ్యాక్టరీ లోకి నడిచాడు. గుమ్మం దగ్గరే ముగ్గురు వ్యక్తులు అతన్ని రిసీవ్ చేసుకున్నారు. సూట్ కేస్‌ని వారికందించి యేదో మాట్లాడాడు రెండు నిమిషాలసేపు.

ఆ తరువాత ఆ వ్యక్తి వెనక్కి తిరిగి, అంబాసిడర్ వెనుకే కొద్ది దూరంలో ఆగి వున్న ఆటోవైపు నడవ సాగాడు.

"మైగాడ్! ఈ పాకిస్తానీగాడు మనవైపే వస్తున్నాడు. ఇప్పుడేం చేద్దాం?" అడిగాడు జేమ్స్.

హోమ్స్ ఊపిరి బిగబట్టి మౌనంగా చూస్తున్నాడు.

ఆగంతకుడు వారిని సమీపించి, వినయంగా అన్నాడు, "నమస్తే, సర్! ప్లీజ్! లోపలికి రండి."

మంత్రముగ్ధుల్లా అతని ఫ్యాక్టరీలోకి అనుసరించారు ముగ్గురూ. లోపల ముగ్గురికీ కుర్చీలు చూపించి మర్యాద చేశాడు అపరిచిత వ్యక్తి.

కొంతసేపు అందరూ విశ్రాంతి తీసుకున్నాక అతను అన్నాడు, "మీకు శ్రమ ఇచ్చినందుకు నన్ను క్షమించాలి. తప్పనిసరి పరిస్థితిలో యిలా చేయవలసి వచ్చింది. మీకు మొదటినుండీ అంతా వివరంగా చెపుతాను...." అని చెప్ప సాగాడతను.

డిటెక్టివ్ ద్వయం నిశ్చేష్టులై వింటున్నారు.

"నా పేరు జనార్ధనరావు. నేను సేట్ రామ్‌లాల్ ఆఫీసులో అసిస్టెంట్ మానేజర్‌గా పని చేస్తున్నాను. మా ఫ్యాక్టరీ యిక్కడ కూనాలపేటలో వుంది. మా ఆఫీసు, మీకు తెలుసనుకుంటాను, విజయవాడలోనే వుంది. ఈ రోజు యిక్కడకి వచ్చే ముందు నేను అంబాసిడర్‌లో బయలుదేరింది మా ఆఫీసు ముందునుండే.

మేము ప్రతినెలా ఫ్యాక్టరీవర్కర్ల జీతాలు 2వ తారీఖున పే చేస్తాము. ఈ రోజు ఒకటవ తారీఖు అయినప్పటికీ మా కస్టమర్ల దగ్గర నుండి మా చేతి కందవలసిన డబ్బు అంద లేదు. అంచేత, మా సేట్ ఈ రోజు మధ్యాహ్నం ఫ్యాక్టరీ మానేజర్‌కి ఫోన్‌చేసి వర్కర్ల జీతాలు రేపు యివ్వడం కుదరదనీ, నాలుగో తారీఖున యిస్తామనీ చెప్పాడు.

ఇయితే యిందుకు వర్కర్లు ఒప్పుకోలేదు. మా ఫ్యాక్టరీ మానేజర్ వాళ్ళకు యెంతగా నచ్చజెప్పటానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. రేపు ప్రొద్దున జీతాలు ఇవ్వక పోతే సమ్మె చేస్తామని కూడా బెదిరించారట. అందుచేత ఫ్యాక్టరీకి మేనేజర్ ఈ రోజు సాయంత్రం 5-35 గంటలకు ఆఫీసుకు ఫోన్ చేసి ఈ విషయం సేట్‌తో చెప్పాడు.

వెంటనే మా సేట్ యిద్దరు, ముగ్గురు ముఖ్యమైన కస్టమర్లతో మాట్లాడాడు. ఎవరూ కూడా డబ్బు వెంటనే ఇవ్వలేమన్నారు. సేట్ చమన్‌లాల్ మాత్రం ఈ రోజు రాత్రి 8-30—9-00 గంటల ప్రాంతంలో డబ్బు సర్దగల నన్నాడు.

అప్పటికి ఆఫీసులో నేను తప్ప యింకెవ్వరూ లేరు. అందుకని మా సేట్ యీ పని నా కప్పగించాడు. నేను చెయ్యవలసిన పనేమిటంటే, 8-30 గం.లకు చమన్‌లాల్

షాప్‌కు వెళ్ళి, అతను ఇచ్చిన రెండు లక్షల రూపాయలూ తీసుకుని, ఆఫీస్ కారులో ఒంటరిగా ఫ్యాక్టరీకి వెళ్ళి ఆ డబ్బు నందజేయాలి. అలా చేస్తేనే, రేపు ప్రొద్దున ఆరు గంటలకు దిగిపోయే రాత్రి షిఫ్టు వర్క-ర్లకు జీతాలు యివ్వడం కుదురుతుంది.

కానీ, మనం వచ్చేటప్పుడు రోడ్డు చూశారు కదా. అంతా దొంకదారి. రెండు గంటల ప్రయాణం. రోడ్డంతా నిర్మానుష్యం. పైగా క్రిందటి నెలలో, యీ దారిలో పట్ట పగలే రెండు దోపిడీలు జరిగాయి. అందుకని రాత్రిపూట రెండు లక్షల రూపాయలతో ఒంటరిగా ప్రయాణం చేయాలంటే భయమేసింది. మా సేట్‌కి వివరించుదామంటే విని పించుకునే రకం కాదు. మొండిమనిషి. అందుచేత అయిష్టం గానే ఒప్పుకున్నాను.

డబ్బు తరచూ ఫ్యాక్టరీకి తీసుకువెళ్ళవలసి ఉంటుంది కనుక ట్రాన్సిట్ ఇన్సూరెన్సు పాలసీ తీసుకున్నాము. అందుకనే ఈ దారిలో దోపిడీ జరిగేందుకు అవకాశంవున్నా సేట్ నిర్భయంగా వెళ్ళమన్నాడు నన్ను.

కానీ నా భయం ఏమిటంటే డబ్బు దోపిడీ చేయబడితే నాకు చెడ్డ పేరు రావచ్చు. దోపిడీ జరిగినట్లు నేను సరియైన నిదర్శనం చూపకపోతే, నేనే ఆ దొంగతనం చేసి నాటక మాడుతున్నట్లు మా సేట్ కానీ, మికతా స్టాఫ్ గానీ నన్ను అనుమానించవచ్చు. పైగా, సరియైన సెక్యూరిటీ లేకుండా రాత్రిపూట రెండు లక్షలతో ఒంటరిగా మనిషి వెళ్ళినట్లు తెలిస్తే ఇన్సూరెన్సువాళ్ళు క్లెయిమ్‌ని త్రోసిపుచ్చవచ్చు కూడా. అప్పుడు మానసికంగా నా పరిస్థితి మరీ దుర్భరంగా వుంటుంది. నేనసలే సెన్సిటివ్ మనిషిని.

ఇక మరో భయం యేమిటంటే డబ్బు దోపిడీ చేయ

డమే కాక నాకు అపకారం కూడా తలపెట్టవచ్చు దుండగులు. క్రిందటి నెల జరిగిన దోపిడీలో యిద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్నేహితుల నెవరినయినా వెంట తీసుకువెళ్ళాలంటే మనసు ఒప్పలేదు. కారణం దోపిడీదారులు ఎదురైనప్పుడు వాళ్ళూ నాలాగే నిస్సహాయంగా చూస్తూ ఊరుకోవాలిసివస్తుంది. అదే మీ వంటి డిటెక్టివ్‌లు తోడుంటే వాళ్ళను సాహసంగా ఎదుర్కోగలరు.

అందుకనే మిమ్మల్ని నా వెంట తీసుకువెళ్ళాలనుకున్నాను. కానీ మీ ఫీజు యివ్వడానికి మా సేట్ ఒప్పుకోడు. ఉత్త పిసినారి. నా జేబులో నుండి యెటు యివ్వలేను. కారణం నాకు వచ్చే 800 రూపాయల జీతంతో సాధ్యపడదు. తప్పనిసరి పరిస్థితుల్లో, చిన్న ప్లాన్ వేసి, మీ ఆఫీస్‌ముందు కాచుకు కూర్చున్నాను. మీరు ఆఫీసు మూసి బయలుదేరగానే మీ దృష్టి నన్నాకర్షించేట్లు అనుమానాస్పదంగా ప్రవర్తించాను. ఆ తరువాత కథ మీకు తెలిసిందే" అంతా చెప్పి తల వంచుకున్నాడు జనార్ధనరావు.

పది నిమిషాల వరకూ నోట మాట రాలేదు పార్ట్‌నర్స్ యిద్దరికీ. అతని తెలివితేటలకు నవ్వాలో, ఏడవాలో అర్థంగాలేదు. 'ఇదేదో మెంటల్ కేసు కాదు కదా' అని అనుమానం కూడా వచ్చింది.

కొంతసేపటికి నిదానంగా అన్నాడు హోమ్స్, "కనీసం మా ఆటో ఖర్చులు...."

"అవి మాత్రం నేను భరిస్తాను" అనేసి మళ్ళీ తల దించుకున్నాడు జనార్ధనరావు.

ఈ కేసు యిక్కడితో ముగిసిపోయినా, ఆ తరువాత వారంరోజుల వరకూ గడ్డం పెంచేసి తనలోనే ఏదేదో గొణుక్కుంటూనే వున్నాడు హోమ్స్. □

బి. రాజేశ్వరి

మలక్‌పేట రేసులు

"మీకు ఉత్తరం వచ్చిందండీ!" భర్త రాగానే ఉత్తరం అందించింది ధనలక్ష్మి.

శ్యామలరావు బట్టలయినా మార్చుకోకుండా ఉత్తరం అందుకున్నాడు.

ఆ దస్తూరీ తనకు పరిచితమే! అది పర్వతరావు రాసిన

లెటరు. అతని ప్రత్యేకత కవర్ చూడగానే చెప్పొచ్చు. తెల్లటి మల్లెపూవులాంటి కవరు వాడతాడు. నల్లసిరాతో అడ్రసు రాస్తాడు. మరీ ప్రత్యేకమైన అలవాటు—కవరుకి సెంటు పూస్తాడు. అంతదూరం ప్రయాణం చేసివచ్చినా తన చేతి కందేసరికి పరిమళం గుబాళిస్తూనే వుంటుం దింకా.

కవరు చింపి, లోపలి నుండి లెటర్ హెడ్ పేపరు బయ టికి తీశాడు. ముత్యాల్లాంటి అక్షరాలు—తెల్లటి పేపరు మీద ప్రింటులా వుంటాయి. పర్వతరావు ఆడపిల్లయి పుట్టాల్సింది! అన్నీ ఆడవాళ్ళ అభిరుచులే మరి!

ఉత్తరం గబగబా చదివాడు. ఏమీ అర్థం కాలేదు. మరోసారి పై నుండి కిందికి చదివాడు. ఉహుఁ! అసలు ఒక్కమాటా అర్థం కాలేదు. మళ్ళీ చదివాడు.

"బాలూ!

ఆదివారం మలకపేట రేసుకోర్సులకు వెళ్ళు.
నంబరు గుర్తుంది కదూ!
నేను ఓటమిని అంగీకరించను.
నువ్వూ ఓడిపోకూడదు, గుర్తుంచుకో!

నీ
పర్వతరావు."

నాలుగోసారి ఆ నాలుగు వాక్యాలు చదివాక శ్యామల రావు మస్తిష్కంలో మెరుపు మెరిసింది.

సంబోధన తనకు కాదు. పర్వతరావు తనని ఎప్పుడూ 'శ్యామూ' అని సంబోధిస్తాడు—బయట, ఉత్తరాల్లో కూడా. ఇది తనకి రాసిన ఉత్తరం కాదు. ఎవరో "బాలు" అన్న మనిషికి. "బాలు" అంటే బాలయ్యో, బాలకృష్ణో,

బాలమురళీకృష్ణో, బాలసుబ్రమణ్యమో — యెవరయినా కావచ్చు.

అయితే ఈ ఉత్తరం తనకెలా చేరింది? కవరుమీద అడ్రసు తనది వుంది. అంటే తనకు పోస్టు చెయ్యాల్సిన ఉత్తరం ఆ 'బాలు'కి, ఆ 'బాలు'కి రాసినది తనకీ పోస్ట్‌చేసి వుంటాడు పర్వతరావు. తొందర్లో ఒకరి కవర్లో మరొకరి ఉత్తరం పెట్టేసి అతికించేశాడు.

అసలు తనకి రాసిన ఉత్తరంలో ఏముందో? 'బాలు'కి రాసిన ఉత్తరం అంత ప్రాముఖ్యత కలది కాదు. ఏదో రేస్ కోర్సులకి సంబంధించినది. ఆదివారం రేస్‌కోర్సులకి బాలు వెళ్ళకపోతే పెద్దగా నష్టమేమీ లేదు.

అయితే, పర్వతరావుకి రేస్‌కోర్సుల పిచ్చి కూడా వుందా? తనకి తెలీదే! ఆ బాలుతో కలిసి రేసులకి అలవాటు పడివుంటాడు. తనకి తెలిసినంతవరకు పర్వతరావు మంచి స్నేహితుడు! వ్యసనాలకు బానిసై పోతున్నాడన్న మాట!

"ఏమిటండీ, ఏముందా ఉత్తరంలో? పది నిమిషా లయింది, ఆ ఉత్తరాన్ని అలా పట్టుకునే నించుండి పోయారు? కాఫీ చల్లారిపోతోంది, ఎంతసేపు పట్టుకుని వుండేది?" అన్న ధనలక్ష్మి మాటలకు యీ లోకంలోకి వచ్చాడు శ్యామలరావు.

"ఆ, అహ, ఏంలేదు. ఇలా తే కాఫీ" కప్పు అందు కున్నాడు.

ధనలక్ష్మి అక్కడినించి కదల్లేదు. "ఇలా యివ్వండి ఉత్తరం?" అంటూ చెయ్యిచాచి అందుకుంది. యాంత్రి కంగా ఆమె చేతి కందించాడు.

"ఏమిటిది? యీ రేసులకి ఎప్పుడు అలవాటుపడ్డారు? నాకు తెలీకుండా చాలా గ్రంథం నడుపుతున్నట్టున్నారే!

అమ్మో, నేను నా పిల్లలు ఏ ఏట్లో దూకాలి? మీకిలాంటి పాడుబుద్ధి పుట్టిందేం?" అరచింది ధనలక్ష్మి. ఆమె కంఠంలో దుఃఖం ఉబికి వచ్చే జలపాతంలా దూక బోతోంది.

"అబ్బబ్బ, ఏమిటోయ్, ఆ పాడుగోల? రేసులు లేదు, నా శ్రాద్ధమూలేదు. ఆ ఉత్తరం నాకు రాసింది కాదు" అన్నాడు శ్యామలరావు గబగబ.

ధనలక్ష్మి భర్త చేతిలోని కవరు లాక్కున్నట్టుగా తీసుకుని చూసి, "నాకు చదువు రాకపోతే మీరు చెప్పిందే నిజమని పిచ్చిదానిలా తలూపి వుండేదాన్ని! ఇదేమిటి, యింత స్పష్టంగా కె. శ్యామలరావు అని రాసి మనింటి నంబరు వీధి రాసి వుంటే కాదని బుకాయిస్తారేం? ఈయనకి యిదేం పాడుబుద్ధి భగవంతుడా...." మళ్ళీ రాగం ఎత్తుకోబోయింది ధనలక్ష్మి.

"అబ్బబ్బ. నువ్వు నాలాగే పొరపడ్డావు. పైన సంబోధన చూసు. ఎవడో 'బాలు' అట. వాడికి రాసిన ఉత్తరం నాకొచ్చి పడింది. నాకే పాపమూ తెలీదు. నీమీద ఒట్టు, కావాలంటే పిల్లలమీద ఒట్టు!"

ధనలక్ష్మి పైన సంబోధన చూశాక శాంతించింది.

"అయితే, మరి మనకెలా వచ్చిందీ ఉత్తరం?"

శ్యామలరావు వివరించి చెప్పాడు.

"అయ్యో, మిమ్మల్ని అనవసరంగా అనుమానించాను, పాపిష్టిదాన్ని, అయినా మీ గుణం నాకు తెలీదూ? బంగారం! మీ మనసు నిశ్చలమైంది. ఇల్లాంటి వాటికి చలించదు" భర్తను మెచ్చుకోసాగింది ధనలక్ష్మి.

"ఇంతకీ పర్వతం నాకేం రాశాడో? అసలే యీ మధ్య

వాడి దగ్గర్నుంచి ఉత్తరాల్లేవు. ఏం విశేషాలు రాశాడో, ఏమిటో? వాడికే రాసి కనుక్కుంటే సరి!''

“అబ్బబ్బ! ఇప్పుడు అర్జంటుగా రాసి కనుక్కోక పోతేనేం? ఏం రాసి వుంటాడు—మేం క్షేమం, మీరెలా వున్నారు? అనే కదూ! అయినా అలాంటి పాడలవాట్లున్న మనిషితో మీకు స్నేహమేమిటి? మీకూ తన అలవాట్లు చెప్పుతాడు.''

“అతనికా అలవాట్లున్నంత మాత్రాన నాకూ అవి అల వడతాయని ఎందు కనుకోవాలి? నాకు సెల్ఫ్ కంట్రోల్ లేదనుకుంటున్నావా ఏమిటి?''

“అంతగా అతనేం రాశాడో తెల్సుకోవాలంటే ఆ 'బాలు' ఎవరో, ఆ మహానుభావుడ్ని వేటాడండి.''

“నువ్వెక్కడో పిచ్చిదానిలా వున్నావు. 'బాలు' అనే పొడిమాట పట్టుకుని హైదరాబాదు నగరమంతా వెతక మంటావా? అదీగాక ఆ బాలూ మహాశయుడిది యీ నగ రమేననే గ్యారంటీ ఏమిటి? ఇదే నగరమనుకుందాం, అడ్ర సేమిటి? అందుకనే పర్వతరావుకి రాసి కనుక్కోవటం మేలని నా అభిప్రాయం.''

“సరే మీ యిష్టం బాబూ! ఎప్పుడైనా నా మాట విన్నారు గనకనా?''

“ఓహో, యిదో కొత్తరకం అస్త్రం! అక్కడికి నే నెప్పుడూ నీమాట విననట్టు, స్వయంగానే వ్యవహరిస్తున్నట్టు తేల్చావు. సరే, మళ్ళీ పర్వతరావు రాసేవరకు నేను రాయను, సరేనా?''

“ఆహా, ఏం త్యాగం?'' నవ్వింది ధనలక్ష్మి.

తనూ నవ్వేశాడు శ్యామలరావు.

2

రెండురోజుల తర్వాత ఓ సాయంత్రం ఓ మనిషి తలుపుతట్టాడు శ్యామలరావు యింటికొచ్చి.

శ్యామలరావు అప్పుడే ఆఫీసునించి తిరిగొచ్చాడు.

తలుపుతీసి కొత్త వ్యక్తి వంక ఆశ్చర్యంగా చూశాడు.

"నా పేరు బాలరాజు. పర్వతరావు స్నేహితుడ్ని" అన్నాడతను.

పర్వతరావు పేరు వినగానే శ్యామలరావుకి యీ బాలరాజెవరో అర్థమయిపోయింది.

"రండి, లోపలికి వచ్చి కూచోండి" ఆహ్వానించాడు శ్యామలరావు.

బాలరాజు లోపలికొచ్చాడు.

"రెండు రోజుల క్రితం పర్వతరావు నాకో లెటర్ రాశాడు. అయితే, అది నాకు రాసినది కాదు!" చెప్పాడు బాలరాజు.

శ్యామలరావు వింటున్నాడు.

"కవరుమీద అడ్రసు నాదే! అయితే లోపలి కాగితం మీ పేర్న రాసుంది. దాన్నిబట్టి నాకు రాసిన ఉత్తరం మీకు పంపించేసి వుంటాడని వూహించి మీదగ్గరికి బయల్దేరి వచ్చాను."

"అయితే మీరుంటున్నది కూడా యిక్కడే నన్నమాట!"

"అవునండీ! ఖైరతాబాద్‌లో వుంటున్నాను."

"మరి మీకు నా అడ్రసెలా తెలిసింది?"

"ఓ సారి పర్వతరావు నేను కలిసినపుడు వాడు చెప్పాడు—మీరు తన క్లాస్‌మేటని, యిక్కడే విజయనగర్ కాలనీలో వున్నారనీ, మీరు తనకు మంచి స్నేహితు

లనీ, మీతో పరిచయం చేస్తాననికూడా అన్నాడు. కానీ వీలుపడలేదు. వాడికి పిటీ వచ్చాడంటే లక్షాతొంభై పనులు. బిజినెస్‌తో క్షణం తీరికుండదు."

"మీరుకూడా బిజినెస్ చేస్తుంటారా?"

"అవునండి. పిటీ ఏజెంటుని. పంప్‌సెట్స్, స్పేర్‌పార్ట్స్ అమ్ముతుంటాను. పర్వతరావు ఆర్డర్లు బుక్ చెయ్యటం వాటి పంపిణీ చేయించటం చూస్తుంటాడు. విజయవాడ బ్రాంచీని వాడు చూసుకుంటున్నాడు."

"బావుందండి. మరి యిల్లు వెతుక్కోవటం కష్టం కాలేదా?" అన్నాడు శ్యామలరావు, పర్వతరావు రాసిన లెటరు అతనికిస్తూ.

"కొద్దిగా ఎంక్వయిరీ చేసి వచ్చానులెండి. అయినా యిదివరలో మీ దగ్గరకి చాలాసార్లు వచ్చాడట కదా! కమ్యూనిటీ హాలు దగ్గర్లో అని చెప్పాడు. సరాసరి కమ్యూనిటీ హాలు దగ్గరకొచ్చేసి ఎంక్వయిరీ మొదలెట్టాను. మీగురించి యిక్కడ చాలామందికి తెలిసినట్లే వుంది. వెంటనే చెప్పారు....ఇదిగోండి పర్వతం మీకు రాసిన లెటరు" ఓ కాగితం అందించాడు బాలరాజు.

శ్యామలరావు అందుకుని చదివాడు.

శ్యామూ!

ఉభయ కుశలోపరి.

నేను త్వరలో, అంటే వచ్చే 20వ తేదీ ఆదివారం హైదరాబాదు వస్తున్నాను. తప్పక మీ ఇంటికి కొస్తాను. ఈ సారి మీ యింట్లో ఓ రోజైనా తప్పకుండా వుంటాను. మన స్నేహితుడు అశ్వారావుతో మాట్లాడే పనుంది. ఆ మధ్య మా ఇద్దరి మధ్య కొద్దిగా మనస్పర్ధలు తలెత్తాయి. వాటిని క్లియర్

చేసుకోవాల్సిన బాధ్యత నా మీదుంచి.

మనిద్దరం కలిసి వాడింటికి వెళ్దాం. ఆదివారం ఎక్కడికీ పోవద్దని వాడిని ముందుగా కలిసి ప్రోగ్రాం ఇవ్వు. బహుశా ఆదివారం సాయంత్రానికి నేను హైదరాబాదు చేర్తాను. ముందు మీ ఇంటికొస్తాను. అక్కడి నుంచి ఇద్దరం కలిసి వెళ్దాం.

పిల్లలందరు కులాసాయే కదా? చెల్లెమ్మని అడిగినట్టు చెప్పు. పిల్లలకు ముద్దులు. ఉంటాను.

—నీ పర్వతం"

గబగబ చదివేసి "అయితే పర్వతం వస్తున్నాడన్న మాట!" అన్నాడు జనాంతికంగా.

"అది నాకేమోనని నేను తెలీక చదివేశానండి. అయామ్ సారీ!" అన్నాడు బాలరాజు.

"ఫర్వాలేదండి. నేనూ మీకు రాసిన లెటర్ నాలుగు సార్లు కిందికీ మీదికీ చదివి ఏం అర్థంకాక అప్పుడు సంబోధన చూశాను. అప్పుడు తెలిసింది–అది నాకు కాదని! ఎవరిదో వూహించలేకపోయాను. మీరు చాలా చురుగ్గా ఆలోచించారు. 'శ్యాము' అంటే శ్యామలరావనీ, ఆ శ్యామలరావు నేనేనని బాగా ఊహించారు."

"సాధారణంగా శ్యామలరావు పేరు చాలా అరుదుగా వుంటుంది కదండీ! అంచేత పర్వతం స్నేహితుడు శ్యామలరావంటే ఇక మీరు తప్ప వేరెవరూ వుండరు కదా! దానికి పెద్ద సమస్యలేదు."

ధనలక్ష్మి కాఫీ కప్పులు తెచ్చి టీపాయ్‌మీద పెట్టింది.

"నా మిసెస్ ధనలక్ష్మి. వీరు బాలరాజుగారని నా ఫ్రెండు పర్వతరావుకి బిజినెస్ పార్టనర్" పరిచయాలు చేశాడు శ్యామలరావు.

"నే వస్తానండీ! పర్వతం ఒకరి ఉత్తరాలు ఒకరికి పంపి మనిద్దర్నీ యిలా కలిపాడు" అన్నాడు బాలరాజు.

బాలరాజు వెళ్ళిపోయాడు.

"ఈ మాత్రానికే ఆ లెటరు గురించి క్రిందా మీదా పడి పోయారు. సమస్య పరిష్కారమయిపోయింది కదా!" అన్నది ధనలక్ష్మి ఉత్తరం చదివి భర్తకిచ్చేస్తూ.

"ఈ ఉత్తరానికి చాలా ప్రాముఖ్యత వుంది. విడి పోయిన యిద్దరు స్నేహితుల్ని కలపటానికి నేను వారధిగా నిలబడబోతున్నాను. అశ్వారావుకి వెంటనే కబురు చెప్పాలి. ఈ రోజు శనివారం. రేపే పర్వతం వచ్చేది. నేను ఇప్పుడే మలిక్ పేట వెళ్ళి చెప్పివస్తాను" అన్నాడు శ్యామలరావు.

"ఏమిటి, ఇంత రాత్రప్పుడా? ఉదయం వెళ్ళి చెప్ప వచ్చును కదా!"

"ఏమో, సెలవురోజు కదా అని వాడు వేరే ప్రోగ్రాం పెట్టుకుని బయటికి ఎక్కడికైనా పోతే? మళ్ళీ రెండు గంటల్లో తిరిగి రానూ?" అన్నాడు శ్యామలరావు బట్టలు వేసుకుంటూ.

"అవునూ, నాకో చిన్న సందేహం...."

ఏమిటన్నట్టు చూశాడామె వంక.

"మీ ఫ్రెండు మీకు లెటరు వ్రాసి ఆ అశ్వారావుగార్ని ఆదివారం కలుస్తాను, వుండమని రాసే బదులు—తనే డైరెక్టుగా ఆయనకు రాయవచ్చును కదా? మళ్ళీ ఈ మధ్య వర్తిత్వం దేనికి?"

"నీ 'లా పాయింట్' బానేవుందిగానీ, వాడు రాశాడు కదా 'మా యిద్దరి మధ్య యిదివరలో మనస్పర్ధలున్నాయి' అని! అంచేత డైరెక్టుగా రాయటానికి కొంత మొహ

మాటం అడ్డొస్తుంది. మళ్ళీ వాళ్ళిద్దరు స్నేహితులు కాబో తున్నారన్నమాట! ఇందుకు మనం దోహదం చేయ పోతున్నాం. ఎంత పుణ్యం!"

"పుణ్యం మాటకేంగాని, మీరు భోజనంచేసి వెళ్తే నాకు కాస్త రెస్టు దొరుకుతుంది. మీరు తిరిగొచ్చేసరికి ఏ అర్ధ రాత్రవుతుందో! బస్‌లు అన్నప్పుడల్లా దొరకవు కదా!"

"నువ్వూ పిల్లలూ తినెయ్యండి ధనం, నాకు వేరే తీసి పెట్టి నీ వంటగది సర్దుకో! వస్తాను" గబగబ వెళ్ళిపోయాడు శ్యామలరావు.

3

"నువ్విలా రావటం చాలా ఆనందంగా వుందిరా శ్యామూ! ఎన్నిసార్లు రమ్మన్నా వచ్చేవాడివికాదు" అన్నాడు అశ్వారావు.

"ఇప్పుడైనా వచ్చేవాడినా? పర్వతంగాడి పుణ్యమా అని నిన్ను కలవటం వీలయింది."

"పర్వతమా?"

"అదేరా, పర్వతరావు. మన చిన్ననాటి స్నేహితుడు."

"ఛీ, వాడి పేరెత్తకు నా దగ్గిర. ఆ దుర్మార్గుడ్ని ఏం చేసినా పాపం లేదు."

"అదేమిట్రా అంత కోపం వచ్చింది? అయితే పర్వతం రాసినట్టు మీ మధ్య ఎందుకో మనస్పర్ధలు ఏర్పడ్డాయన్న మాట!"

"ఏం రాశాడు?"

"ఇదుగో, యీ వుత్తరం చూడు!"

అశ్వారావు వుత్తరం చదివి తిరిగి శ్యామలరావు కిచ్చేస్తూ, "నాకు నమ్మకం లేదు—వాడికి జరిగిన పరాభ వానికి మళ్ళీ వాడు నా గడప తొక్కకూడదు మరి!"

"అసలేం జరిగింది?"

"నాకో చెల్లెలుంది తెల్సుకదా నీకు! సుమతి. ఓసారి నే నింట లేనపుడు వీడొచ్చాడట. సమయానికి నా భార్య యింట్లో లేదు. పిల్లల్ని తీసుకుని మా అక్కగారింటికి—సైదాబాద్—వెళ్ళిందట.

ఇంట్లో సుమతి ఒక్కతే వుంది. ఈ రాస్కేల్ దాన్ని బలవంతం చేయబోయాడట! ఇంతలో అది అరిచి గొడవ చేసింది. సరిగ్గా అదే సమయానికి నే నొచ్చాను ఆఫీసునుంచి. విషయం తెలిసి అక్కడే వాడ్ని కాలరు పట్టుకుని రెండు చెంపలూ వాయించి వాకిట్లోకి నెట్టేశాను. జనం అప్పటికే పోగయ్యారు. వాళ్ళు కూడా తలో దెబ్బ వేయబోయారు. చస్తాడేమోనని భయంవేసి, నేనే వాళ్ళని వారించాను. వాడు చావు తప్పి కన్ను లొట్టపోయి కాలికి బుద్ధిచెప్పాడు.

అది మొదలు మళ్ళీ ఎన్నడూ వాడి మొఖం నాకు చూపించలేదు. ఇంత జరిగాక వాడు మళ్ళీ నా కోసం మా యింటికొస్తానని నీచేత రాయబారం పంపటం నాకయితే చాలా వండర్‌గా వుంది, నమ్మ బుద్ధి కావటంలేదు."

"ఇంత కథ జరిగిందా? నాకు నిజంగా యీ సంగతులేం తెలియవు."

"అవును, నీ కెప్పుడూ నేను చెప్పలేదు. ఇది జరిగి రెండు నెలలు దాటింది. సుమతిని మా వూరు పంపేశాను. వచ్చేనెలలో దాని పెళ్ళి నిశ్చయించాం. నువ్వు తప్పక రావాలి!"

"చెల్లి పెళ్ళికి నే రాకుండా వుంటానా? అది సరే, యింట్లో యెవరూ కన్పించరేం? మా చెల్లెలు, పిల్లలు...."

"పెళ్ళి పనులు కదా! మా వూరు పంపించాను. అక్కడ అమ్మ ఒక్కతే అన్ని పనులూ చేసుకోలేదుకదా?"

"అవునవును, మరి, రేపు యింట్లోనే వుంటావుకదూ!"

"ఉంటాను. మరి, వస్తానని రాశాడంటున్నావు కదా? యెంత చెడ్డా మన బాల్య స్నేహితుడు, క్లాస్‌మేటు. తప్పేదేముంది?"

"అసలు నీ కీ కబురు అందకపోయేది. ఉత్తరాలు తారుమారయ్యాయి."

"తారుమారా? ఏం జరిగింది?"

శ్యామలరావు జరిగిన సంగతి చెప్పాడు. బాలరాజుకి రాసిన లెటరు వివరాలు చెప్పాడు.

"పర్వతానికి రేస్‌కోర్సులకి పోయే అలవాటుందా?"

"ఏమో, అన్ని దురలవాట్లు అబ్బి వుంటాయి. ఏదో బిజినెస్ వెలగబెడ్తున్నాడు కదా!"

"అసలు ఆ రేస్‌లకోసమే ఆదివారం వస్తున్నాడేమో! వాళ్ళ ఫ్రెండుకి అదే రాశాడు."

"మళ్ళీ చెప్పు. ఏమని రాశాడు?"

శ్యామలరావు. బాలరాజుకి రాసిన లెటరులోని నాలుగు వాక్యాలు మళ్ళీ చెప్పాడు.

"యిందులో యేదో మోసముంది" అరిచాడు అశ్వారావు.

"ఏమిటది?"

"ఇప్పుడు రేస్‌కోర్సులు జరగటంలేదు. అఫ్ సీజను."

"అలాగా! మరి ఆ ఉత్తరంలో...."

"అదే మనమిప్పుడు ఆలోచించాలి. ఆదివారం రేస్‌కోర్సులికి మలక్‌పేట వెళ్ళమన్నాడు. ఆదివారమే తను నన్ను కలవటానికి నా దగ్గరికి నీతో కలిసి వస్తానన్నాడు. అవునా?"

"అవును."

" 'ఓటమి నంగీకరించను, నువ్వూ ఓడిపోకూడదు'

అని బాలరాజుని హెచ్చరించాడు, ఉత్తరంలో!"

"అవును!"

"ఇదంతా పెద్ద కుట్ర. బయటివాడి కెవడికీ అర్థం కాకుండా, బాలరాజుకి మాత్రమే అర్థమయ్యే 'కోడ్ భాష'లో రాశాడు పర్వతరావు. మలక్ పేట అంటే నేనుంటున్నది మలక్ పేట, రేస్ కోర్సులంటే గుర్రప్పందాలు కదా! నా పేరు అశ్వారావు—అంటే గుర్రానికి సంబంధించిన పేరు. నంబరంటే మా యింటి నంబరు. ఆదివారం బాలరాజుని మా యింటికి వచ్చి నన్ను హతమార్చమని రాశాడు పర్వతరావు. ఓటమి కూడదన్నాడంటే, ట్రయిల్ ఫెయిల్ కాకూడదని హెచ్చరించాడు."

శ్యామలరావు తెల్లబోయి చూస్తూండిపోయాడు.

"నిజమా? పర్వతరావింత దుర్మార్గుడా?"

"వాడి గురించి ప్రత్యక్షంగా చూశాను కాబట్టి వాడెంత పాపాత్ముడో నాకు తెలిసొచ్చింది. ఆనాడు వాడిని పది మందితోను దేహశుద్ధి చేసినందుకు వాడు నామీద పగ బట్టాడు! వెళ్ళిపోతూ వాడు నాకేసి చూసిన విషపు చూపు నే నెప్పుడూ మర్చిపోను."

"అయితే రేపు వాడు నా దగ్గరికి రావటం...."

"అంతా బూటకం. రేపు బాలరాజు నా మీద హత్యా ప్రయత్నం చేయబోతున్నాడు. నేను ఇంట్లో వుండకుండా బయటికి పోతానేమోనని, నీ ద్వారా నాకు కబురు పంపించాడు. అంటే నా యింట్లోనే నన్ను శాశ్వతంగా సమాధి చెయ్యటానికి కుట్ర జరుగుతోంది."

శ్యామలరావు కర్చీఫ్‌తో చెమట్లు తుడుచుకున్నాడు.

"అయితే, యిప్పుడేం చేద్దాం?"

"ఎత్తుకు పైఎత్తు వేసి వాళ్ళ ఎత్తు చిత్తు చెయ్యాలి."

"పోలీసు రిపోర్టిస్తే....?"

"పోలీసుల్ని చూస్తే వాళ్ళు రావటం మానేస్తారు. మరోసారి మరో విధంగా దెబ్బతీస్తారు."

"మరెలా?"

"నాకో ఆలోచన వస్తోంది."

"ఏమిటది?"

"మన ఫ్రెండు రాఘవ యీమధ్యనే సబిన్స్పెక్టర్‌గా యిక్కడ జాయినయ్యాడు. వాడిది జురిస్‌డిక్షన్ వేరే. అయినా మనకోసం యీ యేరియా పోలీసులతో చెప్పి సాయం చేస్తాడు."

"పోలీసులకి తెలియవద్దన్నావుగా?"

"వాళ్ళు పోలీసు వేషాలతో రారు. మఫ్టీలో మనింట్లో దాక్కుని వుంటారు. కొందరు బయట కాచుకుని వుంటారు. బాలరాజు రాగానే పట్టేస్తారు. బాలరాజు ఏదైనా ముఠాతో వచ్చినా యెదుర్కోవటానికి మనకి బలం వుంటుంది."

"బావుంది. రాఘవని యిప్పుడే కలుద్దాం. పద."

"పద. ఇంటికెళ్దాం. అక్కడ లేకపోతే స్టేషన్‌కి వెళ్ళొచ్చు."

4

తలుపుమీద టకటక చప్పుడు.

"ఎవరు?" లోపల్నుంచి అడిగాడు అశ్వారావు.

"నేను, పర్వతరావుని" బయటినుంచి వినిపించింది.

బయట లైటు వెలిగింది.

తలుపు తెరిచాడు అశ్వారావు.

ఒక్కసారిగా నలుగురు వ్యక్తులు లోపలికి తోసుకుని, వచ్చారు.

"ఎవరు మీరు? ఎవరు కావాలి?" అడిగాడు అశ్వారావు.

"నువ్వే" ఒకడు చెప్పాడు.

"పర్వతరావునని అబద్ధమాడి లోపలకి చొరబడతారా, మీకేం కావాలి?"

"నీ ప్రాణాలు కావాలి."

ముగ్గురి చేతుల్లో కత్తులు లైటువెల్తురులో మెరిశాయి. నాలుగోవాడు విషపు నవ్వు నవ్వుతున్నాడు. అతడు బాలరాజు.

"చివరిసారిగా భగవంతుడ్ని తలుచుకో! పర్వతరావుకి చేసిన అవమానం గుర్తుతెచ్చుకో! దానికి ప్రతీకారమిది! ఊ, కానివ్వండి" ముగ్గురికీ ఆదేశమిచ్చాడు బాలరాజు.

"అడుగు కదల్చవద్దు హేండ్సప్!" వెనకనించి పిడుగు లాంటి స్వరం వినిపించింది.

అందరూ నిర్ఘాంతపోయి తలలు తిప్పారు.

ఎదురుగా ఇన్‌స్పెక్టర్ రాఘవ! చేతిలో నిగనిగ మెరుస్తోన్న పిస్తోలు!

నేల యీనినట్లు పక్క గదిలోంచి బిలబిల మంటూ పోలీసులు గదిలోకి దూసుకొచ్చారు.

నలుగుర్నీ అరెస్టు చేశాక "థాంక్యూ వెరీమచ్ మిస్టర్ రాఘవా!" అన్నాడు అశ్వారావు.

శ్యామలరావు చిరునవ్వుతో రాఘవతో కరచాలనం చేసి "నిజమైన స్నేహితుడు ఆపదలో ఆదుకున్నవాడే!" అన్నాడు. "ఇదిగో, ఇది పర్వతరావు విజయవాడ అడ్రెస్!" అని యిచ్చాడు.

రాఘవ నవ్వి తన బలగంతో వెళ్ళిపోయాడు.

అశ్వారావు కృతజ్ఞతతో శ్యామలరావును ఆలింగనం చేసుకున్నాడు. □

11

"రండి. రండి. ఫోన్ వచ్చినప్పట్నించీ మీ కోసమే ఎదురు చూస్తున్నాను. ఏం తీసుకుంటారు? హాట్ డ్రింక్స్ ఆర్ కూల్‌డ్రింక్స్...."

"థాంక్ యూ ప్రొఫెసర్ స్నేత్నా! అతిధి మర్యాదలు

స్వీకరించడానికి ఇప్పుడు అవకాశం లేదు. ఒక ముఖ్యమైన పనిమీద ఇంత రాత్రిపూట మీకు నిద్రాభంగం కలిగించాను. మీరు అంతరిక్ష విజ్ఞాన శాస్త్రంలో నిష్ణాతులు. సౌరకుటుంబపు స్థితిగతులను క్షుణ్ణంగా అధ్యయనం చేసినవారు. ఈ నాటివరకూ గ్రహమండలాలని పరిశీలన చేస్తూ అదే జీవితాశయంగా భావిస్తున్న అపార శేముషీ...."

"దయచేసి పొగడ్తలు వద్దు మిస్టర్ నర్సన్! మీ గొప్పతనం మీది! మీకేం కావాలో చెప్పండి. కమ్ టు ది పాయింట్" అన్నాడు డాక్టర్ స్నేత్నా.

"థాంక్ యూ స్నేత్నా" అంటూ నర్సన్ ఓ క్షణం వూరుకుని "విశ్వాంతరాళంలోని అనేక గ్రహాలను పరిశీలిస్తూ ఏ గ్రహంలోనైనా జీవరాశి వుందేమో తెల్సుకోడానికి మీరు ప్రయత్నాలు చేస్తున్నారు కదా! మీ పరిశోధనలో ఎక్కడైనా ఏ సౌరగ్రహంలోనైనా జీవరాశి, ఐ మీన్ మనలాంటి మానవరాశి జీవిస్తున్న దాఖలా, ఆధారం ఏదైనా మీకు లభించిందా?" అని అడిగాడు.

"ఏమిటి అంటున్నారు మీరు? సౌరకుటుంబంలోని ఏ గ్రహంలోనూ అసలు ప్రాణవాయువు వున్నదనే నిర్ధారణే యింతవరకూ అందకపోతే జీవరాశి, అందునా మనలాంటి మనుషులు నివసించే గ్రహమా? పురాణ గ్రంథాల్లో మాదిరి ఇంద్రలోకం, బ్రహ్మలోకం, స్వర్గం వగైరా వున్నాయని నమ్ముతున్నారా?"

"మన నమ్మకాలు ముఖ్యం కాదు ప్రొఫెసర్! మనలాంటి మనుషులు నివశించే మరో మానవలోకపు మనిషిని నా కళ్ళారా చూశాను. అతను పోలికలో, పేరులో కూడా మనల్ని, ఇంకా వివరంగా చెప్పాలంటే నాకు ప్రతిరూపంలా వున్నాడు. మన భూమ్మీద నివశిస్తున్న ప్రతి మని

షకీ మరో డబుల్, మరో డూప్ అదే పేరుతో ఆ లోకంలో నివశిస్తోందని అతని ద్వారా తెల్సింది. దీనికేమంటారు?"

"ఆర్ యూ జోకింగ్" సీరియస్‌గా అడిగాడు డాక్టర్ స్నేత్నా.

నర్సన్ తల అడ్డంగా తిప్పుతూ "నో జోక్స్! ఇటీజ్ మోస్ట్ సీరియస్" అంటూ క్లుప్తంతా విషయమంతా చెప్పి, "ఆ లోకపు మనుషుల్ని అదే పోలికల్లో వున్న మన మనుషుల స్థానాల్లోకి రహస్యంగా మార్పిడిచేసి మన లోకాన్ని పాదాక్రాంతం చేసుకోడానికి వాళ్ళు ప్రయత్నిస్తున్నారు. ఆ పథకంలో భాగంగానే ట్రయల్ క్రింద నా పేరుగల, నా పోలికలున్న వాళ్ళ మనిషిని ఇక్కడికి పంపించారు. ఈ రాత్రి మరి కొద్ది గంటల్లో ఆ మనిషిని వాళ్ళ లోకానికి రప్పించుకునేందుకు ఒక అంతరిక్ష వాహనాన్ని పంపబోతున్నారు. ఇది నిజం. దానికి నేనే సాక్ష్యం! ఇప్పుడు మీ అభిప్రాయం ఏమిటి?" అనడిగాడు.

"రియల్లీ ఫెంటాస్టిక్! ఏదో కథ చదువుతున్నట్లుగా వుంది. మరో మానవలోకం వున్నదని నే నెప్పుడూ విన్లేదు? వెరీ సర్‌ప్రయిజింగ్" అన్నాడు డాక్టర్ స్నేత్నా షాక్ అవుతూ. క్షణం ఆగి "మీరు చెబుతున్నా నమ్మకం కుదరడంలేదు నర్సన్! సారీ! ఎవరో మిమ్మల్ని ఫూల్స్ చెయ్యటానికి తెలివిగా నాటకం ఆడుతూండవచ్చు! మరో మనవలోకం వుండటం అబ్సర్డ్! ఇంపాసిబుల్!" అన్నాడు దృఢంగా.

"ఇదంతా నిజంగా ఎవరైనా ఆడుతున్న నాటకమే అయితే నా కన్నా ఎక్కువగా సంతోషించేవాడుండడు ప్రొఫెసర్! ఇదొక నాటకంలోని భాగం కావాలనే నేనూ

కోరుకుంటున్నాను. కానీ, నాటకం కాకపోతే? ఇది వాస్తవం అయితే? మరో మానవలోకం చాలా దూరంగా, మనం అన్వేషిస్తున్న సుదూర గ్రహాలైన శుక్ర, శని, బృహస్పతి గ్రహాలకి అవతల యింకెక్కడో వుంటే? అలా వుండేందుకు అవకాశం వుందా? కాసేపు తర్కం కోసం అలాంటిదేదో వుందనే అనుకుందాం! వుంటే మన పెరీస్కోప్‌లు ఆ గ్రహం చలనాన్ని, ఉనికిని వీక్షించగలవా? కనిపెట్టగలవా? జవాబు చెప్పండి."

"నో! మీరెంత వాదించినా సౌరకుటుంబంలో మన భూమిలాంటి మరో గ్రహం లేదని ఖచ్చితంగా చెప్పగలను. మన అంతరిక్ష పరిశోధనశాలలకంటె వెయ్యిరెట్లు శక్తివంతమైన పరిశోధనశాలలు అమెరికాకి, రష్యాకి వున్నాయి. మహా విశ్వాంతరాళంలో వున్న గ్రహాలన్నింటి ఉనికినీ వాళ్ళు ఏనాడో నిర్ధారణ చేశారు. సుదూర గ్రహాల ఉనికిని సైతం వీక్షించారు. ఏ గ్రహంలోనూ మనిషిలాంటి జీవి నివశించేందుకు అవకాశం లేదని నిర్ధారించారు. ఆయా గ్రహాల్లో మానవ నివాసానికి అనువుగా వాతావరణాన్ని మలుచుకోడానికి వీలవుతుందేమోననే శాస్త్రజ్ఞులు యిప్పుడు పరిశోధనలు సాగిస్తున్నారు. అంతకుమించి, ఆల్‌రెడీగా మరో మానవగ్రహం లేదనేది నిర్వివాదాంశం. నే నన్నమ్మను. ఎవరెంత చెప్పినా, ఎన్ని ఆధారాలు చూపించినా మీరూ నమ్మవద్దు! ఇటీజ్ హంబక్." అంటూ ఖచ్చితంగా చెప్పాడు స్నేత్నా.

అరనిమిషంపాటు నర్సన్ మాట్లాడలేదు. తీవ్రంగా ఆలోచిస్తూ వుండిపోయాడు.

అతని అనుమానాన్ని గ్రహించినట్లు స్నేత్నా పొడిగా దగ్గి "ఎవరో మిమ్మల్ని నమ్మకంగా మోసగించడానికి

ప్రయత్నిస్తున్నారని నా అనుమానం సర్సన్! ఏ గ్రహంలో జీవరాశి బ్రతకాలన్నా మన భూమ్మీదకిమల్లే వాతావరణంలో తేమ వుండాలి! గాలిలో సాంద్రత వుండాలి! మనకి దగ్గర్లో వున్న చంద్రుడి మీద కూడా యిలాంటి లక్షణాలు వాతావరణంలో కన్పించడం లేదని పరిశోధనల వల్ల తేలుతోంది. ఇతర గ్రహాల్లో గంధకికామ్లం, క్షారం అధికపాళ్ళలో వుండటంవల్ల అక్కడి వాతావరణం బాగా పొడిగా వుండటమేగాక మండే స్వభావాన్ని కలిగివున్నాయి. గనుక ఆ గ్రహాలమీదికి ఏ వస్తువు అడుగుపెట్టినా భగ్గున మండి బూడిదై పోతుంది. ఇహ, మనుషులెలా జీవించగలరు? ఒకవేళ యీ గ్రహాలకి దూరంగా మరెక్కడో చాలా దూరంలో అలాంటి లోకం వున్నా అక్కడివాళ్ళు యిక్కడికెలా రాగలరు? వాళ్ళూ మనుషులేగా? అంత దూరాన్నించి భూమికి రావడానికి వాళ్ళకి ఎన్ని సంవత్సరాలు పడుతుందో ఒక్కసారి ఆలోచించండి. అంతటి సుదీర్ఘ ప్రయాణాన్ని సాగించి యిక్కడిదాకా వచ్చి యీ లోకాన్ని ఆక్రమించుకోవాలనుకోవడం ....'' అంటూ అదోలా నవ్వి,

“వాళ్ళు నిజంగానే వెర్రివాళ్ళు అనిపించుకుంటారు. ఎందుకో చెప్పనా? అంతరిక్ష సౌరగ్రహాలమీద శాస్త్రజ్ఞుల పరిశీలనలు నిరంతరంగా సాగుతున్నాయి. మరో లోకాన్నించి మన లోకానికి ఏదైనా అంతరిక్ష నౌకగానీ, కాప్సిల్ గానీ మరోవిధమైన షటిల్‌గానీ వస్తుంటే వెంటనే శాస్త్రజ్ఞులు పసిగట్టేస్తారు. దాని గమనాన్ని అనుసరిస్తూ రేడియో ధార్మిక తరంగాలద్వారా, న్యూక్లియర్ ఆటమిక్ రేస్ ద్వారా ఆ వాహనాన్ని గుర్తిస్తారు. కమ్యూనికేషన్స్ ఏర్పాటు చేస్తారు. అమెరికా, రష్యా అంతరిక్ష పరిశోధనా కేంద్రాల్లో

నిర్మించిన రేడియో కమ్యూనికేషన్ రాడార్స్ కళ్ళుగప్పి ఏ అంతరిక్ష వాహనమూ గ్రహాంతరయానం చెయ్యలేదు. విశ్వాంతరాళంలో విహరించలేదు. అదేమీ చీకట్లో నల్లపూస కాదు'' అని చెప్పాడు.

''ఒకవేళ రేడియో ఆక్టివిటీస్‌కి అందకుండా, రాడార్స్ లోంచి వెలువడే టెలీకమ్యూనికేషన్స్ శక్తికి గురి కాకుండా, టెలికంప్యూటర్స్ దృష్టికి ఆనకుండా వుండేలా ఆ అంతరిక్ష వాహక నౌకకి ఏమైనా ఏర్పాట్లు చేసివుంటే?'' హఠాత్తుగా ప్రశ్నించాడు నర్సన్.

''వాట్!! ఏమిటి అంటున్నారు మీరు?'' అదిరిపడ్డాడు స్నైత్కా.

''కొంచెం జాగ్రత్తగా, నిదానంగా ఆలోచించమంటున్నాను ప్రొఫెసర్! అంతరిక్ష విజ్ఞాన శాస్త్రం గురించి నాకంతగా తెలియదు. అంచేత నాకు కలిగిన అనుమానాన్ని మీ సాంకేతిక భాషలో చెప్పలేను. ఒక అంతరిక్ష ప్రయాణ వాహనం వుందనుకుందాం. మామూలుగా అయితే దానికి సంబంధించిన టెలికంప్యూటర్స్ దాని ఉనికిని చాలా సులభంగా పసిగట్టగలవు. రేడియో యాక్టివిటీస్ దాన్ని వెంటాడగలవు. కానీ ఆ వాహనానికి మాస్క్‌లాంటిదేదైనా ఏర్పాటు చేసివుంటే? రేడియోరేస్ చొరశక్యం కాని విధంగా టెలికంప్యూటర్స్ దృష్టికి కనిపించని విధంగా ఆ వాహనం మీద ఏదైనా ఆచ్ఛాదన రూపొందించి వుంటే? అప్పుడు దాని ఉనికిని, గమనాన్ని గుర్తించడం సాధ్యం కాదుకదా! అలాంటి ఏర్పాటేదైనా చేసుకోటానికి అవకాశం వున్నదా?'' అని వివరంగా అడిగాడు నర్సన్.

నిర్ఘాంతపోయాడు డాక్టర్ స్నైత్కా.

''ఆ మధ్య పేపర్లో ఒక వార్త యధాలాపంగా చది

వాను ప్రొఫెసర్! వివరంగా చెప్పలేను గానీ ఆ వార్తా సారాంశం ఏమిటంటే— జలాంతర్గాములకి పైభాగంలో ఒక విధమైన ఇంధనాన్ని పూత పూస్తే శత్రువుల రాడార్ రేస్ వాటిమీద రియాక్ట్ కావనీ, తత్ఫలితంగా జలాంతర్గాముల ఉనికిని, గమనాన్ని గుర్తించి శత్రువులు వాటిని నాశనం చెయ్యడాన్ని నివారించవచ్చునని ఎవరో కని పెట్టారు! అంటే సబ్‌మెరైన్స్ రాడార్స్ దృష్టికి అందకుండా మాస్కింగ్ ఏర్పాటు చేసుకోవడమన్న మాట! అలాంటి వైజ్ఞానిక ప్రక్రియద్వారా స్పేస్ షటిల్స్‌ని కూడా టెలికంప్యూటర్స్ దృష్టిలో పడకుండా మాయంచేసే అవకాశం ఏదైనా వున్నదా?"

"ఓహ్....మీరు నా బ్రెయిన్ తినేస్తున్నారు నర్సన్.... నా మేధస్సుకీ, విజ్ఞానానికీ, అంతరిక్ష, ఖగోళ, అణుశాస్త్రానికీ అగ్నిపరీక్ష పెడుతున్నారు. ఈ విషయం ఆలోచించాలంటే....రియల్లీ ఇటీజ్ హెల్...." అన్నాడు స్నైత్నా కణతలు నొక్కుకుంటూ.

"ఫర్వాలేదు ప్రొఫెసర్! ఈ ప్రాబ్లెమ్ సాల్వేషన్‌లో మీ మస్తిష్కం పూర్తిగా ఆవిరైపోయినా విచారించను. మీరేదైనా తెల్సుకోగలిగితే మాత్రం అది ప్రపంచాన్ని పెద్ద ప్రమాదానించి తప్పిస్తుందని మర్చిపోకండి. ఆలోచించండి. ఏదైన క్లూ లభిస్తే వెంటనే నాకు చెప్పండి" అని నర్సన్ లేచి, టైం చూసుకుని ఓ నిట్టూర్పు వదిలి—

"నా కాస్తే వ్యవధి లేదు ప్రొఫెసర్! నే వెళ్తున్నాను. మరో రెండు గంటల్లో, యీ తెల్లవారుఝామున మరో మానవలోకానికి తీసుకువెళ్ళే అంతరిక్ష వాహనం ఢిల్లీ శివార్లలో ఛండీగడ్ నేషనల్ హైవేమీద 16 వ మైలురాయి సమీపప్రాంతానికి వస్తుంది. ఫలితం యెలా వున్నా, పర్యవ

సానం ఏమైనా ఆ వాహనంలో నేను ఆ లోకానికి ప్రయాణించడానికి నిశ్చయించుకున్నాను. యీలోగా మీకేదైనా తెలిస్తే తెల్పుకోగలిగితే, నేను ఆ వాహనంలోకి ప్రవేశించే లోగా రాగలిగితే, అక్కడికి ఆ స్పాట్‌కి వచ్చి చెప్పండి. అందువల్ల మన మానవ ప్రపంచానికి మీరెంతో మేలు చేసిన వారవుతారు. గుడ్ నైట్ ప్రొఫెసర్" అనేసి వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు నర్సన్.

స్తబ్ధుడయ్యాడు డాక్టర్ స్నేత్నా. క్షణకాలం పాటు అతని మస్తిష్కం మొద్దుబారిపోయింది. మరుక్షణం అతని నర నరమూ ఉద్వేగంతో కంపించిపోయింది. ఇంకొక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా చక చకా తన లాబ్‌లోకి వెళ్ళాడు.

గ్రహాంతరయానానికి సంబంధించిన పరిశోధనా గ్రంథాలనూ, రేడియో ధార్మిక శక్తిమీద వెలువడిన పరిశోధనాంశ గ్రంథాలను ముందేసుకుని వాటిని పరిశీలిస్తూ నోట్స్ ప్రిపేర్ చెయ్యసాగాడు. వ్యవధి తక్కువ. గ్రాహ్యం చేసుకోవాల్సిన విషయం అనంతం.

స్నేత్నా మొహంనిండా చెమటలు పట్టేస్తున్నాయి. వెన్నులోంచి ఒణుకు పుట్టుకొస్తోంది.

నర్సన్ అడిగిన ప్రశ్న, అతనికి కలిగిన సందేహం సామాన్యమైంది కాదు! దాని ఫలితం మీద భవిష్యత్తులో అంతరిక్ష పరిశోధనా -పద్ధతుల రూపురేఖలు కూడా నిర్ణయించబడతాయి!

ఆ వూహే యదార్థమయ్యేట్లయితే అగ్ర రాజ్యాలు తమ అంతరిక్ష నౌకలను ఇతరుల కంటపడకుండా దాచి అవసరమైనప్పుడు హఠాత్తుగా ప్రళయ భీభత్సాన్ని సృష్టించగలుగుతాయి! యీనాడు ఎవరు అంతరిక్ష పరిశోధన చేసినా

బహిరంగంగా తెల్సిపోతోంది! ఇకమీదట ఆ అవకాశం వుండదు! అంటే ప్రతివారూ తమ తమ అంతరిక్ష నౌకలను రాడార్ల దృష్టిలోంచి తప్పిస్తూ, వీలైతే మిగతా వాటి మీద రహస్యంగా దాడి జరిపే అవకాశాలను అన్వేషిస్తారన్నమాట! అంటే మరో మహా ప్రళయానికి ఇది ఆరంభమన్నమాట!

స్నైత్నా గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. అతని దుస్తులు చెమటతో తడిసి ముద్దయిపోతున్నాయి.

గ్రంథాల్లోని వేలాది పంక్తుల వెంట అతని చూపులు పరుగులు తీస్తున్నాయి. నిమిషాలు క్షణాల కంటే వేగంగా దొర్లిపోతున్నాయి.

రాడార్ రేస్‌బారినుండి జలాంతర్గాములను తప్పించే ప్రక్రియ యిటీవలే వెలుగులోకి వచ్చింది. రేడియం ఆటమిక్ రేస్‌ని ఎన్ని విధాలుగా వుపయోగించుకోవచ్చునో నిరూపించడంలో శాస్త్రవేత్తలు ఎంతో ముందంజ వేస్తున్నారు. అలాగే అంతరిక్షంలో సంచరించే ఒక రాకెట్‌ని, లేదా ఒక స్కైలాబ్‌ని, మరో గ్రహాన్ని అంతరిక్ష పరిశోధనశాలల దృష్టిలో పడకుండా మాస్క్ వేసి మాయం చెయ్యగల పాసిబిలిటీస్ వున్నాయా? ఒక చిన్న విమానాన్నో, ఒక జలంతర్గామినో మాయం చేసినంత సులభంగా ఒక అంతరిక్ష నౌకనో, ఒక గ్రహాన్నో మాస్క్ వేసి కప్పివుంచడం సాధ్యమా?

దాదాపు గంటన్నర తర్వాత స్నైత్నా ఆలోచనలు, పరిశీలనలూ ఒక రూపానికి వచ్చాయి. నుదిట్నించి కారుతున్న చెమటను కొనగోట తుడుచుకుంటూ, తయారుచేసుకున్న రిపోర్టుని ఓసారి తిరగేస్తూ అదిరిపడ్డాడు.

“ఇంపాసిబుల్ .... హైలీ ఇంపాసిబుల్ ....” అప్రయ

త్నంగా గొంతు చించుకొని అరిచాడు డాక్టర్ స్నేత్వా. వెంటనే ఏదో గుర్తొచ్చినవాడిలా టైం చూసుకుంటూ "మై గాడ్! యీపాటికే నర్సన్ ఆ స్పాట్ కి చేరుకునివుంటాడు. ముందతని గ్రహాంతరయానాన్ని నిరోధించాలి. లేకపోతే ప్రమాదం తప్పదు. నో టైం....నో టైం...." అను కుంటూ ఆ కాగితాన్ని కోటుజేబులో కుక్కుకుంటూ లాబ్ లోంచి బైటికి పరిగెత్తాడు స్నేత్వా. మరో నిమిషంలో అతని పాంటియాక్ నేషనల్ హైవేమీద శరవేగంతో దూసుకుపోసాగింది.

డాక్టర్ స్నేత్వాకి యాభై ఆరేళ్ళు. బ్రహ్మచారి. భారత అణుశక్తి పరిశోధనా మండలి అధ్యక్షుడుగా వుంటు న్నాడు. దాదాపు ముప్పయి సంవత్సరాలనించీ అణుశక్తి వినియోగంమీద, గ్రహాంతర చోదిత నౌకల నిర్మాణం మీదా పరిశోధనలు జరుపుతున్నాడు. ఖగోళశాస్త్రం ఆయనకి కంఠతా వచ్చు.

అంతటి అనుభవజ్ఞుడూ యిప్పుడు అనూహ్యమైన భయాందోళనలతో, అలవికాని ఆతృతతో, టెన్షన్ తో బిగుసుకుపోతున్నాడు. సైన్సు ఒక సాగరం వంటిది!దాన్ని మధించే ఓర్పూ, నేర్పూ వుండాలేగానీ అందులోంచి అద్భుతమైన విశేషాలు పుట్టుకొస్తాయి. అలాంటి విశేషమే యిప్పు డొకటి పుట్టుకొచ్చింది! దాన్ని వెంటనే నర్సన్ కి తెలియపర్చాలి! అంత కంటే ముందు అతని ప్రయాణాన్ని ఆపాలి!

వెయ్యి మైళ్ళ వేగంతో తోలుతున్నట్లు కారు డ్రయివ్ చేస్తున్నాడు స్నేత్వా.

నర్సన్ అతని వద్దకు వచ్చి వెళ్ళి గంటన్నర దాటి పోయింది. ఈ మధ్యకాలంలో జరిగిన విశేషాలేవీ డాక్టర్ కి

తెలియవు. ఒక్క విషయం మాత్రం అతనికి గుర్తున్నది. తెల్లవారుఝూమున మూడున్నర, నాలుగు గంటల మధ్య శత్రువుల అంతరిక్ష విమానం వచ్చి నర్సన్ని తీసుకు వెళ్తుంది. దాని రాకకి యింకెంతో వ్యవధి లేదు. కొద్ది నిమిషాలే వుంది. ఆలోగా తాను ఆ స్పాట్ కి చేరుకోవాలి! చేరుకోగలడా? గలడా?

కర్రుమని చప్పుడు చేస్తూ పాంటియాక్ మలుపు తిరుగు తోంది! సరిగ్గా అదే సమయంలో ప్రక్క రోడ్డులోంచి దూసుకువచ్చిన మరో వాహనం రైట్ వింగ్ లోంచి పాంటి యాక్ ని ఢీకొట్టింది.

ఢమ్....మని చప్పుడుచేస్తూ పాంటియాక్ రెండడుగుల ఎత్తు కెగిరి పక్కకి ఒరిగిపోయింది. స్నేత్నా కళ్ళు బైర్లు కమ్మాయి. చెవులు దిబ్బెళ్ళు వేశాయి. తల దిమ్మెక్కింది. షాక్ తో అతని మైండ్ మొద్దుబారిపోయింది.

"సారీ డాక్టర్ స్నేత్నా....యూ కాంట్ మీట్ నర్సన్...." అంటున్నా రెవరో అస్పష్టంగా. స్నేత్నా మొహం వివర్ణమైంది. అప్పుడర్థమైంది, అది కావాలని శత్రువులు కల్పించిన ఏక్సిడెంట్ అని! తన ప్రాణం పోతోంది! తను చచ్చిపోతున్నాడు! తను మరణించినా ఫర్వాలేదు కానీ, తన జేబులో వున్న నోట్స్ పేపర్సు మాత్రం శత్రువుల చేతుల్లో పడకూడదు!

అనూహ్యామైన మైకం కమ్ముకు వస్తూండగా, అలవి కాసంతటి నీరసంతో నిస్సత్తువ ఆక్రమించేస్తుండగా అర క్షణం వ్యవధిలో కోటు జేబులోంచి ఓ చిన్న కాగితాన్ని లాగి నోట్లో దోపుకుని గుటుక్కున మింగేశాడు స్నేత్నా! చాలు! ఆ నోట్స్ లోంచి ఏ చిన్నకాగితం అదృశ్యమయినా చాలు! మిగతా నోట్స్ యెవరికీ యెందుకూ కొరగాదు!

మేధావులంతా తలలు బద్దలు కొట్టుకున్నా ఆ రహస్యం అర్ధంకాదు! ఎన్ని విధాల ప్రయత్నించినా దాన్ని డీకోడ్ చెయ్యలేరు! ఇహ భయంలేదు!

అద్వితీయమైన ఆత్మసంతృప్తితో చిన్న నిట్టూర్పు విడిచాడు స్నేత్నా. ఒళ్ళంతా చలువ కమ్ముకువస్తూండగా "మిమ్మల్ని కాపాడలేకపోతున్నాను నర్సన్....అయితే ప్రపంచాన్ని కాపాడగలిగాను....గాడ్ ఓన్లీ సేవ్ యూ...." అంటూ అతని మనస్సు ఘోషిస్తూండగా వూహాతీతమైన మత్తు అతన్ని ఆక్రమించేసింది. ప్రాణం పోతూండగా ఏర్పడే తమకంతో డాక్టర్ స్నేత్నా తల పక్కకి వాలి పోయింది.

12

పాలపుంతలా, వెన్నెల కాంతిలా, ధవళవర్ణంతో మెరిసి పోతున్న కాంతిపుంజం స్పాట్‌లైట్ ఫోకస్‌లా నిశ్శబ్దంగా వేగంగా భూమ్మీదకి దిగుతోంది. ఆ వెలుగు పరుచుకున్నంత మేరా పట్టపగల్లా అవుపిస్తోంది. ఆ కాంతికి తట్టుకోలేక కళ్ళు జిగ్ జిగేలుమంటున్నాయి.

అదేనా—మరో మానవలోకపు అంతరిక్ష వాహనం? దాని ఉనికినీ, గమనాన్నీ భారత అంతరిక్ష పరిశోధనాశాలలు ఎందుకు గమనించలేకపోతున్నాయి? రాడార్స్ దాని సంచలనాన్ని యెందుకు గుర్తించలేక పోతున్నాయి? ఆ వాహనం యెంత దూరాన్నించి, యెంత వేగంతో భూమికి చేరుకుంటోంది? అంతరిక్ష కక్ష్యలో అది యే మార్గంలో పయనిస్తోంది?

వాక్బంధనతోపాటు శిలా విగ్రహంలా బిర్ర బిగుసుకుపోయిన రావ్ మస్తిష్కం తీవ్రంగా ఆలోచిస్తోంది. మరోలోకపు మానవుడి ఎత్తుకి అంత సులభంగా చిత్తయిపోయి

నందుకు అతని హృదయం ఆవేదనతో ఘోషిస్తోంది.

కానీ యేం చెయ్యగలడు? జరిగిన మోసాన్ని, కళ్ళ ముందు జరుగుతున్నదాన్ని ఎలా బట్టబయలు చెయ్యగలడు? తాను నిర్వీర్యుడూ, నిస్సహాయుడు అయిపోవడమే గాక, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తన ప్రాణమిత్రుడు నర్సన్ని వాళ్ళు తన కళ్ళముందు నుంచే మోసంచేసి అపహరించి మరో లోకానికి తీసుకుపోతుంటే—ఏమీ చెయ్యలేని అశక్తతకు ఏడుపొస్తోందతనికి!

మహోద్ధృతమైన గాలి కెరటం రివ్వున వీస్తుండగా గడ్డి పరకలు గాలి కెగిరిపోతుండగా అపూర్వమైన ఆ కాంతి పుంజం పూర్తిగా నేలమీద ఆనింది.

దృష్టికి అతీతమైన వెలుగు పరుచుకోవడం వల్ల ఆ కాంతి మధ్యనున్న వాహనపు ఆకారం యెలా వుందో యే మాత్రం తెలియడంలేదు. పైగా విమానం, హెలికాప్టర్ ఇంజన్లవల్ల ఉత్పన్నమయ్యే శబ్దంలాంటిది కూడా వినిపించడంలేదు. స్పేస్ రాకెట్స్‌లాంటి అంతరిక్ష వాహక నౌకల చలనంవల్ల బ్రహ్మాండమైన ధ్వని సంభవిస్తుంది. మరి వాహనంలోంచి మామూలు మోటారు శబ్దం కూడా ఎందుకు వినిపించడంలేదు? శబ్దానికి అతీతమైన వాహనాలను రూపొందించడంలో మరో లోకపు మానవులు విజయాన్ని సాధించారా?

"కామ్రేడ్ నర్సన్....ప్లీజ్ జాయిన్ విత్ అజ్ ఇమీడియట్లీ...." స్పీకర్లోంచి గీరగా వినిపించినట్లు ఆ వెలుతుర్లోంచి స్పష్టంగా ఆహ్వానం అందింది.

"గుడ్‌బై మిస్టర్ రావ్...." హేళనగా నవ్వుతూ కారు వెనకసీటుమీద పడుకోబెట్టి వున్న నర్సన్ దేహాన్ని భుజం మీదకి యెత్తుకున్నాడు కామ్రేడ్ నర్సన్.

వెర్రి చూపులు చూశాడు రావ్. శత్రువు తప్పించుకు పోతున్నాడు. అతన్ని నిరోధించే మార్గమే లేదా? అణు మాత్రం కూడా కదల్లేని అశక్తుడయిన తాను యేమి చెయ్య లేడా? ఆ అధర్మాన్ని యెదుర్కో-లేడా?

"బాస్టర్డ్....నాకే గనక కదిలే శక్తి వుంటే నీ పీక పిసికి చంపేస్తాను....నువ్వు మళ్ళీ తిరిగొచ్చే సమయానికి నాకు మామూలు స్థితి వస్తే నా చేతుల్లోనే నీ ప్రాణం పోతుంది...." కసిగా ఆక్రోశించింది రావ్ హృదయం. దాన్ని ఏ మాత్రం ఖాతరు చెయ్యనట్లు నర్సన్ శరీరాన్ని భుజంమీద మోస్తూ ఆ కాంతిపుంజంవైపు చక చక నడు స్తున్నాడు కామ్రేడ్ నర్సన్. క్షణ క్షణానికీ కారుకి దూరమై పోతున్నాడు.

"ఓ దేవుడా....నువ్వు వున్నావని అందరూ అనే మాటే నిజమైతే....నీ ఉనికి యథార్థమైతే....యీ అధ ర్మాన్ని అరికట్టలేవా? స్థంభింప చెయ్యబడిన నర్సన్ హృద యంలో చలనాన్ని పునర్జీవింప చెయ్యలేవా? అసలు నువ్వనేవాడివి వున్నావా?" రావ్ హృదయం రోదిస్తోంది. కన్నీరు జాలువారి అతడి చెంపలు తడిపేస్తోంది. భగవంతు డనేవా డున్నాడో లేడో కానీ యే దేవుడూ అతని ప్రార్థన ఆలకించలేదు.

క్రమ క్రమంగా కామ్రేడ్ నర్సన్ ఆకారం ఆ పాల పుంతలోకి ప్రవేశించి అదృశ్యమైంది. ఆ తర్వాత పాల నురుగులాంటి వెలుతురుతప్ప మరేమీ రావ్‌కి కనిపించడం లేదు. అతని హృదయం బాధతో విలవిల్లాడిపోయింది. "అయిపోయింది. మరో లోకపు మానవుల దురహంకారా నికి భూప్రపంచం బలైపోయింది. శతాబ్దాల తరబడి యెన్నో ఘనవిజయాలను సాధించిన మానవులు మరో లోకపు ఆధి

పత్యానికీ, అహంకారానికీ తలవొగ్గి బానిసలై పోతున్నారు" అనుకున్నాడు ఆవేదనతో.

అదే సమయంలో ఆ కాంతిపుంజం మెరుపు వేగంతో కదిలి రివ్వున పైకి లేచింది. రెప్పపాటు కాలంలో అంత రిక్షాని ఎగసి, తోకచుక్కలా ఆకాశంలోకి దూసుకుపోయి నక్షత్రమంత చిన్నదిగా కనిపించి నక్షత్రాల్లోకల్సి అదృశ్య మైపోయింది.

"యూస్‌లెస్ గాడ్...." బరువుగా మూల్గింది రావ్ హృదయం. సరిగ్గా అదే సమయంలో శరవేగంతో దూసుకు వచ్చిన మరో కారు అతని కారు పక్కన ఆగింది. అందు లోంచి హడావిడిగా దిగుతున్న పి.ఏ.ని చూస్తూ "డామిట్! వచ్చేవాడివి యింకో రెండు నిమిషాల ముందు రాకూడదూ...." అనాలనుకున్నాడు రావ్ కోపంగా. ఆ మాట అప్రయత్నంగా బైటికి వచ్చేసింది. స్థంభించిపోయిన అతని కంఠస్వరం అతనికి మళ్ళీ స్పష్టంగా విన్పించింది. ఆ హఠాత్పరిణామానికి దిగ్భ్రమ చెందాడతను.

పి.ఏ. అతన్ని సమీపిస్తూ ఆ మాటలు విని, "ప్రై చేశాను సార్! లాస్ట్ మినిట్లో గాని యీ ఉత్తరం నా కంట పడలేదు. అక్కడికీ చాలా స్పీడుగా కారు డ్రయివ్ చేసు కొచ్చాను. నర్సన్‌గారు రాసిన ఉత్తరం మీ టేబిల్‌మీద అప్రయత్నంగా కనిపించింది. చూసి వెంటనే పరిగెత్తు కొచ్చాను. చదవండి...." అంటూ ఉత్తరాన్ని అందిం చాడు.

అప్రయత్నంగా చెయ్యి చాచాడు రావ్. అప్పటిదాకా సిమెంట్ కాంక్రీట్‌లా బిగుసుకుపోయిన అతడి చెయ్యి మామూలుగా కదిలింది. ఆ వింత పరిణామానికి విస్తు పోతూ ఆ ఉత్తరాన్ని అందుకున్నాడు రావ్. అందులో—

"మై డియర్ మిస్టర్ రావ్,

పారాసైకాలజీ, టెలిపతీ విజ్ఞానాన్ని యీనాడు ప్రపంచంలో అనేకచోట్ల అధ్యయనం చేస్తున్నారు. స్థూలంగా మన భాషలో చెప్పాలంటే దీన్ని అతీంద్రియశక్తి అనవచ్చు. యీ అతీంద్రియశక్తి చాలా మందిలో అంతో, యింతో వుంటుందనీ, సాధన ద్వారా దీన్ని కరతలామలకం చేసుకోవచ్చనీ చరిత్ర చెబుతోంది. యీ శక్తిని సాధన చేసిన మనిషి ఎదుటివాళ్ళని కొంతసేపు తన చెప్పుచేతల్లో వుంచుకోగలుగుతారు. అవతలివాళ్ళ మనస్సునీ, మస్తిష్కాన్ని కంట్రోలు చెయ్యగలుగుతారు.

ఆ శక్తిని నేనెంతవరకూ సాధన చెయ్యగలిగానో నిర్ధారణ చేసుకోవడానికి మీమీద పారాసైకాలజీ, టెలిపతీలను ప్రయోగించాను. అందువల్ల మీరు అయిదు నిమిషాలపాటు కీలుబొమ్మలా మారిపోయి టెలీపతి ద్వారా నేను అందజేసిన సంకేతాలకి అనుగుణంగా ప్రవర్తిస్తారు. మీ శరీరం స్థంబించిపోతుంది. వాక్బంధన జరుగుతుంది.

శతృవుల అంతరిక్ష వాహనం వచ్చే ముందు ప్రయోగింపబడే యీ శక్తి ఆ విమానంలో నేను బయల్దేరిన తర్వాత, విమానం మీకు దూరం అవుతున్నకొద్దీ—అంటే మీ మనస్సుని నేను ఆదేశించగలిగే పరిధి దాటేంత వరకూ మీమీద పనిచేసి—ఆ తర్వాత నా ప్రభావం నిర్వీర్యమై మీరు యధాప్రకారం మనిషి కాగలుగుతారు. అంటే, షుమారు అయిదు నిమిషాలసేపు మీరు నేను ప్రయోగించే అతీంద్రియశక్తికి బానిస లవుతారు. అంతే గానీ, మీ కిచ్చిన కాప్సిల్లో యే ప్రభావమూ లేదు. ఇలా నేనెందుకు చేశాను?

నిజంగా మరో మానవలోకం వున్నదో లేదో మనకి

తెలియదు. అలాంటి దాన్ని గురించి యీ శతాబ్దంలో, యీ అణుయుగంలో మనం వినలేదు. కళ్ళతో చూసినవాళ్ళూ లేరు. కనుక అదేదో కనిపించేంతవరకూ, అలాంటిదేమీ లేదు అనుకుంటూనే మన కార్యక్రమాన్ని కొనసాగించాలి!

అయితే మేధావు లెవరైనా ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకోవాలనే దురుద్దేశంతో తెలివిగా యీ నాటకం ఆడుతున్నారా? మన భూమ్మీద జన్మించిన వాళ్ళే నేర్పుగా ఏదైనా కుట్ర పన్నుతున్నారా? యీ ప్రశ్నలకి ఖచ్చితమైన జవాబులు లభించేంతవరకూ నా దృష్టిలో మరో మానవ లోకం లేదు! మరో లోకం లేదని తేలిన మరుక్షణం యీ కుట్రని భగ్నం చెయ్యడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఆ వుద్దేశంతోనే నేనీ ప్రయాణం చేస్తున్నాను.

ఈ ఉత్తరం మీ కంటపడే సమయానికి ఎంత దూరంలో వుంటానో, ఏ పరిస్థితిలో వుంటానో, అసలెప్పటికైనా భూమికి తిరిగి వస్తానో, లేదో నాకే తెలియదు.

అయితే, ఇదేదో, కుట్ర అని నా మనస్సు ఎందుకో నొక్కి చెబుతోంది. సైంటిఫికల్ రీజన్స్ ఆలోచించడానికీ, తర్కించడానికీ వ్యవధి లేనందువల్ల యీ బాధ్యతను మన అంతరిక్ష పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ స్నేత్నాకి అప్పగించి నే వెళ్తున్నాను. ఆయనకి కొన్ని ప్రశ్నలు యిచ్చాను. ఆ సమస్యలను ఆయన పరిశోధిస్తున్నారు. బహుశా నేను ఈ పృథ్వినించి అంతరిక్షానికి ఎగిరేలోగా ఆయన మనల్ని కల్సుకోలేక పోవచ్చు! అందుకే, మీకు ప్రత్యేకంగా ఈ ఉత్తరం రాస్తున్నాను.

డాక్టర్ స్నేత్నాని వెంటనే కల్సుకోండి: అంతరిక్ష ప్రయాణ సాధనాలకి మాస్క్ వెయ్యడం సాధ్యమైతే, రాడార్స్‌కీ, టెలీ కంప్యూటర్స్‌కీ కనిపించకుండా అంతరిక్ష

వాహనాలను ముసుగులో కప్పివుంచడం సంభవమేనని డాక్టర్ స్నేత్నా నిర్ధారణ చేస్తే—మరో మానవలోకం అనేదేదీ లేదు! అదంతా హంబక్! మనలాంటి, మన ప్రపంచంలోని మనుషులే ఈ నాటకం ఆడుతున్నట్లు నిశ్చయం! ఇదే నిజమైతే నేను తప్పకుండా మీ అందరి మధ్యకి సురక్షితంగా తిరిగి రాగలననే నమ్మకం నాకుంది. ఆ నమ్మకంతోటే వెళ్తున్నాను.

ఒకవేళ స్నేత్నాకి ఏదైనా ప్రమాదం సంభవించినా, లేదా ఆయన అదృశ్యమైనా మీరూ మరో లోకం లేదని నిర్ధారణ చేసుకోవచ్చు! అలా కాక, ఆయన క్షేమంగా వుండి, చిలక పలుకులు పలుకుతుంటే శతృవులు ఆయన మీద పారాసైకాలజీ, టెలిపతీ ప్రయోగించారేమో నిర్ధారణ చేసుకోండి. ఒకటి, రెండు గంటలు డాక్టర్ని మీ అబ్జరేషన్లో వుంచితే అలాంటి ప్రయోగం జరిపినా దాని ప్రభావం నశిస్తుంది. కాక, ఆయన అదృశ్యమైతే మాత్రం యీ రహస్యాన్ని దాచటానికి శతృవులే ఆయన్ని మాయం చేసి వుంటారని మీరు నిశ్చయించుకోవచ్చు!

యీ వివరణ మీకు స్పష్టంగా యెరుకపర్చడం కోసమే మీమీద అతీంద్రియశక్తిని ప్రయోగించాను.

ఇహ, మరో మానవలోకం హంబక్ అయితే పారాసైకాలజీ, టెలిపతీ ప్రభావంతో శతృవులు మనల్ని మోసం చెయ్యడానికి ప్రయత్నిస్తారని మనం భావించవచ్చు!

ఈ విధమైన అతీంద్రియశక్తులతోపాటు అంతరిక్ష పరిజ్ఞానం, బలం కూడా వాళ్ళకి అధికంగా వుండివుంటుంది! అందువల్లే ఈ పథకాన్ని జయప్రదంగా నిర్వహించ గలమని వాళ్ళు భావిస్తుంటారు! వాళ్ళకి ఎన్ని శక్తిసామర్థ్యా

లున్నా, వాళ్ళూ మన భూమ్మీది మనుషులే అయితేమాత్రం మనం తప్పకుండా కల్సుకుంటాం. లేదా, ఇదే నా ఆఖరి వీడ్కోలు. నా నామరూపాలు సైతం విశాల విశ్వంలో నశించిపోతాయి.

నేను తిరిగి రాగలనో లేదో చెప్పగలిగినవాడు డాక్టర్ స్నేత్నా ఒక్కడే! ఆయన్ని కల్సుకుని ఏ సంగతీ నిర్ధారణ చేసుకోండి. ఆల్ ది బెస్ట్ విషెస్....

—నర్సన్."

యస్.బి. డైరెక్టర్ ఆ ఉత్తరాన్ని పూర్తి చెయ్యగానే "యీ లెటర్ చూసి నేను డాక్టర్ స్నేత్నాకి ఫోన్ చేశాను సార్! ఎవరూ రిసీవర్ ఎత్తలేదు. ఆయన రెసిడెన్స్‌కి కొందర్ని పంపి నే నిక్కడికి వస్తుంటే దార్లో ఆయన పాంటియాక్ కనిపించింది. ఏక్సిడెంట్‌కి గురై రోడ్డు పక్కన పడుంది. కార్లో స్నేత్నా లేరు. ఆ కారుని డాష్ యిచ్చిన మరో వాహనం ఏదీ ఆ ప్రాంతాల్లో కన్పించలేదు. కారు పడున్న పద్ధతినిబట్టి కావాలనే ఎవరో యాక్సిడెంట్ చేసి, ఆ తర్వాత ఆయన్ని అపహరించుకుపోయారని అనుమానిస్తున్నాను" అని చెప్పాడు పి.ఏ.

యస్.బి. డైరెక్టర్ అదిరిపడుతూ "మైగాడ్! డాక్టర్ స్నేత్నాని మాయం చేశారంటే నర్సన్ అనుమానించినట్లు, మరో మానవలోకం అనేది లేక ఇదంతా శత్రువులు ఆడుతున్న నాటకమే అయివుండాలి! ఆ శత్రువుల మాయాజాలంలోకి జొరబడిన నర్సన్‌కి ఈ విషయం తెలియపర్చి హెచ్చరించాలంటే డాక్టర్ స్నేత్నా మేధస్సు మనకి చాలా అవసరం. అతన్ని మాయం చేశారంటే నర్సన్ ప్రమాదంలో వున్నాడన్న మాట! ఎలా?" అన్నాడు ఆందోళనగా

కణతలు నొక్కుకుంటూ.

"సారీ సర్! స్నేత్నా ఏమయ్యారో ఎక్కడున్నారో తెల్సుకునేందుకు ఎలాంటి అవకాశం లేదు. ఉయ్యార్ హెల్ప్ లెస్" నిరాశగా చెప్పాడు పి.ఏ.

"నో! అలా వీల్లేదు. మన ఏజెంట్లందర్నీ ఎలర్ట్ చెయ్యండి. ఇక్కడి వాళ్ళు చాలకబోతే ఫ్లాష్ మెసేజ్ పంపి ఇతర నగరాల్లో వున్న ఏజెంట్లని కూడా ఇక్కడికి రప్పించండి. వాళ్ళూ చాలకపోతే ఢిల్లీ పోలీసు హెల్ప్ తీసుకోండి. అవసరమైతే ఇల్లిల్లూ గాలించి స్నేత్నా జాడలు కనిపెట్టండి.

నర్సన్ బయల్దేరేముందు నలభై ఎనిమిది గంటలు గడువు పెట్టాడు అంటే ఆ వ్యవధి లోపల ఏదో ఉపద్రవం జరగవచ్చునని అతడు అనుమానించి వుంటాడు! అదేమిటో తెల్సుకోవాలంటే స్నేత్నా మనకి అవసరం! అందుకవసరమైతే ప్రధాని అనుమతి తీసుకుని పూచిక పుల్లకూడా దాటిపోకుండా ఢిల్లీ నగరాన్ని దిగ్బంధం చేయిస్తాను. రహదారి, రైలు, విమాన, నౌకా మార్గాల నన్నింటినీ క్లోజ్ చేసెయ్యండి. ఏ రూపంలోనూ, ఏ విధంగానూ స్నేత్నా ఢిల్లీ దాటడానికి వీల్లేదు. అండ్, ఉయ్ మస్ట్ ఫైండ్ హిమ్ యాజ్ ఎర్లీ యాజ్ పాసిబుల్!

అంతేకాదు! అంతరిక్ష పరిశోధన సంస్థ ఉద్యోగుల నందర్నీ తక్షణమే స్పెషల్ డ్యూటీలకి పిలవండి. స్పేస్ నుంచి వచ్చే కమ్యూనికేషన్స్ నన్నింటినీ జాగ్రత్తగా నోట్ చెయ్యమనండి. ఏ నిమిషంలోనైనా మనకి నర్సన్ వద్ద నించి కమ్యూనికేషన్ రావచ్చు! హారియప్....మూవ్ ఆన్ ఇమ్మిడియట్ ఆక్షన్...." అని ఆదేశిస్తూ హడావుడిగా కారు స్టార్ట్ చేశాడు రావ్.

మరో మానవలోకం అబద్ధమా? అదంతా ఎవరో ఆడిస్తున్న నాటకమా? తెల్సుకోవాలనే పట్టుదలతో రెండు కార్లూ నగరంవైపు పరుగుతీశాయి.

13

సెకన్లు చకచక దొర్లిపోయి నిమిషాలుగా మారిపోతున్నాయి.

సూదిమొన నేలమోపితే చప్పుడు వినిపించేటంతటి భయంకరమైన నిశ్శబ్దం. ఆ స్తబ్దతలో భారత ప్రధాని అడుగుల చప్పుడు మాత్రం మెల్లగా విన్పిస్తోంది.

ప్రధాని గంభీరంగా పచార్లు చేస్తున్నారు. మరోచోట భారత రాష్ట్రపతి మునిపుంగవుడిలా ఒక ఆసనంలో కూర్చుని మౌనంగా తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

కొందరు కేంద్ర మంత్రులు అప్పటికే రాజభవనానికి చేరుకుని గంభీర భయాందోళన మనస్కులై శిలాప్రతిమల్లా ఆసనాల్లో కూర్చుని వున్నారు. మరికొందరు కేంద్ర మంత్రుల్ని నిద్రలేపే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇంకా తెల్లవారని ఆ సమయంలో రాజభవన్లో అత్యవసర అర్థాంతరపు కేంద్ర మంత్రివర్గ సమావేశం జరగబోతోంది.

తేలుకుట్టిన దొంగలా, పిల్లిలా ఓ మూల నిలబడి వున్నాడు యస్.బి. డైరెక్టర్.

పచార్లు చేస్తున్న ప్రధాని హటాత్తుగా ఆగి అతని వైపు తీక్షణంగా చూస్తూ "పరిస్థితి ఇంతగా విషమించకముందే యీ సమస్య ఇంత తీవ్రమైనదని ముందుగా మీరు మాకు చెప్పివుండాల్సింది! తీరా నర్సన్ ప్రయాణమై వెళ్ళిపోయిం తర్వాత యీ సీరియస్‌నెస్ గురించి చర్చించి ఏదైనా నిర్ణయించబోవడం చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లే

అవుతుంది. ఈ క్షణంలో మంత్రి మండలి మాత్రం ఏం చెయ్యగలుగుతుంది? విషయం ఇంత తీవ్రమైందని ముందే మాకు చెబితే, మా అభిప్రాయాలను కూడా స్వీకరిస్తే మీకేం నష్టం వచ్చేది?" అన్నారు నిష్ఠూరంగా.

రావ్ అపరాధిలా తల వంచుకుని "ఇంత సీరియస్ అని మొదట మేమూ అనుకోలేదు ప్రైమినిష్టర్! విషయం ఏమిటో మాకే అర్థం కాలేదు. నిరూపణ కాని విషయాల మీద అనవసరంగా రాద్ధాంతం చెయ్యకూడదనుకున్నాను. అందుకే సూచనప్రాయంగా మనవి చేసి మీ అనుమతితో నర్సన్‌మీద ప్రయోగాలు చేశాం. నిర్దుష్టమైన అభిప్రాయం లేనందువల్ల ఏ నిర్ధారణకీ రాలేకపోయాం. ఇక తాత్సారం చెయ్యడం మంచిది కాదని ఇప్పుడు పూర్తి వివరాలు మనవి చేశాను" అని గొణిగాడు.

"నాన్సెన్స్! ఇప్పుడా చెప్పడం? ఏ అభిప్రాయం, నిశ్చయం లేకుండా బ్లయిండ్‌గా నర్సన్ అంతరిక్ష వాహనంలో ఎందు కెళ్ళినట్లు? అసలు మీరెలా వెళ్ళనిచ్చారు? ఇదేదో గూఢచారుల కుట్ర అయినా, అంతరిక్ష వాహనాలూ, గ్రహాలూ వున్న శత్రువుల మధ్యకి ఒంటరిగా వెళ్ళి అతగాడు ఏం సాధించగలడు? పరిస్థితినీ, పర్యవసానాన్ని అంచనా వేసుకోకుండా తొందరపాటుతో తీసుకునే ఇలాంటి చర్యలవల్ల దేశానికీ, ప్రపంచానికీ ఏదైనా అనర్థం సంభవిస్తే బాధ్యులెవరు? లోకానికి ఏం జవాబు చెప్తాం?" మండిపడ్డాడు ప్రధాని.

రావ్‌కి కష్టం కలిగింది. అయినా బలవంతాన నిగ్రహించుకుంటూ "అలాంటిదేదైనా జరిగితే, కారకుణ్ణి నేనే కనక, ఆ బాధ్యత కూడా నా మీదే వేసుకుంటాను

పై ప్రైమినిస్టర్! ఫలితాన్ని నేనే అనుభవిస్తాను" అన్నాడు నెమ్మదిగా.

ప్రధాని క్షణంపాటు అతని మొహంలోకి సూటిగా చూసి "అసలా అవకాశం మనకి లభిస్తుందనే నమ్మకం మీకుందా?" అనడిగారు. రావ్ జవాబు చెప్పలేదు. ఆ ప్రశ్నకి జవాబు లేదని అక్కడున్న వాళ్ళందరికీ తెలుసు! అందుకే ఆ ఆరాటం!

ప్రధాని బలవంతంగా నవ్వి "జరిగినదానికి బాధ్యతను ఎవరిమీద రుద్దాలని నేను ఆలోచించడంలేదు రావ్! మీ రన్నట్లు జరగకూడని దేదైనా జరిగితే ఏం చెయ్యాలో మనం ఎలా నిశ్చయిస్తాం? విషయం ఏమిటో వివరంగా తెలియని పరిస్థితిలో ప్రభుత్వ కర్తవ్యం ఏమిటి? ప్రధానిగా నేనుగానీ, కేంద్రమంత్రి మండలిగానీ, సర్వాధికారాలూ కలిగిన రాష్ట్రపతిగానీ ప్రభుత్వోద్యోగిగా మీరుగానీ ఏం నిర్ణయం చేస్తాం? అలాంటి అవకాశం లేనప్పుడు మాతో ఒక్క మాటైనా చెప్పకుండా ఇంత రిస్కు యెందుకు తీసుకున్నారనే నేను బాధపడుతున్నాను.

అవతలివాళ్ళు మేధావులైన గూఢచారులో, పరలోకం మానవులో ఎవరైతేనేం, యీ చర్య వాళ్ళని రెచ్చగొడితే, మనం వున్న అనిశ్చిత పరిస్థితిలో వాళ్ళు ఆగ్రహిస్తే— ఆ కోపంతో రేపెప్పుడో చెయ్యాలనుకున్న దురాగతానికి వాళ్ళు ఇప్పుడే పూనుకుంటే మీరూ, మేమూ ఆపగలమా? పోనీ మీరు పంపిన సర్సన్ ఆ ఉపద్రవాన్ని నివారించ గలడా? కనీసం మీకైనా ఆ నమ్మకం వున్నదా?" అన్నారు గంభీరంగా.

యస్.బి. డైరెక్టరు తన పొరపాటును అంగీకరిస్తూ

"తొందరపడ్డాను. సారీ. వెరీవెరీ సారీ....ముందుగా చెప్పక పోవడం నా తప్పే" అంటున్నాడు. అదే సమయంలో టెలిఫోన్ మోగింది. ప్రధాని ఒక్క అంగలో వెళ్ళి రిసీవర్ని తీసుకుని "యస్. చెప్పండి .... ఆఁ .... ఇక్కడే వున్నారు...." అని ఓ క్షణం విని రిసీవర్ని అరచేత్తో మూసి "మీ పి.ఏ. ఫోన్ చేశారు. డాక్టర్ స్నేత్నా జాడ తెలిసిందట" అని చెప్పారు.

రావ్ ఒక్క అంగలో ఫోన్ దగ్గరికి వెళ్ళి "యస్.... నేనే....ఎక్కడ....వెంటనే వస్తున్నాం" అని చెప్పి రిసీవర్ని క్రెడిల్ చేస్తూ "చావు బ్రతుకుల మధ్య వున్న స్నేత్నా హాస్పిటల్లో మగతగా కలవరిస్తున్నాడట! మనం అక్కడికి వెళ్ళాలి. ఇంపార్టెంట్" అని చెప్పాడు కంగారుగా. మరుక్షణం అందరూ హుటాహుటిన బయల్దేరారు.

నాలుగు కార్లు అమిత వేగంతో దూసుకుపోయాయి. అప్పుడే తెలతెలవారుతోంది. పన్నెండు నిమిషాల తర్వాత కార్లు హాస్పిటల్ ఆవరణలో ఆగాయి. అందరూ హడావిడిగా వార్డువైపు నడుస్తున్నారు.

వరండాలో వాళ్ళకి ఎదురుపడిన యస్.బి. డైరెక్టరు పి.ఏ. వాళ్ళని అనుసరించుతూ "స్నేత్నా అడ్రసు యాదృచ్ఛికంగానే తెల్సింది సర్! యాక్సిడెంట్ అయిన పేషెంటుని ఏ హాస్పిటల్లోనైనా చేర్పించారేమోనని ఎంక్వయిరీ చేస్తుంటే నర్సన్ పేరు కలవరిస్తున్న స్నేత్నా గురించి మాకు మెసేజ్...." అంటూ చెప్పుకుపోతున్నాడు.

ఆ మాటలు ఎవ్వరూ వినిపించుకునే స్థితిలో లేరు. హడావిడిగా స్పెషల్ వార్డులోకి ప్రవేశించారు. తీవ్రమైన గాయాలతో దాదాపు కోమాలో అచేతనంగా మూలుగు

తున్నాడు డాక్టరు స్నేత్నా. వాళ్ళని చూడగానే పేషెంటు పక్కనున్న డాక్టరు నిరాశగా పెదవి విరుస్తూ "సారీ! ఒకటి రెండు నిమిషాలకంటే బ్రతకడు" అని చెప్పాడు.

రావ్ పేషెంట్‌ని వుంచిన బల్లని సమీపించి "డాక్టర్ స్నేత్నా....డాక్టర్ స్నేత్నా....ప్లీజ్ టాక్ .... లెట్ మీ నో వాటిటీజ్....ప్లీజ్ టాక్...." అన్నాడు మీదకి వంగి అనునయంగా.

స్నేత్నా పెదవులు నెమ్మదిగా కదులుతున్నాయి. మాతిలోంచి వస్తున్నట్లు స్వరం బలహీనంగా వినిపించీ, వినపించనట్లు వినవస్తోంది. డెత్ బెడ్ మీద అంతిమక్షణాల్లో వున్న డాక్టర్ ఏదో చెప్పడానికి విశ్వప్రయత్నం చేస్తూ.... "నర్సన్....నర్సన్...." అని గొణుగుతున్నాడు.

అతడు నర్సన్‌తో ఏదైనా చెప్పాలనుకుంటున్నాడా? నర్సన్‌కి ఏదైనా ప్రమాదం వున్నదని హెచ్చరించాలనుకుంటున్నాడా? ఎవరికీ ఏమీ అర్థంగాక మొహాలు చూసుకున్నారు.

రావ్ మరింత ముందుకు వంగి "నర్సన్ సేఫ్.... నర్సన్ సేఫ్....ప్లీజ్ టాక్ స్నేత్నా....ప్లీజ్ టాక్...." అన్నాడు మరికాస్త బిగ్గరగా. 'నర్సన్ సేఫ్' అన్న మాట వినిపించగానే ఆ అంత్య దశలో కూడా స్నేత్నా మొహం స్వల్పంగా వికసించడం అందరూ గమనించారు.

"నర్సన్....నర్సన్...." గొణుగుతున్నాడు స్నేత్నా. క్షణక్షణానికీ స్వరం పడిపోతోంది. ప్రాణం ఆఖరి క్షణాల్లోకి వచ్చేసింది. మాట రావడం చాలా కష్టంగా వుంది. గొంతులో ఏదో అడ్డం పడినట్లు స్వరపేటిక ఉబ్బిపోతోంది. అయిపోతోంది. అతని ప్రాణం ఎగిరిపోతోంది. నర్సన్

అన్న మాట తప్పు చెప్పదల్చుకున్నది పూర్తిగా చెప్పలేక పోతున్నాడు. క్షణాలమీదున్నాడు.

"అయాం నర్సన్....అయాం నర్సన్ .... ప్లీజ్ టాక్ స్నేత్నా...." అన్నాడు రావ్ ఆఖరి ప్రయత్నంగా. క్షణం తర్వాత స్నేత్నా పెదవులు మళ్ళీ కదలసాగాయి.

"మానవలోకం .... డెత్ స్టార్ .... మృత్యుతార .... డేంజర్....నర్సన్....మృత్యుతార...." అతి భారంగా, బల హీనంగా స్నేత్నా పెదవులు అస్పష్టంగా పలికాయి. అందరూ అదిరిపడ్డారు.

"మానవలోకమా? మృత్యుతారా? ఏమిటది? ఎక్కడుంది? ప్లీజ్ టాక్ స్నేత్నా...." బిగ్గరగా అరిచాడు రావ్. జవాబు రాలేదు. ట్రీట్‌మెంట్ చేస్తున్న డాక్టర్ ముందు కొచ్చి క్షణంపాటు స్నేత్నావైపు పరిశీలనగా చూసి "సారీ ఉయ్ లాస్ట్ స్నేత్నా...." అని ప్రకటించాడు. యావన్మందీ నిశ్చేష్టులయ్యారు. స్నేత్నా మరణించాడని తెల్సుకోగానే గుండెలు బరువెక్కాయి.

"మైగాడ్....వివరాలు చెప్పకుండా స్నేత్నా మరణించాడా? ఇప్పుడెలా? ఆ మృత్యుతార ఎక్కడుందో ఇంకెవరు చెప్తారు? ఎలా తెలుస్తుంది? అసలా మృత్యుతార అంటే ఏమిటి?" అరిచాడు రావ్ బిగ్గరగా.

'మృత్యుతార' అన్న పేరు వింటూ అందరి మొహాలూ భయంతో పాలిపోయాయి! మరో మానవలోకం పేరే మృత్యుతారా? ఆ మృత్యుతారకి వెళ్ళిన నర్సన్ ఏమవుతాడు? మృత్యుతారవల్ల ప్రపంచానికి ఎలాంటి ఉపద్రవం ముంచుకు రాబోతోంది? ఎలా తెలుస్తుంది? ఎలా తెలుస్తుంది??

(ఇంకా వుంది)

మిస్. మార్గరెట్

వి.యస్. చెన్నూరి

ఎప్పుడయినా హుషారు పుడితే డైమండ్ బార్‌కి వెళ్ళేవాడ్ని. అక్కడ మంచి సరుకు దొరుకుతుందని కాదు. దొరికే సరకులు సరసంగా లభిస్తాయనీ కాదు. అనువుగా వుంటుందనీ, అన్ని వస్తువులూ అందుబాటులో వుంటాయనీ అంతకంటే కాదు. కేవలం మార్గరెట్ కోసం.

అందమయిన మార్గరెట్ లేత పెదాలమీద లాస్యం చేసే చిరునవ్వుకోసం.

డైమండ్ బార్ చాలా చిన్నది. నలుగురయిదుగురు వెయిటర్స్ మాత్రం వుండేవారు. ప్రొప్రైటర్ చైనావాడు. పేరు లింగ్‌చా. పొట్టిగా, బొద్దుగా, సట్టిముఖంతో చప్పిడి ముక్కుతో, కళ్ళు మిటకరిస్తూ కౌంటర్లో కూర్చుని వుండే వాడు. ఎవరయినా పరిచయమయిన వ్యక్తులు కనుపిస్తే తన బంగారు పళ్ళు బయట పెట్టేవాడు.

ఎవరయినా ఆ బార్‌కి వెళుతున్నారంటే కేవలం మార్గరెట్ కోసం! ఆమె చిరునవ్వుకోసం!

మిస్ మార్గరెట్ ఆ బార్‌లో నాట్యకత్తె. ఆమె ఆడుతూంటే విద్యుల్లతలు జ్ఞాపకానికి వచ్చేవి.

మిస్ మార్గరెట్ ఆంగ్లో యిండియన్ యువతి. పాతికేళ్ళుంటాయి. సన్నగా, తెల్లగా, బంగారు తీగలాగా, అప్పుడే విరబూసిన గులాబీ మొగ్గలాగా వుండేది. భుజాల దాకా వ్రేలాడే వుంగరాలుతిరిగిన నల్లని కురులూ, కోల ముఖం, కొనతేరిన ముక్కూ, చిన్నగడ్డం, నీలికళ్ళూ, గులాబీ చెక్కిళ్ళూ, ఎర్రని పెదాలూ, గుండ్రటి భుజాలూ, ఎత్తయిన వక్షోజాలూ, సన్నని నడుమూ, ఘన జఘన ద్వయం, బలిష్టమయిన తొడలూ, చిన్న చిన్న పాదాలూ- ఆమెలో అందం, ఆకర్షణా రెండూ ఒకదానితో ఒకటి పోటీపడేది.

నేను బార్‌లో అడుగు పెట్టగానే ఆమె కళ్ళు నన్ను పలకరించేవి సన్నని పెదాలు ఆప్యాయంగా ఆహ్వానించేవి. నేను ఎంతమందిలో వున్నా సరే, ఆ అందమయిన కళ్ళు నాకోసం వెతుకులాడేవి. నేను కనిపించగానే ఉత్సాహంతో పురకలేసేవి.

ముంజేతులు కోటు జేబులో దాచుకుని డైమండ్ బార్ కేసి బయలుదేరాను.

బార్ కాంపౌండులోకి చేరుకున్నాను.

లోపల ఆర్కెస్ట్రా వినిపించడం లేదు. భోక్తల కేకలు గానీ, కేరింతలుగానీ చెవికి సోకడంలేదు. కౌంటర్‌వద్ద కూర్చునివున్న ప్రొప్రైటర్ లింగ్‌చౌ మీనమేషాలు లెక్క బెడుతున్నాడు.

నేను గుమ్మంలో కాలు పెట్టగానే లింగ్‌చౌ ముఖం చాటంత అయింది. బంగారు పళ్ళు బైటపెట్టి, కౌంటర్ లోంచి లేచి, "కమాన్ జంటిల్‌మన్" అంటూ నా వెంట పడ్డాడు.

లోపల ఆట్టే జనంలేరు. రిస్టువాచ్ చూచుకున్నాను. పది కావస్తోంది. రెండు మూడు జంటలు మాత్రం అక్కడక్కడా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ వాగుతున్నారు.

"మంచి ఫారిన్ సరకువుంది. పంపించమన్నారా?" అన్నాడు లింగ్‌చౌ.

పంపించమన్నట్టు తలూపి కుర్చీలో కూర్చున్నాను.

నా కళ్ళు మిస్ మార్గరెట్ కోసం హాలంతా గాలిస్తున్నాయ్.

ఓ ట్రేలో ఓ వైట్‌హార్స్ విస్కీ బాటిల్, రెండు ఖాళీ గ్లాసులూ, ఓ షోడా బాటిల్‌తో వెయిటర్ అక్కడికి వచ్చాడు.

బాటిల్ చేతికి తీసుకుని మార్గరెట్‌ని గురించే ఆలోచిస్తున్నాను.

"మే ఐ కమ్ ఫార్ యువర్ కంపెనీ?" సన్నని గొంతుక వినిపించింది. తలెత్తి చూశాను. మిస్ మార్గరెట్!

ఎక్కడ్నించి వచ్చిందో—నాముందు చిన్నగా నవ్వుతూ నిల్చుని వుంది.

"షూర్, షూర్! యు ఆర్ ఆల్వేస్ వెల్‌కమ్"

ఆమె నవ్వుతూ నా కెదురుగా కుర్చీలో కూర్చుంది. చొరవగా నా చేతిలోంచి బాటిల్ అందుకుని కార్కు తీసి, రెండు గ్లాసుల్లోకీ వొంచింది. షోడా కలిపి ఓగ్లాసు నాకిచ్చి తనో గ్లాసు తీసుకుంది.

"టు ది బెస్ట్ హెల్త్ ఆఫ్ మిస్టర్ సుకుమార్" అంది.

"అండ్ మిస్ మార్గరెట్" నేను వాక్యం పూర్తి చేశాను.

ఆమె నవ్వింది. ముత్యాలు వొలకబోసింది.

ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ త్రాగుతున్నాం.

ఆమె మాట్లాడుతూంటే, అందంగా మెరిసే ఆ కళ్ళూ, తమాషాగా కదలాడే ఆ లేత పెదాలూ, అందమయిన మెడ కింద ఉవ్వెత్తుగా పెల్లుబికే వక్షోజాలూ చూస్తూ మత్తుగా 'ఊఁ' కొడుతున్నాను. త్రాగుతున్నాను. బాటిల్ ఖాళీ అయింది. మాటల్లోపడి బాటిల్లో ఎక్కువ భాగం నేనే త్రాగేశాను.

నిషా తలకెక్కింది. గాలిలో ఎగిరిపోతున్నట్టుంది.

లింగ్‌చౌ మరో బాటిల్ పట్టుకుని అక్కడికి వచ్చాడు.

"దీన్ని మీరెప్పుడూ త్రాగి వుండరు. ఒకసారి రుచి చూస్తే జన్మలో మరెప్పుడూ మరచిపోలేరు. ట్రై చెయ్యండి మిస్టర్ సుకుమార్!" అన్నాడు.

"ఊహూఁ. ఇక లాభంలేదు" అన్నట్టు తలూపాను.

"ఫరవాలేదు మిస్టర్ సుకుమార్. మీరు దీనికి బిల్లు పే చెయ్య నవసరంలేదు. రుచి చూడండి! బావుంటే మరెప్పు డయినా ప్రయత్నించవచ్చు" అన్నాడు లింగ్‌చౌ బలవంతం

చేస్తున్నట్టు.

మార్గరెట్ ముందు బలవంత పెట్టించుకోవడం నా కిష్టం లేదు.

"సరే, ఇవ్వండి!" బాటిల్ చేతికందుకున్నాను.

కార్కు తీసి గ్లాసులో పోంచుకుని త్రాగుతున్నాను. మార్గరెట్ ఇంకా మొదటి బాటిల్ తాలూకు విస్కీనే కొద్ది కొద్దిగా 'సిప్' చేస్తోంది.

రెండవ బాటిల్ కూడా పూర్తయింది.

తల తిరుగుతోంది. నా కళ్ళముందు ప్రపంచమంతా తల్లక్రిందులుగా తిరుగుతోంది. బిల్లు పే చేసి, తడబడే మాటలతో, "థాంక్ యూ మిస్ మార్గరెట్!—థాంక్ యూ ఫార్ యువర్ కంపెనీ!" అంటూ కుర్చీలోంచి లేచాను. "గుడ్ బై! — వస్తా!" అంటూ అడుగు ముందుకు వేశాను.

అడుగులు తేలిపోతున్నయ్. అవయవాలు స్వాధీనంలో లేవు. తూలి క్రింద పడబొయ్యాను. మార్గరెట్ నన్ను పట్టుకుంది.

"ఫరవాలేదు మిస్.... నేను వెళ్ళగలను....నన్నొదులు" మార్గరెట్‌ని విడిపించుకుని వెళ్ళడానికి ప్రయత్నించాను.

అంతలో బార్ ప్రొప్రైటర్ లింగ్‌చా అక్కడికి వచ్చి నన్ను పట్టుకున్నాడు. "ఇప్పుడు లాభంలేదు మిష్టర్ సుకుమార్. తరువాత వెళ్ళొచ్చు. కొంతసేపు విశ్రాంతి తీసుకోండి!" అన్నాడు.

నేను అక్కడే వున్న ఓ కుర్చీలో కుప్పగా కూలి పొయ్యాను.

బుర్రలో మేఘాలు తిరిగాయి. కళ్ళు మూతలుబడ్డయ్. తరువాత ఏం జరిగిందో నాకు తెలీదు.

2

నాకు వొళ్ళు తెలిసి-కళ్ళు తెరిచే సరికి నేను మార్గరెట్ వొళ్ళో వున్నాను. తల భారంగా వుంది. మార్గరెట్ తన సున్నితమయిన వ్రేళ్ళతో నా తల సర్దుతోంది. ఆమె ఒంటి మీంచి వచ్చే సువాసన నన్ను మత్తెక్కిస్తోంది.

మార్గరెట్‌తో నాకు పరిచయమే కాని, నేనెప్పుడూ ఆమెకు అంత సన్నిహితంగా వెళ్ళలేదు. ఆమె వొంటిమీద బట్టల్లేవు. నల్లగా నిగనిగలాడుతున్న శాటిన్ బ్రాసియర్స్, అండర్‌వేర్ మాత్రమే వున్నయ్.

చటుక్కున లేచి కూర్చున్నాను. చుట్టూ చూశాను.

పైన సీలింగ్ ఫాన్ ఫుల్ స్పీడులో తిరుగుతోంది. కిటికీలకు సిల్కు-కర్టెన్‌లు వ్రేలాడుతున్నయ్. గది గోడలకి అందమయిన అమ్మాయిల నగ్న చిత్రాలు వ్రేలాడు తున్నయ్.

మెత్తని పట్టుపరుపుమీద ముఖమల్ దిండు నానుకుని ఆమె వొయ్యారంగా కూర్చుని వుంది. నాకేసి చూచి, "ఇప్పుడెలా వుంది మిస్టర్ సుకుమార్?" అని ప్రశ్నించింది ఆప్యాయంగా.

"బాగానేవుంది. ఇంతకీ నే నిక్కడికెలా వచ్చాను?"

"ఏముంది? మీరు తప్పతాగి ఒళ్ళు తెలీని స్థితిలో పడి పోతే, ప్రొప్రైటర్ లింగ్‌చౌ మిమ్మల్నిక్కడికి చేర్చారు."

"థాంక్స్! నేను వెళ్ళొస్తాను" మంచం మీంచి దిగాను.

ఆమె నా కేసి అదోలా చూచింది. "ఇప్పుడా? ఈ అర్ధ రాత్రివేళ?"

"ఫరవాలేదు వెళ్ళగలను."

ఆమె కిలకిలా నవ్వింది. "బయట వర్షం పడుతోంది.

టాక్సీలు కూడా దొరకవ్. ఈ రాత్రి యిక్కడే వుండి ప్రొద్దున్నే వెళ్లొచ్చు" అంటూ మంచం మీంచి క్రిందికి దిగింది. తిన్నగా వచ్చి నా కెదురుగా నిల్చుంది. తన రెండు చేతులూ నా భుజాలమీదికి చాచి, చిలిపిగా నా కళ్ళల్లోకి చూచి నవ్వింది.

ఆమె కళ్ళు నన్ను కవ్విస్తున్నయ్. ఆమె నవ్వు నన్ను రెచ్చగొడుతోంది. అందమయిన అవయవాల పొందిక నన్ను పిచ్చివాణ్ని చేస్తోంది.

నాకు తెలీకుండానే నా ఎడంచెయ్యి ఆమె నడుముని చుట్టివేసింది. ఉద్రేకంతో, నరాల వేడిమితో, ఆమెను గట్టిగా హృదయానికి హత్తుకుని, ఆమె పెదాలని నా పెదాలతో అందుకున్నాను. బుగ్గల్ని ముద్దాడాను.

ఆమె నా కౌగిట్లో వెచ్చగా వొత్తుగా, మెత్తగా వొంపులు తిరిగిపోయింది. కరిగిపోయింది. ఒరిగి పోయింది.

లక్ష జన్మలెత్తినా మరువరాని మధుర క్షణాలు అవి!

ఎంత తపస్సు చేసినా సాధించలేని మధురానుభూతి!!

3

తెల్లవారింది. కిటికీలోంచి మీదపడ్డ సూర్యకిరణాలు నన్ను నిద్ర లేపింది.

బద్ధకంగా పక్కమీంచి లేచాను. మార్గరెట్ అక్కడ లేదు. ఒంకీకి వ్రేలాడుతోన్న కోటునందుకుని తొడుక్కున్నాను. అడుగు ముందుకు వేశాను.

చక్కగా ముస్తాబై చిరునవ్వులు చిందిస్తూ గుమ్మంవద్ద ఎదురైంది మార్గరెట్. ఆమె కళ్ళు ఉత్సాహంగా మెరుస్తున్నయ్.

టైంకోసం రిస్టువాచీ చూచుకున్నాను. చేతికి రిస్టువాచీ

లేదు. గోల్డు చెయిన్‌తోసహా మాయమయింది. నా చేతులు అప్రయత్నంగానే కోటుజేబులు తడిమాయి. మనిపర్సు కూడా అదృశ్యమయింది.

"మార్గరెట్! నా రిస్టువాచ్ చూశావా!"

"రిస్టువాచా?" ఆశ్చర్యంగా చూచింది మార్గరెట్.

"జేబులోని మనిపర్సు కూడా మాయమైంది."

మార్గరెట్ మాట్లాడలేదు. కళ్ళప్పగించి నా కేసి చూస్తూ వుండిపోయింది.

నాకు నవ్వొచ్చింది.

ఇందులో ఆశ్చర్యపడాలిసిన విషయమేమీ లేదు. మారుమూలనున్న యిలాంటి చిన్నచిన్న బార్స్‌లో అప్పుడప్పుడూ యిలాంటి సంఘటనలు జరక్కపోతే గడవడం కష్టం!

"ఫరవాలేదు డియర్! వెళ్ళొస్తా!"

"అప్పుడప్పుడూ వస్తుంటారు కదూ?"

"తప్పకుండా."

"కాని ఇక ముందెప్పుడూ యిలా ఎక్కువగా త్రాగకండి!"

"మే మిలా తప్ప త్రాగకపోతే మీలాంటి వాళ్ళకి గడవద్దూ?"

చెంప ఛెళ్ళుమనిపించి నట్టయింది. చూస్తుండగానే ఆమె ముఖం అవమానంతో మాడిపోయింది.

"మిస్టర్ సుకుమార్! మీరు నన్నవమానిస్తున్నారా!" ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"సారీ డియర్! నీ మనసుకి బాధ కలిగిస్తే నన్ను క్షమించు, వస్తా!"

ఆమె తల వంచుకుంది. నా కేసి చూళ్ళేదు. నేను గది

విడిచి సింహద్వారం చేరుకునే వరకూ ఆమె వొంచిన తల ఎత్తలేదు.

ఈ నేరంలో ఆమెకు భాగం లేదేమో! జీవగత్తె! యజమాని చెప్పినట్టు చెయ్యవలసిన అస్వతంత్రురాలు! ఆమెను అనవసరంగా బాధించానేమో!

చిన్నబోయిన ఆ చిన్నారి ముఖం నా కళ్ళల్లో యింకా కదులాడుతూనే వుంది.

తరువాత ఆరు మాసాలదాకా నేనటు వెళ్ళలేదు.

మార్గరెట్ అందం, ఆకర్షణా, మంచి, మర్యాదా మరచి పోవాలన్నా మరపుకు వచ్చేది కాదు.

ఆమె నాట్యకత్తె కావచ్చు, డబ్బుకి శరీరాన్నమ్ముకునే పడుపుకత్తె కావచ్చు. కాని, ఆమెతో గడిపిన ఆ మధుర క్షణాలు లక్ష జన్మలెత్తినా మరువలేను.

ఆమె జ్ఞాపకానికి రావడంతో ఆనాటి ఆ సంఘటన కూడా గుర్తుకు వచ్చేది. నా గుండెల్ని పిండేది. ఆమెను చూడాలన్న కాంక్ష సమూలంగా తుడిచివేసేది.

4

ఆ రోజు డిసెంబర్ ఇరవై అయిదు. క్రిస్టమస్ డే. కనీసం ఈ రోజయినా ఆమెను కలుసుకోవాలనిపించింది. బట్టలు తొడుక్కుని బయిలుదేరాను.

నేను డైమండ్ బార్ చేరుకునే సరికి వాల్‌క్లాక్ తొమ్మిది కొట్టింది.

డైమండ్ బార్ పూర్వంలా లేదు. పూర్తిగా మారి పోయింది. ఫ్లోరసెంట్ దీపాల వింతకాంతితో హాలంతా ధగధగా మెరిసిపోతోంది. ఒకవైపు ఆర్కెస్ట్రా కమ్మని సంగీతాన్ని అందిస్తోంది. మిస్ మార్గరెట్ సంగీతాని కను

గుణంగా అడుగులు వేస్తోంది. ఆడుతోంది. ఆమె చుట్టూ చేరిన జనం తలలూపుతూ చప్పట్లు కొడుతున్నారు. మధ్య మధ్య కేకలు! కేరింతలు! ఈలలు!

హాలంతా జనంతో కిటకిట లాడుతోంది. త్రాగేవాళ్ళు త్రాగుతున్నారు. తాళం వేసేవారు తాళం వేస్తున్నారు. గాజుబుడ్లు ఖాళీ అవుతున్నయ్. ఖాళీ గ్లాసులు గాల్లోకి ఎగురు తున్నయ్.

వెయిటర్స్ చాలా బిజీగా అటూ యిటూ తిరుగు తున్నారు.

నేను తిన్నగా వెళ్ళి ఓ టేబుల్ ముందు కూర్చున్నాను. బీర్ పట్టుకురమ్మని వెయిటర్‌కి చెప్పి నాట్యం చేస్తున్న మార్గరెట్ కేసే చూస్తున్నాను.

బార్‌తోబాటు మిస్ మార్గరెట్ కూడా పూర్తిగా మారి పోయింది. విలువయిన బట్టలు తొడుక్కుంది. మెడలో వ్రేలాడుతోన్న లాకెట్ తళతళ లాడుతోంది. ముంపుకం చే కాస్త ఒళ్ళు కూడా జేసింది. కాని ఆ కళ్ళల్లో చిలిపితనం లేదు. ఆ పెదవుల్లో కొంటెతనం లేదు. ఆ ముఖంలో కళాకాంతుల్లేవు. ఏదో భయం, బాధ కొట్టొచ్చినట్లు కని పిస్తున్నయ్.

అకస్మాత్తుగా ఆమె కళ్ళు నా మీద పడ్డాయ్. పెద వులపై చిరుహాసం లాస్యంచేసి, వెంటనే మాయమయింది. కళ్ళల్లో కాంతులు మెరిసి అదృశ్యమయినయ్.

ఆర్కెస్ట్రా ఆగిపోయింది. జనం గల్లంతుగా ఏదో మాట్లాడుకుంటున్నారు.

మార్గరెట్ జనాన్ని తప్పించుకుని తిన్నగా నా వద్దకి వచ్చింది. నా చెవిదగ్గరికి వొంగి, "మిస్టర్ సుకుమార్! నేను ఆపదలో వున్నాను. మీరు నన్ను రక్షించాలి! ఈ

రాత్రికి మీరు నా గదిలో గడపాలి. ప్లీజ్!" అంది రహస్యంగా.

ఆమె కళ్ళల్లో దైన్యం దోబూచులాడింది.

అంతలో ఎవరో అటు రావడం చూసి, పిల్లిలా అక్కడ్నించి పారిపోయింది.

ఎవడో బలిష్టంగా మెలికలు తిరిగిన కండరాలతో, పహిల్వానుకి మల్లే వున్న వ్యక్తి తిన్నగా అక్కడికి వచ్చి, నాకేసి చురచురా చూసి, ఆమెవెంట పడ్డాడు.

ఏమిటీ చిత్రం—మార్గరెట్ నిజంగానే ఆపదలో వుందా? .... ఆమెకొచ్చిన ఆపదేమిటి? — ఈ రాత్రి నే నామెతో గడిపినంత మాత్రాన ఆమె ఆ ఆపదలోంచి బయట పడుతుందా?—ఇంతకీ ఎవడీ వ్యక్తి?—ఇతడ్ని చూచి మార్గరెట్ ఎందుకలా భయపడి పారిపోయింది?

నేను ఆలోచిస్తున్నాను.

బార్లో జనం పలుచబడుతున్నారు.

మార్గరెట్ మళ్ళీ ఏదయినా ఎత్తువేస్తోందా?—ఆమె నిజంగానే ఏదయినా ఆపదలో వుందా?—నా జేబులు ఖాళీ చెయ్యడానికి ఇదేదయినా కొత్తరకం ఎత్తుగడా?

నా బుర్రలో అన్నీ ప్రశ్నలే.

గోడగడియారం పదకొండు గంటలు కొట్టింది.

బార్లో నాట్యంచేసే ఒక సామాన్య స్త్రీ కోసం—డబ్బుకోసం ఒళ్ళమ్ముకునే ఒక పడుపుగత్తె కోసం—నే నెందుకిలా బుర్ర పాడుచేసుకోవాలి?—ఆమె నిజంగా ఆపదలో వుంటే రక్షించే ధీరుడు నా కంటే మరెవ్వరూ దొరకలేదా?—

బార్లోంచి వెళ్ళిపోదామని కుర్చీలోంచి లేచాను. బిల్లు చెల్లించి పక్కకి తిరిగాను.

ఎవరో కెవ్వుమని అరిచిన శబ్దం వినిపించింది. వెనక్కి తిరిగాను.

ఇంతక్రితం నా కేసి చురచుర చూచిన మనిషి, పహిల్వానుకిమల్లే వున్న వ్యక్తి మార్గరెట్ చెయ్యి పుచ్చుకుని లాగుతున్నాడు. ఆమె అతనిపట్టు విడిపించుకునేందుకు ప్రయత్నిస్తోంది. గింజులాడుతోంది. వాళ్ళ చుట్టూ జనం మూగారు. ఒక్కడూ కలుగజేసుకోలేదు. తమాషా చూస్తున్నారు.

నాకు ఒళ్ళు మండిపోయింది. కోపంతో వొళ్ళు వేడెక్కిపోయింది. ఒక్క అంగలో అక్కడికి చేరుకున్నాను. అమాంతం అతని చొక్కా పుచ్చుకుని ఒక్క గుంజుగుంజి, "ఆమెను విడిచిపెడతావా, నీ ఒళ్ళు హూనం చెయ్యమన్నావా?" అని గర్జించాను.

"అది శరీరాన్నమ్ముకునే మనిషి. దాన్ని నే నీ రాత్రికి బుక్ చేసుకున్నాను. మధ్య నువ్వెవడవు నన్నడగటానికి?" అన్నాడా వ్యక్తి మార్గరెట్‌ను విడిచిపెడుతూ.

అంతలో బార్ పొప్రైటర్ లింగ్‌చౌ అక్కడికి చేరుకున్నాడు. నేను వెంటనే జేబులో చెయ్యివేసి, ఓ పచ్చనోటు బైటికి తీసి, ఎవరికీ తెలియకుండా అతని చేతిలో బెట్టాను.

"నే నావిడ్ని నీకంటే ముందే బుక్ చేసుకున్నాను. కావలిస్తే పొప్రైటర్ని అడుగు" అన్నాను.

"అవును మిస్టర్ వైట్. వారు మీకంటే ముందే ఆవిడ్ని బుక్ చేసుకున్నారు" అన్నాడు లింగ్‌చౌ చేతిలోని పచ్చనోటుని జేబులోకి కుక్కుకుంటూ.

మిస్ మార్గరెట్ చొరవగా నా చెయ్యి పుచ్చుకుని, "కమాన్ మిస్టర్ సుకుమార్. వెళదాం పదండి!" అంది.

ఇద్దరం ఆమె గదికేసి బయలుదేరాము.

మిస్టర్ వైట్ మాకేసి కళ్ళప్పగించి చూస్తూ వుండి పోవడంకంటే ఏమీ చెయ్యలేకపోయాడు.

5

ఫోమ్‌బెడ్ మీద వెల్లకిలా పడుకుని, గిరగిరా తిరిగే ఫాన్‌కేసి చూస్తూ, ఆలోచిస్తున్నాను.

మార్గరేట్ డబ్బుకి వొళ్ళమ్ముకునే మనిషి. పడుపు కత్తెలికి కావలిసింది ప్రేమకాదు, డబ్బు! డబ్బిచ్చేవాడెవ రైనా సరే వాళ్ళకి తేడా తెలీదు.

కాని, మార్గరెట్ అతడ్నెందుకు కాదంది?—అతన్ని చూడగానే ఎందుకలా భయపడింది?—అతనిద్వారా ఆమె కొచ్చిన ఆపదేమిటి?—

మార్గరెట్ బట్టలు తీసివేసి, నైట్‌గౌను తొడుక్కుని బాత్‌రూంలోంచి బయటపడింది. తిన్నగా వచ్చి నా దగ్గరగా కూర్చుంది. ఆమెలో ఇంకా భయంపోలేదు. కళ్ళల్లో యింకా కంగారు తొంగిచూస్తోంది.

నేను పక్కమీంచి లేచి ఆమె దగ్గరికి జరిగాను. ఎడం చేత్తో ఆమె నడుం పట్టుకుని దగ్గరకి లాక్కుంటూ, "డియర్! అతడంటే ఎందుకలా భయపడ్డావ్?" అని ప్రశ్నించాడు.

"అతడు మనిషికాడు! పశువు! రాక్షసుడు! అతడంటే నాకు భయం!" ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "రాత్రంతా వాడిచేతుల్లో హూనమైపోయాను. ఇలా చూడండి!" అంటూ నైట్‌గౌను తొలగించి తన తొడలకేసి చూపింది.

తెల్లటి సుకుమారమయిన ఆ తొడలమీద ఎర్రగా కందిన గాట్లు? పదహారుపళ్లూ స్పష్టంగా కనిపిస్తున్నయ్: నా కళ్ళు గిర్రున తిరిగిపోయినయ్.

"మనుషుల్లో ఇలాంటి పశువులు కూడా వుంటారా!" అనుకున్నాను.

"అతడెవడో కాదు. నా భర్త. నేవీలో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం సింగపూర్‌లో వుంటున్నాడు. రెండు సంవత్సరాల క్రితం మా యిద్దరికి పెళ్ళయింది. ఆరు మాసాలు అతనితో కాపురం చేశాను. ఆ నరకయాతన అనుభవించలేక తప్పించుకుని పారిపోయి ఇక్కడ చేరుకున్నాను.

నే నిక్కడున్న విషయం ఎలా తెలుసుకున్నాడో నిన్ననే దిగబడ్డాడు. లింగ్‌చౌ ఈ మధ్య స్మగ్లింగ్ వ్యాపారం ప్రారంభించాడు. ఆ వ్యాపారంలో యిద్దరికీ పరిచయమయి వుంటుంది. ఇక్కడ తిష్టవేసి, నన్ను తనతో రమ్మని బాధిస్తున్నాడు. వెళ్ళకపోతే ఎంతకయినా తయారవుతాడు. కసాయివాడు. ఈ పడుపువృత్తి నయినా భరించగలను గానీ, మళ్ళీ వాడితో ఆ నరకంలోకి దిగలేను. నా కేమీ పాలుపోవడంలేదు.

పాపం మార్గరెట్ భయంతో గజగజలాడిపోతోంది.

"పోనీ, ఎక్కడికయినా పారిపోకూడదా?"

"ఎక్కడికి పారిపోను?—ఒంటరిదాన్ని, ఆడదాన్ని. ఎలా బ్రతకగలను?—మళ్ళీ వాడు వెంటబడితే ఎలా తప్పించుకోవడం?" ఏడుస్తోంది.

నా హృదయం ద్రవించిపోయింది.

"నాతో వొచ్చెయ్. నేను తీసుకెళతాను."

"ఏమిటి? నిజంగానా?" ఆమె ఆశ్చర్యంగా నా కళ్ళ

లోకి చూసింది. "మిస్టర్, సుకుమార్! నిజంగానే అంటున్నారా? నన్ను మీతో తీసుకెళతారా? చెప్పండి సుకుమార్! యేమిటి చెప్పండి!" ఆశగా చూచింది.

"కాని...."

"కాని? చెప్పండి సుకుమార్! ఏమిటి ఆలోచిస్తున్నారు? నేను మీకు తగననా? కావచ్చు! మీరు నన్ను పెళ్ళాడవద్దు! ధర్మపత్నిగా స్వీకరించనూ వద్దు! ఉంపుడు గత్తెగా ఉంచుకోండి చాలు! యిష్టమేనా? చెప్పండి సుకుమార్, చెప్పండి!"

"నే నాలోచిస్తున్నది అది కాదు డియర్. నేను నిన్ను సుఖపెట్టగలనా అని ఆలోచిస్తున్నాను."

"వద్దు సుకుమార్, నాకు సుఖం వద్దు. మీరు నన్ను విడిచిపెట్టవద్దు. మీరు నన్ను చంపండి, హింసించండి. మీరేం చేసినా నా కిష్టమే! కాని, వారానికో రోజు, కనీసం నెలకో నాడు నన్ను ఆప్యాయంగా పలకరించండి. ప్రేమగా చూడండి. మనసిచ్చి మాట్లాడండి చాలు - మీ పాదాలవద్ద పడివుంటాను. మిమ్మల్ని పువ్వులతో పూజించుకుంటాను. కాదనకండి సుకుమార్! నన్ను మీతో తీసుకెళ్ళండి! ప్లీజ్!"

ఆమె కళ్ళల్లోంచి చెంపల మీదుగా కన్నీరు కాలువలు గట్టాయి.

"మార్గరేట్, పద! యిప్పుడే యిక్కడ్నించి వెళదాం పద!" అంటూ మంచంమీదనుంచి క్రిందికి దూకాను.

"సుకుమార్! మై డియర్!" బావురుమని ఏడుస్తూ మార్గరేట్ నన్ను కౌగలించుకుని, "నాకు తెలుసు డియర్! మీ హృదయం వెన్నపూసలాంటిది. మీరు నన్ను కాదనరని

నాకు తెలుసు.'' తన చెంపల్ని నా చెంపలకు రాస్తూ, నా భుజాలను కన్నీటితో తడిపివేసింది.

''కాని, యిప్పుడు యిక్కడ్నుంచి వెళ్ళడం సాధ్యం కాదు డియర్! యిటు నా మగడూ, అటు ప్రొప్రైటరూ మనల్ని యిక్కడ్నుంచి కదలనివ్వరు. ఈ రాత్రంతా వాళ్ళ నిఘా యీ గదిమీదనే వుంటుంది. వాళ్ళని తప్పించుకుని పారిపోవటం మన తరం కాదు. ఈ వారం రోజులూ యిక్కడ్నుంచి యెక్కడికీ కదల్లేను.

ఆరవరోజు రాత్రి పన్నెండు దాటగానే కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. బార్‌లో అందరూ కొత్త సంవత్సరపు హడావుడిలో వుండిపోతారు. లింగ్‌చౌ, అతగాడూ తప్పతాగి యే గదిలోనో దొర్లుతుంటారు. సరిగ్గా చర్చిలో గంటలు మోగగానే బార్ కెదురుగా వున్న పబ్లిక్ పార్క్ ముందు చెట్టుక్రింద నా కోసం యెదురు చూస్తూ వుండు. నే నెలాగయినా మిమ్మల్ని కలుసుకుంటాను. వెళ్ళిపోదాం. కొత్త సంవత్సరంలో కొత్త జీవనాన్ని ప్రారంభిద్దాం. యిష్టమేనా సుకుమార్!''

''అలాగే'' అంటూ ఆమెను దగ్గరకు తీసుకున్నాను.

ఆమె నా కౌగిట్లో యిమిడిపోయింది.

నే నా గదిలోంచి వెళ్ళేటప్పుడు ఏదో జ్ఞాపకానికి రాగా ''ఒక్క క్షణం ఆగండి!'' అంటూ అల్మేరాకేసి తిరిగింది మార్గరేట్. అల్మేరా తెరచి తన వానిటీ బాగ్‌లోంచి ఏదో బయటికి తీసింది.

''ఏమిటది?'' ప్రశ్నించాను.

''ఆ రోజు మీరు పోగొట్టుకున్న రిస్టువాచీ. ప్రొప్రైటర్ లింగ్‌చౌ గదిలో దొరికింది. మీ వస్తువు మీకు యిద్దా

మని మీ కోసం యెదురు చూచాను. మీరు మళ్ళీ కనిపించ లేదు'' అంటూ ఆమె తన చేతులతో రిస్టువాచీని నా చేతికి తగిలించింది. "కాని పర్సు మాత్రం కనుపించ లేదు" బాధగా నా కళ్ళల్లోకి చూచింది.

"ఫరవాలేదు డియర్! నీలాంటి నిధి దొరికిన తరువాత అలాంటి పర్సొక లెక్కా?" ఆమెను దగ్గరకు లాక్కొని గట్టిగా ముద్దుపెట్టుకున్నాను.

"ముప్పైవొకటో తేదీ రాత్రి 12 గంటలకు, పబ్లిక్ పార్కు ముందు, చెట్టుక్రింద నా కోసం యెదురుచూడడం మరిచిపోరు కదూ?" ఆ మాటల్లో ప్రేమ, అభ్యర్థన, బాధ, భయం అన్నీ మిళితమై వున్నాయ్.

"ఎలా మరిచిపోగలను డియర్! అది నాకు సాధ్యమా? తప్పకుండా కలుసుకుందాం. కొత్త సంవత్సరంతో బాటు కొత్త జీవితాన్ని ప్రారంభిద్దాం."

"థాంక్ యూ సుకుమార్!"

"వెళ్ళొస్తా! బై! బై!"

ఆమె వద్ద శెలవు తీసుకుని బయలుదేరాను.

6

ఆ రోజు డిసెంబర్ ముప్పయ్యొకటి.

మార్గరేట్‌ని వెంటతీసుకుని జనవరి ఫస్టునే ఆ వూరు విడిచిపెట్టి వెళ్ళిపోడానికి అన్ని ఏర్పాట్లూ చేశాను. వెళ్ళే ముందు ఆ రోజు జ్ఞాపకార్థం నేనూ, మార్గరేట్ కలిసి ఫోటో తీయించుకోడానికి బ్లూ స్టార్ ఫోటో స్టూడియోలో చెప్పి వుంచాను.

బ్లూ స్టార్ ఫోటో స్టూడియో చాలా పెద్దది. ఎప్పుడూ బిజీగా వుంటుంది. క్రిస్టమస్ సీజన్‌లో రాత్రిళ్ళు కూడా

పనిచేస్తుంది. మా ఏర్పాటు ప్రకారం మేము ఆ రాత్రి ఒంటిగంటకి స్టూడియోలో వుండాలి.

రాత్రి పన్నెండు కావడానికి యింకా పావు గంట వుంది.

బార్ కెదురుగా పబ్లిక్ పార్కు ముందు చెట్టుక్రింద నిల్చుని మార్గరేట్ కోసం యెదురుచూస్తున్నాను. మార్గరేట్‌తో నేను గడపబోయే మధుర జీవితాన్ని గురించి ఆలోచిస్తున్నాను.

పన్నెండు దాటింది. చర్చిలో గంటలు మోగాయి.

కాని మార్గరేట్ రాలేదు. ఎక్కడా ఆమె జాడ కనిపించడం లేదు. ఆమె రాక కోసం నిరీక్షిస్తూ మరో పావు గంట గడిపాను. కాని, ప్రయోజనం కనిపించలేదు.

మార్గరేట్ యెందుకు రాలేదు? ఆమె కేమయింది?

నాలో ఆత్రుత యెక్కువయ్యింది. గుండెలు వేగంగా కొట్టుకోసాగినాయి. నా కాళ్ళు నాకు తెలీకుండానే 'డైమండ్ బార్' కేసి బయలుదేరినాయ్.

బార్ తెరిచే వుంది. లోపల జనం లేరు. ప్రొప్రైటర్ లింగ్‌చౌ పనివాళ్ళతో హాలుని 'డెకొరేట్' చేయిస్తున్నాడు. రంగు రంగుల కాగితాలతోనూ, రబ్బరు బెలూనులతోనూ, కాగితపు పూలతోనూ హాలుని అలంకరిస్తున్నారు. మార్గరేట్ యెక్కడా కనిపించలేదు.

నన్ను చూడగానే లింగ్‌చౌ తన బంగారు పళ్ళు బయట పెట్టాడు. "జెంటిల్‌మన్, మీ రిక్కడి కెందుకొచ్చారో నాకు తెలుసు. కాని లాభం లేదు. మార్గరేట్ తన భర్తతో వెళ్ళిపోయింది" అన్నాడు.

నా గుండెల్లో గతుక్కుమంది.

"అబద్ధం! అంతా అబద్ధం! ఆమె అతనితో వెళ్ళదు. చచ్చినా వెళ్ళదు!" ఉద్రేకంతో అరిచాను.

లింగ్ చా వాళ్ళంతా వూగిపొయ్యేలా వికారంగా నవ్వాడు.

"జెంటిల్మన్! మీ రామెను నిజంగానే నమ్మారు కదూ? బార్లో నాట్యకత్తె. శరీరాన్ని అమ్ముకునే పడుపు కత్తె. ప్రేమిస్తున్నానంటే యెలా నమ్మారు? వెళ్ళిపోండి! ఆమెను మరచిపోండి!"

నా కతడ్ని నమిలి మింగేయా లన్నంత కోప మొచ్చింది.

మార్గరేట్ శరీరాన్నమ్ముకునే పడుపు కత్తె కావచ్చు. ఆమె ప్రేమించ గలదు. ప్రేమించినవార్ని సుఖపెట్టకలదు. ఈ దుర్మార్గుడే ఆమెను బలవంతంగా అతనితో పంపించి వుంటాడు.

అతనికేసి కోపంగా చూచి, బార్లోంచి బయట పడ్డాను. తిన్నగా బ్లూ స్టార్ ఫోటో స్టూడియో వద్దకి చేరుకున్నాను.

"ఎస్ మిస్టర్! మీ ఆవిడ రాలేదా?" ఫోటోగ్రాఫర్ అడిగాడు.

"లేదు. నే నొక్కడ్నే. నన్ను మాత్రం ఫోటో తియ్యి" అన్నాను ముక్తసరిగా.

అతని కేమీ అర్థం కాలేదు.

ఫోటో తియ్యడం పూర్తయ్యింది.

"రేపు ఉదయం పదింటికల్లా మీ అడ్రసుకి ప్రూఫులు పంపిస్తాను. మీరు వెళ్ళి ఉత్తరం వ్రాస్తే అడ్రసుకి

పోస్టులో పంపిస్తాను కాపీలు" అన్నాడు ఫోటోగ్రాఫర్.

"ఫరవాలేదు. నే నిప్పు డెక్కడికీ వెళ్ళడం లేదు. వారం రోజుల పాటు యిక్కడే వుంటాను. కాపీలు నేనే వచ్చి తీసుకెళతాను. ప్రూఫులు మీ కెప్పుడు వీలయితే అప్పుడు పంపండి."

నేను నా గదికి వెళ్ళిపోయాను. ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు. తెల్లవారింది. ఆ రోజంతా గదిలోంచి యెక్కడికీ వెళ్ళలేదు. మార్గరేట్‌ని గురించే ఆలోచిస్తూ బరువుగా గడిపేశాను.

సాయంత్రం ఆరయింది. ఒంటరిగా గదిలో కూర్చుని ఆలోచిస్తున్నాను. పక్కరూములో వున్న థియసోఫిస్ట్ ఫ్రెండ్ నన్ను కలుసుకున్నాడు. విషయమంతా తెలుసుకుని నన్ను ఓదారుస్తున్నాడు. బ్లూ స్టార్ ఫోటోస్టూడియో నుండి ఓ బాయ్ ప్రూఫులు పట్టుకొచ్చి యిచ్చాడు.

కవరులోంచి ప్రూఫులు బైటికి తీశాను. ఫోటో కేసి చూచి ఉలిక్కిపడ్డాను. ఎవరో వీపుమీద గట్టిగా చరిచి నట్టయింది. ఆశ్చర్యంగా ఫోటో కేసే చూస్తూ వుండి పోయాను.

నా పక్కనున్న థియసోఫిస్ట్ ఫ్రెండుకి యేమీ అర్థం కాలేదు. నే నెందు కలా ఆశ్చర్యపోయానో అతడు వూహించుకోలేక, "ఏమి టేమిటి మిస్టర్, ఏం జరిగింది?" అని ప్రశ్నించాడు.

"ఈ ఫోటో కేసి చూడండి మిస్టర్! స్టుడియోకి వెళ్ళిందీ, ఫోటో తీయించుకున్నదీ నే నొక్కడ్నే. కాని ఫోటోలో నాతోబాటు ఈ ఆకారం యెలా వచ్చిందో అర్థం కావడం లేదు."

థియసోఫిస్ట్ ఫ్రెండ్ ఆ ఆకారం కేసే చూస్తూండి పోయాడు.

నా పక్కనే నా కుర్చీమీద చేతులు వేసి నిల్చునివున్న ఆకారం ఓ స్త్రీ మూర్తిది. అస్పష్టంగా కనిపిస్తున్నా పరిశీలనగా చూస్తే ఆ ఆకారం మార్గరేట్‌దే నని గుర్తుపట్ట వచ్చు.

ఏమి టీ చిత్రం? యిది ఎలా సంభవం?

"బాగా చూడండి. ఈ ఆకారం మార్గరేట్‌దేనా?" అని ప్రశ్నించాడు థియసోఫిస్ట్ ఫ్రెండు.

"నిస్సందేహంగా మార్గరేట్‌దే యీ ఆకారం."

థియసోఫిస్ట్ ఫ్రెండ్ మాట్లాడలేదు. గదిలో నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. థియసోఫిస్ట్ ఫ్రెండ్ తన వెంట తెచ్చిన యీవెనింగ్ ఎడిషన్ "లోకల్‌న్యూస్"ని తిరగేస్తూ ఆలోచిస్తున్నాడు. నా బుర్ర పనిచెయ్యడం లేదు.

"మానవుడికి మరణం సంభవించినపుడు శరీరంలోంచి ప్రాణి వేరవుతుంది. భౌతికశరీరానికి అగ్నిసంస్కారమో, భూస్థాపనమో జరుగుతుంది. కాని జీవుడు కంటికి కానరాని సూక్ష్మశరీరంలో అనంతాకాశంలో విహరిస్తూ వుంటాడు.

గత జన్మలోని కోర్కెలకు సాఫల్యం కలగకపోతే యీ జీవుడు పునర్జన్మకు అనర్హుడు. అందుచేత ఆ జీవుడు గతస్మృతులలో మునుగుతూ తేలుతూ తన కోరికల్ని సాఫల్యం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ వుంటాడు. ఈ ప్రయత్నంలో ఆ జీవుడు తాను కాంక్షించిన వస్తువు చుట్టూ తిరగడం మామూలు. ఈ సూక్ష్మశరీరగత జీవుడ్నే "ప్రేతాత్మ" (Departed soul) అంటారు. జీవన్మర

ణాలు శరీరానికేగాని ఆత్మకి గాదు. ఆత్మకి చావు లేదు.

జీవుడు సూక్ష్మశరీర అయినప్పటికీ దానికి ఆకారం వుందనీ, శక్తివంతమయిన లెన్సు ద్వారా దాని ఉనికిని ఋజువుచెయ్యవచ్చనీ, యీ మధ్య కొందరు మేధావులు తమ ప్రయోగాల ద్వారా నిరూపించారు. దీనిని బట్టి మార్గరెట్ మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తోందనీ, ఉధృతంగా కాంక్షిస్తోందనీ అర్థమవుతోంది" అన్నాడు అతను.

నా కేమీ అర్థం కాలేదు. "ఏమిటి మిస్టర్! ఏమిటి మీ రంటున్నది?" అని ప్రశ్నించాను.

థియసోఫిస్ట్ (Theosophist) ఫ్రెండ్ జాలిగా నాకేసి చూచి టేబుల్‌మీదనున్న పేపరు తీసి నా ముందు పెట్టాడు. చివరి పేజీలో బాక్స్ కట్టి ప్రచురించబడిన వార్తను చూపించాడు.

"డైమండ్ బార్ కాంపౌండులో భూస్థాపితం చెయ్యబడిన ఓ శవాన్ని పోలీసులు యీ ఉదయం బైటకిలాగారు. శవం - బార్‌లో డాన్స్ చేస్తూండిన మిస్ మార్గరెట్ అనే స్త్రీదని గుర్తించారు. ఈమెను హత్యచేశారన్న అనుమానంతో బార్ ప్రొప్రయిటర్ లింగ్‌చౌని, నేవీలో పని చేసే వైట్ అనే ఓ ఆంగ్లో యిండియన్ యువకుడ్ని అరెస్టు చేశారు. మిస్ మార్గరెట్ నాలుగయిదు రోజుల క్రితం హత్య చెయ్యబడిందని శవ పరీక్ష చేసిన డాక్టర్ అంటున్నారు" అని వుంది బాక్స్‌లో.

బరువెక్కిన గుండెలతో నిశ్చలంగా వుండిపోయాను. □

[పదహారేళ్ళనాటి 'అపన' కథ]

హంతకుడికి వసుంధర మళ్ళీ పెళ్ళా?

గోవిందరావు పెళ్ళాం చచ్చిపోయిందని తెలిసినపుడు చాలా మంది అడిగిన ప్రశ్న - "ఆత్మహత్య చేసుకుందా?" అని.

గోవిందరావు గురించి తెలిసిన వారందరికీ ఈ ప్రశ్న స్ఫురించడం అత్యంత సహజం.

గోవిందరావు మంచి చెడ్డలను బేరీజు వేయడం కష్టం. అతను దుర్మార్గుడని చెప్పడం కష్టమే. ఎందుకంటే అతను ఊరికి ఉపయోగించే చాలా పనుల్లో పాల్గొన్నాడు. అతడి కారణంగా కొందరు పేద విద్యార్థులు ఉన్నతవిద్య నభ్యసించగలిగారు. చిన్నతనం నుంచీ అతనికి సేవా సంస్థల్లో పాల్గొనడం సరదా. చాలా సేవా సంస్థలకు అతను విరాళాలిస్తూంటాడు.

గోవిందరావు యెదుటి వాళ్ళతో నవ్వుతూ మాట్లాడతాడు. ఎదుటివా డెంత మాటన్నా యే మాత్రమూ ఆవేశపడడు సరిగదా - చమత్కారంగా మాట తిప్పి కొడతాడు. అతని శాంత గుణాన్నీ, చమత్కారాన్నీ చాలా మంది మెచ్చుకుంటూరు కూడా.

ఇంటికి వచ్చిన వారికి మర్యాదలు చేయడంలో కూడా అతడికి అతడే సాటి. వారి వారి అలవాట్లను తెలుసుకుని వాటి కే లోపమూ రానివిధంగా మసిలేవా డతను.

అయితే గోవిందరావుకు దుర్వ్యసనాలున్నాయి అతను తాగుతాడు. అప్పు డప్పుడు వ్యభిచార గృహాల కూడా వెళ్ళి వస్తూంటాడు. కానీ అవో పెద్ద లోపంగా అనుకోడానికి వీల్లేదు. ఒక విధంగా చెప్పాలంటే ఆ అలవాట్లు లేకుండా గొప్పవాళ్ళనిపించుకోవడం కష్టం. ఎందుకంటే యిప్పట్లో యే రంగంలోనైనా సరే - గొప్పవాళ్ళమని చెప్పుకునేవారందరికీ ఈ అలవాట్లున్నా యంటారు.

ఉదాహరణకు ఆ మధ్య మొరార్జీ దేశాయి ప్రధానిగా వున్నప్పుడు—మద్యనిషేధాన్ని దేశమంతటా ఖచ్చితంగా అమలుజరిపి తీరాలని నిర్ణయించుకోగా — ఆయన మంత్రివర్గ సభ్యులు చాలామంది మేమేమైపోవాలని గోలపెట్టారట! అందుకో—మరెందుకో అది అమలు జరగలేదు.

కాబట్టి గోవిందరావుకున్న మంచి అలవాట్లతో పోలిస్తే అతడి దుర్వ్యసనాలొక లెక్కలోవి కాదు. అంచేత అతన్ని దుర్మార్గుడనడానికి వీల్లేదు. అయినా అతను దుర్మార్గుడే— భార్య పరంగా ఆలోచిస్తే!

గోవిందరావు పెద్ద ఆస్తికి ఏకైక వారసుడు. అతనికి పద్దెనిమిదవ ఏట వివాహమయింది—పదిహేనేళ్ళ శారదతో! పద్దెనిమిదేళ్ళప్పుడు అతను పాతికేళ్ళ మనిషిలాగుండేవాడు. ముప్పై ఏళ్ళొచ్చినా అలాగే వున్నాడు. అతడి భార్య మాత్రం అతడితో కాపురం చేసిన పదేళ్ళలో — నలభై ఏళ్ళ మనిషిలా తయారయింది.

గోవిందరావు తన అలవాట్లన్నీ తండ్రి దగ్గర్నుంచి పుణికి పుచ్చుకున్నాడు. మొగుడు పెళ్ళాన్నెలా చూస్తాడో కూడా తండ్రిదగ్గరే తెలుసుకున్నాడు.

గోవిందరావు తల్లిది సహజ మరణంకాదు. ప్రమాద వశాత్తూ మరణించిందావిడ. ఆ ప్రమాదం కాకతాళీయంగా జరిగిందని కొందరు, ఆమెకి ఆమే కల్పించుకున్నదని కొందరు, గోవిందరావు తండ్రి కల్పించాడని కొందరు— చెప్పుకున్నారు.

తల్లి పోయినప్పుడు గోవిందరావు వయసు పదిహేనేళ్లు. తల్లిపోయిన ఏడాదికి గోవిందరావు తండ్రి మంచాన పడ్డాడు. అందుక్కారణం క్యాన్సర్ అని తెలిసినపుడు— చాలామంది—అదతడి పాపాలకు శిక్ష అన్నారు. తను మేజరు కానప్పుడే ఆస్తి వ్యవహారాలు చూడడం, ఆరిందా లాగ మసలడం నేర్చుకున్నాడు గోవిందరావు. అతనెక్కువగా చదువుకోకపోయినా మంచి వ్యవహారజ్ఞుడు.

అతడి వివాహం జరిగిన ఆర్నెల్లకు తండ్రి పోయాడు.

గోవిందరావు ఆ యింటికి ఏకచ్ఛత్రాధిపతి అయ్యాడు.

అతడి ఆస్తినీ, పరిస్థితులనూ చూసి చాలామంది బంధువులతన్ని చేరబోయారు. కానీ గోవిందరావు తెలివిగా చాలామందిని వారించగలిగాడు. అయితే స్తోత్ర పాఠాలలో ఆరితేరిన రామాయమ్మగారి నతడు వారించలేకపోయాడు. ప్రతివారి శక్తికీ ఓ అదుపుండక తప్పదు కదా!

రామాయమ్మగారు విధవరాలు. గోవిందరావు దగ్గర చేరేటప్పుడు ఆవిడకు నలభై అయిదేళ్ళు. చూడగానే సెంచరీ కొట్టే శాల్తీ అనిపించేటంత ఆరోగ్యంగా వుంటుంది.

రామాయమ్మనెప్పుడూ అంటిపెట్టుకుని వుంటాడు—ఆవిడ తమ్ముడు. అతగాడికి ఆవిణ్ణంటిపెట్టుకుని వుండడం తప్ప వేరే పనిలేదు. అతడి భార్య సుభద్ర. ఆమెను రమణ పక్కన చూడగానే "అయ్యో—పాపం—కాకి ముక్కుకి దొండపండు" అనిపిస్తుంది. ఆ దంపతులకున్న ఏకైక సంతానం పేరు వెంకట్రావు.

రమణకు బుర్రలో తెలివితేట లేమాత్రమూ లేవు. చెప్పినపని చెప్పింది చెప్పినట్లు చేయగలగడం అతడి ప్రత్యేకత అని రామాయమ్మ అంటుంది కానీ సుభద్ర ఆ విషయం అంగీకరించదు. వెంకట్రావుకు తల్లి పోలికలే మాత్రమున్నాయో తెలియదుకానీ—తండ్రిపోలిక మాత్రం ఏ కోశానా లేదు. తండ్రికి లేని తెలివితేటలు కూడా వున్నాయి వెంకట్రావుకి.

రామాయమ్మగారు ఏదో వరుసలో గోవిందరావుకు దొడ్డమ్మో, పిన్నమ్మో అవుతుంది. ఆవిడ ఎక్కడికి కదిలినా రమణ కుటుంబం ఆవిణ్ణి వెంటాడుతుంది. తన కాశ్రయం లభించడానికి సుభద్ర పెద్ద అస్సెట్ అని రామా

యమ్మకు తెలుసు. సుభద్రకూ తెలుసు. మాటల్లో రామాయమ్మా, చెప్పుకుందుకు మొగుడూ, మాతృ ప్రేమ చూపించుకునేందుకో కొడుకూ - సుభద్రకు చేయూతగా ఉంటున్నారు.

గోవిందరావు సుభద్రను చూసే రామాయమ్మగారికి ఆశ్రయమిచ్చాడు. అప్పటికతడి భార్యకు పదిహేనేళ్ళయితే-సుభద్రకు పాతికేళ్ళు. అతడామెకంటె ఏడేళ్ళు చిన్న. అయితే వారి పరిచయానికి ఈ వయోభేదం అడ్డురాలేదు. రావలసిన అవసరమూ లేదు.

శారద ఆ యింట్లో నిలదొక్కుకుని కాస్త లోకమంటే తెలుసుకోడానికి మూడు నాలుగేళ్ళు పట్టింది. అప్పటికి భర్త పూర్తిగా రామాయమ్మ చెప్పు చేతల్లోకీ, సుభద్ర చేతుల్లోకీ వెళ్ళిపోయాడు.

అట్నించి నరుక్కురావాలనుకునే రామాయమ్మ శారదను కూడా బుట్టలో వేసుకుందామనే ప్రయత్నించింది. అందులోనూ శారద చిన్నపిల్ల కాబట్టి తన ఎత్తులు గ్రహించలేదనే అనుకుంది. అందులో కొంత నిజమూ లేకపోలేదు.

అయితే శారదకు పుట్టింటివారి సలహాలుకూడా లభిస్తూనే వున్నాయి. ఆమె పుట్టింటి వారికి చూచాయగా అల్లుడి వ్యవహారాలు తెలియడంవల్ల రామాయమ్మకు వ్యతిరేకంగా వారు ఆమెకు నూరిపోయసాగారు.

ఆ సలహాల ఫలితంగా గోవిందరావు తనవాడనీ, ఆ యిల్లు తనదనీ, ఆ యింటికి తను యజమానురాలిననీ శారద గ్రహించేసరికి ఆమెకో బిడ్డకూడా పుట్టాడు.

బిడ్డ పుట్టగానే శారదలో మాతృత్వానికి సంబంధించిన స్వార్థంకూడా నిద్రలేచింది. అప్పుడామె భర్తను పూర్తిగా తన చెప్పుచేతల్లోకి తీసుకునేందుకు అసలు సిసలు ప్రయ

త్నాలు చేయసాగింది. ఆ ప్రయత్నాలలో ఆమెకూ సుభద్రకూ భేటీ రానే వచ్చింది.

శారద మాటలకు సుభద్ర జవాబు చెప్పదు. అన్ని మాటలూ విని ఆమె రామాయమ్మ దగ్గరకు వెళ్ళి జరిగిందంతా చెబుతుంది. రామాయమ్మ అంతా సమీక్షించి సమయానుకూలమైన సలహా యిస్తుంది.

పొరుగింటి పుల్లకూర రుచి అన్న సామెత ఊరికే పుట్టలేదు. మనింట్లో కూరయితే అడిగినంతా లభిస్తుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు వండుకుని తినొచ్చుకూడా. పొరుగింటివారైతే మనకు కావలసినంతా ఇవ్వరు. కావలసిన వన్నీ వండరు.

శారదకూ, సుభద్రకూ అదే తేడా!

గోవిందరావు శారద శరీరంపై హక్కు సంపాదించాడు. ఆమె శరీరం అతడిది. ఆ శరీరాన్నతడు ఇష్టం వచ్చినపుడల్లా ఇచ్చవచ్చిన రీతిలో అనుభవించవచ్చును.

సుభద్ర విషయం అలా కాదు.

ఆమె భర్తచాటు భార్య. పొరుగింటి పుల్లకూర.

పైగా సుభద్రకు వలచి వలపింపజేసుకునే తెలివితేటలున్నాయి. రమణ వంటి భర్త కారణంగా చాటుగా ఆమె చాలామంది మగవాళ్ళను మరిగి శృంగార పరంగా రకరకాల విద్యలు నేర్చుకుంది. ప్రస్తుతానికి ఆమెకు గోవిందరావు ఒక్కడే మగవాడు. అన్నివిద్యలూ అతనొక్కడి మీదనే ప్రదర్శించి చిత్తుచేసింది. వయసులో తనకంటే చిన్నవాడైన గోవిందరావును మచ్చిక చేసుకోవడం ఆమెకు కష్టమనిపించలేదు. అదీ కాక అతడు తనకు తాళికట్టిన భర్త కాకపోవడంవల్ల - అతడి చెడు తిరుగుళ్ళామెను బాధించేవి కావు. వాటిగురించి ఆమె పట్టించుకునేదీకాదు-

"మీకేం మగ మహారాజులు—" అంటూ అతడినామె సమర్ధించేది.

రామాయమ్మ బాగా ఆలోచించి శారదపై గోవింద రావుకు నేరాలు చెప్పమని సుభద్రకు సలహా యిచ్చింది. ఆ సలహాలోని లోతు ఎరిగినదై సుభద్ర తూచా తప్పకుండా పాటించసాగింది.

గోవిందరావుకు భార్యపై కోపం వచ్చి దెబ్బలాడడం మొదలుపెట్టాడు. మొదట్లో శారద ఊరుకునేది. కానీ క్రమంగా ఆమె ఊరుకోవటం తగ్గించింది. అదే అతడికీ ఆమెకూ మధ్య దూరాన్ని పెంచసాగింది.

తనకు అణగి మణగి వుండవలసిన భార్య యెదిరించి మాట్లాడడం గోవిందరావు ఏ మాత్రమూ సహించలేక పోయేవాడు. ఫలితంగా అతడామెను మాటలతో దారుణంగా హింసించసాగాడు.

ఏకాంతంలో అయితే శారద అతడెన్ని మాటలన్నా సహించివుండేది. కానీ సుభద్ర సమక్షంలో చిన్నమాట కూడా ఆమె సహించలేకపోయేది. అందుకే ఎదురు తిరిగేది. ఫలితంగా కొంత కాలానికి గోవిందరావు చేయి చేసుకో వలసిన అవసరం కూడా వచ్చింది.

"నేను మీ భార్యను. మీరేమన్నా పడతాను. ఏం చేసినా సహిస్తాను. కానీ ఈ రామాయమ్మ బృందాన్నీ ఇంట్లోంచి తరిమేయండి" అని అతన్ని వేడుకునేది శారద.

గోవిందరావు రెచ్చిపోయి "సుభద్ర కాలిగోటికి చాలవు నువ్వు. ఆమె మనసు నొప్పించావంటే నిన్ను పుట్టింటికి పంపేస్తాను. ఆమెను మంచి చేసుకో. ఆమె మెప్పు పొందు" అనేశాడు.

అంతేకాదు. సుభద్రకూ తనకూగల సంబంధం భార్యకు తెలిసేంత బహిరంగం చేశాడతను.

శారదకు కష్టకాలం ప్రారంభమైంది. అన్ని విధాలా ఓడిపోయి అభిమానాన్ని చంపుకుని సుభద్రకు దాసీ స్థానాన్నాక్రమించిందామె. రామాయమ్మ ఆమెను ఎన్నో విధాల అవమానించింది. ఆమె పిల్లలచేత కూడా అంతా ఊడిగం చేయించుకునేవారు—గోవిందరావుకు తెలియకుండా.

పండుగవస్తే సుభద్ర పట్టుచీర కొనుక్కునేది. శారదకు ముతక నేతచీర లభించేది. తన పుట్టిన రోజున గోవింద రావు గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకునేది సుభద్ర. వారిద్దరూ ఒకే మంచంమీద పడుకుని వుండగా సుభద్రకు పాదాలొత్తేది శారద.

శారదను గోవిందరావు అందరి ఎదురుగా తిట్టేవాడు. అవమానించేవాడు. పనివాళ్ళకుక్కూడా ఆమె లోకువై పోయింది. ఇంట్లో ఆమె జీవితం నవ్వులపాలయింది. ఆమెకు ముగ్గురు పిల్లలు. వాళ్ళకోసం ఎలాగో అలా బ్రతకాలనుకునేదామె. కానీ జీవితం దుర్భరంగా వుండేది.

పెళ్ళయిన పన్నెండేళ్ళకు యింట్లో స్టవ్ వెలిగిస్తూండగా ప్రమాదం జరిగింది. ఆమె వంటిమీదకు అంత కిరస నాయిలు ప్రమాదవశాత్తూ ఎలా వచ్చిందో తెలియదు. కానీ వచ్చింది. ఆమె మాడి మసి అయిపోయింది.

అది హత్య అని ఎవరన్నా అనుకుంటే వాళ్ళు మూర్ఖులు. ఆ యింట్లో మనుషులు శారదను హింసించి వినోదిస్తున్నారు. అంతులేని వినోదం శారద కారణంగా లభిస్తూంటే చేజేతులా వారామెను ఎందుకు చంపుకుంటారు?

శారద ఆత్మహత్య చేసుకున్నదనడంలో సందేహం

లేదు. అయితే ఇంత ఆశ్చర్యంగా యెందుకు చేసుకుందీ అని ఆమె పరిస్థితి తెలిసిన వారు ఆశ్చర్యపడ్డారు.

ఈ దేశంలో ఆడపుట్టుక పుట్టిన నేరానికి—మరే దారీ లేక—కన్న మమకారాన్ని కూడా వదులుకుని నూరేళ్ళ జీవితం త్యాగంచేసి వెళ్ళిపోయింది శారద.

శారద మరణం గోవిందరావులో ఎటువంటి మార్పు తీసుకువచ్చిందో తెలియదు కానీ రామాయమ్మ బృందం అతడి యిల్లు విడిచిపెట్టింది.

గోవిందరావు వయసిప్పుడు ముప్పైఏళ్ళు. అతడికి ముగ్గురు పిల్లలు. పెద్దవాడికి ఎనిమిదేళ్ళు నిండాయి. రెండో వాడికి ఆరు. ఆఖరిదానికి మూడు.

శారద పుట్టింటివారు గోవిందరావింట్లో మకాం పెట్టారు. చాలాకాలానికి వారికా యింట ఆదరణ లభించింది. మామగారిని చూసి గోవిందడావు భోరుమన్నాడు. ఆయన అల్లుని ఓదార్చుతూ తనూ ఏడ్చాడు.

"శారద తిరుగుతూంటే ఇల్లంతా నిండుగా వుండేది—చూడండి—ఒక మనిషి లేకపోవడంతో ఇల్లెలా బావురుమంటోందో" అంటూ ఏడ్చాడు గోవిందరావు.

"నీ మూలంగానే నీ భార్య పోయింది" అని ఒక్కరు కూడా గోవిందరావుని వేలెత్తి చూపలేదు. అంతా ఓదార్చడానికే ప్రయత్నించారు.

కర్మ జరిపించేశాక ముగ్గురు పిల్లల్నీ శారద తండ్రి తీసుకుపోతానన్నాడు "నా పిల్లల్ని నానుంచి వేరు చేయకండి. వాళ్ళలో శారదను చూసుకుంటూ బ్రతుకుతాను" అన్నాడు గోవిందరావు.

"కొన్నాళ్ళపాటు నీకు ఒంటరితనం పనికిరాదు.

నువ్వైనా మా యింటికి రావాలి. మేమైనా మీ యింట్లో ఉండాలి" అన్నాడు శారద తండ్రి.

"మీరే మా యింట్లో వుండండి" అన్నాడు గోవిందరావు.

"కుదిరితే అలాగే చేద్దును. కుదరదు" అన్నాడు శారద తండ్రి.

గోవిందరావు మామగారింటికి వెళ్ళి రెండు నెలలున్నాడు. ఈ రెండు నెలలూ అతను ముంగిలా, సంగనాచిలా, ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆ విధంగా అతను ఎంతోమంది సానుభూతి సంపాదించాడు.

"మళ్ళీ పెళ్ళి చేసుకోరాదూ" అన్నాడో రోజున శారద తండ్రి.

"నాకు పెళ్ళా—ఆ ప్రసక్తి వద్దు...." అన్నాడు గోవిందరావు వేదాంత ధోరణిలో. అతని గెడ్డంపెరిగి వున్న కారణంగా చూడ్డానిక్కూడా వేదాంతిలాగే వున్నాడు.

"నీకు పెళ్ళాం కావాలని కాదు. నీ పిల్లలకు తల్లి కావద్దూ."

"కావాలి. కానీ ఆమె చచ్చిపోయింది. మరో ఆడది నా పిల్లలకు తల్లి కాలేదు" అన్నాడతను.

"అయితే అలా చూడు...." అన్నాడు మామగారు.

గోవిందరావు చూసి కళ్ళు తుడుచుకున్నాడు. శారద చెల్లెలు హేమకు యిరవై రెండేళ్ళు. గోవిందరావు పిల్లలు ముగ్గురూ ఆమె చుట్టూ వున్నారు. వాళ్ళ నామె ఆప్యాయంగా, అభిమానంగా పలకరిస్తూ మాట్లాడుతోంది. వాళ్ళక్కడ తల్లీ పిల్లల్లా కలిసిపోయి వున్నారు.

అంతకు ముందే ఒకసారి గోవిందరావు శారదా అని

అరిచి హేమ చేయి పట్టుకున్నాడు. హేమ పట్టు విడిపించు కోకుండా అయిదు నిముషా లతడి కౌగిట్లోనే వుండిపోయి ఒక చిన్న ముద్దు అందుకుని, "ఏమిటిది బావా?" అని విడి పించేసుకుని జరిగిందాంట్లో పూర్వభాగాన్ని తల్లికి చెప్పగా- తల్లి తండ్రికి చెప్పగా - ఆయన యిప్పు డీ ప్రస్తావన తీసుకువచ్చాడు.

గోవిందరావు మామగారు డబ్బు యిబ్బందుల్లో వున్నాడు. అందుకే బొమ్మలాంటి హేమకు నాలుగేళ్ళుగా ప్రయత్నిస్తూ కూడా సంబంధం కుదర్చలేకపోతున్నాడు. శారద చనిపోగానే తన రెండో కూతుర్నే గోవిందరావు కిస్తే - అనిపించిం దాయనకు. ఈడూ జోడూ విష యంలో తిరుగు లేదు. ఇరవై రెండుకు ముప్పయి చక్కని జత. స్వయానా అక్కపిల్లలు కాబట్టి వాళ్ళకూ సవతి తల్లి బాధ వుండదు.

ఎటొచ్చీ గోవిందరావు ప్రవర్తన గురించే ఆయన భయం. అయితే అందుకు రామాయమ్మ బృందమే కారణ మనీ, గోవిందరావు కే పాపమూ తెలియదనీ ఆయన సరి పెట్టున్నాడు.

ఇంట్లో ఈ విషయంలో చాలా తర్జన భర్జనలు జరి గాయి. గోవిందరావు లాంటి దుర్మార్గుడికి మళ్ళీ పిల్ల నివ్వడమా అని చాలా మంది అన్నారు.

"నా మటుక్కు నాకు హేమను నీ కిచ్చి చేయాల నుంది. శారద నీ కారణంగా చాలా యిబ్బంది పడిందని చాలా మంది అంటున్నారు" అన్నాడు మామగారు, అక్క డికి తన కేమీ తెలియనట్లు.

"ఎవరేమంటే మాత్రం నేనేం చేయగలను? వా రంద రికీ నేను జరిగింది చెబితే నా శారద మళ్ళీ బ్రతికి

వస్తుందా?" అన్నాడు గోవిందరావు.

ఈ జవాబుతో మామగారికి అతడిపట్ల గౌరవం పెరిగింది.

"అసలు లోపం కొంత అక్కలో కూడా వుందేమో నాన్నా! సుభద్ర బావని కట్టి పడేసుకోగలిగింది కదా - త నా పని యెందుకు చేయలేకపోయిం దీ అక్కయ్య?" అంది హేమ.

ఆమె తండ్రి కీ మాటలు బాగా రుచించాయి.

గోవిందరావుకు డబ్బుంది. అందముంది. వయసుంది. ఈ కారణాల వల్ల అతడికి హేమతో పెళ్ళయింది. శారద విషయంలో తన ప్రవర్తన గురించి అతడు యిసుమంత కూడా పశ్చాత్తాపాన్ని వెలిబుచ్చ లేదు. అతడి తప్పుల గురించి యెవరూ నొక్కించలేదు. అతడు తప్పితే తనకు వరుడు దొరకడనుకుందో యేమో - హేమ కూడా పెళ్ళికి సుముఖత చూపించింది.

ఈ పెళ్ళి శుభలేఖ అందుకుని నేను షాక్ తిన్నాను.

నాకు గోవిందరావు గురించి బాగా తెలుసు. మా యింట్లో మనిమనిషి ద్వారా శారద కష్ట గాథంతా యెప్పటి కప్పుడు విని అతడిపైన ద్వేషం పెంచుకున్న వాడిని నేను.

ఒక హంతకుడికి మళ్ళీ పెళ్ళా?

అదీ శారద చెల్లెల్నిచ్చి!

నేను శుభలేఖను శ్రీమతికి చూపించి, "చూశావా, యెంత అన్యాయం జరిగిపోతోందో!" అన్నాను.

నా మాటలు వింటూనే శ్రీమతి కంయ్ మంటూ లేచింది. ఆ పెళ్ళి హేమ యిష్టపడి చేసుకుంటున్నదనీ, యిందులో అన్యాయ మేమీ లేదనీ అంది,

అయినా నేను వ్యథ చెందడం మానకపోగా ఆమె చటు క్కున "మీకు అర్థంకావాలంటే రాజకీయాలు మాట్లా డాలి" అంది.

"ఎమర్జన్సీలో యెన్నో ఘోరాలు జరిగాయన్నారు. ఎమర్జన్సీ ఇందిరాగాంధీ మూలంగా వచ్చింది. జరిగిన ఘోరాలకు ఆమె జవాబు చెప్పుకుని తీరాలి. కానీ ఎమర్జ న్సీకి వ్యతిరేకంగా ఆమె ఒక్క ముక్క చెప్పలేదు. తను తప్పు చేశానని అంగీకరించలేదు. కేవలం ఆమె కారణంగా కాంగ్రెస్ పార్టీ ఛిన్నాభిన్నమైపోయింది. ఎందరో పెద్ద లా పార్టీని విడిచిపెట్టారు. పార్టీ యెన్నికల్లో దారుణంగా ఓడిపోయి జనతా ప్రభుత్వం వస్తే - ఆమె పార్టీయే ఆమెను దూరంగా ఉంచబోయింది. చివరికి ఏం జరిగింది? మళ్ళీ యెన్నికలు వచ్చాయి. ప్రజ లామెకే పట్టం గట్టారు. పట్టం గట్టి మూడేళ్ళు దాటింది. దేశానికేమైనా నష్టం వాటిల్లిందా?"

శ్రీమతి యిలా యెదురుతిరిగే సరికి ఏం మాట్లాడాలో నాకు తెలియలేదు. ఆమె చెప్పిందాంట్లోనూ సబబున్నదని పించింది.

భార్య పోయిన కారణంగా గోవిందరావు తప్పులు మరచిపోబడ్డాయా లేక గోవిందరావు అసలు తప్పే చేయ లేదా? అన్న ప్రశ్న ఒకటి కూడా నాలో ఆవిర్భవించింది.

ఈ ప్రశ్నకు సమాధానం దొరికినా దొరక్కపోయినా హేమ భవిష్యత్తుకూ, మన దేశపు భవిష్యత్తుకూ ఏదో ముడి వున్నదనిపించి - ఆ రోజు నుంచీ హేమ కాపురం యెలాగున్నదో తెలుసుకుంటూ వుండాలని నిర్ణయించు కున్నాను. □

ఢిల్లీ దొంగలు

బొమ్మిడి అచ్చారావు

ఢిల్లీలో జరగబోయే ఎగ్జిబిషన్‌కి నన్ను సెలక్టు చేశారు మా డిపార్టుమెంటు తరఫున. నాతోబాటు ఓ ఆర్టిస్టుని, కార్పెంటర్‌ని కూడా పంపిస్తున్నారు. ఓ వారం రోజుల పాటు మన రాష్ట్ర ప్రగతిని చాటి చెప్పే ప్రదర్శన అది!

ఎ. పి. ఎక్స్‌ప్రెస్‌కి రిజర్వేషన్ చేయించుకున్నాం.

అనుకున్న రోజున ముగ్గురం సికింద్రాబాద్ స్టేషన్ నించి ప్రయాణం మొదలెట్టాము. మాతోబాటు ఎగ్జిబిషన్ పేనెల్స్ బ్రేక్ వాన్‌లో బుక్ చేయించి తీసుకుపోయాం.

మర్నాడు మధ్యాహ్నం రెండు గంటలకి న్యూఢిల్లీ చేరాం. తిరుగు ప్రయాణానికి అప్పుడే రిజర్వేషన్ చేయించుకున్నాం. అందరూ ఒకేరోజు తిరుగు ప్రయాణం చేస్తే రిజర్వేషన్ దొరక్కపోయే ప్రమాదముంది. మాతో బాటు దాదాపు పదిహేను డిపార్టుమెంట్సు తమతమ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు మరి!

ఎగ్జిబిషన్ రఫీమార్గ్‌లో వున్న ఆలిండియా ఫైన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటీ బిల్డింగులో ఏర్పాటు చేశారు. మా పేనెల్స్‌తో తిన్నగా రఫీమార్గ్ పోయాం. మాకిచ్చిన స్పేస్‌లో ఎగ్జిబిషన్ పేనెల్స్ అరేంజి చేశాం. మాకు నివాసం యూనివర్శిటీ హాస్టల్లో ఏర్పాటు చేశారు.

వార్డెన్ మాకు రూం కన్ఫర్మ్ చేసి, "మీరుండే రోజులకి రూం రెంట్ ఆఫీసులో కట్టెయ్యండి" అన్నాడు.

ఉదయం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కి పోతే సాయంత్రమే తిరిగి హాస్టల్‌కి తిరిగొచ్చేది. అదీ రాత్రి ఎనిమిది దాటాకనే!

మా ఆర్టిస్ట్, కార్పెంటర్ యిదే ఢిల్లీకి రావటం!అంచేత వాళ్ళు మొత్తం పని నామీద వొదిలేసి సైట్‌సీయింగ్‌కి పోయేవారు.

నేను గతంలో వచ్చినప్పుడు ఢిల్లీలోని దర్శనీయ స్థలాలు, చుట్టుపట్ల వున్న హరిద్వార్, హృషికేష్ వంటి పుణ్యక్షేత్రాలు, ఆగ్రా ఫతేపూర్ సిక్రీ వంటి చారిత్రాత్మక ప్రదేశాలు—అన్నీ చూసి వున్నవే! అంచేత నేను వాళ్ళని ఫ్రీగా వదిలేశాను.

2

ఎగ్జిబిషన్ ముగింపు కొచ్చింది.

ఇక రెండు రోజులే వుంది సమయం.

కొన్ని కొనాల్సినవి యింకా కొనలేదు.

ముగ్గురం ఆ రోజు కొనాలనుకున్నాం. ఉదయం పది కొండు గంటల వరకు మాకు ఎగ్జిబిషన్ పని వుండదు. ఆ సమయంలో పోయి కొనుక్కురావాలని బయలు దేరాము.

ముఖ్యంగా రేపు రాబోయే చలికాలం కోసం స్వెట్టర్లు కొనాలనుకున్నాం. ఢిల్లీలో అక్టోబర్‌లోనే చలి ప్రారంభ మవుతుంది. అది ఫిబ్రవరి చివరి వారం వరకు కొనసాగు తుంది.

మేము వెళ్ళినది అక్టోబర్ నెలలోనే; చలి ప్రారంభ మయింది. మన ప్రాంతాలలో నవంబర్ చివరలోగాని చలి ప్రారంభం కాదు. ఫిబ్రవరి మొదట్లోనే మనకు యెండలు కొంచెం కొంచెంగా మొదలవుతాయి.

స్వెట్టర్స్‌కి కరోల్‌బాగ్ పెట్టింది పేరు. ఇదివరలో చాందినీచౌక్‌లో కూడా బాగానే అమ్మేవారు. కాని ఈసారి మేము గమనించిందేమంటే, చాందినీచౌక్‌లో కన్న కరోల్ బాగ్‌లోనే సరసంగా వుంటాయని, మంచి రకం దొరుకు తాయని తెల్సుకున్నాం.

సిటీ బస్‌లో కరోల్‌బాగ్ బయలుదేరాం.

ఢిల్లీలో కరోల్‌బాగ్ చాలా పెద్ద షాపింగ్ సెంటర్. అక్కడ సండే మార్కెట్‌లో చాలా చవకగా దొరుకు తాయి—మనకాకావలసిన సరుకులు. అక్కడ సూది దగ్గ ర్నుంచి ప్రతి వస్తువూ దొరుకుతుంది.

ఇంపోర్టెడ్ వస్తువులు కూడా బాహాటంగా ప్లాట్‌ఫాం

మీదనే అమ్ముతున్నారు. వాటికి ఎక్సైజ్ డ్యూటీ పడదు. లైసెన్సులు వుండవు. అంతటి మహానగరంలోనే అలాంటి స్మగుల్డ్ గూడ్స్ బాహాటంగా అమ్ముతుంటే మరి అధికారులు ఎందుకు పట్టించుకోరో నాకు యెప్పటికీ అర్థం కాని ప్రశ్న!

షాపింగ్ సెంటర్‌లో ప్రవేశించాం. ఓ గంట చూశాం. సరయిన స్వెట్టర్లు అమరలేదు. టైం చూడబోతే పదకొండు గంటలు కావస్తోంది. ఓ పక్క ఎగ్జిబిషన్ టైం దగ్గరపడుతోంది. కొనాల్సినవి అలాగే వుండిపోయాయి.

నాకు ఉద్యోగ ధర్మం! దాని తర్వాతనే మన విలాస యాత్రలు, షాపింగులు.

నేను మా ఆర్టిస్టు, కార్పెంటర్‌తో చెప్పాను టైం లేదని.

వాళ్ళు దిగులుగా మొహాలు పెట్టి "ఇంకా ఏమీ కొనుక్కోలేదు సార్! రేపు ఒక్క రోజే కదా మనం ఢిల్లీలో వుండేది! దయచేసి మీరు వెళ్ళండి ఎగ్జిబిషన్ స్టాల్‌కి. మేము కొనుక్కొని వస్తాం" అన్నారు.

సరే, తప్పేదేముంది? నేను మరోసారి కొనాలి. ఇప్పుడయితే యిక సమయం లేదు. ఉన్నపళంగా బయలుదేరితే తప్ప టైంకి అందుకోలేను.

3

అజ్మర్‌ఖాన్ రోడ్ జంక్షన్ కొచ్చాను. అక్కడే బస్టాప్ వుంది. సెంట్రల్ సెక్రటేరియట్‌కి పోయే బస్ కోసం ఎదురుచూస్తున్నాను.

బస్టాపు చాలా రద్దీగా వుంది. డి.టి.సి. బస్సులే కాకుండా ప్రయివేట్ సంస్థల బస్సులు 'అండర్ హైర్ టు డి.టి.సి.' అన్న ముద్ర వేసుకుని హడావిడిగా తిరుగు

తున్నాయి.

నేను ఎదురుచూస్తున్న ఎనభై ఎనిమిదో నంబర్ బస్సు వచ్చింది. ఒక్క క్షణం ఆగి సర్రున దూసుకుపోయింది. ఓ పదిమంది కూడా ఎక్కలేదు.

మరొకటి, మరొకటి - మూడు బస్సులు ఖాళీ లేకుండానే పోయాయి.

ఈసారి యెలాగయినా సరే బస్సు అందుకునిపోవాలి. తప్పితే ఆటోలో పోవాలి. టైంలేదిక.

మళ్ళీ ఎనభై ఎనిమిది వచ్చింది. డబుల్‌డెక్ బస్సు.

ఈసారి సాహసం చెయ్యదల్చుకున్నాను.

చాలా రష్‌గా వుంది; అయినా తప్పదు. ఆటో భరించాలంటే పదిహేను రూపాయల పైచిలుకే అవుతుంది. బస్ అయితే కేవలం నలభై పైసలు. డి.టి.సి. పుణ్యమా అని పదమూడు కలోమీటర్ల వరకు ముప్పై, నలభై పైసలు మించి టికెట్టు కొట్టరు। ఆ సౌకర్యం వుంది.

ఎలాగో తోసుకుపోతున్నారు జనం. డబుల్‌డెక్ బస్‌కి ఎంట్రన్సు దగ్గిర చాలా వెడల్పుగా వుంటుంది. అది మరింత రద్దీకి తోపుడికి కారణమయింది. ఓ క్రమం లేకుండా పదిమంది ఒకేసారి లోపలికి జొరబడాలనే ప్రయత్నం.

నేను ఆ రద్దీలో తోసుకుంటూ పోలేక కొంచెం ఎడంగా నుంచున్నాను. అయితే బస్సు పోతుందేమోనని ఓ చేత్తో ఎంట్రన్సు దగ్గిర వున్న యినుపరాడ్ పట్టుకొని వదలలేదు.

నేను లోపలికి వెళ్ళటానికి ప్రయత్నిస్తూన్నాను. నేను చెయ్యి పెట్టిన రాడ్ మీదనే మరొకతని బండ చెయ్యి పడింది.

నన్ను వెళ్ళకుండా అటకాయిస్తున్నాడు.

"పెహలే లేడీస్ కో రస్తా ఛోడ్‌దో సాబ్!" అంటున్నాడు నాతో.

లేడీస్‌కి సిటీ బస్ ఎక్కేటప్పుడు కూడా ప్రత్యేకస్థానం ఎలా వస్తుంది? అందునా రెండో ద్వారం లేని డబుల్ డెక్‌లో. సరే పాపం, యీయనెవరో ప్రజాసేవ చేస్తున్నాడని సరిపెట్టుకున్నాను.

నా వెనకనుంచి యెవడో నెట్టుతున్నాడు. లోపలికి వెళ్ళకుండా వాడి భస్మాసుర హస్తం! ఎలాగో చొచ్చుకుని లోపలికి వెళ్ళటానికి ప్రయత్నిస్తున్నాను. లేడీస్ లోపలికి ఎక్కి అయిదు నిమిషాలయింది. కాని నా ముందువాడు ఎక్కడు, రాడ్‌మీది నుంచి చెయ్యి తియ్యడు!

బస్ కదిలిపోతోంది. ఇక ఆలస్యం చెయ్యకుండా ముందువాడి చెయ్యి తోసుకుని లోపలికి అడుగుపెట్టేశాను. ఇంత హడావిడి చేసిన ముందువాడు బస్ ఎక్కనేలేదు, దిగిపోయాడు.

బస్ కదిలిపోయింది. కండక్టర్‌కి చిల్లర యిస్తూ యధాలాపంగా పేంట్ యిన్నర్ పాకెట్‌లోకి తడుముకున్నాను.

నా గుండె ఆగిపోయినట్టనిపించింది. అందులో వుండాల్సిన నోట్ల స్పర్శ తగలటంలేదు. కంగారుగా పాకెట్ లోపలికి చెయ్యి పోనిచ్చాను. గుండె దడదడ కొట్టుకోవటం నాకే వినిపిస్తోంది.

లేవు, అందులో పెట్టిన రెండువందలు లేవు. ఓ వంద నోటు, రెండు ఏభై నోట్లు! షాపింగ్‌కని తెచ్చిన డబ్బు!

ఎవడో కొట్టేశాడు. ఒకరిద్దరు నా పరిస్థితి చూపి "పిక్ పోకటింగ్?" అనడిగారు.

తలూపాను.

"క్యాహువా భాయ్? పాకెట్ మారా?" అనడిగాడు మరొకతను. మౌనంగా తలూపాను.

ఎవడు కొట్టేశాడు? ఆఁ, అర్థమయింది. ఆడవాళ్ళ కోసం ప్రజాసేవ చేసిన నా ముందువాడి పనే అది!

అయితే డబ్బు వాడు కొట్టెయ్యలేదు. ఎందుకంటే వాడు రెండు చేతులతోను రాడ్ పట్టుకుని జనాన్ని కంట్రోల్ చేశాడు చాలాసేపు. ఆ వంకతో నన్ను లోపలికి వెళ్ళనివ్వకుండా ఆటంకపరిచాడు. వాడి మనిషి మరొకడు వెనకనుంచి రద్దీలో నెట్టినట్టుగా నన్ను నెడుతూ సమయం చూపి పేంట్ నుంచి నోట్లు లాగేశాడు. అందుకే, వాడి పని పూర్తయేవరకు నా ముందువాడు నన్ను పోనివ్వకుండా ఆపేశాడు!

అంతా ప్లాన్డ్‌గా నాకు అనుమానం రాని విధంగా జరిగింది.

జరిగినదానికి నాకు బాధకన్న ఆశ్చర్యం, మోసపోయానే అన్న ఆవేదన తొలిచివేస్తున్నాయి. బస్‌లో వాళ్ళు పిక్ పాకటింగ్ గురించి కథలు చెప్పకుంటున్నారు.

పోయిన రెండు వందలు పెద్ద మొత్తం కాకపోవచ్చు. కాని కొత్తచోట, తెలియని చోట ఆ రెండువందలకి రెండు వేల విలువుంటుంది. ఆ విషయం నాకు తెలుసు.

కండక్టర్ సానుభూతిగా చూసి, "ఏ బద్మాష్ లోగోంకో ఐసా నహీఁ ఛోడ్‌నా సాబ్! వాపస్ జాకర్ కరోల్‌బాగ్ ట్రాఫిక్ స్టేషన్‌మేఁ రిపోర్ట్ కరియే!" అన్నాడు.

అవును, యీ రాస్కెల్స్‌ని యిలా వదిలేస్తే నాలాంటి కొత్తవాళ్ళని యింకా యెంతమందినో దోచుకుంటారు. సివిక్ సెన్స్ వున్న ప్రతివాడూ చెయ్యాల్సిన పని—

పోలీస్ రిపోర్ట్ యిచ్చి వాళ్ళని పట్టుకోవటానికి పోలీస్‌కి దోహదం చెయ్యటం!

నా కోసం మధ్యలోనే బస్ ఆపేశాడు నెక్స్ట్ స్టేజీ రాకుండానే — డ్రైవరు — యెదురుగా మరో బస్ వస్తోంది.

దిగాను. కరోల్‌బాగ్ పోయే బస్ డ్రైవరు చెయ్యి చూపి ఆపినట్టున్నాడు, నా ముందే ఆగింది బస్.

ఎక్కాను. కరోల్‌బాగ్‌లో దిగాను.

మళ్ళీ నే నెక్కిన స్టేజీలోనే దిగాను. ఎదురుగానే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వుంది. నేను యిదివరలో గమనించనేలేదు. దాని అవసరం వచ్చేవరకు దేనిగురించీ మనం దృష్టి కేంద్రీకరించం. ఢిల్లీలో సంవత్సరం వున్నానుగాని, ఆ సంవత్సర కాలంలో ఏనాడూ నా జేబు నుండి పది పైసలు కూడా యెవడూ పిక్‌పాకెట్ చెయ్యలేదు. అలాంటిది యీ వారం రోజుల ట్రిప్‌లోను యిది నాకు చేదు అనుభవాన్ని మిగిల్చింది.

4

పోలీస్ స్టేషన్‌లోకి వెళ్ళాను. విషయం చెప్పాను.

డ్యూటీ ఇన్‌స్పెక్టర్ లోపల వున్నారు, వస్తారు కూచోమని కానిస్టేబుల్ చెప్పాడు.

కూచున్నాను. పది నిమిషాలు గడిచినా అతను రాలేదు. అప్పటికే నా డ్యూటీకి గంట ఆలస్యమయింది.

స్టేషన్‌లోని గోడ గడియారం సరిగ్గా పన్నెండు కొట్టింది. సరిగ్గా అదే సమయంలో డ్యూటీ ఇన్‌స్పెక్టర్ నేనున్న గదిలోకి అడుగుపెట్టాడు.

నన్ను చూసి "క్యాహోనా?" అనడిగాడు.

నేను జరిగిన విషయం ఇంగ్లీషులో చెప్పాను.

ఇనస్పెక్టర్ అర్థం కానట్టు ముఖం పెట్టాడు.

సరే, అతనికి అర్థమయేలా చెప్పాలి కదా అని, నాకు వచ్చిన హిందీలో మళ్ళీ జరిగిన సంగతి వరసగా అతనికి చెప్పాను.

ఇన్స్పెక్టర్ తలూపాడు.

"అభీ ఆయేఁ" అంటూ లోనికివెళ్ళాడు. మళ్ళీ ఎదురు చూడటమే నా వంతయింది.

ఓ పావుగంట తర్వాత మళ్ళీ వచ్చాడు ఇన్స్పెక్టర్.

"ఇప్పుడు చెప్పండి. మీరు అసలు కరోల్‌బాగ్ ఎందు కొచ్చారు? యెన్ని గంటల కొచ్చారు? అసలు మీ దే ప్రాంతం? డబ్బు బస్టాండులోనే పోయినట్టు గ్యారంటీ యేమిటి?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు హిందీ లోనే.

మళ్ళీ మొదటికే వచ్చాడు. ఓ పక్క ఆలస్యమయి పోతోందన్న ఆరాటం, మరోపక్క అర్థంపర్థం లేని యీ ఇన్స్పెక్టర్ అడ్డదిడ్డమైన ప్రశ్నలు నాకు చిరాకు తెప్పిస్తు న్నాయి.

అయినా ఓపిగ్గా సమాధానం చెప్పాను. పోనీ ఇంగ్లీషులో వివరంగా చెపుదామంటే యీయన బొత్తిగా హిందీ తప్ప మరో భాష మాట్లాడనని భీష్మించుకుంటున్నాడు. నా కా హిందీ సరిగ్గా రాదు.

అసలు నన్నడితే మన మాతృభాషమీద అభిమానంలేని దురభిమానుల్ని ఓ వారం రోజులు ఢిల్లీలో వదిలేస్తే కచ్చి తంగా మన భాషపట్ల మమకారాన్ని పెంచుకుంటారు, ఈ ఢిల్లీవాసుల హిందీ భాషాభిమానం అదే మాతృభాషాభి మానం చూశాక!

పెద్ద హోదాలో వున్న ఆఫీసర్లు కూడా మరో ఆఫీ

సరుతో మాట్లాడేటపుడు కూడా హిందీ తప్ప మరో భాష-కనీసం ఇంగ్లీషు కూడా మాట్లాడటంలేదు. వాళ్ళకి ఇంగ్లీషు రాకనా? పరాయి భాష ఎందుకు మాట్లాడాలి మాతృభాష ఉండగా?—అన్న భావన ప్రతి ఒక్కరిలోను నేను గమనించాను.

నేను చెప్పిన విషయాన్ని యీ సారి శ్రద్ధగానే విన్నట్టున్నాడు-తలూపాడు ప్రతిమాటకూ.

చివర్లో అన్నాడు "మీరింకా ఎన్నాళ్ళుంటా రిక్కడ?" అని.

"రేపటితో మా ఎగ్జిబిషన్ పూర్తవుతోంది. ఎల్లుండి ఎ. పి. ఎక్స్‌ప్రెస్‌కి టికెట్సు కూడా రిజర్వు అయిపోయాయి."

"అయితే కష్టమే!"

"ఏమిటి సార్ అలా అంటున్నారు?"

"చోరీ జరిగాక దొంగని పట్టుకోవటం నిమిషాలమీద జరిగే పనికాదు. దానికి చాలా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి. పాత కేడీలను విచారించాలి. ఆ రోజు ఆ ఏరియాలో వాడున్నాడో మరెవడున్నాడో వెరిఫై చెయ్యాలి. అదీగాక ఇన్నర్ పాకెట్‌లో నుంచి దొంగిలించటం చాలా కష్టం. అది సెన్సిబుల్ స్పాట్ కదా, దొంగ అక్కడ తడమగానే మీకు తెలిసిపోతుంది. అనుమానం ఏమిటంటే, మీరే కేష్ బయటకి తీస్తూ కింద పడేసుకుని వుండాలి. పడిపోయిన సొమ్ము ఎవడి చేతిలో పడిపోయినా మేం ఏం చెయ్యలేం కదా!" అన్నాడు.

నాకు ఉక్రోషంతో కూడిన పిచ్చికోపం వచ్చేసింది. నేను మరీ అంత ఒళ్ళు తెలీకుండా డబ్బులు చిల్లిపెంకుల్లా రోడ్డు మీద పారేసుకుంటున్నాననా ఇతని అభిప్రాయం! ఓ పక్క

డ్యూటీకి ఆలస్యమైపోయినా, సివిక్ సెన్స్‌తో నేనొచ్చి పోలీస్ రిపోర్టిస్తుంటే ఓ బాధ్యతగల పోలీసాఫీసరు అడగాల్సిన మాటలేనా ఇవి?

నాకు ఆ రెండువందల మీద ఆశ - అవిపోయాయని తెలియగానే, పోయింది. ఈ పోలీసులకి చెప్పటంవల్ల అవి తిరిగొస్తాయని కాదు, కనీసం ఈ దొంగతనాన్ని వీళ్ళు అరికట్టగలిగితే మరో నా సాటివాడు నష్టపోకుండా వుంటాడని! కాని నా అభిప్రాయం పొరపాటని ఆ యినస్పెక్టరు మాటలతో అర్థమయింది నాకు.

నా ముఖకవళికల్నే జాగ్రత్తగా గమనిస్తున్న ఇనస్పెక్టర్ అంతలోనే మాట మార్చేశాడు.

"అదికాదు, మీరు ఎల్లుండి వెళ్ళిపోతానంటున్నారు. మీరు ఇక్కడుండగా యీ కేసు ఫైనలైజ్ కాకపోతే మళ్ళీ మీరు హైదరాబాద్ నించి ఇక్కడికి రావాలంటే కష్టమే కదా అంటున్నాను."

"నేను మళ్ళీ ఇంతదూరం రావాలా?"

"తప్పదు కదండీ! దొంగ దొరికాకే కేసు కోర్టుకి పంపిస్తాం. సాక్ష్యంకోసం డబ్బు తీసుకోవడం కోసం మీరు మళ్ళీ ఇక్కడికి రావాల్సి వుంటుంది."

రెండువందలు పోతేపోయింది, యీ కేసు కోసం మళ్ళీ నేను పనిగట్టుకుని వారంరోజులు సెలవుపెట్టి మరో అయిదారు వందలు ఖర్చుపెట్టుకుని ఢిల్లీ రావాలా? ఇదెక్కడి చోద్యం? నాకా క్షణంలో అనిపించింది—ఎందుకు పనిగట్టుకు వచ్చి రిపోర్టు చేశానా—అని!

"అది జరిగేపని కాదు. నే నుండే ఈ రెండురోజుల్లోను ఇన్వెస్టిగేట్ చేసి నా కేదియినా విషయం చెప్పండి."

ఇన్‌స్పెక్టర్ కాసేపేదో ఆలోచిస్తున్నట్టుండిపోయాడు.

"అయితే ఓ పని చెయ్యండి" అన్నాడు ఉపోద్ఘాతంగా.

ఏమిటన్నట్టు చూశాను.

"మీరిచ్చే రిపోర్టునిబట్టి వుంటుంది?"

"ఏమిటి?"

"ఇన్ఫర్మేషన్ రిపోర్టులో రెండు రకాలున్నాయి. మొదటిది—మీరు మళ్ళీ కోర్టుకొచ్చి సాక్ష్యం చెప్పాల్సి వుంటుంది. మరొక రిపోర్టు విషయంలో మీరు మళ్ళీ యిక్కడికి రానక్కర్లేకుండానే చోరీ సొమ్ము మేము పట్టుకుని మీ అడ్రసుకు పంపిస్తాం. మీ పర్మనెంటు అడ్రసు మాకు యివ్వాల్సి వుంటుంది. మీరిందులో యెలాంటి రిపోర్టు యివ్వదలుచుకున్నారో చెప్పండి!"

"రెండోరకం రిపోర్టులో కేసు విషయం తేలటం ఆలస్యమవుతుందా?"

"సాధారణంగా కాదు. అయితే మొదటి రిపోర్టులో కొంత త్వరితగతిన యిన్వెస్టిగేషన్ చేయటం జరుగుతుంది."

"అయితే నాకు ఏ విషయం పోస్టుద్వారా తెలియపరుస్తారా?"

"చోరీ విషయం తెలిస్తే...."

నేను రెండు నిమిషాలు ఆలోచిస్తూ వుండిపోయాను.

"సరే! ఆ రెండో రకం రిపోర్టునే తీసుకోండి" అన్నాను.

ఇనస్పెక్టర్ ఓ రిజిష్టరు తీశాడు.

దానిలో నా పేరు, అడ్రసు, ఫిర్యాదుచేసిన తేదీ, టైం, చోరీ జరిగిన సమయం, జరిగిన ప్రదేశం వగయిరా వివరాలన్నీ రాసుకున్నాడు.

ఆ దిగువ అసలు పిక్‌పాకెటింగ్ ఎలా జరిగిందో

సవిస్తరంగా రాసుకొచ్చాడు—హిందీలో.

"మీకు హిందీ రాకపోయినట్టయితే, చదివి వినపిస్తాను; అర్థం చేసుకోగలరు కదా!?" అనడిగాడు ఇనస్పెక్టర్.

"హిందీ ప్రింటు అయితే చదవగలనుకూడా!" అన్నాను, అతని బ్రహ్మ లిపి వంక దీక్షగా చూస్తూ. ఒక అక్షరం కూడా పోలిక లేదు. ఏం రాశాడో ఆయనకి తప్ప మరో మానవ మాత్రుడికి తెలియదనే చెప్పాలి!

ఆయన రాసినదాన్ని మళ్ళీ పైకి కిందికీ ఓసారి పరీక్షగా చూసుకుని "చదువుతున్నాను, వినండి" అని మొదటి నుంచీ చివరివరకూ చదివాడు. నేను చెప్పింది కాస్త అటూ యిటూగా మొత్తానికి ఆ అర్థం వచ్చేలాగా రాశాడు గాని, వివరించటంలో స్పష్టత కనిపించలేదు. పిక్‌పాకటింగ్ జరిగినట్టుగా నేనభిప్రాయపడ్డున్నట్టుగా రాశాడందులో. జరిగిందని కచ్చితంగా నిర్ధారించలేదు — అందులో!

నా మొహంలోకి ఓసారి చూసి, "సరిపోయినట్టేనా?" అనడిగాడు.

నాకు తృప్తిగా లేదు. కాని మళ్ళీ నా పద్ధతిన అతనిచేత వివరంగా రాయించాలంటే యీ రోజంతా యీ పోలీస్ స్టేషన్‌లోనే గడిచిపోతుంది. అసలే ఎగ్జిబిషన్‌కి యిప్పటికే చాలా ఆలస్యమయింది. ఇంకా ఆలస్యం చెయ్యటానికి మనస్సాక్షి ఒప్పుకోవటం లేదు.

"సరిపోయింది" అన్నాను ఎలాగో.

"ఓ.కే. మీరు వెళ్ళొచ్చు. నేరస్తుడు దొరికితే మీకు కబురు చేస్తాం. మీరుండగా యీ కేసు ఫైనలైజ్ కాకపోవచ్చు. మీ పర్మనెంటు అడ్రసు చెప్పండి. వివరాలు అక్కడికి తెలియచేస్తాం" అన్నాడు ఇనస్పెక్టర్.

అడ్రసు రాసి యిచ్చాను. దాన్ని రిపోర్టుకి పిన్ చేసి, కాపీ ఒకటి నా చేతికిస్తూ, "దీనిమీద కాపీ అందినట్టు సంతకం చెయ్యండి" అన్నాడు.

నేను కాపీ తీసుకుని ఆయన చెప్పినచోట సంతకం పెట్టాను. దాన్ని అటెస్ట్ చేస్తూ ఆయన సంతకం చేశాడు. నా కాపీమీద కూడా ముందు జాగ్రత్తకు ఆయన సంతకం తీసుకున్నాను. కాసేపు ఆలోచించి ఆ తర్వాత సంతకం చేశాడు.

"నేను రేపు మళ్ళీ మిమ్మల్ని కలుస్తాను" అన్నాను వెళ్ళటానికి లేస్తూ.

"అబ్బే, దేనికి? అవసరం వుండదు." అన్నాడు విసుగ్గా.

"అహా, యీ లోపల మీకేమైనా చోరీ వివరాలు తెలుస్తా యేమోనని!"

"ఇక్కడి చిరునామా కూడా రాసుకున్నాం కదా! అవసర మయితే మా కాన్‌స్టేబుల్ని మీ ఎగ్జిబిషన్ స్టాల్ దగ్గరికి పంపిస్తాను" అన్నాడు ఇనస్పెక్టర్.

ఆయనకి నమస్కారం చెప్పి స్టేషన్ బయటికొచ్చాను.

ఈసారి బస్‌లో ప్రయాణం చెయ్యటం నా కిష్టంలేదు. ఆటోలో పోవటంవల్ల సమయం, మిగిలిన డబ్బు మిగుల్చు కోవచ్చును!

ఎందుకయినా మంచిదని, నేను మొత్తం డబ్బుని మూడు నాలుగు చోట్ల భద్రపరుస్తాను. రెండు పేంట్ పాకెట్లలోను కొంచెం కొంచెం దాచి, యిన్నర్ పాకెట్‌లో ఆ రెండు వందలు దాచాను. షర్టు పై జేబులో మరో వంద రూపాయిల పై చిలుకు, చిల్లర వుంది. మొత్తం యీరోజు నేను తెచ్చినది దాదాపు ఎనిమిది వందలు.

నేను ఢిల్లీ వస్తున్నానని బంధువులు, తెలిసినవాళ్ళు ఏవేవో తెమ్మని తలా కొంత డబ్బు యిచ్చారు. కొందరు ఘరానాగా, 'తీసుకురా, తర్వాత యెంతయిందో యిచ్చేస్తాం' అని కూడా ఫర్మాయించకపోలేదు. వాళ్ళని ఆర్డరులో చివరగా పెట్టాను—డబ్బు మిగిలితే తీసుకొవాలని.

చాలా మందికి పై వూళ్ళనించి వస్తువులు తెప్పించుకోవటం అదో పిచ్చి, వెర్రీను. బయటి సిటీల్లో చవగ్గా దొరుకుతాయని వాళ్ళ అభిప్రాయం! ఒక్కో-సారి బయటి కన్న తామున్న వూళ్ళలోనే చవగ్గా దొరుకుతుంటాయి ఆ విషయం వాళ్ళు గుర్తించరు. విడమర్చి చెప్పినా నమ్మరు. ఏదో తప్పించుకోవటాని కేదో సాకు చెపుతున్నానంటారు.

తామున్న వూరికో కన్న మంచి నాణ్యమైన వస్తువులు దొరుకుతాయని తెప్పించుకుంటున్నారా అంటే—అదీకాదు. ఊరికే ఫ్యాషన్‌కోసం, పబ్లిసిటీ కోసం! ఈ సూట్‌కేస్ ఢిల్లీ నుంచి తెప్పించాం అనీ, యీ పాలరాయి విగ్రహాలు ఆగ్రా నుంచి తెప్పించామనీ, యీ బొమ్మలు బొంబాయి నుంచి తెప్పించామనీ మరోటి కలకత్తా నించి తెప్పించామనీ—యిలా వూరికే, వినే వాళ్ళకు విసుగుపుట్టేలా అలా చెపుతూనే వుంటారు — వచ్చిన బంధువులకీ, స్నేహితులకీ!

అదిగో. అలాంటి కేటగిరీ జనమే నాకు డబ్బిచ్చి, యివ్వకా వస్తువులు తెమ్మన్నవాళ్ళు!

ఇరవై నిమిషాల్లో ఆటో రఫీమార్గ్‌లోని మా ఎగ్జిబిషన్ స్టాల్‌కి చేర్చింది.

ఆటో ఫేర్ చెల్లించి హడావిడిగా లోని కడుగు పెట్టాను.

అప్పటికి మా ఆర్టిస్ట్, కార్పెంటర్ చేరుకోలేదు. కరోల్ బాగ్‌లోని బ్రహ్మాండమైన మార్కెటింగ్ సెంటర్స్‌లో యింకా ఏవేవో కొనుక్కుంటూ వుంటారు.

స్టాల్స్‌లోని యితర డిపార్టుమెంట్సు వాళ్లు నన్నుచూపి విష్ చేశారు. వారంరోజుల పరిచయంతో, ఆంధ్రావాళ్ళం పరాయి ప్రాంతంలో ఒకచోట చేరగానే ఆత్మీయులమయి పోయాం.

"బాగా ఆలస్యమయినట్టుందే?" అన్నాడు మా పక్క స్టాల్స ఎలక్ట్రిసిటీ బోర్డు యింజనీరుగారు.

ఆయన చాలా స్నేహశీలి. నేను వివరంగా జరిగిన విషయం చెప్పాను. ఆసరికి నాలుగు డిపార్టుమెంట్ల ఉద్యోగులు నా దగ్గరికి చేరారు. అందరు తమ సానుభూతిని వెల్లడించారు.

"స్టేషన్లో రిపోర్టిచ్చారా?"

"ఢిల్లీలో రోజురోజుకీ దొంగతనాలు, హత్యలు మితి మీరి పోతున్నాయి."

"అలాంటి వెధవల్ని స్పాట్‌లోనే పట్టుకుని నలుగురూ ఉతికెయ్యాలి."

"పరాయి చోట పది రూపాయలు కావాలంటే యిచ్చే నాధుడేడీ?"

ఇలా తలొకరు తలోమాట అన్నారు.

నేను స్టేషన్లో రిపోర్టుచేసిన విషయం విన్నాక సక్సేనా నవ్వాడు. అతను ఢిల్లీలోనే యిన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్‌లో పని చేస్తున్నాడు. లోకల్‌వాడే.

"మీరింకా ఆ డబ్బు దొరుకుతుందనే నమ్ముతున్నారా?" అన్నాడు ఇంగ్లీషులో.

నేను ప్రతిగా నవ్వి, "అందుకోసం కాదు నేను రిపోర్టు

చేసింది! మీ ఢిల్లీ పోలీసుల సామర్థ్యం ఏపాటిదో తెలుసు కుందామని!'' అన్నాను.

సక్సేనా మళ్ళీ నవ్వాడు.

"ఆ విషయం నన్నడగండి, నేను చెపుతాను. మీరు రిపోర్టు చెయ్యటంవల్ల, పాపం ఆ దొంగ నష్టపోయాడన్న మాట. సగం వాటా 'ముడుపు' కిందపోతుంది'' అన్నాడు.

"అంటే....?'' ఆశ్చర్యంతో నాకు మరి మాటలు రాలేదు.

"మీరు రిపోర్టు చెయ్యటంవల్ల ఆ దొంగ కొట్టేసిన సొమ్ము మొత్తం పోలీసులకి తెలిసిపోయింది. ఇప్పుడు వాడు దొంగిలించినది పదో, యిరవయ్యో అంటే పోలీసులు వూరుకోరు. 'రెండు వందలురా భేటా, మాకు ముందే తెలుసు. బుకాయిస్తే లాకప్‌లోకి తోసేస్తాం' — అంటారు.''

శ్రోతలు నోళ్లు తెరుచుకుని వింటున్నారు.

"కాబట్టి, ఆ సొమ్ము మీకు యింకా దక్కుతుందని మీరేమాత్రమూ ఆశించవద్దు. పోయిన సొమ్ముకి ఓ నమస్కారం పెట్టేసి, ఎల్లుండి ఎ.పి. ఎక్స్‌ప్రెస్ ఎక్కెయ్యండి'' అన్నాడు సక్సేనా.

జరుగుతున్న దోపిడీ విధానం నాకు కళ్ళకు కట్టింది, ఎంత ఘోరం? ప్రజలకి రక్షణ కల్పించవలసిన పోలీసులే యిలా అడ్డదార్లు తొక్కుతున్నారన్న మాట.

'కంచే చేనుమేస్తే?' అన్న సామెత నిజమే! ఈ మధ్య పేపర్లో తరచూ వస్తున్న వార్తల్లో మానభంగాలకి పాల్పడుతున్న పోలీసుల విషయం విని మొదట్లో నేను ఆశ్చర్య పోయాను. అయితే, ఆ తర్వాత దర్యాప్తులో అది నిజమని తేలాక చాలామంది పోలీసాఫీసర్లు సస్పెండు కావడం

కూడా పేపర్లలో చూశాక, అది నిజమని నేనూ నమ్మక తప్పలేదు. ఇలా చెదురుమదురుగా వున్న అవినీతిపరులైన కొందరివల్ల మొత్తం పోలీసు డిపార్టుమెంటుకే అవమానం!

"ఏమిటింకా ఆలోచన?" అన్న సక్సేనా మాటలతో యీ లోకంలోకి వచ్చాను.

"ఏం లేదు, మీరన్న విషయమే ఆలోచిస్తున్నాను. అలా జరగటాని కవకాశముంది" అన్నాను.

"అవకాశం మాట ఒదిలెయ్యండి. సెంట్ పర్సెంట్ కరెక్ట్! కావాలంటే మీరు యీ రోజు రేపు మీరు రిపోర్టిచ్చిన పోలీస్‌స్టేషన్ దగ్గిర నిఘావేసి చూడండి. మీ దొంగలు ఆ స్టేషన్ దగ్గిర దర్శన మిస్తారో లేదో మీరే స్వయంగా తెల్సుకుంటారు" అన్నాడు సక్సేనా.

6

మర్నాడు తెల్లవార్తూనే బయటకి వెళ్ళటానికి తయారవుతున్న నన్నుచూసి మా ఆర్టిస్టు, కార్పెంటర్ ఆశ్చర్యపోతూ అడిగారు: "ఎక్కడికి యింత ఉదయమే బయల్దేరుతున్నారు?" అని.

నిన్న బాగా పొద్దుపోయాక రెండు బేగ్స్ నిండా కొన్న వస్తువులతో వాళ్ళిద్దరు సరాసరి ఎగ్జిబిషన్ స్టాల్స్ దగ్గిర కొచ్చారు. జరిగిన విషయం విని చాలా బాధపడిపోయారు.

"మీరు మాతో వుండినా సరిపోయేది సార్!" అంటూ వాపోయారు. నేను నవ్వి వూరుకున్నాను.

ఇప్పుడు వాళ్లు అడిగినదానికి సమాధానంగా, "కరోల్ బాగ్ వెళ్తున్నాను. నేను సరాసరి స్టాల్స్ దగ్గిరకొచ్చేస్తాను. మీరిద్దరు ఎగ్జిబిషన్‌కి టైంకి వెళ్ళిపోండి" అన్నాను.

సిటీబస్‌లో కరోల్‌బాగ్ బయల్దేరాను. నేను అడపాదడపా డిటెక్టివ్ కథలు రాస్తుంటాను. నా చిన్నప్పట్నుంచీ

చదివిన డిటెక్టివ్ సాహిత్య పరిజ్ఞానం నాకిప్పుడు ఉపయోగ పడుతుందనే నమ్మకం నాకుంది.

ఓ జేబుదొంగని పట్టుకోవటం పెద్ద కష్టం కాదుగాని, ఢిల్లీలాంటి పరాయిచోట అది అనుకూలంగా వుండక పోవచ్చును. అయినా యీ విషయం అంతు తేల్చుకో వల్సిందే నని దృఢనిశ్చయంతో వున్నాను.

ముఖ్యమైన సమస్య - టైం ఫేక్టర్! ఈ రోజుతో ఎగ్జిబిషన్ ముగిసిపోతోంది. రేపటి ఎ.పి. ఎక్స్‌ప్రెస్‌కి రిజర్వేషన్ చేయించుకుని సిద్ధంగా వున్నాను. ఈ ఒక్క రోజులోను నేనీ సమస్య పరిష్కరించలేననే శంక నాలో తేలు కొండీలా తలెత్తుతోంది.

కాని చేసేదేం లేదు. నేనిక్కడ మరొక్కరోజు అదనంగా వుండే అవకాశం లేదు. ఎగ్జిబిషన్ పేనెల్స్‌కి నేనే పూర్తి బాధ్యుడ్ని. వాటిని వెంట తీసుకుని మా డిపార్టు మెంటుకి భద్రంగా అప్పగించాలి!

ఎలా యీ సమస్య పరిష్కరించేది? ఇది రెండువందల రూపాయల సమస్య కాదు! ఇంత అనుభవముండీ, యిన్ని జాగ్రత్తలు తీసుకునే నేను ఓ జేబు దొంగ చేతిలో ఘోరంగా ఓడిపోయాను. వాడ్ని పట్టి పోలీసులకి అప్ప గించగలిగితే నా మనసుకి శాంతి, వూరట లభిస్తాయి.

కరోల్‌బాగ్ ఎప్పుడొచ్చిందో ఆలోచనల మధ్య నేను గమనించనేలేదు. హడావిడిగా దిగాను బస్.

పోలీస్ స్టేషన్ కెదురుగా ఓ పాన్ షాపుంది. అక్కడ నిల్చున్నాను. ఓ న్యూస్‌పేపర్ కొని, దాన్ని నా ముఖానికి అడ్డుగా పెట్టుకుని దారినపోయే వాళ్ళని, పోలీస్ స్టేషన్ లోపలికి వెళ్ళి వచ్చేవాళ్ళని జాగ్రత్తగా పరిశీలిస్తున్నాను.

మధ్యాహ్నం వరకు అలా యెదురుచూస్తూనే వున్నాను.

సక్సేనా మాటల్ని నెమరువేసుకుంటున్నాను. ఆ దొంగ నాకు గుర్తే! నా వెనుకనుంచి, బస్‌పద్ద, ముందుకి తోసిన దొంగ కూడా గుర్తే! మరోసారి చూస్తే తప్పకుండా గుర్తు పడతాను. కాని వాళ్ళెవరూ వస్తున్న జాడలేదు.

ఇక ఎగ్జిబిషన్ స్టాల్‌కి తిరిగి వెళ్ళిపోదామనుకొంటు న్నాను. ఇంతలో స్టేషన్ లోపల్నుంచి వస్తున్న యిద్దరు వ్యక్తులమీద నా దృష్టి పడింది. ఉలిక్కిపడ్డాను. వాళ్ళే! ఆ యిద్దరూ తోడుదొంగలు. ఒకడు నన్ను బస్ యెక్కకుండా ఆపినవాడు, మరొకడు నా వెనకనే నించుని నన్ను ఆనుకుని ముందుకి తోసినవాడు!

అయితే వాళ్ళిద్దరు లోపలికి ఎప్పుడు వెళ్ళారు? నేను ఎంతో జాగ్రత్తగా కళ్లు కాయలు కాచేలాగా అప్పటిదాకా యెదురుచూస్తుంటే, నా దృష్టినుంచి తప్పించుకుని ఎప్పుడు యెలా లోనికి ప్రవేశించారు?

వాళ్లు దగ్గరగా వచ్చేశారు. ఇప్పుడెలా? నేను స్టేషన్ లోపలికి వెళ్ళి ఇనస్పెక్టర్‌తో చెప్పే వ్యవధి లేదు. వాళ్లు ఎటో మిస్సయిపోతారు.

నేను డైరెక్టుగా వాళ్ళని ఎదుర్కోవటం శ్రేయస్కరం కాదు. వాళ్ళని దొంగలని చెప్పినా అక్కడ ఎవరూ నన్ను నమ్మడు సరికాదా, ఎదురు తిరిగి వాళ్ళిద్దరూ నేనే దొంగ నని, వాళ్ళ జేబు కొట్టేశానని సీన్ సృష్టిస్తే చేయగలిగే దేమిటి? ఆ పరాయి ప్రాంతాన ఎవడు నాకు తోడు వస్తాడు? ఎవడు నన్ను సపోర్టుచేస్తాడు?

నేను అటు యిటు చూశాను. పక్కనే ఓ కానిస్టేబుల్ నిల్చుని వున్నాడు. అతని చేతిలో గన్‌కూడా వుంది. సెంట్రీ అనుకుంటాను.

రెండడుగుల్లో అతన్ని సమీపించాను. వాళ్ళిద్దర్ని

చూపించాను. రెండు ముక్కల్లో వాళ్లు నా జేబు దొంగిలించిన విషయం, నేను రిపోర్టిచ్చిన విషయం అతనితో నాకు వచ్చిన హిందీలో గబగబ చెప్పాను.

అతను తాపీగా నా వంక చూసి "మీదేవూరు?" అనడిగాడు హిందీలో.

చెప్పాను.

అతను ఫక్కున నవ్వాడు.

వాళ్ళిద్దరు దూరమైపోతున్నారు. నాలో అదుపు తప్పిన ఆరాటం!

"నాతో చెప్పారు కాబట్టి సరిపోయింది, అదే యినస్పెక్టరుగారితో చెపితే మీ గతేమయ్యేదో?" అన్నాడతను తాపీగా, హిందీలో.

"ఏమిటి? ఏమయ్యేవి?" అన్నాను అసహనంగా.

వాళ్ళిద్దరు దృష్టిపథం నించి కనుమరుగై పోతున్నారు. చేతికి చిక్కిన అవకాశం దూరమైపోతోంది.

"మీకు తెలీదనుకుంటాను. వాళ్ళిద్దరు మా ఇనస్పెక్టర్ సాబ్ ప్రాణ స్నేహితులు. అమీర్‌లోగ్! అప్పుడప్పుడు వచ్చి మాట్లాడిపోతుంటారు" అన్నాడు కానిస్టేబుల్.

నా తల గిర్రున తిరిగిపోయింది.

నాకు వాళ్ళ స్నేహం ఎలాంటిదో అర్థమయింది. లోపలికి వెళ్ళి ఇనస్పెక్టర్ని చూడవలసిన అవసరం యిక లేదు. సక్సేనా చాలా అనుభవంతో చెప్పాడు. అతని మాటలు నూటికి నూరుపాళ్లు నిజం!

హైదరాబాద్ తిరిగొచ్చాక ఆ పోలీస్ స్టేషన్‌కి లెటరు రాద్దామనుకున్నాను—ఏం చేశారు నా ఫిర్యాదు సంగతి అని!

వాళ్ళిచ్చే సమాధానం నాకు తెలుసు:

"యువర్ కేస్ యీజ్ అండర్ యిన్వెస్టిగేషన్!" □

ఔరా! మానవుడా!

విశ్వమోహిని

సుబ్రహ్మణ్యం బెంగుళూరు వచ్చాడంటేనే గొప్ప సందడి నాకు. ఉన్న నాలుగు రోజులూ నానా హడావుడీ చేసేస్తాడు. ఉదయం నుండి అర్ధరాత్రి వరకు అడ్డగాడిదలా వూరంతా తిరగడం వాడి హాబీ. వాడితోపాటు నన్నూ తిప్పుకుంటూ వుంటాడు కంపెనీకోసం.

సుబ్రహ్మణ్యానికి బెజవాడలో ఫ్యాన్సీ షాపు ఒకటి వుంది. అప్పుడప్పుడు మైసూరు, బెంగుళూరు వచ్చి తన షాపులో అమ్మడానికి రకరకాల చందనపు బొమ్మలనీ కొనుక్కొని వెళుతుంటాడు.

సుబ్రహ్మణ్యం, నేను, గిరి—ముగ్గురమూ కాలేజిలో 'త్రిమూర్తులు' అని తెలుగులోను. 'ద ట్రయో' అని ఇంగ్లీషులోను పేరు సంపాదించుకున్నాము. ఎప్పుడు చూసినా. ఎక్కడ చూసినా మేమే కనిపించడమే అందుక్కారణం.

గిరి గురించి, నా గురించి అంతగా చెప్పుకోవలసిందేమీ లేదుగాని. సుబ్రహ్మణ్యం మాత్రం 'లేడీ హంటర్', లేదా 'గ్రంథసాంగుడు' అనే చెప్పుకోవాలి.

ఎక్కడ ఆడపిల్ల కనిపించినా వాడికెలాగో అయిపోయేదట! ఆమె వెనుక పడేవాడు. కొన్ని సమయాలలో విజయం సాధించినా, ఎక్కువగా పరాజయాలే ఎదురయ్యేవి వాడికి. అయినా దూషణ, భూషణ తిరస్కారాదులకు అతీతుడయిన వాడిలా దులిపేసేవాడు అన్నిటినీ.

ఒక్కోసారి వాడికూడా వెళ్ళాలంటే నేను, గిరి భయపడుతూండేవాళ్ళం, . వాడితోపాటు మా క్కూడా ఎక్కడ దేహశుద్ధి జరుగుతుందోనని. ఆ ఒక్క విషయంలో తప్పితే మిగతా విషయాలన్నిటిలోనూ ఒక్క మాటమీద వుండేవాళ్ళం మేము, ట్రాటిమీద నిలవడం చేతకాదు కనుక.

చదువులు పూర్తి కాగానే మా దారులు వేరయ్యాయి.

సుబ్రహ్మణ్యం, వాళ్ళ నాన్న ఫాన్సీషాపును చూసుకుంటూ వున్న ఊళ్ళోనే వుండిపోయాడు. ఐ.టి.ఐ. లో వుద్యోగం రావడంతో నేను బెంగుళూరు వెళ్ళిపోవలసి

వచ్చింది. నా లాగే గిరి కూడా కడుపు చేతపట్టుకుని నా కంటె దూరంగా వెళ్ళిపోయాడు. కూర్గులో వున్న కాఫీ ఎస్టేట్‌లో వుద్యోగం సంపాదించుకున్నాడు వాడు.

కాలక్రమాన మా ముగ్గురికీ పెళ్ళిళ్ళు కూడా అయిపోయాయి. ఉద్యోగరీత్యా నేనూ, గిరీ అస్తమాను బెజవాడ వెళ్ళలేకపోయినా తరచు సుబ్రహ్మణ్యం బెంగుళూరు వస్తూండడం వలన వాడిని చూసే అవకాశం కలిగేది నాకు. అలాగే గిరి కూడా అప్పుడప్పుడు వాళ్ళ ఎస్టేట్ లారీ ఏదైనా వస్తే బెంగుళూరు వచ్చి నన్ను చూసి వెళుతూండేవాడు. అందుకే అన్నేళ్ళు గడిచినా మా స్నేహం చెక్కు చెదరకుండా వుంది.

అయితే, గిరికి మాత్రం సుబ్రహ్మణ్యం మీద కోపంగా వుండేది—అన్నిసార్లు బెంగుళూరు వచ్చినా ఒక్కసారీ కూర్గు వెళ్ళలేదని. ఆ సంగతి చెబితే నవ్వేసి వూరుకునేవాడు సుబ్రహ్మణ్యం. ఎప్పటికప్పుడే టైము లేదంటూ తిరిగి వెళ్ళిపోతూండేవాడు.

అందుకే ఈ సారి సుబ్రహ్మణ్యం 'మనం రేపు కూర్గు వెళ్ళాలి. నాలుగు రోజులు ఆఫీసుకు సెలవు పెట్టరా సత్తిగా!' అనేసరికి ఆశ్చర్యంగా చూసాను, ఆ మాటలంటున్నది వాడేనా అన్నట్లు.

నవ్వాడు వాడు. "ఎప్పటికప్పుడే వెళ్ళాలనుకున్నా వీలు పడడంలేదు. ఈ సారైనా వెళ్ళకపోతే గిరిగాడికి కోపం వస్తుంది. మొన్న ఉత్తరం కూడా రాసాడు, ఈ మారైనా తప్పకుండా తగలడరా వెధవా అంటూ" అన్నాడు.

వాడికింత మంచిబుద్ధి పుట్టడమే ఆలస్యమన్నట్లు మర్నాడే కూర్గుకు ప్రయాణమయ్యాము.

బస్టాండుకు వెళుతుంటే సుబ్రహ్మణ్యం అన్నాడు—

"ఏరా సత్తిగా కూర్గులో ఆడవాళ్ళు అందంగా వుంటారట కదురా?"

"నీ కెవరు చెప్పారు?" అన్నాను అనుమానంగా చూస్తూ.

"గిరిగాడు రాసాడులే."

"ఓహాఁ, అదా సంగతి!" అనుకున్నాను.

నిజమే! కూర్గు ఏరియాలో స్త్రీలు చాలా అందంగా వుంటారు. సోషియల్‌గా గూడా వుంటారు. అసలు ఆ వాతావరణంలోనే ఓ ప్రత్యేకత వుంది.

మనోహరమైన సుందర ప్రకృతి....అతివల రమణీయ సౌందర్యము....మనోరంజకంగా,కంటికింపుగా ఉంటాయి. కాఫీ తోటల నుండి వచ్చే కమ్మని వాసనలూ, ఆ ప్రాంతపు ప్రజల స్నేహశీలతా ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటాయంటే అతిశయోక్తి కాదు.

సుబ్రహ్మణ్యం అంత హఠాత్తుగా కూర్గుకు బయలుదేర దీసిన కారణంగా బోధపడగానే 'ఔరా, మానవుడా!' అనుకుని విస్తుపోయాను.

ఆ ప్రాంతంలో పడతులు అందంగా, కలుపుగోరుతనంగా వుంటారని తెలుసుకుని ఫన్‌కోసం బయలుదేరాడన్న మాట వాడు! అంతేగాని, గిరిమీద ప్రేమతో కాదన్న మాట!

నలభయ్ ఏళ్ళు దాటాయి వాడికి. అందమైన భార్య, ఇద్దరు పిల్లలూ వున్నారు. ఇంకా పరస్త్రీలపైన వ్యామోహం పోలేదు వాడికి. 'పుర్రెతో పుట్టిన బుద్ధి పుడకల్లో పెట్టేంతవరకు పోదు' అంటారు యిదే కాబోలు అనిపించింది నాకు.

ఆవేళ యెందుకో బస్ చాలా రష్‌గా వుంది. ఆడా,

మగా కలిసి త్రోసుకుంటున్నారు, టికెట్సు ఇష్యూ చేసే చోట ఓ చిన్న రణరంగం తయారయింది. ఎలాగో ఆ పద్మ వ్యూహంలో జొరబడి రెండు టికెట్లు సంపాదించాను.

ఈ లోపున మా వాడు బస్‌లోకెక్కి కూర్చున్నాడు సీట్లు రిజర్వ్ చేసేందుకు.

2

నేను టికెట్లు తీసుకుని బస్‌లో ప్రవేశించగానే కనిపించిన దృశ్యం చూసి తెల్లపోయాను.

అప్పటికే బస్సంతా నిండిపోయింది. టూ సీటర్‌లో చివరి వరుసలో కూర్చున్నాడు మా వాడు. వాడి ప్రక్కనే నేను కూర్చోవలసిన చోట—ఓ యువతి కూర్చుంది.

నన్ను చూసి అదోలా నవ్వాడు సుబ్రహ్మణ్యం. "ఈవిడ ఇక్కడ కూర్చుంటానందిరా సత్తిగా! పాపం, ఆడపిల్ల కదా అని సరేనన్నాను—అదిగో, ఆ యెదర ఖాళీ వున్నట్లుంది. కాస్త సర్దుక్కూర్చో" అన్నాడు.

పొడవుగా వున్న ప్రక్కసీట్లలో ఒకచోట ఇరుక్కుని కూర్చోక తప్పింది కాదు నాకు.

ఒకరి ఒళ్ళో మరొకరు కూర్చున్నట్లు కూర్చున్నాము ఆ వరుసలో.

టూ సీటర్‌లో ఖాళీగా, దర్జాగా కూర్చున్న సుబ్రహ్మణ్యాన్ని చూస్తోంటే ఒళ్ళు మండింది నాకు. కేవలం అపరిచితురాలయిన ఒక ఆడపిల్లకోసం నన్ను నిర్లక్ష్యం చేసాడు వెధవ!

వాడి ప్రక్కను కూర్చుని వాడితో నవ్వుతూ కబుర్లు చెబుతూన్న ఆ యువతి వంక చూశాను .... ముప్పయ్యే

ళ్ళుంటాంయేమో. తెల్లగా, బొద్దుగా, అందంగా వుంది. ఆమెను బాగా ఆనుకుని కూర్చున్నాడు మా వాడు.

ఆమె కూడా నవ్వుతూ మాట్లాడుతోంది. అపరిచిత అయివుండీ ఎంతో సోషియల్‌గా బిహేవ్ చేస్తున్న ఆ యువతిని చూస్తుంటే ఆశ్చర్యం కలిగింది నాకు. 'వీడి జాతకం ఏమిటోగాని, ఆడపిల్లల్ని ఇట్టే మచ్చిక చేసేసు కుంటాడు వెధవ!' అనుకున్నాను కించిత్తు అసూయగా.

బస్ వేగంగా దూసుకుపోతోంది. కుదిపినప్పుడల్లా ఒకరిపై నొకరం పడుతున్నాము.

నా చూపులు సుబ్రహ్మణ్యం మీదే వున్నాయి.

బయట ప్రపంచంతో సంబంధం లేనట్లు ఆమెతో నవ్వుతూ కబుర్లలో మునిగిపోయాడు. వాడు వేసే జోకు లకు కాబోలు ఆమె నవ్వుతోంది. బస్‌లో అంతా వాళ్ళనే గమనిస్తున్నారు.

ఇంతలో ఎవరో టైమ్ అడగటంతో చటుక్కున ఆమె చేయి పట్టుకుని ఆమె రిస్టువాచీ చూసి చెప్పాడు సుబ్ర హ్మణ్యం. వాడి టాక్‌టిక్స్ నాకు తెలుసు. తన వాచీ వున్నా, ఆమె వాచీయే కావలసివచ్చింది టైమ్ చూడ్డానికి!

చల్లగాలి శరీరానికి హాయి గొలుపుతూంటే కాసేపటికి సన్నగా కునుకు పట్టింది నాకు.

మధ్యలో బస్ గట్టిగా కుదపడంతో నునుకుంటాను చటుక్కున మెలకువ వచ్చింది. బస్‌లో చాలా మంది జోగుతున్నారు. నా చూపులు అప్రయత్నంగా మా వాడి మీద పడడంతో చిన్నగా పులిక్కిపడ్డాను.

ఆమె నవ్వుతూ ఏదో చెబుతూంటే—మా వాడు ఆమె భుజంపైన తలపెట్టుకుని ఆలకిస్తున్నాడు! ఆమె చేయి వాడి

చేతిలో వుంది!

నేను అక్కడే వున్నాననిగాని, బస్‌లో ఇతర ప్రయాణికులు చూస్తున్నారన్న స్పృహగాని లేకుండా భార్యకంటె ఎక్కువగా ఆమెతో ప్రవర్తిస్తూన్న సుబ్బిగాణ్ణి చూస్తుంటే, యేళ్ళొచ్చినా వీడు వీసమెత్తయినా మారలేదు అనిపించింది నాకు.

చూడ్డానికి ఎబ్బెట్టుగా అనిపించడంతో మళ్ళీ కళ్ళు మూసుకున్నాను.

బస్ కూర్గ్‌లో ఆగేంతవరకు మళ్ళీ మెలకువే రాలేదు నాకు.

బస్ దిగి గిరి కోసం చూసాను వచ్చాడేమోనని. బెంగుళూరులో బయలుదేరే ముందు టెలిఫోన్ చేసి చెప్పాను వాడికి మేము వస్తున్నట్లు....ఎక్కడా కనిపించలేదు వాడు.

3

బస్‌లో నుండి ఒక్కొక్కరే దిగుతున్నారు.

సుబ్రహ్మణ్యం చివరివరకు ఆగి, ఆ యువతి నడుం చుట్టూ చేయివేసి దిగుతున్నాడు. జాలీగా కనిపిస్తున్నాడు మనిషి.

చేతిలోని హ్యాండ్ బ్యాగ్ వూగించుకుంటూ వాడిమీదికి వాలిపోతూ అడుగులు వేస్తోందామె.

ఎంత సోషియల్ లైఫ్ అయితే మాత్రం ఆమె మరీ అంత ఇదిగా ప్రవర్తించటం కొంచెం ఎబ్బెట్టుగా అనిపించింది నాకు.

గిరి కోసం దిక్కులు చూస్తూవున్నా, వోరకంట వారిని కనిపెడుతూనే వున్నాను.

"థాంక్యూ మేడమ్! ఐ ఎంజాయ్‌డ్ యువర్ కంపెనీ వెరీమచ్" అన్నాడు సుబ్రహ్మణ్యం ఆమె చేయి నొక్కుతూ.

"మీ హాస్యాలకేంగాని, పదండి" అందామె వాడి చేయి పట్టుకుని,

"ఎక్కడికి?" అన్నాడు సుబ్రహ్మణ్యం ఆశ్చర్యపోతూ.

"మీరు ఎక్కడికి వెళితే అక్కడికి!" అందామె కొంటెగా నవ్వుతూ.

ఉలిక్కిపడ్డాను నేను.

"ఏమిటండీ అలా చూస్తారు? అసలే ప్రయాణంతో విసుగ్గా వుంటే. ఇంకా ఎంతసేపు నిలబెడితారిక్కడ?" అందామె చిరుకోపంతో. ఆమె కంఠంలో అధికారం ధ్వనిస్తూంది.

అయోమయంగా ముఖాలు చూసుకుంటున్నాం నేనూ, సుబ్రహ్మణ్యమూ.

ఆమె భావం అర్థమయ్యేసరికి గుండె ఆగినంత పన యింది నాకు.

ఆమె....! మా వాడి—అంటే—సాక్షాత్తూ మా సుబ్రహ్మణ్యంగాడి భార్యనని దబాయించేస్తోంది! వాడు—కాదు మొర్రో అన్నా వినిపించుకోవడంలేదు.

అప్పటికే బస్‌లో నుండి దిగిన జనమంతా మా చుట్టూ మూగారు. ఒకవేళ ఆమెకు స్క్రూ లూజేమోననుకుంటే చక్కగా మాట్లాడుతోంది.

మా వాడే తన భర్త అనీ, ఎవరో స్నేహితుల ఇంటి కని అక్కడకు తీసుకొచ్చాడనీ చెబుతోంది అందరితోనూ. అచ్చటి కాఫీ ఎస్టేట్ నుండి వస్తోన్న ఘాటైన వాసనలకు

మతిపోయిందా ఏమిటి అని మా వాడితో జోక్ చేసింది.

మొదట అదంతా తమాషాగా అనిపించింది నాకు. కాని, వ్యవహారం ముదురుతున్నట్లు అనిపించేసరికి నేను కలగ జేసుకోక తప్పలేదు. ఆమె మా వాడి భార్య కాదనీ, ప్రయాణంలో పరిచయమయిందనీ చెప్పాను. కాని, నమ్మే దెవరు!?

ఆడది అబద్ధమాడితే కాంక్రీటుతో గోరీ కట్టినట్టేనట! ఆ విషయం మొదటిసారిగా అనుభంలోకి వచ్చింది నాకు.

"చూడబ్బాయ్! మొగుడూ, పెళ్ళాలన్నాక అనేకం వుంటాయి పొరపొచ్చాలు. అ మాత్రానికే నా పెళ్ళాం కాదు పొమ్మనడం అన్యాయం!" అంటూ సుబ్రహ్మణ్యాన్ని కేక లేసారు కొందరు.

బిక్కచచ్చిపోయి చూస్తున్నాడు వాడు నాకు తెలిసి, వాడి రోమియో చరిత్రలో అటువంటి సంఘటనలు ఎదురు కాలేదు ఎన్నడూ.

"బస్‌లో ప్రయాణం చేస్తున్నంతసేపూ ఒకళ్ళ వొళ్ళో ఒకళ్ళు పడుతూ వచ్చారిద్దరూ. పరాయి స్త్రీ అయితే ఊరు కుంటుందా? ఆ పిల్లను అట్టే బాధపెట్టక, మీ గొడవలేమిటో ఇంటికి వెళ్ళాక పడండి" అంటూ మందలించారు మరి కొందరు.

మరో స్థితిలోనైతే అందమైన ఆ అమ్మాయిని తీసుకు వెళ్ళి చక్కగా ఎంజాయ్ చెసేవాడే సుబ్రహ్మణ్యం. కాని, ఆమె నాటకం చూసాక భయం వేసినట్లుంది. ఆమెను ఎలా వదిలించుకోవాలా అన్న బెంగ వాడి మొహంలో స్పష్టంగా కనిపిస్తోంది.

అప్పటికే చాలాసేపటి నుండి జరుగుతోంది ఆ

భాగోతం....ఏం చేయాలో తోచక ఆ గుంపులో నుండి బయటపడి సిగరెట్ వెలిగించాను, గిరి వస్తున్నాడేమోనని దిక్కులు చూస్తూ. ఎందుచేతో వాడు రాలేదు.

అంతలో, ఒక వ్యక్తి నా దగ్గర కొచ్చాడు.

నలభై ఏళ్ళుంటా యతనికి. చామనచాయగా, సన్నగా, నా అంత ఎత్తున్నాడు. సిగరెట్ నోట్లో పెట్టుకుని, అగ్గి పెట్టె ఇమ్మంటే ఇచ్చాను.

వెలిగించుకున్నాక, ఏదో రహస్యం చెబుతున్నట్లు నాతో మెల్లగా అన్నాడతను—"సార్! మీరు యీ ప్రాంతానికి క్రొత్తవారిలా వున్నారు. అప్పుడప్పుడు యిలాంటి సంఘటనలు పరిపాటే. ఏదో కొంత ముట్టజెప్పారంటే, ఆ పిల్ల గొడవ వదులుతుంది."

ఆశ్చర్యంగా, అనుమానంగా చూశాను నేను. అతన్ని అంతకు ముందు బస్‌లో చూసినట్లు గుర్తుకొచ్చింది.

"ఎవరికి ముట్టజెప్పాలి? ఎందుకు?" అన్నాను.

చిన్నగా నవ్వి, "ఎందుకేమిటి సార్? అది ఆమె వృత్తి. ఎంతో కొంత యిచ్చారంటే మాట్లాడకుండా వెళ్ళిపోతుంది! మీకు న్యూసెన్స్ తప్పుతుంది" అన్నాడు.

"ఎంత మోసం? ఆమెకు డబ్బెందు కివ్వాలి? పోలీసుల కప్పగిస్తే వాళ్ళే తేలుస్తారు వ్యవహారం...." అన్నాను కోపంగా.

మళ్ళీ నవ్వాడతను అనుభవజ్ఞుడిలా. "పోలీసుల చేతుల్లో పడితే రెండింతలు అవుతుంది మీకు."

ఆ మాట నిజమే ననిపించింది, ఆలోచిస్తే.

"అయితే ఆ పిల్లకు యెంతివ్వాలంటావ్?...." అడిగాను.

"ఎంతో్నా? రెండో, మూడో పచ్చ కాగితాలు!"

ఎంత తేలిగ్గా చెప్పాడు!

ఆ న్యూసెన్స్ ఖరీదు రెండు, మూడు వంద లన్న మాట!

అతన్ని చూస్తే అనుమానం కలిగింది నాకు.

"నువ్వెవరు? ఇదంతా నీకెలా తెలుసు?" అడిగాను.

మళ్ళీ ఓ వెధవ నవ్వు నవ్వాడు.

"నేనూ మీ లాంటోణ్నే. ఏదో నాకు తెలిసింది చెప్పాను."

మాట్లాడలేదు నేను.

"ఆలోచించుకోండి. మీరు 'వూఁ' అంటే ఆ పిల్లతో మాట్లాడతాను" అన్నాడతను మళ్ళీ.

వాడి వరస చూస్తూంటే, వాడికి ఆమెతో సంబంధం వున్నదేమో ననిపించింది నాకు.

ఆలోచిస్తూండగానే, ఎప్పుడొచ్చాడో గిరి వచ్చి ఆమె చేయి పట్టుకున్నాడు!

"నువ్విక్కడ వున్నావటే, మంజూ! ఏమయిపోయావో నని తెగ వెదికేస్తున్నాను" అన్నాడు.

ఆశ్చర్యంతో, వాణ్ణి పలకరించడం సయితం మరిచిపోయి నోరు తెరిచాను నేను.

4

ఆమె తెల్లబోయినట్లు చూసింది గిరి వంక. చేయి విడిపించుకుని "ఎవరు? నువ్వు?" అంది తీక్షణంగా.

"నీ మొగుణ్ణి! ఏం, నీ పిచ్చింకా కుదరలేదూ? పద, పద" అంటూ చేయిపట్టి లాగాడు గిరి.

హఠాత్తుగా క్రొత్త మలుపు తిరిగిన ఆ కేసు చూపరు లలో కుతూహలం రేకెత్తించినట్లుంది. మిస్టరీ సినిమా చూస్తున్నట్లు నోళ్ళు తెరుచుకుని బొమ్మల్లా వుండి పోయారు.

అంతకు ముందు నాతో మాట్లాడినతను ముందు కొచ్చాడు.

"ఏయ్, ఎవరు నువ్వు? ఈ ఆడమనిషి నెందుకలా టీజ్ చేస్తున్నావ్?" అంటూ గద్దించాడు గిరిని.

"ఈమె నా భార్య మంజుల. మతిస్థిమితం తప్పినప్పు డల్లా యిలా యింటి నుండి వచ్చేస్తుంటుంది. బెంగు ళూర్‌లో ఓ నర్సింగ్‌హోమ్‌లో వుంచితే, అక్కడినుండి చెప్పకుండా వచ్చేసింది" అన్నాడు గిరి.

ఆమె గిరి భార్య అనేసరికి మతిపోయింది నాకు.

"అబద్ధం!" అరిచిందామె, చేయి లాక్కుంటూ.

"మంజూ! అనవసరంగా గోల చెయ్యక, రా....అంతా చూస్తున్నారు. ఈ నడి వీధిలో గొడ వేమిటి?" అన్నాడు గిరి.

"ఛీఛీ....నేను నీ మంజూని కాదు—చేయి వదులు" అందామె గింజుకుంటూ.

దాంతో పబ్లిక్ ఒపీనియన్ మారిపోయింది. అప్పటికే అంతా తలో మాటో అననారంభించారు.

"పాపం, పిచ్చిదట! అందుకే అతన్ని పట్టుకుని తన భర్తంటూ వెంటపడింది. పాపం, ఆమె నా భార్య కాదు అని అతను మొత్తుకుంటున్నా మనం విన్నాం కాదు" అంటున్నా రందరూ.

ఆమె వదనంలో ఆందోళన, ఆతృత, అలజడి కనిపిం

చాయి. ఆమె తరఫున వకాల్తా పుచ్చుకున్న వ్యక్తి—నా అనుమానం ప్రకారం ఆమె రాకెట్‌లోని మనిషి—కంగారుగా చూశాడు మా వంక.

"మంజూ! బుద్ధిగా నాతో వచ్చేయ్. లేకపోతే మును పటిలా పోలీస్‌ను పిలిచి వ్యాన్‌లో ఎక్కించుకుని వెళ్ళ వలసి వుంటుంది" అన్నాడు గిరి ఆమెతో.

ఆ మాటతో ఆమె, ఆమె తాలూకు మనిషి లిప్తపాటు కళ్ళతోనే మాట్లాడుకున్నారు. తరువాత తల వంచుకుని గిరి వెంట నడిచింది.

మంత్రించినట్లుగా నేనూ, సుబ్రహ్మణ్యమూ వారివెనుకే నడిచాము—మాటలు కూడా మరిచిపోయి.... వెనుకనే ఆమె మనిషీ వచ్చాడు.

ప్రక్క వీధిలోకి వెళ్ళగానే అసలు నాటకం బయట పడింది.

వాళ్ళెవరో నిజం నొప్పుకోకపోతే పోలసులకు అప్ప గిస్తానని గిరి బెదిరించడంతో, బ్రతిమాలడం ప్రారంభిం చారు ఆమె, ఆమె మనిషీను.

వాళ్ళిద్దరూ భార్యాభర్తలట! ఇద్దరూ చదువుకున్నవాళ్ళే. కాని, వుద్యోగం దొరకలేదట. కడుపుకోసం చీటింగ్ రాకెట్ ఆరంభించారట.

ఆమె అందానికి ఆకర్షింపబడిన వ్యక్తులను కవ్వించి, పిచ్చివాళ్ళను చేస్తుంది. ఆ తరువాత వారి భార్యనంటూ వెంటపడినట్లు నాటకమాడుతుంది. ఆమె భర్త పైవ్యక్తిలా వచ్చి ఆమెకు యెంతో కొంత ముట్టజెప్పమని సలహా ఇస్తాడు.

ఆ న్యూసెన్సును వదిలించుకోవడమే ప్రధానంగా ఎంచిన విక్టిమ్స్ డబ్బు పడవేసి తప్పించుకోవడం జరుగుతుంది.

ఆ నాటకం ఆడిన వూళ్ళో ఆడకుండా వూరూరా తిరుగుతూ ఆ విధంగా ఆకలి తీర్చుకుంటున్నారట ఆ దంపతులు.

వారి కథ వింటే జాలి, కోపము కూడా కలిగాయి నాకు. వారి ధైర్యాన్ని మెచ్చుకోకుండా వుండలేక పోయాను.

"ఎల్లప్పుడూ మీ మోసం సాగుతుందనుకోకు, మిస్టర్! ఏదో ఒకనాడు మీ ట్రాప్‌లో మీరు పడక తప్పదు. ఇక నుంచయినా న్యాయంగా జీవించడం నేర్చుకోండి" అంటూ అ దంపతులకు గట్టిగా వార్నింగిచ్చి విడిచిపెట్టేసాడు గిరి.

అప్పటికిగాని తేరుకోలేదు నేను.

నా కొశ్చెన్‌మార్క్ వదనాన్నిచూసి నవ్వుతూ చెప్పాడు గిరి. తాను వచ్చేసరికి గుంపు మధ్య సుబ్రహ్మణ్యం పడుతూన్న అవస్థ చూసి విషయం గ్రహించాడట. సమయస్ఫూర్తితో నాటకానికి ప్రతి నాటకం ఆడి ఆ మోసగాళ్ళ ఆట కట్టించాడు.

వాడి తెలివితేటలకు, సమయస్ఫూర్తికీ ప్రశంసించకుండా వుండలేకపోయాను.

తరువాత సుబ్రహ్మణ్యాన్ని వుద్దేశించి "చూశావట్రా సుబ్బిగా! నీ లాంటి లూజ్ కారెక్టర్‌గాళ్ళు వుండబట్టే వాళ్ళు అలా చీట్ చేయగలుగుతున్నారు. మీ వీక్‌నెస్‌ను ఈజీగా ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నారు" అన్నాడు గిరి.

"ఎక్స్‌ప్లాయిటేషన్ కాదు బ్రదర్, సెక్స్‌ప్లాయిటేషన్...." అన్నాను నేను నవ్వుతూ.

పాపం, సుబ్రహ్మణ్యం మొదటిసారిగా సిగ్గుతో తల వంచుకున్నాడు. □

దెయ్యం లాంటి కుక్క

భమిడిపాటి భాస్కర రామారావు

ఆరోజు ఆదివారం.

స్థానిక దినపత్రిక ఉదయం ఎడిషన్ తిరగేస్తున్నాడు డిటెక్టివ్ ప్రభాకర్.

'ప్రభుత్వమూ, ప్రభుత్వానికి ఏజెంట్లయిన పోలీసులూ నిద్రపోతున్నారా!' తాటికాయలంత అక్షరాలతో ఉన్న

హెడ్డింగు అతడి దృష్టి నాకట్టుకుంది.

వార్త చదవసాగాడు.

"అంతర్జాతీయంగా ప్రఖ్యాతి వహించిన వ్యాపారవేత్త భుజంగరావుగారు. ఆయన విచిత్ర పరిస్థితులలో మరణానికి గురయిన వార్త క్రితం వారం మా పాఠకులకు అందించాము.

ఇప్పటికీ ఆయన మరణానికి అసలు కారణం ఏమిటన్న విషయం కూడా తేల్చలేకపోయారు ఘనత వహించిన మన పోలీసు శాఖవారు.

అదలా ఉండగా మొన్న శుక్రవారం రాత్రి మరో ప్రఖ్యాత వ్యాపారవేత్త జానాబ్ మస్తాన్ సాహెబ్‌గారు బీచ్‌లో శవంగా మారారు.

భుజంగరావుగారి మరణం ఏ విధంగా సంభవించిందో సాహెబ్‌గారి మరణం కూడా అలాగే సంభవించిందని తేల్చారు వైద్యులు.

ఇప్పటికప్పుడే యిద్దరు వ్యక్తులు అతి విచిత్ర పరిస్థితులలో మరణించారు. అయినా మన పోలీసువారికి చీమ కుట్టినట్టన్నా లేదు...."

అంటూ యింకా యేమేమో వ్రాసింది ఆ పత్రిక.

డిటెక్టివ్ ప్రభాకర్ ఆ వార్త తన అసిస్టెంట్ హరికి చూపించి, "హరీ! భుజంగరావు మరణవార్త పడ్డనాటి పత్రికలు ఇలా తే!" అని చెప్పాడు.

హరి ఆ న్యూస్ పేపర్లు తెచ్చి బల్లమీద పెట్టాడు.

డిటెక్టివ్ ప్రభాకర్ వాటిలో ఒక పత్రికలోని వార్త చూపించి, "హరీ! ఈ వార్త చదువు" అన్నాడు.

"రాత్రి తొమ్మిది గంటలవేళ భుజంగరావు తన యింటి తోటలో ఫౌంటెన్ దగ్గర కూచుని ఫయినాన్షియల్ ఎక్స

ప్రెస్ చూసుకుంటున్నాడు.

ప్రతీరోజు అది అతడి అలవాటు.

పదకొండు దాటినా తిరిగి యింట్లోకి రాకపోయేసరికి భార్య కంగారు పడింది.

ఆమెను కంగారుపడవద్దని చెప్పి కొడుకు సూర్యం తోటలోకి వెళ్ళాడు. అప్పటికే కూచున్నవాడు కూచున్నట్టే భుజంగరావు మరణించి ఉన్నాడు'' అని పోలీసుల ప్రవేశం, దర్యాప్తు మొదలైన వివరాలు చదివి,''మెదడుకు రక్తప్రసరణ ఆగిపోవడంవల్ల మరణించాడని పోస్ట్‌మార్టమ్ రిపోర్టు'' అని ముగించాడు హరి.

''బాస్! మెదడుకు రక్తసరఫరా గుండె ఆగిపోవడం వల్ల మాత్రమే కదా జరిగేది?'' అడిగాడు హరి.

''మెదడుగు రక్త సరఫరా ఆగిపోవడంవల్ల కూడా గుండె ఆగిపోతుంది'' చెప్పాడు ప్రభాకర్.

''గొంతు పిసికితే మెదడుకు రక్త సరఫరా నిలిచి పోతుంది. డాక్టర్ల రిపోర్టు ప్రకారం అలాటి దాఖలా ఏం కనిపించడంలేదు?'' సందేహం వెలిబుచ్చాడు హరి.

''నువ్వో విషయం మరచిపోతున్నావు. గొంతు ముడికి యీ ప్రక్క నొకటి ఆ ప్రక్క నొకటి చెప్పున రెండు ధమను లుంటాయి. అవి మెదడుకు రక్తాన్ని సరఫరా చేస్తాయి. వాటిని కొద్ది నిముషాలపాటు నొక్కి ఉంచితే మెదడుకు రక్తపు సరఫరా నిలిచిపోతుంది. గొంతు నులి మిన చిహ్నాలూ వుండవు.

దానితో తగిన ఆజ్ఞలు యిచ్చే మెదడు చచ్చుబడడంతో మిగతా శరీర భాగాలన్నీ స్తబ్ధు అయిపోతాయి. అలాగే గుండె కూడా.

"శరీరంలో యే అవయవం తన పని మానినా ప్రాణానికి ప్రమాదం లేదేమో కాని గుండె విషయం అలా కాదు కదా!"

"అయితే కార్టాయిడ్ నరాలను నొక్కడంవల్ల మరణం సంభవించిందన్నమాట."

"అలాగే అనుకోవాలి."

"అదెలా సాధ్యం?"

"ఏం?"

"వాటిని నొక్కడానికి ప్రయత్నిస్తే ప్రతిఘటించకుండా వుంటారా ఎవరేనా?"

"నువ్వు చెప్పినది సబబుగానే వుంది."

"బాస్! యిద్దరు ముగ్గురు కలిసి చేసి వుండవచ్చునేమో?"

"వాళ్ళ యింటికి వాచ్‌మన్ వున్నాడు కదా?"

"గోడ దూకి దొంగ చాటుగా వచ్చి వుండవచ్చును కదా?"

ఈలోగా బయట బూట్ల శబ్దమయింది.

"బయట ఇన్‌స్పెక్టర్ మూర్తి వస్తున్న అలికిడవుతోంది. వెళ్ళి తీసుకురా!" చెప్పాడు ప్రభాకర్.

హరి వెనుకనే లోపల కడుగుపెట్టాడు మూర్తి. నెత్తిమీది టోపీ టీపాయ్‌మీద పెట్టి ఉస్సురంటూ కూర్చున్నాడు మూర్తి.

"ఏం మూర్తీ! యేమిటి విశేషాలు?" అడిగాడు ప్రభాకర్.

ప్రభాకర్ ఎదుట టీపాయ్‌మీద వున్న వార్తాపత్రికను దానిలో వున్న వార్తను తన స్టిక్‌తో చూపుతూ, "ఈ వార్త చదివి కూడా యేమిటి విశేషాలూ అని అడుగు

తున్నావా?" అన్నాడు మూర్తి.

"పేపరువాళ్ళు యిలా వ్రాశారని కంగారుపడు తున్నావా?"

"పత్రికలవాళ్ళ మాట యెవడు పట్టించుకుంటాడయ్యా మహానుభావా! మా సూపర్నెంటు అగ్గిరాముడిలా విరుచుకు పడుతున్నాడు."

"అది సరే, భుజంగరావు మస్తాన్‌సాహెబ్‌ల హత్య లకు సంబంధించి అనుమానితు లెవరేనా తేలేరా?"

"రెండు హత్యలు ఒక్క మాదిరిగా జరిగాయన్న విషయం తప్ప అంతా అగమ్యగోచరంగా ఉంది."

"రెండు హత్యల మధ్య వున్న సారూప్యతనుబట్టి అవి చేసినవారు లేదా చేయించినవారు ఒకరే అన్న విషయం అర్థం అవడంలేదా?" అడిగాడు ప్రభాకర్.

"అలాగే అనుకోవాల్సి వస్తోంది."

"అయితే యిప్పుడేమిటి నీ ప్రణాళిక?"

"అది తోచకే నీ దగ్గరకు వస్త."

డిటెక్టివ్ ప్రభాకర్ రెండు నిముషాలు మౌనంగా ఆలోచించి, "చూడు మూర్తీ! భుజంగరావు, మస్తాన్‌సాహెబ్-యిరువురూ కూడా పెద్ద వ్యాపారస్తులు. సంఘంలో పేరు ప్రతిష్ఠ లున్నవాళ్ళు. వాళ్ళ మధ్య స్నేహం కూడా వుండొచ్చు ..." అని ప్రభాకర్ యింకా ఏమో చెప్ప బోతున్నాడు. మధ్యలో మూర్తి అందుకుని,

"ఉండొచ్చేమిటి? ఆ యిరువురే కాదు—పంపు సెట్ల హోల్‌సేలర్ నాగేంద్రం, మోటార్ పార్ట్స్ మేగ్నెట్ జార్జి. వీరు నలుగురూ గాఢస్నేహితులు.

మొదటి యిద్దరూ హత్యకు గురయ్యాక తమ ప్రాణా లకు కూడా ముప్పు వస్తుందేమోననే భయంతో రక్షణ

కోరుతూ నా దగ్గరకు వచ్చారు. నీ దగ్గరకూ వస్తారేమో?"
అన్నాడు మూర్తి.

"వారా విధంగా భయపడడానికి కారణం యేమైనా చెప్పారా?"

"తరచి తరచి అడిగాను. కేవలం తమ అనుమానమే నన్నారు."

"అలా రక్షణ కోరుతూ యింకా యెవరేనా వచ్చారా?....."

"వాళ్ళిద్దరే వచ్చారు."

"ఇది కొంచెం ఆలోచించవలసిన విషయంగా కనిపించడంలేదూ?"

"నాకేం కనిపించడంలేదు. ఎందుకంటావా, ఇంత వరకూ హతులైనవాళ్ళు పెద్ద వ్యాపారస్తులు. వీళ్ళిద్దరూ కూడా వాళ్ళకు సమ ఉజ్జీలు. పైగా గాఢస్నేహితులు."

"ఆ మాత్రం చేతనే వీళ్లూ భయపడుతున్నారంటే వింతగా లేదూ?" అడిగాడు ప్రభాకర్.

"నీ ఉద్దేశ్యం ఏమిటో సరిగ్గా చెప్పు."

"వీళ్ళ నలుగురకూ శత్రువైనవాడు ఎవరేనా ఉన్నాడా అన్నది ముందుగా తెల్సుకోవలసిన విషయం" అన్నాడు ప్రభాకర్.

"వాళ్ళు చాలా పెద్దవాళ్ళు. కిట్టనివాళ్ళు చాలామందే వుంటారు."

"అంతమాత్రం చాలదు. చంపేటంత కక్ష వున్నవాళ్లున్నారేమో తెలుసుకోవాలి."

"ఆ నలుగురి స్వస్థలమూ ఇదేనా?"

"గత పాతికేళ్ళుగా ఇక్కడే వుంటున్నారు."

"అంతకుముందు?"

"తెలియదు."

"అదే తెలుసుకోవాలి ఇప్పుడు. అంతేకాక అప్పుడేం చేసేవారన్న విషయమూ తెలుసుకో."

మూర్తి "సరే!" అని లేచాడు.

"మూర్తీ!" పిలిచాడు ప్రభాకర్.

బయలుదేరబోయేవాడల్లా ఆగాడు మూర్తి.

"మూర్తీ! మస్తాన్ సాహెబ్ హత్య బీచ్‌లో జరిగింది. ఎంత ఏకాంత ప్రదేశమనుకున్నా ఏ ఒకరో యిద్దరో ఉండక పోరు కొద్దిదూరంలో అయినా. ఏదైనా అఘాయిత్యం జరిగితే చూచిన వారికి కనీసం అనుమానమైనా రాదా?"

"నీ ఉద్దేశం అర్థమైంది. ఎవరేనా చూచివున్నా పోలీసులతో ఎందుకు వచ్చిన తంటా అని ఎవరూ ముందుకు రారు కదా!"

"అసలు నీకు వార్త ఎలా వచ్చింది."

"ఒక వ్యక్తి తనెవరో చెప్పకుండా ఫోన్‌లో చెప్పాడు."

"అయితే ఒక పని చెయ్యి. మస్తాన్ సాహెబ్ హత్యకు సంబంధించిన వివరాలు చెప్పగలవారికి పోలీసులను కలుసుకోవడం ఇష్టం కాకపోతే నన్ను కలుసుకోమని పేపరులో ప్రకటన యిప్పించు. ప్రకటన నా పేరున వుండాలి సుమా," అని ప్రకటన ఏ విధంగా వుండాలో మూర్తికి చెప్పాడు ప్రభాకర్.

2

"నమస్కారమండి. నా పేరు గుప్తా."

డిటెక్టివ్ ప్రభాకర్ వచ్చిన వ్యక్తివైపు చూచి, "రండి కూర్చోండి" అన్నాడు.

గుప్తా, ప్రభాకర్ ఎదురుగా కూచున్నాడు.

"ఏం పనిమీద వచ్చారు?"

"ఈ ఉదయం పేపర్లో మీ ప్రకటన చూచివచ్చానండి."

"ఓహో! ఆ పనిమీదనా! థాంక్స్."

"నేను చెప్పానన్న సంగతి బయటకు రానివ్వకూడదు సుమండీ. ఏదో చిన్న ఉద్యోగం ఆధారంగా పెళ్ళాం బిడ్డ లను పోషించుకుంటున్నవాణ్ణి."

"ఆ హామీ నా ప్రకటనలోనే యిచ్చాను. మీకేం భయం లేదు."

"వేసవి వచ్చిందంటే ప్రతిరోజూ బీచ్‌కి వెళ్ళడం నా అలవాటండి. జనం ఎక్కువగా వుండే చోటగాక కాస్త విడి ప్రదేశంలో కూచోవడం నా అలవాటండి. మస్తాన్ గారికి కూడా నాలాంటి అలవాటే ననుకుంటానండి. అయితే ఆయన శుక్రవారం మాత్రమే బీచ్‌కి వస్తారండి."

"ఆయనతో మీకు పరిచయం వుందా?"

"పరిచయమాండి? ఆయనతోనాండి? ఎలా వుంటుం దండి? నేను కాళ్ళమీద నడిచి వెళ్ళే మామూలు మనిషిని. మరి ఆయనో, కారులో వచ్చే మనిషి."

"సరే! తరువాతి విషయం చెప్పండి."

"ఆ శుక్రవారంకూడా నేను బీచికి వెళ్ళానండి. నీటికి బాగా దగ్గరగా ఇసుకలో కూచోవడమంటే నాకు చాలా యిష్టమండి. ప్రతి శుక్రవారంలాగే ఆరోజుకూడా మస్తాన్ గారు వచ్చి రోడ్డు వార కారాపి వచ్చారండి. రోడ్డు నాను కునే వున్న పార్కులో పొద పక్కనున్న సిమెంటు బెంచి మీద కూచోవడం ఆయన అలవాటండి.

కొంతసేపయ్యాక ఒక మోటార్ కారు ఆగిన చప్పు డయిందండి రోడ్డుమీద.

నేను వెనుకకు తిరిగి చూచానండి. ఒక పెద్ద కుక్క దాదాపు ఆవు దూడంత వుంటుందండి. రోడ్డుమీద నుండి

పరుగు పరుగున వచ్చి మస్తాన్‌గారి వైపు నేలవాసన చూచుకుంటూ వెళ్ళిందండి.

ఆయన దగ్గరకు వెళ్ళాక వెనుక కాళ్ళు రెండింటిమీదా నిలబడి ముందు రెండు కాళ్లూ మస్తాన్‌గారి భుజాలమీద వేసిందండి."

"అప్పుడు రాత్రికదా! మీకు అంతా స్పష్టంగా కనిపించిందా?"

"మునిసిపల్ కార్పొరేషన్ వారి ధర్మమా అని బీచ్ రోడ్డంతా మెటల్ హేలైడ్ దీపాలు వేయించారు కదండీ! ఆయన కూర్చున్నది పొద నీడలో కాబట్టి అంత స్పష్టంగా కాకపోయినా అక్కడి దృశ్యం బాగానే కనిపిస్తోందండి."

"అలాగా! ఆ తరువాత?"

"ఆయన కుక్కను చేతులతో గెంటి వేయబోతున్నారన్నట్టు నాకు తోచిందండి. కాని ఆ కుక్క ఏమాత్రం కదలలేదండి. ఆ కుక్క ఆయనది కాదేమో? ఆయనను ఏమైనా చేయబోతోందేమో అనే అనుమానం కలిగిందండి నాకు. ఆయన దగ్గరకు వెడదామని లేచానండి. అంతట్లో కుక్క ఆయన భుజాలమీద నుండి ముందుకాళ్లు తొలగించి రోడ్డువైపు పరుగెత్తిందండి.

పిట్టగోడ ప్రక్కనే ఆగివున్న పాత మోడలు మోటారు కారు వెనుక సీటుమీదకు ఎక్కిందండి. వెంటనే కారులో వున్న వ్యక్తి కారుని స్టార్ట్‌చేసి వేగంగా వెళ్ళిపోయాదండి."

"అతడిని మీరు చూచారా?"

"బాగా దూరం అవడంతో సరిగా కనిపించలేదండి."

"తరువాత?"

"కుక్క భుజాలమీద కాళ్లు పెట్టినప్పుడు వెనక్కివంగిన

మస్తాన్‌గారి మెడ అలాగే వుండిపోవడంతో కంగారుగా ఆయనవద్దకు పరుగెత్తానండి....కాని అప్పటికే ఆయన ప్రాణం విడిచారేమోననిపించిందండి.''

''పోలీసులకు తెలియపరిచినది మీరేనా?''

''ఔనండి.''

''సరే! మీరు వెళ్ళిరండి.''

3

డిటెక్టివ్ ప్రభాకర్ లేచి పాత మేగజయిన్లు వుండే ర్యాక్ వద్ద నిలబడి వెతికి ఒక ఫారిన్ క్రయిమ్ మేగజయిన్ తీశాడు. ఇండెక్స్ చూచి తృప్తిగా తలాడించి ఒక పేజి లోని విషయం చదువుతూ కూచున్నాడు.

''ఏమిటంత దీక్షగా చదువుతున్నావు?''

తను చదువుతున్న విషయంలో గాఢంగా లీనమవ డంతో ఇనస్పెక్టర్ మూర్తి రాకనే గమనించలేకపోయాడు డిటెక్టివ్ ప్రభాకర్.

''ఓ! నువ్వా? ఏమయింది నీ ఎంక్వయిరీ?'' పుస్తకం బల్లమీద బోర్లిస్తూ అడిగాడు ప్రభాకర్.

''నీ అనుమానం నిజమే. పాతికేళ్ళ క్రితం భుజంగ రావు, మస్తాన్, నాగేంద్రం, జార్జి, గోవాలో వుండేవారు. అప్పట్లో భీమశంకరం అని మరో పార్ట్నర్ కూడా వుండే వాడు వీళ్ళకు. అప్పుడు స్మగ్లింగ్ పెద్ద ఎత్తున చేసేవారు'' చెప్పాడు మూర్తి.

''మరి భీమశంకరం ఏమయ్యాడిప్పుడు?''

''దొంగ రవాణా అవుతున్న సరుకుతో కస్టమ్స్‌వారికి దొరికిపోయాడట. పదేళ్లు శిక్షపడింది. అతడు జైలులోనే అనారోగ్యంతో చనిపోయాడు?''

డిటెక్టివ్ ప్రభాకర్ ఏదో ఆలోచిస్తూ మౌనంగా వుండి

పోయాడు.

అతడి మౌనాన్ని భంగపరుస్తూ, "జరిగిన హత్యలు రెండిటా కార్టాయిడ్ నరాలను నొక్కడం ద్వారా మెదడుకు రక్త సరఫరా ఆగిపోయి మరణం సంభవించిందని తేలింది" అని చెప్పాడు మూర్తి.

"హత్యచేసే వ్యక్తి ప్రస్తుతం వీళ్ళతో సన్నిహిత సంబంధం కలవాడని గట్టిగా చెప్పవచ్చు" చెప్పాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"ఎందుచేత?"

"హత్యాయుధం ఏమిటో తెలుసా?"

"నరాలు నొక్కడానికి వేరే ఆయుధం కావాలా ఏమన్నానా?"

"నిజమే! అక్కరలేదు. ఇక్కడ మాత్రం నరాలు నొక్కుతున్నది ఒక కుక్క—"

మూర్తి విస్మయంగా చూస్తూ, "కుక్కయితే చీల్చుతుంది. చెండాడుతుంది. సుతారంగా నరాలు నొక్కుతుందా?" అన్నాడు.

"తరిఫీదు మూర్తీ! తరిఫీదు! కుక్క లెక్కలు చెయ్యడం లేదూ? అలాగే!" అని తను బల్లమీద బోర్లించిన మేగజయిన్ పైకి తీసి, "ఇందులో ఒక విశేషం వుంది. దక్షిణాఫ్రికాలో సైక్స్ అనే డాగ్ ట్రెయినర్ వున్నాడు. అతడు ఒక విలేకరికిచ్చిన ఇంటర్వ్యూ వుంది ఇందులో. దాని సారాంశం అతడి మాటల్లోనే చెబుతాను విను.

'నేను కుక్కలకు ఎలా కావాలంటే అలా తరిఫీదిస్తాను. డబ్బున్న వాళ్ళు చాలా మంది నా కుక్కలను ఎంత వెలయిచ్చి అయినా కొంటారు. సాధారణంగా కుక్కలు దొంగలమీద

పడి చీల్చి చెండాడుతాయి. రక్తం వరదలుగా పారుతుంది.

చాలా మందికి రక్తపాతం అంటే కిట్టదు సరికదా చూస్తే ముఖం తిరిగి పడిపోతారు. అందుచేత నేనో కొత్త ప్రయోగం చేశాను. మంచి ఆల్సేషియన్ కుక్కలను ఏరి వాటికి ప్రత్యేకమైన తరిఫీదిస్తాను.

ఆ తరిఫీదు పొందిన కుక్కలు దొంగను కదలకుండా పడగొట్టి కంఠానికి ఈవైపు ఆవైపు వుండే కార్టాయిడ్ ధమనులను ముందుకాళ్ళ పంజాలతో గట్టిగా నొక్కిపెడతాయి. కొద్ది క్షణాలలోనే దొంగకు ప్రతిఘటించే శక్తి సన్నగిల్లుతుంది. కొద్ది నిముషాలలోనే ప్రాణం పోతుంది.

నాది చాలా క్లీన్ ప్రోసెస్.

అయినా జాతి లక్షణాన్ని బట్టి అవి కరవవచ్చు. అందుకవకాశం లేకుండా తరిఫీదుకు ముందుగానే వాటి పళ్ళు పీకివేస్తాను' అంటాడు" అని ముగించాడు డిటెక్టివ్ ప్రభాకర్.

ఆశ్చర్యం నుండి తేరుకుందుకు కొద్ది నిముషాలు పైనే పట్టింది ఇనస్పెక్టర్ మూర్తికి.

"అయితే దక్షిణాఫ్రికా నుండి తెప్పించారంటావా కుక్కను?"

"మన దేశంలోకూడా ఎక్స్‌పర్ట్ డాగ్ ట్రెయినర్స్ లేకపోలేదు. మిష్టర్ సైక్స్ యిచ్చిన స్ఫూర్తితో వారిలో ఎవరైనా అలాటి కుక్కలను తయారుచేసే అవకాశం లేకపోలేదు."

"అయితే డాగ్ ట్రెయినర్స్ అడ్రసులు తెప్పించేదా?" అడిగాడు మూర్తి.

అంగీకారంగా తలవూపాడు ప్రభాకర్.

4

బెంగుళూరులోని జాలహళ్ళి రోడ్‌లో వున్న నంజప్ప కెన్నల్ ముందు టేక్సీ దిగాడు డిటెక్టివ్ ప్రభాకర్.

కెన్నెల్‌కు ముందు భాగంలో వున్న ఆఫీస్‌లోనే ఎదురయ్యాడు నంజప్ప.

"నంజప్ప అంటే తమరే అనుకుంటాను."

ఫుల్‌సూట్‌లో దొరబాబులా వున్న ప్రభాకర్‌ను చూచి, "అవును. దయచేయండి. నేను తమకేం సేవ చేయగలను" వినయంగా అడిగాడు.

ఇరువురి సంభాషణా కన్నడంలోనే నడుస్తోంది. ప్రభాకర్‌కు కన్నడం కూడా బాగా వచ్చు.

"కుక్కలకు తరిఫీదివ్వడంలో మీరు ఘటికులని విని విశాఖపట్టణం నుండి వెతుక్కుంటూ వచ్చాను."

"చాలా సంతోషం. నా కుక్కలు తమబోటివారి దగ్గర వుండవలసినవే! దొంగవెధవలను చీల్చి చెండాడుతాయి."

"రక్తపాతం అంటే నాకు కిట్టదు. నీట్‌గా ప్రాణం తీసేటట్టు తరిఫీదివ్వగలరా? దక్షిణాఫ్రికాలో సైక్స్ అనే ఆసామీ ఆ విధమైన ట్రెయినింగ్ ఇవ్వగలడట."

"అతడి పద్ధతిలో నేనూ తరిఫీదిచ్చాను. రండి! చూపిస్తాను" అని ప్రక్కనున్న ఒక గదిలోకి తీసుకువెళ్ళాడు నంజప్ప ప్రభాకర్‌ను.

ఆ గదిలో నేలమీద లోపలి నరాలు వగైరాలు కనిపిస్తూన్న ట్రాన్స్‌పరెంట్ రబ్బరు బొమ్మ పడుకోబెట్టి వుంది.

ఆ బొమ్మ ప్రక్కనే చిన్న మోటార్ వుంది. నంజప్ప మోటార్ 'ఆన్' చేశాడు. ఎర్రని రక్తం వంటి ద్రవం

బొమ్మ గుండెకాయ నుండి బొమ్మ శరీర భాగాలన్నిటికీ ప్రసరించసాగింది.

ప్రభాకర్ అతడి చర్యలన్నీ కుతూహలంగా గమనిస్తున్నాడు.

మరో గదిలో వున్న పెద్ద అల్సేషియన్ కుక్కను తీసుకువచ్చి, బొమ్మవైపు చేయి చూపిస్తూ, "డెవల్! కిల్!" అన్నాడు నంజప్ప ఇంగ్లీషులో.

అంతే. కుక్క బొమ్మమీద ఉరికింది ఎరమీదకు దూకే పులిలా. కంఠం ముడికి ఈ ప్రక్కా ఆ ప్రక్కా ఉండే నరాలను నొక్కిపట్టింది. తల భాగానికి రక్తప్రసరణ ఆగిపోయింది.

కొద్ది నిమిషాలు అలాగే నొక్కివుంచి పట్టు విడిచిపెట్టింది కుక్క.

"ఇప్పుడర్థమైందనుకుంటాను నా కుక్కలు యెంత సమర్థంగా పని చెయ్యగలవో!" నవ్వుతూ అని, "అయితే దూరాన వున్న వ్యక్తులమీద వీటిని ప్రయోగించాలంటే ముందుగా ఇవి పసికట్టడానికి వారు వాడే జేబురుమాలు తేదా ఏదైనా వస్తువు వాసన చూపించాలి" అన్నాడు నంజప్ప.

"ఇప్పటి కెన్నిటిని తయారుచేశారు యిలాంటి కుక్కలను?"

నంజప్ప ప్రభాకర్ వంక సందేహంగా చూస్తూ "ఏం అలా అడుగుతున్నారు? ఇది రెండవది" అన్నాడు.

"మొదటిదాన్ని ఎవరికి అమ్మారు?"

"సారీ! మా కష్టమర్స్ పేర్లు చెప్పడం మా వ్యాపార ధర్మానికి విరుద్ధం."

డిటెక్టివ్ ప్రభాకర్ తన కోటుపాకెట్ నుండి ఐడెంటిటీ తీసి చూపించాడు.

"నంజప్పగారూ! మీ తరిఫీదు పొందిన కుక్క విశాఖ పట్టణంలో ఇప్పటికే రెండు ప్రాణాలు బలిగొంది. మీరు చెప్పకపోతే ఆ ఘోరానికి పరోక్షంగా బాధ్యులవుతారు సుమా!" అన్నాడు.

"సారీ! రండి. ఆఫీసులో కూచుని మాట్లాడుకుందాం."

ఇద్దరూ నంజప్ప ఆఫీసులో కూర్చున్నాడు.

నంజప్ప ఒక ఫయిలు తెరిచి అడ్రసు ఒక కాగితంమీద రాసి ప్రభాకర్‌కు అందించాడు.

ప్రభాకర్ అది చూసి, "ఈ అడ్రసు కరక్టేనని నమ్మకం ఏమిటి?" అన్నాడు.

"ఇందాకటి కుక్క నోరు మీరు చూచే వుంటారు. ముందు జాగ్రత్త చర్యగా దాని పళ్ళు పీకేశాం. మేమే ప్రత్యేకంగా తయారుచేసిన లిక్విడ్ డయిట్ మాత్రమే ఆ కుక్కలశక్తి నశించకుండా కాపాడుతుంది. ఆ ఆహారం గురించి మాకు వ్రాయక తప్పదు. అందుచేత ఈ అడ్రసు తప్పని అనుకోను" చెప్పాడు నంజప్ప.

"న్యాయమార్గం వారి విషయంలో మీరు చెప్పినది సరి పోతుంది. ఇక్కడలా కాదు. ఆహారం కావలసినపుడు మరో అడ్రసుకు ఆహారం తెప్పించుకోవచ్చును" చెప్పాడు ప్రభాకర్.

నంజప్ప అతడితో ఏకీభవించాడు.

"నంజప్పగారూ! మీ వద్ద కుక్కను కొన్నతని పోలికలు వర్ణించగలరా?"

నంజప్ప వర్ణించాడు.

5

"హరీ! నంజప్ప వర్ణించిన వ్యక్తి హతులైన యిద్దరికే కాక మిగిలిన ఇద్దరికీ కూడా సన్నిహితుడే అయివుండాలి. నీవా విషయం తెలుసుకోవాలి" అని నంజప్ప వర్ణించిన వ్యక్తి పోలికలు వివరించాడు డిటెక్టివ్ ప్రభాకర్. హరి బయటకు వెళ్ళిపోయాడు.

"ఏమైంది నువ్వు వెళ్ళిన పని? కాయా? పండా?" వస్తూనే అడిగాడు మూర్తి.

"హత్యాయుధం యజమాని పోలికలు తెలిశాయి. ఈ ఊరు వాడే."

"అయితే మన పని ఒక కొలిక్కి వచ్చిందన్న మాట."

ప్రభాకర్ అందు కేమీ జవాబివ్వకుండా, "ఇంతకూ జార్జి, నాగేంద్రలను తగిన జాగ్రత్తలలో వుండమని హెచ్చరించావా లేదా?" అని అడిగాడు.

"హెచ్చరించాను అసలు వాళ్ళిద్దరికీ కూడా పార్టీలు ఏమీ లేకపోతే వాళ్ళ యిళ్ళ గార్డెన్స్‌లో కాలక్షేపం చేయ డమే అలవాటట.

నేను హెచ్చరించే నాటికే పార్టీలకు వెళ్ళడం మాట దేవుడెరుగు, గార్డెన్‌లో పచార్లు కూడా మానేశారు" చెప్పాడు మూర్తి.

గంట తర్వాత హరి తిరిగివచ్చి, "బాస్! నంజప్ప వర్ణించిన వ్యక్తి పేరు రాణా అట. భుజంగరావు కంపెనీ లోనే పని చేసేవాడట. అయితే రెండు నెలలుగా ఉద్యోగా నికి రావడంలేదట. ఎక్కడ వుంటున్నదీ తనకు తెలియ దని భుజంగరావుగారి కొడుకే చెప్పాడు" అని అన్నాడు.

డిటెక్టివ్ ప్రభాకర్ యేమీ మాట్లాడకుండా చేతులు వెనక్కి కట్టుకుని పచార్లు చేయసాగాడు గదిలో.

అతడి ఆలోచన కంతరాయం కలిగించకుండా మిగిలిన యిరువురూ మౌనంగా కూర్చున్నారు.

"మన ముందున్న ఆధారాలనుబట్టి హంతకుడు జార్జి, నాగేంద్రలమీద కూడా పగ తీర్చుకోకుండా వుండడు.

"అందుకు అవకాశం మనమే కలగజేస్తే?" ప్రశ్నించాడు ప్రభాకర్.

"ఏమిటి నువ్వు చెప్పేది?" గాభరాగా అడిగాడు మూర్తి.

"ఔను మూర్తీ! మరో నాలుగు రోజులు పోతే భయం తగ్గిన జార్జి,నాగేంద్రాలు మామూలు కార్యక్రమంలో పడడం సమయం కోసం గోతివార నక్కలా కాచుకుని వున్న హంతకుడికి అవకాశం దొరకడం జరగవచ్చు. అప్పుడు మనం వాళ్ళని ఆదుకోలేకపోవచ్చు" అన్నాడు.

"అయితే ఏం చేద్దామని నీ ఊహ?"

"జార్జి, నాగేంద్రం మన పర్యవేక్షణలో వుండేలా చూచి, హంతకుడికి మనమే అవకాశం కలిగిద్దాం."

"అదే! ఎలాగ? ఆభాసుపాలు కాంగదా?"

ప్రభాకర్ చిరునవ్వు నవ్వి, మూర్తికి తన ప్రణాళిక వివరించి, "నేను చెప్పినట్టు చెయ్యి. యే ప్రమాదమూ జరగదని హామీ యిస్తున్నాను. సరా?" అన్నాడు.

6

సర్రున దూసుకువచ్చింది ఒక మోటార్ కారు. జార్జి యింటికి కొద్ది దూరంలో ఆగింది.

ఒక వ్యక్తి క్రిందకు దిగాడు. అతని వెనుకనే దయ్యి

మంత అల్సేషియన్ కుక్క. జేబునుండి సెల్లోఫేన్ కవ రొకటి బయటకు తీశాడు మోటార్‌కారు వ్యక్తి. అందు లోంచే ఒక రుమాలు తీసి కుక్కకు వాసన చూపించాడు.

అక్కడకు కాస్త దూరంగా ఒక సందులో మోటార్ సైకిల్‌తో సిద్ధంగా ఉన్న హరి అదంతా జాగ్రత్తగా గమ నిస్తున్నాడు.

"టైగర్! గో అండ్ కిల్!" అన్నాడు మోటార్‌కారు వ్యక్తి.

అతడా మాట అన్నదే తడవుగా గాలిని వాసన చూసు కుంటూ జార్జి యింటివైపు పరుగెత్తింది కుక్క.

కాంపౌండ్‌వాల్ ప్రక్క ఆగి మోర పైకెత్తి గాలిని వాసన చూసి చెంగున దూకింది గోడ.

కాంపౌండులో పూపొదరింటి దగ్గర పేము కుర్చీలో కూర్చుని వున్నాడు జార్జి. భయం భయంగా నలుదిక్కులా చూస్తూ చీమ చిటుక్కుమన్నా యెగిరెగిరి పడుతున్నాడు జార్జి.

మృత్యుదేవతలా తనవైపే వస్తున్న కుక్కమీద పడింది జార్జి దృష్టి. కెవ్వుమని అరచి కుర్చీలోంచి లేచి యింటి వైపు పరుగెత్తబోయాడు జార్జి.

అతడికా అవకాశం ఇవ్వకుండా చటుక్కున దూకింది కుక్క జార్జిమీద.

జార్జి దబ్బున నేలమీద పడ్డాడు. స్పృహ తప్పింది.

కుక్క అతడి గుండెలమీద కూచుని ముందు రెండు కాళ్ళు కంఠ నరాలమీద ఆన్చింది లాఘవంగా.

పొదరింటి చాటునుండి చేతిలో కర్రతో దండధరుడిలా వచ్చిన డిటెక్టివ్ ప్రభాకర్ కుక్క నొక్కదెబ్బ వేశాడు కర్రతో.

తన పనికి విఘాతం కలిగించిన డిటెక్టివ్‌వైపు ఎగర బోయింది కుక్క మొరుగుతూ.

కాని అతడి చేతిలోని కర్ర ముఖంలోని తీక్షణత చూచి, జంకి గోడ గెంతి ఆవలకు పోయింది.

బుర్రున స్టార్టయి దూసుకుపోయింది మోటార్‌కారు.

సందులో కాచుకుని వున్న హరి వెన్నాడసాగాడు.

ముందు వెడుతున్న హంతకుడి మోటార్‌కారు ఒక యింటి ముందాగింది. అతడు, అతడి వెనుక కుక్క యింట్లో ప్రవేశించారు.

అతడు తలుపు మూసేలోపలే సుడిగాలిలా లోపల ప్రవే శించాడు హరి.

"మిస్టర్ రాజా! ఇక నీవు తప్పించుకోవడం కల్ల!" అధికారికంగా అన్నాడు హరి.

"హుం! అది నువ్వు ప్రాణాలతో ఉన్నప్పుడు" అని, "టైగర్! గో అండ్ కిల్!" అరిచాడు హరివైపు చూపిస్తూ.

కుక్క క్రూరంగా చూస్తూ హరిమీదకు దూకింది. ఆ కుక్క ఏం చేస్తుందో హరికి తెలుసు. కుక్క దూకీ దూక గానే దాని ముందుకాళ్ళు రెండూ దొరకపుచ్చుకున్నాడు.

రాజా, హరిమీద పడి పిడిగుద్దులు గుద్దసాగాడు.

కుక్కమీది పట్టు సడలకుండా వీలైనంతవరకూ అతడి దెబ్బలకు దొరకకుండా తప్పించుకుంటున్నాడు హరి.

రాజా చటుక్కున వెనుకనుండి హరి మెడ పట్టు కున్నాడు.

"హేండ్సప్?" వెనుక సింహగర్జన.

రాజా చటుక్కున వెనక్కి తిరిగాడు. చేతిలో నల్లగా

నిగ నిగ మెరుస్తున్న పిస్తోలుతో డిటెక్టివ్ ప్రభాకర్.

ఆ వెనుక బలగంతో ఇన్స్పెక్టర్.

* * *

రాజా స్టేట్‌మెంటివ్వసాగాడు.

"....ఒప్పందానికి విరుద్ధంగా మా నాన్న భీమశంకరం గారికి ద్రోహం చేశారు ఆ దుర్మార్గులు. మా నాన్నను జైలుకు పంపి, మా నాన్న భాగం వాళ్ళే కాజేశారు. జైలు నుండి ఉత్తరం ద్వారా వివరాలు, ఫోటోల ద్వారా వాళ్ళ రూపాలు తెలియజేశాడు మా నాన్న. పగ తీర్చుకోవటానికి భుజంగరావు కంపెనీలోనే వుద్యోగం సంపాదించాను.

సమయం కోసం వేచి చూస్తున్నాను.

కుక్కలతో సైక్స్ ప్రయోగం చదివాక నాకు మార్గం దొరికిందనిపించింది.

నంజప్ప దగ్గర నాకు కావలసిన కుక్క దొరికింది.

ఆ నలుగురూ అప్పుడప్పుడు భుజంగరావు గెస్టు హౌసులో మందుపార్టీలు చేసుకుంటుండేవారు.

నేను చాలా నమ్మకంగా పని చేస్తూండటంతో అలాటి పార్టీలవేళ వాళ్ళకు కావలసినవి అందజేయడానికి నన్నే నియోగించేవాడు భుజంగరావు. నాకు కావలసినది కూడా అదే. వాళ్ళమీద కుక్కను ప్రయోగించాలంటే ఆ కుక్కకు వాళ్ళ వాసి అవసరం! దానికోసం అలాటి పార్టీలప్పుడు ఒక్కొక్కసారి ఒకరిది చొప్పున వాళ్ళ జేబురుమాళ్ళు సంగ్రహించాను. జేబురుమాలు పోయింతమాత్రాన ఎవరూ పెద్దగా పట్టించుకోరు కదా!

నా తండ్రికింత ద్రోహం చేసిన వీళ్ళను ఈ విధంగా చంపడం ఏమీ తప్పుకాదనే అనుకుంటున్నాను" అని ముగించాడు రాజా. □

ముంచుకు రానున్న ముప్పు

ఎమ్. సత్యవతీదేవి

న్యూయార్క్,
20-7-82

ప్రియమైన చెల్లీ,

శుభాకాంక్షలు.

నీ ఉత్తరం అందింది. ముఖ్యంగా రాస్తున్నాను. నాన్న గారు బతికివున్న రోజులలో మనకు గబ్బర్‌సింగ్‌తో వైరం

పడింది. మనం మరచిపోలేని కేసు: 'పావురాలే దిక్కు' కేసు.

ఆ కేసులో నిన్నూ నన్నూ గబ్బర్‌సింగ్ అతడి పరివారమూ ఎత్తుకుపోయారు. నాన్నగారు చేసే శాస్త్రీయ పరిశోధనల విషయం మైక్రోఫిల్ముల్లుగా చిత్రీకరించమని గబ్బర్‌సింగ్ కోరాడు. నాన్నగారి లాబ్‌కి నాలుగు పావురాలు పంపించాడు. వాటి కాళ్ళకు మైక్రోఫిల్ములు కట్టి త్రిప్పి పంపించమని ఆదేశించాడు.

నువ్వూ నేనూ కలసి పథకంవేసి గబ్బర్‌సింగ్‌గాడి స్థావరంలోంచి పారిపోయాం. అదే సమయానికి మనకు పోలీసుల సహాయం లభించింది.

గబ్బర్‌సింగ్‌కీ అతడి పరివారానికీ జైలుశిక్ష వేశారు. ఈ నెలలోనే అతడిని విడుదల చేస్తారనుకుంటాను. వాడు మన కుటుంబం మీద పగబట్టాడు. ఒంటరిగా ఇండియాలో వున్నావు. నీ జాగ్రత్తలో నువ్వుండు.

అవసరమయితే లాయర్ సౌజన్య సలహాలూ సహకారమూ తీసుకో.

నా లాబ్ అడ్రసుకి కేబులు యివ్వు.

—నీ అన్నయ్య.

లావణ్య ఉత్తరం చదవడం ముగించింది.

భారంగా నిట్టూర్చింది.

అన్నయ్య రాసిన విషయం తన మనసులో కలవరం రేపుతోంది. అన్నయ్య రాసింది అక్షరం అక్షరమూ నిజమే!

గబ్బర్‌సింగ్ పరమ కర్కోటకుడు. తమ కుటుంబం మీద అతడు పగబట్టాడు. నాన్నగారు అప్పట్లో గబ్బర్‌సింగ్‌కు మైక్రోఫిల్ములు యిచ్చివుంటే గబ్బర్‌కి నలభై లక్షల రూపాయల విదేశీ మారకం లభించేది. ఇవ్వక

పోవడంవలన మాతృదేశానికి ఒక శాస్త్ర పరిశోధన దక్కింది.

లావణ్య ఉత్తరం మడిచింది. హాండ్‌బాగ్‌లో పెట్టుకున్నది.

ఇంటికి తాళంపెట్టి పోర్టికోలోకి నడిచింది. పోర్టికోలో చెవర్లెట్ కారు తళతళలాడుతోంది.

లావణ్య కారును బయలుదేర తీసింది.

డైమన్ పార్కు దాటి క్రాస్ రోడ్లోంచి సెంట్రల్ జెయిలు ముందుకు వచ్చి ఆగింది.

లావణ్య కారును రోడ్డు ప్రక్కగా పార్కుచేసింది. సెంట్రల్‌జెయిలు ఆఫీసు గదిలోకి నడిచింది.

జెయిలు సూపర్నెంటును విష్ చేసింది.

"మీరు ఎవరు?" అడిగాడు జెయిలు సూపర్నెంటు.

"సైంటిస్ట్ లేట్ పరాంజపేగారి అమ్మాయిని. పేరు లావణ్య."

సూపర్నెంటు ఆప్యాయంగా చూశాడు. అంతలోనే ఏదో గుర్తు వచ్చినట్టయింది. నుదురు చిట్లించాడు.

"అంటే గబ్బర్‌సింగ్ కేసులో...."

లావణ్య తలూపింది.

"ఈ రోజే గబ్బర్‌సింగ్‌ను విడుదల చేస్తున్నాం."

లావణ్య ఉలిక్కిపడింది.

"మీరు భయపడుతున్నారా?"

"అవును."

"అతడు మారిపోయాడు. మీజోలికి రాడనుకుంటాను."

"రాకపోయినట్టయితే మంచి మాటే!"

"అతడి సత్ప్రవర్తనకు ఒకనెల జైలుశిక్షతగ్గించారు."

"ఎందుకో అతడు నామీద దాడి చేస్తాడని అనుమానంగా

వుంది!"

"పోలీసు రక్షణ కోరండి."

"మీరన్నట్టు నా జోలికిరాకపోతే ఫూలిష్‌గా వుంటుంది."

"అవును. ఒక పౌరుడిని కించపరచినట్టవుతుంది!"

లావణ్య ఆలోచనలో పడింది.

తనమీద గబ్బర్ దాడిచేయవచ్చును. దాడిచేస్తే తాను మిగలక పోవచ్చును. అప్పుడుగానీ పోలీసులు రంగంలోకి దూకరు! అప్పటికి జరగవలసిన అపకారం జరిగిపోతుంది.

తాను యిప్పుడు ఏం చెయ్యడం?

లాయర్ సౌజన్యను కలుసుకోవాలా?

లావణ్య కదిలింది. సూపర్నెంటును సెలవు అడిగింది.

"ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు గబ్బర్‌సింగ్‌నూ, అతడి ముఖ్య అనుచరుడు సాంబంనూ విడిచిపెడతాం!" అన్నాడు సూపర్నెంటు.

లావణ్య తలూపి బయటకు నడిచింది.

2

సెంట్రల్ జెయిలు రోడ్డు దాటాడు గబ్బర్‌సింగ్. అతడి వెనుక సాంబం నడుస్తున్నాడు.

లావుపాటి శరీరం కావడంతో గబ్బర్‌సింగ్ వగురుస్తున్నాడు. మిలటరీ ఖాకీరంగు పాంటుమీద ముదురుపచ్చ రంగు చొక్కా టక్‌చేశాడు గబ్బర్‌సింగ్. పల్చగా పెరిగిన గడ్డం, ఒత్తయిన మీసాలూ, భుజాన గళ్ళ టవలూ, కాళ్ళకు ఏనాటివో జమీందారీ చెప్పులూ....

"అరె సాంబా!" పిలిచాడు గబ్బర్‌సింగ్.

సన్నగా చువ్వలాగా నడుస్తోన్న సాంబం ఆగాడు.

"మనకి సాలాగాడు పెట్టిన కబురు నిజమేనంటావా?" అడిగాడు గబ్బర్.

"ఏమిటి బాస్!"

గబ్బర్ వ్యర్థంగా నవ్వాడు. సాంబం అతడివంక భయంగా చూశాడు. గబ్బర్ నవ్వినపుడు ఆకుపచ్చరంగుకు తిరిగిన పళ్ళు వెక్కిరిస్తాయి. ఆ నవ్వు ప్రమాదకరం! ఎవరికో యెక్కడో మూడిందన్నమాట!

"పరాంజపేగాడు చచ్చిపోయాడటగదా!"

"అవును."

"వాడి కొడుకు అమెరికా వెళ్ళాడట."

"కూతురు లావణ్య ఈ వూళ్ళోనే వుందట."

"పద! వాళ్ళ యింటికి వెళ్దాం."

"ఎందుకు బాస్? ఇపుడేగదా జెయిలులోంచి బయట పడ్డాం!"

"అరె సాంబా! జెయిలు కూడు తిని నీ బుర్ర చెడిపోయింది."

"బాస్.... క్షమించు."

"లావణ్య రసగుల్లా. దాన్ని మన స్థావరానికి తీసుకుపోవాలి."

"కా....క్షమించు బాస్! నెలకోసారి జెయిలుకి వచ్చి సంతకం పెట్టాలి."

"అరె బేవకూఫ్! చంబల్ లోయకి పారిపోతాం. మనిషి మాత్రుడికి అందము."

"ఆ యింట్లోనే వున్నారో లేదో...."

"వున్నారు. సాలాగాడు రాశాడు. పిట్ట పదిలం అని. ఇల్లు మారివుంటే రాసేవాడే కదా!"

ఇద్దరూ క్రాస్ రోడ్లో నడిచారు. డైమన్ పార్కును సమీపించారు.

అప్పుడే స్కూలుబస్సు వచ్చి పార్కువద్ద ఆగింది.

గబ్బర్‌సింగ్ బస్సు దాటాడు.

సాయంకాలం నీరెండ రోడ్డుమీద లేత బంగారు రంగులో మెరుస్తోంది.

గబ్బర్‌సింగ్ ద్వారకానగర్‌లో ఆకుపచ్చ రంగు భవనం ముందు ఆగాడు. పోర్టికోలోకి నడిచాడు. గుమ్మానికి పక్క చలవరాతి పలక తాపడం చేసివుంది.

సైంటిస్ట్ పరాంజపే.

1910-1982.

గబ్బర్‌సింగ్ తల త్రిప్పి "సాంబా" అన్నాడు. ఆనందంతో ఉద్రేకంతో అతడి గొంతు వణకుతోంది.

"బాస్! గుమ్మం తాళంపెట్టివుంది!"అన్నాడు సాంబం.

"పిట్ట నగరంలోకివెళ్ళింది. పోర్టికోలోసైర్లగుర్తులు.... తాజా గుర్తులు...." గుమ్మం సమీపించాడు గబ్బర్‌సింగ్.

తాళం వున్న ప్రాంతం తడిమాడు. తృప్తిగా నవ్వాడు. పోర్టికోలో వెతికాడు. సన్నపాటి గొడుగు వూచ దొరికింది.

తాళం పట్టే రంధ్రంలో వూచను దూర్చి త్రిప్పాడు.

ముంజేతి కండరాలూ నరాలూ మెలితిరిగాయి.

క్లిక్‌మన్నది. తాళం వూడింది. తలుపు తెరచుకుంది.

గబ్బర్‌సింగ్ లోపలకు నడిచాడు.

సాంబం అతడిని అనుసరించాడు.

మెయిన్ హాలులో రెండు సోఫాలూ, వాటిమధ్య టీపాయ్, సోఫాలకు వెనక పుస్తకాల బీరువా వున్నాయి.

మేడమీదకు మెట్లున్నాయి.

గబ్బర్‌సింగ్ మెట్లమీదకు దూకాడు.

"సాంబా! నువ్వు గుమ్మం దగ్గరే వుండు" సమాధానం కోసం ఎదురుచూడకుండా మెట్లు ఎక్కి గదులు తణిఖీ ఛేయసాగాడు.

పెద్ద గదిలో ప్రవేశించాడు గబ్బర్‌సింగ్.

గడ్డం తడుముకున్నాడు.

గదిలో బట్టల బీరువా తెరగ తోసివుంది. మంచంమీద వుండవలసిన పరుపూ, దుప్పట్లూ అస్తవ్యస్తంగా నేలమీద పడిపోయాయి. పరుపూ తలగడలూ చీల్చి వున్నాయి.

పుస్తకాల రాక్ బోర్ల పడివుంది.

ఫ్లవర్‌వాజ్ పగిలి ముక్కలు చెల్లాచెదురయాయి.

గోడకి వున్న అద్దం పగిలి ముక్కలు గోడవద్ద పడి వున్నాయి.

గబ్బర్‌సింగ్ గడ్డం గోక్కుంటూ పుస్తకాల రాక్‌ను సమీపించాడు. అక్కడ ఏదో ఇన్విటేషన్ కార్డు అతనిని ఆకర్షించింది. కొద్దిసేపు తదేకంగా దానినే చూస్తూండి పోయాడు.

లావణ్యకు ఏమయింది?

ఈ గదిలో బీభత్సం ఏమిటి?

లావణ్య ఎక్కడికయినా వెళ్ళిందా? లేక....బీభత్సం సృష్టించిన వాళ్లు తీసుకువెళ్ళారా?

తనకంటె ముందు లావణ్యమీద దాడిచేసిన వాళ్ళెవరు? తనకంటె పరమ కిరాతకుడూ చురుకయినవాడూ రంగం లోకి దూకాడా?

ఆశ్చర్యం! ఇపుడు లావణ్య ఎక్కడున్నదని వెతకడం? అయినా తాను ఆమెను వెతుకుతూ కూర్చుంటే తనమీదకు పోలీసుల దృష్టి మళ్లుతుంది.

గబ్బర్‌సింగ్ నడవాలోకి వచ్చి చూశాడు.

సాంబం సోఫాలో కాళ్లు చాపుకొని పడుకున్నాడు.

"అరె సాంబా" మెట్లు దిగసాగాడు గబ్బర్.

"నువ్వు యిక్కడే రెస్ట్ తీసుకో" అన్నాడు గబ్బర్.

"బాస్! లావణ్యకు కాపలాగానా!"

"లావణ్యను ఎవరో ఎత్తుకు వెళ్ళిపోయి వుంటారు?"

సాంబం వులిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"నిజమా!"

"నా వూహ. అంతే!"

"అయితే నువ్వు ఎక్కడకు వెళ్తావు బాస్?"

"మనం లావణ్యను వెతకగూడదు."

"అవును. వెతుకుతోన్నట్టు పోలీసులకు అనుమానం వస్తే చాలు. ఎముకలు విరగతన్నుతారు!"

"అరె సాంబా!" ఆకుపచ్చ రంగు దంతాలు కనిపించాయి. "పోలీసులకు దొరకకుండా లావణ్యను పట్టుకుంటాను."

"ఎలా?"

"ఈ ద్వారకానగర్‌లోనే లాయర్ సౌజన్య వుంటోంది. ఆమె ఇంట్లో ఏదో ఫంక్షన్ వుంది. పిట్ట అక్కడే దొరకవచ్చు."

"సౌజన్యనా?" నోరావులించాడు సాంబం.

"అవును."

"జాగ్రత్త బాస్!"

"గబ్బర్‌కి జాగ్రత్త ఏమిట్రా సాంబా!" కదిలాడు గబ్బర్.

భవనంలోంచి బయటపడ్డాడు.

ద్వారకానగర్‌లో యిళ్ళ నెంబర్లో చూసుకుంటూ నడవసాగాడు. పార్క్ వెనకవీధిలో అంతసేపూ ఆగివున్న చెవర్లెట్ కారులో స్టీరింగ్ వీల్ దగ్గర కూర్చున్న లావణ్య వణుకుతోంది. ఆమె మొహంమీద చెమట బిందువులు పట్టాయి.

తనకోసం గబ్బర్‌సింగ్, సాంబం, యింటికి వచ్చారు. లోపలకు వెళ్ళారు. తాను బయట కాచుకుని వుండటం మంచిదయింది. పావు గంట తర్వాత గబ్బర్‌సింగ్ బయట పడ్డాడు. ఎక్కడకు వెళ్తున్నాడు?

తాను లాయర్ సౌజన్యకు చెప్పి, గబ్బర్‌సింగ్‌ను తన యింట్లో అక్రమ ప్రవేశానికి పోలీసులచేత బుద్ధిచెప్పించాలి.

లావణ్య పళ్లు కొరికింది.

కారు విండోలోంచి ఆమె భుజంమీద చెయ్యి పడింది.

లావణ్య వులిక్కిపడి తిరిగింది. ఆమెకు గుండె తెగిపడి తిరిగి అతుక్కున్నట్టయింది.

సాంబం!

"ఎక్కడికి పోతావే పిల్లా!" నవ్వాడు సాంబం.

"నువ్వా?" ఆమెకు గొంతు తడారిపోయింది.

"గొప్ప తెలివైనదానివే!"

లావణ్య చుట్టూ చూస్తోంది. సాంబం ఒక్కడే వున్నాడు. చుట్టుపక్కల ఎక్కడా గబ్బర్‌సింగ్ లేడు.

లావణ్య చటుక్కున అతడి చేతిని విదిలించి కొట్టింది.

సాంబం నవ్వాడు. "గదిలో బీభత్సం రేగినట్టు సీన్ సృష్టించావు. నువు పారిపోయావు కానీ, ఎవరూ ఎత్తుకు పోలేదు."

"నీకు ఆ విషయం ఎలా తెలుసు?"

"అద్దం పగలకొట్టావు. పరుపులూ తలగడలూ కోసి పెట్టావు. నీమీద అఘాయిత్యం జరిగి వుంటే నీ చేతి గాజులు పగిలి వుండేవి. ఇంట్లో ఎక్కడా గాజుముక్కలు లేవు."

లావణ్య తన చేతి గాజులవైపు చూసుకుంది.

"గబ్బర్‌కి నీమీద పిచ్చి ప్రేమ. ఆ ప్రేమతోనే అతడు

గుడ్డిగా నీ వెంటపడ్డాడు.”

లావణ్య వింటూనే ఆలోచిస్తోంది.

రోడ్డుమీద జనం తమ పనుల్లో సాగుతోన్నారు. తమని చూచి ఎవరయినా అనుమానించరు. ఆ ధీమాతోనే సాంబం తనతో అతిసాదాగా మాట్లాడుతున్నాడు.

అతడి అంతరంగం తనకు అర్ధమవుతోంది. గబ్బర్ సింగ్‌ను కాదని తాను అతడిని వరించాలి కాబోలు! చప్పిదవడల వెధవ!

లావణ పళ్ళు పటపటలాడించింది.

“గబ్బర్‌సింగ్!” అంది లావణ్య, ఎటో చూస్తూ.

సాంబం అదిరిపడి వెనక్కి తిరిగాడు.

కారు రోడ్డుమీద వురికింది!

సాంబం నిరాశగా ఆగిపోయాడు. కారు అతడి ముందు నుండి పరుగెత్తుకుంటూ పోయింది.

3

పుట్టినరోజు పార్టీ ఘనంగా చేస్తోంది వనజ.

స్నేహితురాళ్ళ నందరినీ పిలిచింది. మెయిన్ హాలులో తోరణాలు కట్టారు. టేబులుమీద బర్త్‌డే కేక్, కొవ్వొత్తులూ అమర్చారు.

వనజ కేక్ కట్ చేసింది.

స్నేహితురాళ్లు చప్పట్లు కొట్టారు.

సర్వర్ అందరికీ కూల్‌డ్రింకులు అందించసాగాడు.

వనజ అందరినీ నవ్వుతో చూస్తోంది.

లాయర్ సౌజన్య ఆమె భుజంమీద చేయి వేసింది. ఆప్యాయంగా నిమిరింది.

వనజ నవ్వుతూ స్నేహితురాళ్ళ వైపు చూచింది. స్నేహితురాళ్ళలో లావణ్య వుంది.

లావణ్య ఆమెవైపు నడిచింది.

"బాగున్నావా వనజా!" పలకరించింది లావణ్య.

వనజ తలూపి ఆమె చేతులు అందుకుంది.

ఇద్దరూ మాటల్లో పడ్డారు.

సర్వర్ వాళ్ళను సమీపించాడు.

"మేడమ్!" లావణ్యను పిలిచాడు.

ఏమిటన్నట్టు చూచింది లావణ్య.

"మీ కోసం డ్రాయింగ్ రూంలో ఒక అమ్మాయి వెయిట్ చేస్తోంది" సర్వర్ చెప్పి, కదిలాడు.

"వెళ్ళి చూడు!" అంది వనజ.

లావణ్య డ్రాయింగ్ రూంలోకి నడిచింది.

డ్రాయింగ్ రూంలో ఎవరూ లేరు.

సర్వర్ గుమ్మం దగ్గరకు వచ్చాడు. లావణ్య గుమ్మం వైపు వస్తోంది. గుమ్మం దాటితే గది, గదిప్రక్కన మెయిన్ హాలూ.

"అటుప్రక్క మేడం!" సర్వర్ వెనక్కి చూడ మన్నట్టు సైగ చేశాడు.

లావణ్య అనుమానంగా వెనక్కి తిరిగింది.

గబ్బర్ సింగ్ పిస్తోలుతో కనిపించాడు.

"లావణ్యా!" నవ్వాడు గబ్బర్ సింగ్.. "ప్రాణాల మీద ఆశ వుంటే అరవక!"

లావణ్య వణికిపోయింది.

సర్వర్ వైపు తలత్రిప్పింది. ఉలిక్కిపడింది.

సాంబం! తాను అతడిని గుర్తుపట్టకపోవడం పెద్ద పొర పాటు! టోపీ తప్పించాడు. గుర్తు దొరుకుతున్నాడు ఇప్పుడు.

తెల్లటి డ్రస్‌లో సర్వర్‌నుచూపి తాను మోసపోయింది.

లావణ్య తల విదిలించింది.

"మా వెంట నిశ్శబ్దంగా బయటకు నడువ్. బయట మెటడోర్ వాన్ వుంది" అన్నాడు గబ్బర్ సింగ్, పిస్తోలు వూపి.

"చెప్పినట్టు విను లావణ్యా! నీ బతుకు గబ్బర్ సింగ్ తోనే. నువ్వు నా కంటబడకుండా తప్పించుకున్నావు" అన్నాడు సాంబం.

"నీలాంటి తెలివైన పిల్ల నా బారిన పడటం నా అదృష్టం!" లావణ్యను సమీపించాడు గబ్బర్ సింగ్.

"తెలివంటే తెలివా? ఎవరో ఎత్తుకుపోయినట్టు దొంగ సీన్ సృష్టించింది!"

లావణ్యను పిస్తోలుతో పొడిచాడు గబ్బర్ సింగ్.

లావణ్య చేసేదిలేక బయటకు వెళ్ళే గుమ్మంవైపు అడుగులు వేస్తోంది. గబ్బర్ ఆమెను అనుసరించాడు.

"కియ్యకు....క్...." వెనుక దబ్బున చప్పుడయింది. గబ్బర్ సింగ్ చటుక్కున వెనక్కి తిరిగాడు.

అతడి చేతిమీద చటుక్కున దెబ్బపడింది.

ఎముక ఫట్ మంది. పిస్తోలు ఎగిరి గదిమూల పడింది.

లాయర్ సౌజన్య అతడిముందు నిలబడింది.

"నీవు వస్తావని తెలుసు. అందుకే అన్ని ఏర్పాట్లు చేసాను" అంది సౌజన్య.

గదిలోకి పోలీసులు ప్రవేశించారు.

* * *

జెయిలర్ వాళ్ళవంక ఆశ్చర్యంగా చూశాడు.

గబ్బర్ సింగ్, సాంబం పళ్ళు కొరుకుతున్నారు. సెల్ లోకి మౌనంగా నడిచారు.

తలుపుమూసి తాళం వేశాడు జెయిలర్. □

సీరియల్



వాణిశ్రీ

కాంచనగ్రహం

(గత సంచిక తరువాయి)

ఆమె వాచీ చూస్తోంది....పది దాటి పదినిమిషాలైంది.

ఏరియల్ అన్నచోట బటన్ నొక్కింది. మేడపైన టి. వి. యాంటీనా నుంచి సన్నటితీగ ఆకాశంలోకి దూసుకుపోయింది. ఆమెకు మాత్రం ఎర్రటి లైటు మినుకుమినుకుమంటూ వుండటం కనిపిస్తోంది.

కొంచెం సేపటికి ఎర్రలైటు పచ్చగా మారింది.

అప్పుడామె రిసీవర్ బటన్ నొక్కింది. మొదట గర్ గర్‌మని శబ్దాలు వచ్చినా తర్వాత అదుపులోకి వచ్చాయి.

"హలో....హలో...." అంటూ కూర్చుంది. చాలా సేపటి వరకూ రెస్పాన్స్ రాలేదు.

అరగంట తర్వాత "యస్....జాన్ స్పీకింగ్" అన్న మాటలు వినిపించాయి.

ఆమె ముఖం విప్పారింది తన ప్రయత్నం ఫలించినందుకు.

"మిస్టర్ జాన్...."

"యస్....జాన్"

"అయామ్ స్పీకింగ్ ఫ్రమ్ స్టేషన్ త్రీ ప్లీజ్" గట్టిగా అంది ఆమె.

"స్టేషన్ త్రీ! గుడ్....వేరీజ్ చైతన్య? హూ ఆర్ యూ మేడమ్?"

"అయామ్ అసిస్టెంట్ టూ చైతన్య."

"గ్లాడ్ టూ మీట్ యూ మేడమ్. మే ఐనో యువర్ గుడ్‌నేమ్?"

"మై నేమ్ ఈజ్ అరుణతార."

"టెల్ మీ మేడమ్. వాటెబౌట్ చైతన్య? నో రెస్పాన్స్ ఈజ్ కమింగ్ సిన్స్ ఎ లాంగ్ టైమ్!"

జాన్ ప్రశ్నలవర్షం కురిపించాడు.

"కారణం ఏమీ లేదు. అతను జబ్బున పడ్డాడు. ఇన్ని రోజులూ ఢిల్లీలో వున్నాడు. ఈ రోజునే ఇద్దరం కలిపి హైదరాబాద్ వచ్చాం. కాని ఎయిర్‌పోర్టులోనే అతన్ని పోలీసులు అరెస్ట్ చేశారు?"

"ఎందుకు?"

"వెండికొండ డామ్ పగలగొట్టడానికి ప్రయత్నించాడని నేషనల్ సెక్యూరిటీ యాక్టు క్రింద అతన్ని అరెస్ట్ చేశారు. అలా డామ్ పగలడానికి కారణం యేమిటో చైతన్య మిమ్మల్ని అడిగి తెలుసుకోమన్నాడు. చెప్పండి. ఎందుకు అలా జరిగింది? మన ఫాల్టు ఏమైనా వున్నదా?"

"యస్. మేడమ్. అతను అనుకున్నది నిజమే. ఆ రిజర్వాయర్లో మన స్థావరం వుంది. ఒకరోజు రిజర్వాయర్‌లో ఆక్సిజన్ మాస్క్‌లు తగిలించుకున్న యిద్దరు వ్యక్తుల్నిచూసి మనవాళ్ళు అనుమానపడ్డారు. మనస్థావరం ఎవరో కనిపెట్టారని భయపడి వాళ్ళని మట్టుపెట్టారు. అక్కడ్నుంచి వెళ్ళిపోయే ప్రయత్నంలో ఆపరేషన్ రాంగ్ జరిగి డామ్‌కు దెబ్బ తగిలింది."

"అయితే తప్పంతా మనదే అన్నమాట."

"ఎస్!"

"నే నీ విషయం చైతన్యకి తెలియజేస్తాను. మళ్ళీ ఇదే సమయానికి రేపు రాత్రికి మీతో మాట్లాడతాను. ఓ.కే."

"ఓ.కే. థాంక్స్."

మర్నాడుదయం స్పెషల్ పర్మిషన్ తీసుకుని చైతన్యను చూడడానికి అరుణతారకు పర్మిషన్ ఇచ్చారు.

సాయుధులైన గార్డులు కళ్ళ రెప్పలు వెయ్యకుండా అతన్నే చూస్తున్నారు. అతను తప్పించుకుపోతే సస్పెన్షన్ ఖాయమని డి. జి. పి. హెచ్చరించడంవల్ల జాగ్రత్తగా కాపలా కాస్తున్నారు గార్డులు. అతను ఏ క్షణంలో తప్పించుకు పోతాడోననే భయం గుండెల్లో గూడుకట్టుకుని వుంది వాళ్ళని.

"గుడ్ మార్నింగ్ చైతన్యా!" నవ్వుతూ పలకరించింది

అరుణతార.

చైతన్య హుషారుగానే వున్నాడు.

"వెరీ గుడ్ మార్నింగ్" అన్నాడు.

"నువ్వు ఊహించిన విధంగానే సమాధానం ఇచ్చాడు జాన్" అంటూ జరిగిందంతా చెప్పింది.

అంతా విని చైతన్య ముఖం గంభీరంగా మారిపోయింది.

"ఐ యామ్ సారీ తారా! చిన్న పొరపాటువల్ల పెద్ద నష్టం జరిగింది. నష్టపరిహారానికి నిర్ణయం జరగాలి" అన్నాడు.

"చైతన్యా! ఏమిటి నువ్వు మాట్లాడేది? జరిగినదానికి నష్టపరిహారం చెల్లిస్తావా? ఎంత డబ్బు కావాల్సొస్తుందో ఆలోచించావా?" ఆశ్చర్యపోతూ ప్రశ్నించింది అరుణతార.

"ఎంతయినా సరే తప్పదు. ఆ నష్టం ఒక వ్యక్తికి సంబంధించింది కాదు. మొత్తం దేశానికి సంబంధించింది" అతని కంఠం కఠినంగా పలికింది.

"కావొచ్చు. నష్టం లక్షలు దాటిపోయి కోటికి చేర వచ్చు. అప్పుడు ఎలా చెల్లించగలననుకుంటున్నావు?"

"బాస్ అనుమతిస్తే కోటి పెద్ద సమస్య కాదు" అన్నాడు.

కోటి అంటే లెక్కలేనట్లు మాట్లాడుతున్న అతన్ని విభ్రమంగా చూస్తూ వుండిపోయింది ఆమె.

"తారా! నువ్వు ఆశ్చర్యపోకు. మా ఉద్యమంతో పోలిస్తే కోటి అనేది అల్పమైన సంఖ్య. నువ్వు జాన్‌కి ఖచ్చితంగా చెప్పు. జరిగిన నష్టానికి పరిహారం చెల్లించడానికి వెంటనే ఏర్పాట్లు చెయ్యమని. అవసరం అనుకుంటే బాస్ పర్మిషన్ తీసుకుని అయినా సరే. ఆ డబ్బు చెల్లించే

వరకూ నేను జైల్లోనే వుంటానని చెప్పు. ఉద్యమం మూలంగా మన దేశానికి ఎటువంటి నష్టం జరిగినా నేను సహించను'' అన్నాడు చైతన్య.

"ఈ రోజు నిన్ను కోర్టులో హాజరు పరుస్తారట. పేపర్లో న్యూస్ పడింది. నువ్వు పోలీసులకు దొరకడంవల్ల మా ఫాదర్ సంతోషంగా వున్నాడు. డామ్ పగులుకు కారణం తను కాదనీ, తనని బ్లాక్ లిస్టులో వెయ్యడం అన్యాయమని కోర్టుకి వెళ్ళడానికి సన్నాహాలు చేస్తున్నాడు. లాయర్లు పిటీషన్ తయారు చేస్తున్నారు హడావుడిగా'' అంది తార నవ్వుతూ.

"పోనీ పాపం. ఇప్పటికే పరువుపోయి ఏడుస్తున్నాడు'' అని నవ్వాడు చైతన్య.

"ఇక టైం అయిపోయిందమ్మా!'' అంటూ గార్డు వచ్చి హెచ్చరించాడు ఆమెను వెళ్ళిపోవలసిందిగా సూచిస్తూ.

33

వెండికొండ డామ్ నలభై తొమ్మిదో బ్లాక్ పగిలి నీళ్ళు కారిపోవడం ప్రారంభించింది. డామ్ నిర్మాణంలో బ్లాకుల పద్ధతి అనుసరించి నిర్మించడంవల్ల పెద్ద ప్రమాదం తప్పింది. పగులు నలభై తొమ్మిదో బ్లాక్ వరకే పరిమితమైంది.

డామ్ మొత్తం పగిలిపోతున్నదనే పుకార్లు అధికార్లు ఖండించారు. పగులు మొత్తం నలభై తొమ్మిదో బ్లాకు వరకే అవడంవల్ల నది పల్లపు ప్రాంతంలో ఎర్రవాడ పట్టణం వరకూ వున్న అనేక పల్లెలకు ప్రమాదం తప్పింది.

దాదాపు వందమైళ్ళ వైశాల్యంలో రిజర్వు అయివున్న నీరు ఒక్కుమ్మడిగా కాకుండా నెమ్మదిగా నదిలోకి ప్రవ

హిస్తూ వుంది. అయినా ఏ క్షణంలో పగులు పెద్దదై నీరు అదాటున దూకితే జరుగనున్న ప్రమాదం వూహించి ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా పల్లెలలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఎర్రవాడ పట్టణం నిర్మానుష్యంగా యుద్ధంలో బాంబులు పడి నాశనమైపోయినట్లు కళావిహీనమైపోయింది. ప్రజలు ఇళ్ళలో లేనందు వల్ల అదే అదునుగా దొంగలు విజృంభించి ఇళ్ళు దోచుకోకుండా ప్రభుత్వం సి.ఆర్.పి. గస్తీలు వీధి వీధికీ ఏర్పాటుచేసింది.

డామ్ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కి, ఎర్రవాడ పట్నానికీ గంట గంటకీ వైర్లెసు రిపోర్ట్సు వెళ్తున్నాయి నీరు ఎన్ని క్యూసెక్కులు విడుదలైందీ తెలియజేస్తూ.

పగులుకు కారణం నిర్ధారించలేకపోయినా ప్రభుత్వం మాత్రం నలభై తొమ్మిదో బ్లాక్ నిర్మాణంలో పాల్గొన్న ఇంజనీరింగ్ అధికారులను సస్పెండ్ చేసింది. కంట్రా క్టర్ని బ్లాక్ లిస్టులో పడేసింది.

కొద్ది రోజుల్లోనే వెండికొండ రిజర్వాయర్లో నీరంతా నదిలోకి ప్రవహించి వృధాగా సముద్రం పాలైంది.

డామ్ పగులుకు వెంటనే రిపేర్లు చేపట్టడానికి ఇంజనీర్లు ఎస్టిమేట్లు తయారుచేస్తూ నిర్విరామంగా కృషిచేస్తున్నారు. రెండు నెలలపాటు రాత్రింబగళ్ళు పని జరిపించి రిపేరు చేస్తామనీ వర్షాకాలంలో మామూలు ప్రకారం రిజర్వాయర్ నిండిపోతుందనీ కుడి, ఎడమ కాలవలకు యథాప్రకారం నీరు వదుల్తామనీ డామ్ అధికార్లు పత్రికా ప్రతినిధులకు తెలియజేశారు.

కంట్రాక్టర్ గోవిందరాయుడు తన కూతురు ప్రేమి కుడు కృష్ణచైతన్య తనమీద కుట్ర చేశాడని ప్రకటించడం,

హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అతన్ని అరెస్ట్ చేయడంవల్ల ప్రభుత్వం కాస్త ఊపిరి పీల్చుకుంది.

నేషనల్ సెక్యూరిటీ యాక్టు క్రింద కృష్ణ చైతన్యను అరెస్ట్ చేసిన రెండో రోజునే కోర్టులో హాజరు పరిచారు. అతని మీదవున్న పాత కేసులు కొత్త కేసులతో పాటు కోర్టులో పెట్టారు పోలీసు డిపార్టుమెంట్ తరపున హోమ్ గవర్నమెంట్ ప్లీడరు.

కేసు విచారణకు వచ్చింది. కేసు విచారణ జరుగుతున్నప్పుడు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చైతన్య తరపున ప్రముఖ క్రిమినల్ లాయర్ రాయప్ప హాజరై వాదన అసక్తికరంగా సాగించాడు.

ఢిల్లీ అశోకా హోటల్ సిబ్బంది సాక్ష్యం, చైతన్యకు ట్రీట్‌మెంట్ ఇచ్చిన డాక్టర్, నర్సుల సాక్ష్యాలవల్ల డామ్ పగులు ఏర్పడిన రోజున అతను ఢిల్లీలోనే వున్నట్లు రుజువైంది. పాత కేసుల్ని గూడా దూదిపింజల్లా ఎగరగొట్టాడు లాయర్. ప్రభుత్వ వాదనలో పస కన్పించలేదు. అతి పేలవంగా తయారైంది.

వాదోపవాదాలు పూర్తయ్యాయి. సిమెంట్ కుంభకోణం కేసులో పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకుని పోయినందుకు మాత్రమే వెయ్యిరూపాయలు జరిమానా పడింది.

వెండికొండ డామ్ పగులుడు కేసులో నిర్దోషిగా తేల్చారు. ఇక గోవిందరాయుడు ఇంట్లో చెప్పి చేసిన దొంగతనం అంతా కట్టుకథగా వుందనీ, పోలీసులు కాపలా వుండగా మనిషి అదృశ్యరూపంలో వచ్చి దొంగతనం చేశాడనడం నమ్మదగినదిగా లేదని జడ్జీగారు అభిప్రాయపడ్డారు.

చైతన్యకు జైలుశిక్ష పడుతుందేమోనని భయపడుతున్న

అరుణతార అమితంగా సంతోషించింది.

ఆమె వెంటనే జరిమానా పడిన వెయ్యిరూపాయలు చెల్లించివేసింది.

చైతన్యకు జైలుశిక్ష పడుతుందని ఆశించిన గోవింద రాయుడు నిరాశపడ్డాడు. భవిష్యత్తులో వీడు తనని ఎన్ని తిప్పలు పెడతాడోనని భయం కలిగింది. అతను ముఖ్యంగా భయపడుతున్నది డబ్బు గురించి కాదు, కోటేశ్వరరావుని తను హత్య చేశానని ఎక్కడ బైటపెడతాడోనని హడలిపో సాగాడు. మానసికంగా చిత్రవధ అనుభవించడంవల్ల అత నికి పిచ్చెక్కినట్లయింది.

౩

"ఇప్పుడు మన ప్రోగ్రామ్ ఏమిటి?" హైకోర్టులో నుంచి వచ్చాక అడిగింది అరుణతార.

"ముందు ఇంటికి?" ముక్తసరిగా సమాధానం చెప్పాడు చైతన్య.

అతని ఆలీవ్ గ్రీన్ కలర్ జీప్ వేగంగా పోతోంది బ్రిడ్జి మీద.

అతను సీరియస్‌గా ఆలోచిస్తున్నాడని ఆమె గ్రహించి మాట్లాడకుండా కూర్చుంది.

జీప్ పోర్టికోలో ఆగింది.

సరాసరి డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళి కూర్చున్నాడు. నౌకరు వచ్చి ఏ. సి. ఆన్ చేశాడు. కుక్ వచ్చి 'ఆజ్ఞ' అన్నట్లు నిల్చుని వుంది.

"టీ" అన్నాడు అతను.

"ఏమిటి సీరియస్‌గా ఆలోచిస్తున్నావు?" అతని ప్రక్కనే కూర్చుని ప్రశ్నించింది అరుణతార.

"బాస్ నష్టపరిహారానికి ఎందుకు ఒప్పుకోలేదు? అని

ఆలోచిస్తున్నాను" అన్నాడు.

"ఒప్పుకోకపోతే?"

"నూటికి తొంభై పాళ్ళు ఒప్పుకుంటాడు. లేకపోతే నేనే స్వయంగా వెళ్ళి ఒప్పిస్తాను. లేదా...." అని ఏదో అనబోయి ఆమె ముఖం చూసి ఊరుకున్నాడు.

"లేదా!....అని ఆగిపోయావేం!....ఏం చేస్తావు?" నవ్వింది ఆమె.

"అప్పుడే ఆలోచిస్తాను" అన్నాడు చిరుమందహాసం చేస్తూ.

కుక్ 'టీ' తెచ్చి టీపాయ్‌మీద పెట్టింది.

"ఈ రోజుగూడా బాస్ నుంచి కమ్యూనికేషన్ రాకపోతే మనం వెళ్ళాల్సి వస్తుంది" అన్నాడు.

"ఎక్కడికి? మీ బాస్ యెక్కడ వుంటాడు? ప్లీజ్ చైతన్యా! చెప్పవూ?" కళ్ళల్లో అభ్యర్థన చూసి అతనికి జాలి కలిగింది.

ఆమె తనను యెంతగా ఆరాధిస్తున్నదో అనే వూహ రాగానే అతని హృదయం స్పందించింది.హాయిగా జీవించే అవకాశం వున్నా ఆమె తనతో కష్టాలు పడడానికే సిద్ధపడుతూ రావడాన్ని యేమనుకోవాలి? ప్రేమ, ఆరాధన, ఆకర్షణా!....యేమిటి కారణం? అతని మనసు గజిబిజి ఆలోచనలతో నిండిపోయింది.

"ఏమిటి చైతన్యా! అలా రెప్పలు కొట్టడం మానివేసి ఎందుకలా చూస్తున్నావు?"

ఆమె ముఖం ఎర్రబడింది సిగ్గుతో.

"నువ్వు చిన్నపిల్లలా అమాయకురాలిలా కనిపిస్తున్నావు. అందుకే అలా చూస్తూ వుండిపోయాను."

"నీ మాటలకేం గాని! మనం యెక్కడికి వెళ్ళాలంటే

చెప్పవేం? మీ బాస్ యెక్కడ వుంటాడు? ఇంకా నన్ను నమ్మడంలేదా నువ్వు? నీ సస్పెన్స్‌తో నన్ను చంపేస్తున్నావు? నీ నమ్మకం సంపాదించాలంటే నన్నేం చెయ్యమంటావు చెప్పు?"

"ఆఁ....ఆఁ....అంత కోపం అయితే ఎలా? శాంతి.... శాంతి...." అని నవ్వాడు.

ఆమె సీరియస్‌గా చూస్తూ వుండిపోయింది.

"నేను నీ దగ్గర రహస్యాలు యేమీ దాచను. రేపటి నుంచి అన్నీ చూపిస్తాను. చెప్పడం యెందుకు సరేనా?" ఆమె భుజంమీద చెయ్యివేసి అనునయంగా అన్నాడు.

"నిజంగా!" నమ్మలేనట్లు చూసింది.

"అవును తారా, ఇక నాకూ నీకూ భేదం ఏమీలేదు. మనిద్దరం ఒకటిగా జీవిస్తాం. నేను అనుకోని దుష్పరిమాణం ఒకటి సంభవించింది. అదే వెండి కొండ డామ్‌కి ప్రమాదం. దాని నష్టపరిహారం చెల్లించేవరకూ నా మనస్సు శాంతించదు" అన్నాడు.

"సరే!....తారా! నేను స్నానంచేసి వస్తాను. టి. వి. టూ దగ్గర వుండు. జాన్‌తో మాట్లాడు. ముఖ్యంగా నష్టపరిహారం గురించి" అన్నాడు.

ఆమె తల వూపి మేడపైకి వెళ్ళిపోయింది.

చైతన్య స్నానం చేసి డ్రెస్ చేసుకుంటూ వుంటే అరుణతార హడావుడిగా వచ్చి "చైతన్యా! గుడ్ న్యూస్! బాస్ నష్టపరిహారం యివ్వడానికి ఒప్పుకున్నాడు" అంది ఆనందంతో.

అతని ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

"వెరీ గుడ్!...." అన్నాడు.

ఆమెను దగ్గరగా తీసుకుని, చెవిలో గుస గుసలాడి

నట్లు "పద తారా! ఈవాళ ఏదోక సినిమాకి వెళ్దాం...." అన్నాడు.

"ఏ సినిమాకి....?"

"ఏదో ఒకటి" అన్నాడు.

"గ్రహాంతరవాసుల యుద్ధం అని ఒక ఇంగ్లీషు పిక్చర్ వుంది. వెళ్దామా?"

"ఇంగ్లీషువాళ్ళు గూడా మన విఠలాచారితో పోటీ పడుతూ తీస్తున్నారు ఇటువంటి సినిమాలు. పద....ఏదోక కాలక్షేపం. రేపే మన ప్రయాణం. నువ్వు సినిమా చూసిన తర్వాత మీ యింటికి వెళ్ళిపో. నీ సరంజామా సర్దుకుని ప్రొద్దున్నే వచ్చేయ్! వచ్చేటప్పుడు మీ అమ్మ, నాన్న కాళ్ళకు నమస్కారాలు చేసి మరీ రా! మళ్ళీ ఎప్పుడు చూస్తావో పాపం వాళ్ళని...."

"చాలు యిక ఆపు!" అంది ఆమె చిరుకోపం ప్రదర్శిస్తూ.

"రేపు మీ నాన్న నామీద మళ్ళీ పోలీస్ కంప్లెయింట్ ఇస్తాడు కాబోలు."

"ఎందుకు?"

"నా కూతుర్ని యెత్తుకు పోయాడు దేవుడోయ్ అని."

ఆమె పక పక నవ్వింది.

35

శరవేగంతో పోతున్న జీప్ తారురోడ్డు నుంచి ప్రక్కకు మళ్ళింది. ఆ కుదుపుకి అరుణతార యెగిరి పడింది.

"అబ్బ ఏమిటా రాష్ డ్రైవింగ్?" అంది జారిపోయిన పమిట సర్దుకుంటూ.

"సిటీలో అయితే ట్రాఫిక్ పోలీసుల భయం. ఈ అడవిలో భయం యేమిటి?...." చైతన్య నవ్వుతూ అన్నాడు.

కంకర రోడ్డు కుదుపులకు ఆమె ఎగిరెగిరి పడుతూ చైతన్య భుజం గట్టిగా పట్టుకుంది.

రోడ్డు ప్రక్కల యెత్తయిన చెట్లు గుబురుగా వున్నాయి. కొంత దూరం చీకటిగా వుండేంత దట్టంగా వుంది అడవి.

లేడి, దుప్పి, నెమళ్ళు, కుందేళ్ళు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. జీప్ వస్తున్న ధ్వని విని కంగారు పడి పారిపోతున్నాయి. అరుణతార వాటిని ఆసక్తిగా చూస్తూ ముచ్చటపడింది.

"తుపాకీ తీసి రెడిగా పట్టుకో" అన్నాడు చైతన్య.

"ఎందుకు?"

"ఎందుకయినా మంచిది. చెట్టుపై నుంచి ఏ చిరుతపులో మనపైకి దూకవచ్చు. దారిలో పెద్దపులి ఎదురై మన జీప్‌కి అడ్డంగా నిల్చోవచ్చు" అన్నాడు నవ్వుతూ.

"ఈ అడవిలో పులులు గూడా వున్నాయ్యా" ఆశ్చర్యపోయింది ఆమె.

"పులులు అడవిలో వుండక జూలో మాత్రమే వుంటాయనుకున్నావా? భలేదానివే. ఈ అడవిలో లేని జంతువు లేదు. ఏనుగులు గూడా వున్నాయి. ఎలుగులు లెక్కలేనన్ని. జంతువులే కాదు ఎన్నో వేల రకాల ఔషధ మొక్కలు గూడా వున్నాయి. చలిదేశంలో తప్ప వేడి ప్రాంతాల్లో దొరికే అన్ని రకాల వృక్ష సంతతి యీ అడవిలో వుంది."

"అలాగా!" అని ఆశ్చర్యంగా చూసింది.

ఎండ తీవ్రంగా వున్నా రోడ్డుకి రెండుప్రక్కలా చెట్లు దట్టంగా పరుచుకుని వుండి నీడని ఇస్తున్నందువల్ల చల్లగా వుంది.

అప్పుడప్పుడూ కనిపించే జంతువుల్ని కుతూహలంగా చూస్తూ కూర్చుంది అరుణతార.

అడవిలో నాలుగయిదు మైళ్ళు పోయాక ఆమె హఠాత్తుగా అడిగింది, "మనం యెక్కడికి వెళ్తున్నాం" అని.

"జాన్ దగ్గరకు" అన్నాడు చైతన్య.

"జాన్ ఈ అడవిలోనా వుండేది?" ఆశ్చర్యపోయింది ఆమె.

"అవును. ఏం?"

"నేను అలా అనుకోలేదు."

"మరి ఏమనుకున్నావు?"

"వైర్‌లెస్‌లో అతని కంఠం స్పష్టంగా వినబడేది. సిటీలోనే ఎక్కడో మరో ప్రాంతంలో వుంటున్నాడని అనుకున్నాను."

"కాదు. సిటీ యిక్కడికి వంద మైళ్ళు పైనే వుంది"

"అతను యీ అడవిలో యెందుకు వుంటున్నాడు" ప్రశ్నించింది ఆమె.

అతను నవ్వి "అతని స్థావరం ఇది. ఇండియా మొత్తానికి మా బాస్ నియమించిన ప్రతినిధి జాన్ అతని మిసెస్ కాథరిన్. దాదాపు పదేళ్ళ పాటు యిక్కడే వుంటారు. ఇండియాలో దొరికే అన్ని రకాల మొక్కలు ముఖ్యంగా ఓషధులు, వృక్ష సంతతి, జంతువులు వాళ్ళు సేకరిస్తారు."

"వూఁ.... సేకరించి!"

"వాటిని పరిశోధిస్తారు. అవి బ్రతకడానికి యెటువంటి వాతావరణం వుండాలో నిర్ధారిస్తారు. జంతువులు వాటి తిండి, అలవాట్లు క్షుణ్ణంగా పరిశీలించి నోట్స్ తయారు చేస్తారు."

"అవును. ఇవన్నీ ఎందుకు?"

"ఈ ప్రపంచంలో వున్న అన్ని రకాల మొక్కలు, వృక్షాలు, జంతు సంతతిని రక్షించాలని మా బాస్ సంకల్పం."

"రక్షించడమా? ఇప్పుడు వాటికి ప్రమాదం యేం ముంచుకు వచ్చింది?"

"కంటికి కనిపించని ప్రమాదం ముంచుకురాబోతున్నది. అది యెప్పుడైనా రావచ్చు. రావడం అంటూ జరిగితే ఈ ప్రపంచంలో యే జీవీ మిగలకపోవచ్చు. సర్వనాశనం జరిగి పోతుంది."

"ఏమిటది?" భయంగా అడిగింది అరుణతార.

"ప్రపంచ యుద్ధం" గంభీరంగా అన్నాడు చైతన్య.

"వస్తే మటుకు అది కొన్ని దేశాల మధ్య జరుగుతుంది."

"అక్కడే పొరపాటు పడుతున్నావు తారా! లోగడ జరిగిన రెండు ప్రపంచయుద్ధాలకూ రేపు రాబోయే ప్రపంచ యుద్ధానికీ ఎంతో వ్యత్యాసం వుంది."

"అంటే ప్రపంచంలో వున్న అన్ని దేశాలూ పాల్గొంటాయనా నీ వుద్దేశ్యం?"

"వుహూఁ....అది కాదు. పాల్గొన్నా లేకపోయినా నష్ట పడక తప్పదు. గత రెండు యుద్ధాల్లోనూ జన నష్టం, ఆస్తి నష్టం జరిగింది. ఈసారి యుద్ధానికి రక రకాల మారణాయుధాలు తయారు చేస్తున్నారు అగ్రరాజ్యాలు అనబడే దేశాలు

న్యూట్రాన్ బాంబ్ అని పేరు విని వుంటావు."

"అవును విన్నాను."

"అది ఆస్థి నష్టం జరగనీయకుండా కేవలం విషవాయువులు వెదజల్లి జన నష్టం కలుగచేస్తుంది. అదొక్కటే కాదు, సభ్య ప్రపంచానికి తెలియని ఎన్నో రకాల మారణాయుధాలు తయారవుతున్నాయి. కొన్ని ఆయుధాలు వాతావరణాన్ని నాశనం చేస్తుంది.పండించడానికి పనికి రాకుండా కొన్ని వేల సంవత్సరాలపాటు భూమిని నిరుపయోగం చేసేవి కొన్ని. మనిషిని పీడించి రక రకాల జబ్బులకు గురిచేసి జీవచ్ఛవం చేసి నాశనం చేసేవి మరికొన్ని. చెప్పకుంటే ఎన్నో వున్నాయి."

"వీటి బారినుంచి మీ బాస్ ఎలా రక్షించగలడు?"

"అందుకే అయన ఎప్పటినుంచో తన ప్రయత్నాలు మొదలుపెట్టాడు."

"ఎవరు ఆయన?"

"మిష్టర్ సైరన్. గొప్ప సైంటిస్ట్. ఇప్పటికి రెండు వందల రకాల పరికరాలు కనిపెట్టాడు. ప్రపంచంలో ఆయనకు సాటి ఎవరూ లేరు."

"ఏ దేశంలో వుంటాడు ఆయన?"

"గలీలిలో."

"అదేమి దేశం? ఎక్కడుంది?"

"అది ఆయన స్వంత దేశం."

అరుణతార ఆశ్చర్యపోయి చూస్తూ వుండిపోయింది.

"ఎందుకు అంత ఆశ్చర్యం?"

"మనకి స్వంత యిల్లులా ఆయనకు స్వంతదేశం వుందన్నమాట."

"అవును. ఆయన జీవితచరిత్ర విచిత్రంగావుంటుంది.

సైరన్ అమెరికాలో పుట్టాడు. ఆయన తండ్రి ఒక ఫ్రెంచి అమ్మాయిని పెళ్ళి చేసుకుని యింటిని వదిలిపెట్టాడు. తన ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్ళి చేసుకున్నాడని సైరన్ తాత కొడుకుని ఇంట్లోనుంచి వెళ్ళగొట్టాడు.

సైరన్ పుట్టాక పదేళ్ళకే తండ్రి పోయాడు. తల్లి అతన్ని అష్టకష్టాలుపడి పెంచి చదివించింది. సైరన్ పట్టుదలతో చదువుకుని సైంటిస్ట్ అయ్యాడు. అతని అసాధారణ్ణమైన తెలివితేటలు ప్రతిభ చూసి తోటి సైంటిస్టులే అసూయ పడేవాళ్ళు.

స్వంతంగా పరిశోధనలు సాగించడాకి కావలసిన లేబరేటరీ లేక తన ప్రతిభ వ్యర్థమైపోతుందేమోనని చింతించేవాడు. అప్పటికే పేరులోవున్న సైంటిస్టుల దగ్గర సహాయకుడిగా చేరి పరిశోధనలు చేసి ఏదైన కొత్త విషయం కనిపెట్టినప్పుడు ఆ పేరు గురువుగారు కొట్టేసేవాడు.

సైరన్ హ్యూస్టన్‌లో నేషనల్ ఎరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్‌లో పని చేస్తున్నప్పుడు అతన్ని అదృష్టం వరించింది. అప్పటికి అతని తాత వ్యాపారంలో అంతులేని ధనం సంపాదించాడు. ఎంత ఆస్తి వుందో తెలియనంత పెరిగిపోయింది సంపద. తనకంటూ ప్రత్యేకంగా ఒక ద్వీపం కొని అందులో మకాం పెట్టాడు. తన మనుమడు సైరన్ సైంటిస్ట్ అయ్యాడని తెలుసుకున్నాడు. అవసాన దశలో సైరన్‌ని తనదగ్గరకు పిలిపించుకుని ఆస్థిపాస్తులన్నీ మనుమడికి అప్పగించి కన్ను మూశాడు.

ప్రతిభ వున్నవాడికి డబ్బు తోడైతే ఇక ఎన్ని విచిత్రాలైనా చేయవచ్చు. సైరన్ అదే పని చేస్తున్నాడు."

సైరన్ పథకం గురించి చెప్తున్న చైతన్య దూరంగా కనిపిస్తున్న పరిసరాలు గమనించడంలేదు.

అపరాధ పరిశోధన పోటీ-168

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 7-7-82 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు సెప్టెంబరు '82 నెల సంచికలో ప్రచురిస్తాము.*

1. ఉత్తరప్రదేశ్ పోలీసులను గజగజలాడిస్తున్న బందిపోటు రాణి—? (పూలన్‌దేవి, దేవికారాణి)
2. కేరళ మధ్యంతర ఎన్నికల్లో ఏర్పాటైన ప్రభుత్వం—? (ఎల్.డి.ఎఫ్., యు.డి.ఎఫ్.)
3. ఇది కుట్టితే మంట విపరీతంగా వుంటుంది—? (తేలు, తేనెటీగ)
4. స్త్రీలకు ఇవంటే ఇష్టం—? (పూలు, నగలు)
5. మనిషి దీనిని తప్పించుకోలేడంటారు—? (మరణం, నొసటివ్రాత)

"చైతన్యా! ఏమిటి అక్కడ జనం గుమిగూడారు?" హఠాత్తుగా ప్రశ్నించింది ఆమె.

చైతన్య జీప్ స్లో చేసి చూశాడు. జనం గుంపుగా చేరి వున్నారు. యేదో జరిగివుంటుంది అనుకున్నాడు. జీప్ వేగం పెంచి కొన్ని నిముషాల్లో అక్కడకు చేరుకొన్నారు.

చైతన్య జీప్ దిగుతూ వుండగానే అతన్ని చూసి రాజు ఒక్క పరుగున వచ్చాడు.

"సార్!...." అంటూ వచ్చి నిల్చున్నాడు.

రాజు ముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. అతని నోట మాట రావడంలేదు.

"ఏమిటి రాజూ! ఏం జరిగింది? జాన్ ఎక్కడ?" అని ప్రశ్నించాడు చైతన్య.

"సార్!... జాన్‌ని మర్డర్ చేశారు...."అన్నాడు రాజు.

"వాట్?" గట్టిగా కేకపెట్టాడు.

అతని కేకకు అక్కడున్న లంబాడీలంతా హడలి పోయారు.

"ఎవరు?....జాన్‌ని హత్య చేసింది ఎవరు? చెప్పు రాజూ? ఎలా జరిగింది హత్య?" చైతన్య ప్రశ్నల వర్షం కురిపించాడు.

రాజు తడబడిపోతున్నాడు.

"జాన్ శవం ఎక్కడ?"

"రివర్ బాంక్‌న వుంది సార్!" అన్నాడు రాజు.

చైతన్య అటువైపు పరిగెత్తాడు. అతని వెనుక అరుణ తార, రాజు గూడా వెళ్ళారు.

నది ఒడ్డున నెత్తురుమడుగులో జాన్ శవం ప్రక్కన కూలబడిపోయింది కాథరిన్.

చైతన్యన్ని చూసి ఆమె దుఃఖం ఎక్కువై పోయింది.

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 46: శ్రీ లక్ష్మి ఛిట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌గా అనంతరావును నియమించారు ఆ కంపెనీ డైరెక్టర్లు. కొద్ది రోజులు ఆ పదవిలో పనిచేసిన తర్వాత షేర్ హోల్డర్ల సమావేశంలో, కంపెనీ డైరెక్టర్ల నియామకం అవకతవకలుగా జరిగిందని వారందరూ తొలగించబడ్డారు. వారితోపాటు అనంత రావు పదవి కూడా ఊడింది.

తనకు జరిగిన అన్యాయానికి పరిహారం కోరుతూ అనంత రావు కోర్టు కెక్కాడు.

ఇక, మీ తీర్పు విన్పించండి? —

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 7-7-'82 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమ మైన తీర్పుకు 6 నెలలపాటు పత్రికను బహుమతిగా పంపుతాము. ఫలితాలు సెప్టెంబరు '82 నెల సంచికలో చూడండి.—ఎడిటర్]

కేసు నెం. 44 (తీర్పు)

రీటా నష్ట పరిహారం చెల్లించాలి.

డాక్టర్ నళినికి డబ్బు చెల్లించవలసిన బాధ్యత రీటాది. చెక్కు మంచిదో, కాదో చూసుకోకుండా నళిని కిచ్చి అభాసు చేయటం ఆమె తప్పు. అందుకు ఆమె నష్టపరిహారం చెల్లించు కోక తప్పదు. అవసరమైతే ఆమె ఆ పరిహారాన్ని హోటల్ ప్రొప్రయిటర్ నుంచి పొందవచ్చును. అది వేరే సంగతి.

ఈ నెల న్యాయనిర్ణేత: శ్రీ పి. వి. ఎ. శేషగిరిరావు, అసిస్టెంట్ సూపర్‌వైజర్, 66/1140, సబ్ స్టేషన్, రైల్వే కోడూరు (కడప జిల్లా).

బావురుమని ఏడ్చింది.

"ఐ లాస్ట్ మై జాన్...." అంటూ ఏడ్చింది.

చైతన్య ఆమెను ఓదార్చాడు.

జాన్ శవం తీసికెళ్ళడానికి ఐస్‌తో నింపిన చెక్కపెట్టె తయారు చేయించి సిద్ధంగా వుంచమని రాజుకి పురమాయించాడు చైతన్య.

అరుణతార అక్కడి నర్సరీ, అందులోని మొక్కలు, చిన్న చిన్న బోనుల్లో వున్న అడవి జంతువులను చూస్తూ కాలక్షేపం చేసింది.

చైతన్య మిల్లర్‌ని వెంటనే రమ్మని జాన్ హతుడైన సంగతి చెప్పాడు. మిల్లర్ తను బయల్దేరి వస్తున్నట్లు చెప్పాడు.

"రాజూ! నువ్వు ఏదీ దాచకుండా చెప్పు? జాన్‌ని ఎవడు మర్డర్ చేశారు?"

"హనుమ అని ఒక లంబాడీ సార్!"

"ఎందుకు? డబ్బుకోసమా?"

"నో సర్! జాన్ ప్రవర్తన చాలా మారిపోయింది సార్! హనుమ భార్య సోని అని ఒకమ్మాయి వుంది. ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. జాన్ ఇస్తున్న డబ్బు చూసుకుని సోని భర్తని నిర్లక్ష్యం చేసి ఎప్పుడూ జాన్‌తోనే తిరగడం మొదలుపెట్టింది. హనుమ ఆ కోపంతో జాన్‌ని చంపాడు సార్!" అన్నాడు రాజు.

అదంతా విని చైతన్య నిట్టూర్చాడు.

"ఒక ఆడదాని కోసం జీవితం పాడుచేసుకున్నాడు జాన్" అని నిట్టూర్చాడు.

"నేను హెచ్చరించి చూశాను సార్? కాని జాన్ సోనీ మత్తులో పడిపోయాడు. ఆయన వైఫ్ ఏడ్చి మొత్తుకున్నా

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీనివల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

లెక్క చేయలేదు."

"హనుమ తనకు అపకారం చేస్తాడేమోనని జాన్‌కి అనుమానం కలగలేదా?"

"హనుమవంటి అనామకుడు తననేం చెయ్యలేడని జాన్ లెక్కచేయలేదు సార్!" అన్నాడు రాజు.

"ఇటువంటి వీక్‌నెస్ వున్న వాళ్ళకి అటువంటి శాస్తే జరుగుతుంది" అని నిట్టూర్చాడు చైతన్య.

మిల్లర్, టైలర్ ఇద్దరూ అదుర్దా పడుతూ వచ్చారు. జాన్ మరణానికి విచారం వ్యక్తపరిచారు. అనుకోని ఈ హఠాత్పరిణామానికి కర్తవ్యం ఏమిటి అని ఆలోచించారు. మిల్లర్‌కి జాన్ శవం చూసిన తర్వాత భయం ఎక్కువైంది. శవాల్ని చూసి అతను తట్టుకోలేడు. అలాగని జాన్ శవం అక్కడే ఖననం చెయ్యడానికి వీల్లేదు గూడా. ఆ శవానికి బాస్ సమక్షంలోనే అంత్యక్రియలు జరపాలి.

జాన్ చార్జి తను తీసుకుంటానని, అతని శవాన్ని తీసుకుని చైతన్యని వెళ్ళమని మిల్లర్ ప్రపోజ్ చేశాడు.

36

ఐస్ పెట్టెలో ప్యాక్‌చేసిన శవం నదిలో వున్న స్టీమ్ బోట్‌లోకి ఎక్కించారు. చీకటి పడిన తర్వాత స్టీమ్‌బోట్ బయల్దేరింది.

అరుణతారకు ఆ కార్యక్రమం అంతా అయోమయంగా వుంది. జాన్ శవం ఎక్కడికి తీసుకెళ్తున్నారో ఆమెకు అర్థం కావడంలేదు. చనిపోయిన వాళ్ళ శవాన్ని సాధారణంగా స్వగ్రామం తీసికెళ్ళి ఖననం చేస్తారు. మరి జాన్ స్వగ్రామం దగ్గరలోనే వుందా?

ఆమె సందేహం విని చైతన్య నవ్వాడు.

"ఇక్కడకు కనీసం నాలుగువేల మైళ్ళు వుంటుంది

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

(బహుమతి రు. 100-00 లు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి 7—7—'82 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హోం.డె. సభ్యులు కాని వారు తమ వ్యాఖ్యలతో 50 పైసల స్టాంపులు జతపర్చాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు నగదు బహుమతితోపాటు, ఐదు నెలలు పత్రికను కూడా పంపుతాము. ఫలితాలు సెప్టెంబరు '82 నెల సంచికలో చూడండి.

మే '82 పోటీ ఫలితాలు

(1) మె '82 నెల "అపరాధపరిశోధన" ముఖ చిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

మృతుడికి సమీపంలో,
మృత్యు వాహకులు !!

పంపినవారు : శ్రీమతి ఎమ్. శిరీష, నవీన కాన్వెంటు వద్ద, మద్దిలపాలెం, విశాఖపట్టణం - 530013.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

అపాయం పొంచివుంది!
ప్రమాదం తరుముతుంది !!

పంపినవారు : శ్రీ యన్. సత్యానంద్, మెయిన్ రోడ్, బెల్లంపల్లి - 504 251 (ఆదిలాబాదు జిల్లా).

గలీలి వెళ్ళాలంటే" అన్నాడు.

"అంత దూరం ఈ స్టీమ్‌బోట్‌లో ఎప్పటికి చేరుకుంటాం?"

"రెండు గంటల్లో...." అన్నాడు.

"ఏమిటీ? రెండు గంటలా? రెండు నెలలా?" ఆశ్చర్యంతో ప్రశ్నించింది.

"రెండు గంటలే."

"ఎలా?"

"చూస్తుండు" అన్నాడు.

స్టీమ్‌బోట్ రిజర్వాయర్ మధ్యలో ఆగింది.

"ఇక నీ చీరలూ వగైరాలు మానేయాలి" అన్నాడు అతను.

"ఏం?"

"మనం యిప్పుడు నీళ్ళలో కొన్ని వందల అడుగుల లోతుకు వెళ్ళాలి. యీ చీరలు పనికిరావు" అని నవ్వాడు.

ఆమె బేతింగ్ డ్రెస్‌లో మారిపోయింది. ఇద్దరూ ఆక్సిజన్ మాస్కులు తగిలించుకున్నారు. జాన్ శవం వున్న పెట్టె నీళ్ళలోకి నెట్టాడు. ఇద్దరూ లోపలకు దూకారు. మాస్కులకు వున్న లైటుకాంతిలో నీళ్ళలో దారి స్పష్టంగా కనిపిస్తోంది. చెక్కపెట్టెకు వున్న ఇనుప గొలుసు పట్టుకుని నీళ్ళ అడుగుకి లాక్కుని పోసాగాడు.

అడుగున బంగారు రంగులో మిలమిల మెరిసిపోతున్న కాంచన గ్రహాన్ని చూసి ఆమె నివ్వెరపోయింది. ఆమెకు గతం జ్ఞాపకం వచ్చింది. ఆ రోజు తనూ చైతన్య షికారుగా వెళ్ళినప్పుడు తను చూసింది అటువంటి గ్రహాన్నే. అదే ఇదా? చైతన్యను తీసికొని వెళ్ళింది ఇదే గ్రహమా?

చైతన్య దాని తలుపు తెరిచి చెక్కపెట్టె లోపలకు

అపరాధ పరిశోధన పోటీ-166

[ఫలితాలు]

మే '82 నెల "అపరాధ పరిశోధన పోటీ — 165"కి సరియైన సమాధానాలు:

1. ఎమ్. జి. ఆర్.
2. కరాటే.
3. విద్యుచ్ఛక్తి.
4. టెలిఫోను.
5. ప్రాణవాలకు.

పై జవాబుల ప్రకారం ముగ్గురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి ఆగస్టు '82 నెల నుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ యం. విద్యాసాగర్, బి.ఏ.,
44-168, ప్రకాష్ నగర్,
కర్నూలు - 518 004.

(2) శ్రీమతి వాయిల పార్వతీదేవి,
c/o వాయిల రమణమూర్తి,
శ్రీ వెంకటేశ్వర కోవెల వీధి,
(విజయనగరం జిల్లా).

(3) శ్రీమతి ఎమ్. మంజుల,
D/O ఎమ్. నంజప్ప,
1-260, కొత్తపేట,
ధర్మవరం,
(అనంతపురం జిల్లా).

చేర్చాడు. ఆమె లోపలకు వచ్చి ఆక్సిజన్ మాస్క్ తీసిన తర్వాత అతనితో మాట్లాడగలిగింది.

"చైతన్యా! ఆ రోజు నిన్ను తీసికెళ్ళింది....ఇదేనా?" ఆశ్చర్యంగా అడిగింది.

అతను నవ్వి "కావచ్చు. ఇటువంటివి ఎన్నో ఉన్నాయి. అందులో ఇది ఒకటి" అన్నాడు.

"ఇందులో మనకి ఊపిరి ఎలా ఆడుతున్నది? ఆక్సిజన్ అవసరం లేదా?"

అతను తల అడ్డంగా ఊపి "ఆక్సిజన్ అవసరం లేదు. ఇది ప్రెషరైజ్ చేయబడింది. నీళ్ళలో అయినా, నేలమీద అయినా, ఆకాశంలో అయినా సరే లోపల మార్పు వుండదు" అన్నాడు.

"ఇప్పుడు నాకు అంతా అర్థమైంది. వెండికొండ డామ్‌ని ఢీకొని పగులుకు కారణమైంది ఇదేననుకుంటాను."

"అవును."

"ఇప్పుడు చెప్పు? ఆ రోజు నిన్ను వాళ్ళు ఎక్కడికి తీసికెళ్ళారు?"

"చెప్తాను. ఆ రోజు నువ్వు నన్ను బలవంతంగా షికారు తీసికెళ్ళడం ఎంతో మంచిది అయింది. నీకు ఎంతో కృతజ్ఞుణ్ణి గూడా. నా జీవితం మలుపు తిప్పింది ఆ రోజు. అందుకే నిన్ను మర్చిపోలేకపోయాను. నిన్ను చూడాలని తిరిగి వచ్చాను. కాని నువ్వు నా కోసమే ఎదురు చూస్తూ వుంటావని మాత్రం అనుకోలేదు. పెళ్ళి చేసుకుని హాయిగా...."

(ఇంకావుంది)

Edited and Published by S. Damodar Reddy
3-4-554 Narayanaguda, Hyderabad-500 029
and Printed at Kranti Press, Madras-600 001.

Blank Page